సంపుటము–2
సమావేశము–XXX
నంబరు. 3

వెల : రూ. 15–00
16 మార్చి, 2018
శుక్రవారము
హేవళంబి నామ సం.
ఫాల్గుణ బ. 14

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్ కార్యకలాపాలు
# ANDHRA PRADESH LEGISLATIVE COUNCIL DEBATES

## అధికార నివేదిక
## OFFICIAL REPORT

## విషయ సూచిక

| క్రమ సంఖ్య | విషయం | పేజీ నం. |
|---|---|---|
| (1) | ప్రశ్నోత్తరాలు | 01–32 |
| (2) | సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు | 32–33 |
| (3) | సభా సమక్షంలో ఉంచే పత్రం<br>ఇంధన శాఖ మంత్రి శ్రీ కిమిడి కళా వెంకట రావు, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి, 2017 సంవత్సరం రెగ్యులేషన్ నెం. 1, 2లలో జారీ చేసిన నోటిఫికేషన్ ప్రతులను, 2003, విద్యుత్ చట్టంలోని సెక్షన్ 182 క్రింద ఆవశ్యకమైన విధంగా ప్రతి సమర్పణ | 33–33 |
| (4) | సభా కార్యక్రమం – ప్రకటన | 34–34 |
| (5) | ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై లఘు చర్చ | 34–71 |
| (6) | శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తీర్మానం | 71–108 |
| (7) | విభజన చట్టం హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై శాసనపరిషత్తు తీర్మానం | 108–112 |

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తు

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| చైర్మన్ | : | శ్రీ ఎన్. ఎం.డి. ఫరూక్ |
| డెప్యూటీ చైర్మన్ | : | శ్రీ రెడ్డి సుబ్రహ్మణ్యం |
| ఉపాధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీమతి పామిడి శమంతకమణి |
| | | శ్రీ వాకాటి నారాయణ రెడ్డి |
| | | శ్రీ బొడ్డు నాగేశ్వర రావు |
| కార్యదర్శి (ఇన్‌చార్జ్) | : | శ్రీ ఎమ్. విజయరాజు |
| ఉప కార్యదర్శులు | : | శ్రీ కె. సత్యనారాయణరావు |
| | | శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ పి. వి. సుబ్బారెడ్డి |
| | | శ్రీ కె. రాజకుమార్ |
| | | శ్రీమతి ఆర్. వనితారాణి |
| | | డా. వై. కామేశ్వరి |
| | | శ్రీ ఇ. సంజీవరావు |
| | | శ్రీ కె. వెంకటేశ్వరరావు |
| | | శ్రీ డి. జగన్‌మోహన్‌రావు |
| | | శ్రీ బి. ప్రభాకరరావు |
| | | శ్రీమతి కె. భారతి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ ఆర్. శ్రీనివాసరావు |

* * * * *

# ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్

## సోమవారం, 16వ తేది, మార్చి, 2018

----

(సభ ఉదయం 10.00 గంటలకు సమావేశమైనది)

( గౌరవ అధ్యక్షులు అధ్యక్ష స్థానం వహించారు )

**MR.CHAIRMAN:** Now Question Hour.

<u>1.ప్రశ్నోత్తరాలు</u>

<u>చింతలపూడి ఎత్తిపోతల నీటిపారుదల పథకం</u>

ప్రశ్న నెం. 9968(61)

**శ్రీమతి పోతుల సునీత, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) పశ్చిమ గోదావరి జిల్లా, పోలవరం మండలంలోని పట్టిసీమ వద్ద చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడం కోసం అవసరమయిన 18,317 ఎకరాలకు గాను సేకరించిన భూమి విస్తీర్ణం ఎంత;

ఆ) ఈ పథకం కోసం అవసరమైన 6,683 ఎకరాల అటవీ భూమిని కేంద్ర ప్రభుత్వం డీనోటిఫై చేయనందున కాలువ పనులు జరగడం లేదనే విషయం వాస్తవమేనా;

ఇ) అయితే, ఈ విషయంలో తీసుకున్న చర్య ఏమిటి?

**గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

**అ)** చింతలపూడి ఎత్తిపోతల పథకం కోసం పశ్చిమగోదావరి జిల్లా, పోలవరం మండలంలోని పట్టిసీమలో ఎటు వంటి భూమిని సేకరించలేదు.

**ఆ)** 1వ దశకు అవసరమైన అటవీ భూమిలోని 6,683 ఎకరాల విస్తీర్ణంలో కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఇప్పటి వరకు 859 ఎకరాల (347.64 హెక్టార్లు) మేరకు స్టేజ్–1కు అనుమతిని ఇచ్చింది. అటవీయేతర ప్రాంతాలలో సేకరించిన భూమిలో కాలువ పనులు పురోగతిలో ఉన్నాయి.

**ఇ)** అటవీ భూమిని సేకరించే తదుపరి ప్రక్రియ పురోగతిలో ఉన్నది.

**శ్రీమతి పోతుల సునీత(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, సభకు నమస్కారం. ఈ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి దాదాపు 1800 ఎకరాల భూమి కావాలని అంచనా వేయడం జరిగింది. మన గౌరవముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మన రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, నీరు అందించాలనే ఒక ఆశయంతో ఉన్నారు. కాబట్టి ఈ చింతలపూడి ఎత్తిపోతల పథకానికి కూడా అందులో భాగంగానే శంకుస్థాపన చేశారు. 66,000 ఎకరాల అటవీ భూమి ఉంటే దానికి మొదటి ఫేజ్‌లో 859 ఎకరాల భూమి ఇచ్చారని మంత్రి గారు చెప్పారు. మరి ఇంకా అవసరమైన భూమిని సేకరించి ఆ చింతలపూడి ఎత్తిపోతల జలాశయాన్ని పూర్తి చేస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పోలవరం మండలం పట్టిసీమ గ్రామ వాసులకి చాలా ఉపయోగం. ఈ ప్రాజెక్టు రావడం వలన అక్కడ 2 లక్షల ఎకరాలకు సాగునీరు, 16 మండలాలలోని 191 గ్రామాలకు త్రాగునీరు అందించే జలాశయం ఇది. ఈ మధ్య కాలంలో కేంద్ర ప్రభుత్వం మనకు ఇచ్చిన ఏ హామీని అమలుపరచకుండా చాలా నిరంకుశంగా, దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. దానికి కూడా మన మంత్రిగారు చర్యలను తీసుకోవాలని, ఆ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరుతున్నాను. కాంగ్రెస్ పాలనలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేశారు. వారు ఏ ప్రాజెక్టును పూర్తి చేయలేదు. మన ముఖ్యమంత్రి గారు వాటన్నింటిని పూర్తి చేయాలనే ఆశయంతో అందరి ప్రజలకు త్రాగునీరు, సాగునీరు అందించాలనే ఆశయంతో ఉన్నారు. అలాగే మన మంత్రిగారు కూడా చాలా కష్టపడుతున్నారు కాబట్టి, ఈ ప్రాజెక్టును కూడా సాధిస్తారని ఆశిస్తూ ముగిస్తున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు:** అధ్యక్షా, చింతలపూడి ఎత్తిపోతల పథకం తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల మెట్ట ప్రాంత ప్రజలకి ఒక వరం లాంటిది. ముఖ్యమంత్రి గారు గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో దీనికి శంకుస్థాపన చేయడం జరిగింది. రైతుల , అటవీ భూములకు సంబంధించిన భూములను ఒక పద్ధతిలో తీసుకుని, ఎక్కడికక్కడ నాలుగు ప్యాకేజీ పనులను వేగవంతంగా చేస్తున్నాము. గోదావరి గట్టు దగ్గర కూడా మొదటి దశ పనులు అంటే దగ్గరదగ్గర గోదావరి గర్భం దగ్గర 30 అడుగులు లోతుకు వెళ్లి పెద్ద ఎత్తున పట్టిసీమ తరహాలో డయా ఫ్రమ్ వాల్ పనులన్నీ 14+4= 18 పంపుల ద్వారా దాదాపు 6500 క్యూసెక్కుల నీటితో తూర్పు గోదావరి, కృష్ణా, నా నియోజక వర్గం మైలవరం కానీ, నందిగామ నియోజక వర్గంలో కంచికచర్ల, వేములపాడు మండలాలు కానీ, మైలవరం, తిరువూరు, నూజివీడు, గన్నవరం, ఏలూరు, దెందులూరు, చింతలపూడి, గోపాలపురం దగ్గరదగ్గర 7 నియోజకవర్గాల్లో అధికారికంగా, అనధికారికంగా 7 లక్షల ఎకరాల మెట్ట పొలానికి గోదావరి తల్లి నీళ్లు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 19 లోపు అందివ్వడం వల్ల నీటికి ఎంతో ఇబ్బంది పడే ప్రాంతమంతా కూడా సస్యశ్యామలం అవ్వబోతోంది. ఈ ప్రాంతం

అంతా కూడా హార్టికల్చర్ హబ్‌గా మారబోతుంది. ఈ ప్రాంతానికి మామూలుగా నీరు రావాలంటే నాగార్జునసాగర్ నుంచి నల్గొండ దాటి, ఖమ్మం దాటి కృష్ణా జిల్లా నీళ్లు నవంబర్‌లో రావాలనుకుంటే అవి వచ్చే సరికి మార్చి కూడా అవుతుంది. పై జిల్లాల్లోని రైతులు మెట్టభూములను వరి భూములుగా చేసుకోవడం వలన నీళ్లు రాని పరిస్థితిలో నాగార్జున సాగర్ ఆయకట్టు చివర ఉన్న మేమంతా 55 సంవత్సరాల నుంచి చాలా ఇబ్బందులు పడుతున్నాము. 25 సంవత్సరాలుగా దీనిపై మా పోరాటాన్ని చేస్తున్నాము. స్వర్గీయ దేవినేని రమణ గారు మా సోదరుడు శాసనసభ సభ్యుడిగా, మంత్రిగా 5 సంవత్సరాలు ఈ నీటి కోసం పోరాటం చేశారు. 19 సంవత్సరాల శాసన సభ్యుడిగా, ఈ రోజు జలవనరుల శాఖా మంత్రిగా మా ప్రాంతానికి నీళ్లు తీసుకెళ్లే అదృష్టం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు గారి నాయకత్వంలో కలిగింది. ఈ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూ. 4,909కోట్లతో టేకప్ చేస్తుంది. అక్కడి రైతులను ఒప్పించి వారి భూములను తీసుకుని, కేంద్ర ప్రభుత్వ అటవీ శాఖ అధికారులతో తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల అధికారులు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుకొని పనులను వేగవంతం చేస్తున్నారు. మొదటి దశ పనులను జూన్ నుంచి సెప్టెంబర్‌లోపు పూర్తి చేసి 18 పంపులను పూర్తి చేసి పోలవరం రైట్ కెనాల్ ద్వారా పట్టిసీమ నీళ్లతో ఈ నీళ్లను అనుసంధానం చేసి కృష్ణానదికి తీసుకువస్తున్నాము. అదే విధంగా పైన ఉన్న తూర్పుగోదావరి మెట్ట ప్రాంతానికి, కృష్ణా జిల్లా ఆయకట్టు క్రింద నాగార్జున సాగర్ కాలువలో వేలేరుపాడు మేజర్ ద్వారా నూజివీడు బ్రాంచ్ కెనాల్‌కి, మైలవరం బ్రాంచ్ కెనాల్‌కి నీటిని తీసుకొస్తున్నాము. ఈ ప్రాంతాలన్నీ సస్యశ్యామలం అవ్వబోతున్నాయి. శ్రీమతి పోతుల సునీత చెప్పినట్లు అటవీ భూముల విషయంలో కానీ, రైతులకు నష్టపరిహారం ఇచ్చే విషయంలో కానీ అన్ని జాగ్రత్తలు తీసుకొని ఫిబ్రవరి, 2019 నాటికి ఈ చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నీళ్లను ఇస్తాము. ఏ విధంగా అయితే పట్టిసీమను పూర్తి చేశామో, అదే స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను.

**MR.CHAIRMAN:** Question No. 10300, Minister for Water Resources Management.

<u>గోదావరి జిల్లాల్లో భూమికోత</u>

ప్రశ్న నెం. 10300(62)

**శ్రీమతి అంగూరి లక్ష్మీ శివ కుమారి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) తూర్పు మరియు పశ్చిమ గోదావరి జిల్లాలలో కోత నుండి భూములను రక్షించడానికి ప్రభుత్వం ఏవేని ప్రణాళికలను రూపొందిస్తున్నదా;

ఆ) అయితే, అందుకు సంబంధించిన వివరాలేమిటి;

**గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

అ) అవునండీ.

ఆ) రూ. 305.34 కోట్ల వ్యయాన్ని భరిస్తూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో పిచ్చింగ్ ప్లాట్ ఫారంలు మరియు అడ్డుకట్టలను ఏర్పాటు చేయడం ద్వారా 21 రక్షిత పనులను చేపట్టడమయింది. గోదావరి నదిలో వరదల కారణంగా ఏర్పడే కోతను నివారించడానికి తూర్పు గోదావరి జిల్లాలో వైనతాయం కుడి వరద గట్టుకు సంబంధించి 16.3 కిమీ నుండి 18.5 కి.మీ వరకు కోతకు గురయ్యే రీచ్ వద్ద రూ.16.50కోట్ల మొత్తంతో పనులు చేపట్టాలని ప్రతిపాదించిన కొత్త రక్షిత పని కోసం అంచనా ప్రాసెస్‌లో ఉంది.

**శ్రీమతి అంగూరి లక్ష్మీ శివ కుమారి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, నది కోతకు నష్టపోతున్నటువంటి ప్రాంతం ముఖ్యంగా కోనసీమ ప్రాంతం. ఈ కోనసీమలో ఒక దీవి ఉంది. దానిని ఆనుకుని కొన్ని పాయలు ఉండడం జరిగింది. ఈ పాయలు ఆనుకొని కొంతమంది రైతులకు భూములు ఉన్నాయి. ఎక్కువ వర్షాలు వచ్చినప్పుడు భూమి కోతకు గురి కావడం వలన రైతులు చాలా బాధ పడుతున్నారు. ఈ దీవిని సెంట్రల్ డెల్టా ప్రాంతంగా పిలవడం జరుగుతుంది. ముమ్మిడివరం, పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు, రామచంద్రాపురం ఈ ప్రాంతాల్లోని నదీ పాయలకు సంబంధించిన తీర ప్రాంతంలో ఉన్న గ్రోయిన్‌లను వెంటనే కట్టించినట్లయితే కొంతమంది రైతులు బయట పడడానికి ఆస్కారం ఉంటుంది. అయితే, మంత్రిగారు చెప్పినట్లుగా దీనికి డబ్బు మంజూరు చేయడమైతే జరిగింది కానీ, పనులు మాత్రం త్వరగా జరగడం లేదు. అంతేగాకుండా, పాశర్లపూడిలో కూడా దళిత రైతులు ఉన్నారు. వారికి ఆ గ్రామంలో ఇంచుమించు 200 ఎకరాల వరకు భూమి ఉండేది. దళితులకు చెందిన కొంత మంది రైతుల భూమి ఈ దీవి వలన 100 ఎకరాల వరకు పోవడం జరిగింది. దళితులకు చెందిన మిగిలిన 100 ఎకరాలనైనా రక్షించడానికి మంత్రి గారు తగు చర్యలు తీసుకోవాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

ఉ.10.10

**శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు:** అధ్యక్షా, గౌరవ సభ్యురాలు చెప్పినట్లుగా దళిత సోదరుల భూములను కాపాడడానికి తీసుకున్న చర్యల వివరాలను చూస్తే, రూ.16.5 కోట్లతో చేసిన ఈ పనిని వేగవంతం చేసి, ఈ సీజన్‌లోనే ఆ పనులు పూర్తయ్యే విధంగా అన్ని చర్యలు, అన్ని జాగ్రత్తలు తీసుకుంటాము. అదేవిధంగా గోదావరి జిల్లా రైతాంగం కూడా దగ్గరదగ్గరగా సుమారు 8,96,533 ఎకరాల్లో ఈ సంవత్సరం రెండవ పంట వేయడం జరిగింది. వాస్తవంగా గోదావరిలో నీళ్లు లేవని మా అధికారులు స్పష్టంగా చెప్పి, ఈ సంవత్సరం రెండవ పంటకు నీళ్లు అందివ్వడం కష్టమౌతుంది కాబట్టి, మీరు అన్నీ కూడా ఎంచొద్దని చెప్పి మా మీద ఒత్తిడి తెచ్చినప్పటికి కూడా, మన ముఖ్యమంత్రి గారు గత నాలుగు సంవత్సరాలుగా ఎన్ని ఇబ్బందులు వచ్చినాసరే సీలేరు నుండి గాని, బలిమెల నుండి గాని పై ప్రాంతాల నుండి నీళ్లు తీసుకువచ్చి, ఎట్టి పరిస్థితుల్లో కూడా ఒక్క ఎకరా నీళ్లు కూడా గోదావరి రైతాంగానికి తగ్గించొద్దని మాకు ఆదేశాలిచ్చారు. ఆ విధంగా గోదావరి డెల్టాలో మొదటి సంవత్సరం 2014లో, 2015లో, 2016లో, 2017లో

అలాగే ఈ సంవత్సరం అంటే 2018లో కూడా దాదాపు 8,96,533 ఎకరాల్లో గోదావరి జిల్లా రైతాంగం పంటను వేసింది. అట్లాగే, దాదాపుగా 2 లక్షల ఎకరాల్లో ఆక్వా పంటలు సాగవుతున్నాయి.

వాస్తవానికి గోదావరిలో కేవలం 500 క్యూసెక్కుల నీరు కూడా రానటువంటి పరిస్థితుల్లో, సీలేరు, బలిమెల నుండి 7400 క్యూసెక్కుల నీటిని పై ప్రాంతాల నుండి దిగువకు తీసుకువచ్చారు. మన ముఖ్యమంత్రి ఒక సీనియర్ నాయకుడిగా ఉండి, తన 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో ఎంతో దూరదృష్టితో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయకముందే ఢిల్లీ వెళ్లి "అయ్యా నేను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాలంటే సీలేరు, బలిమెల ఉన్న ఆ ప్రాంతాల్లోని 7 మండలాలు పోలవరం ముంపు ప్రాంతాలు కాబట్టి, అవి మా భూభాగంలో కలిపితేనే నేను ప్రమాణస్వీకారం చేస్తాను" అని పట్టుపట్టి, తెలంగాణాలోని 7 ముంపు మండలాలను మన భూభాగంలో కలపడం వల్ల, ఇవాళ గోదావరి డెల్టాలో రెండవ పంట వేసుకోగలుగుతున్నాము. గోదావరి నదిలో 500 క్యూసెక్కులు వస్తున్నాయి. 7 ముంపు మండలాల్లోని సీలేరు, బలిమెల ప్రాంతాల్లో ఉన్న రిజర్వాయర్ల వల్ల 7,500 క్యూసెక్కుల నీరు తెచ్చుకుని, ఇవాళ ఈ కష్టకాలంలో 900 క్యూసెక్కుల నీటిని ప్రతిరోజూ రైతాంగానికి ఇస్తున్నాము.

అట్లాగే, కొంతమంది సోదరులు 500, 1000 క్యూసెక్కులకు నీటి సరఫరా పెంచమని అడుగుతున్నారు. ఇవాల్టికి కూడా ఈ 500 క్యూసెక్కులు, రోజుకి వచ్చే 600 క్యూసెక్కులు కలుపుకుంటే కూడా దాదాపుగా మొత్తం 17.9 టిఎంసిలు. ఆర్నెల్ల క్రితం మా అధికారులు చెప్పిందేమంటే – 18 టిఎంసిలు మాత్రమే వస్తాయండి, మీరు పంటలు వేస్తే ఇబ్బందిపడతారని నన్ను హెచ్చరించారు. 18 టిఎంసిలు వస్తాయని చెప్పినా కూడా, ముఖ్యమంత్రి గారిచ్చిన ప్రోత్సాహంతో పై ప్రాంతాల నుండి 56.5 టిఎంసిలు తెచ్చాము. పక్క రాష్ట్రాల వాళ్లు ఎన్ని అడ్డుకట్టలు వేసినా, ఎన్ని ఎత్తిపోసుకున్నా ఒరిస్సా ప్రభుత్వం గాని, మన ఏపీ జెన్కో అధికారులందరూ సమన్వయం చేసుకుని 56.5 టిఎంసిలు మన గోదావరి డెల్టాకు తెచ్చుకున్నాము. ఆ విధంగా మరి ఇవాళ పంటంతా మార్చి, ఏప్రిల్ 10 కల్లా కోతకు వచ్చేలోగా దాదాపుగా మరో 8, 10 టిఎంసిల నీళ్లు ఆ పంటలకు కావాలి. డ్రింకింగ్ వాటర్‌కు 4 టిఎంసిలు కావాలి. మొత్తం మీద 12 టిఎంసిలు కావాలి. అదేవిధంగా అక్కడున్న డ్రెయిన్లలోకి కూడా నీళ్లు ఎత్తిపోసుకోవడానికి పంపులకు, మోటార్లకు, రైతాంగానికి కావాల్సిన పంపులు, మోటార్లకు కూడా డబ్బులు రిలీజ్ చేశాము. తప్పకుండా మీ ద్వారా గోదావరి డెల్టా రైతాంగానికి తెలియజేసేదేమంటే– ఈ ప్రభుత్వం రైతులు వేసుకున్న పంటల్ని కాపాడటమే కాకుండా, మంచినీటి బాధ్యత కూడా తీసుకుని, అన్ని విధాలుగా రెండవ పంటను కాపాడుతుంది. రైతాంగం గాని, ప్రజా ప్రతినిధులు గాని ఎప్పటికప్పుడు తప్పకుండా సమాచారాన్ని మా అధికారులకు తెలియజేయాలని, పంటల్ని కాపాడే బాధ్యత ఈ ప్రభుత్వం తీసుకుంటుందని తమ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను అధ్యక్షా.

**శ్రీ చిక్కాల రామచంద్రరావు(స్థానిక సంస్థలు – తూర్పుగోదావరి):** అధ్యక్షా, ఈనాడు చెప్పాలంటే గోదావరి డెల్టా సిస్టంలో రెండవ పంట వేసుకుంటున్నామంటే ఆనాడు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తీసుకున్న నిర్ణయం వల్ల సీలేరు నుండి నీరు ఫ్రీగా వస్తోంది. మనకు గతేడాది గాని, ఈ సంవత్సరం కూడా నీటికి

చాలా ఇబ్బందులుపడే పరిస్థితుల్లో చాలా చక్కగా నీటి సదుపాయం రెండవ పంటకు కల్పించారు. ఇంచుమించు 9 లక్షల హెక్టార్ల వరకు నీరిస్తున్న విధానం చూస్తున్నాము. అయితే, ఇక్కడ మంత్రి గారు చెప్పిన సమాధానంలో 55 టిఎంసిల వరకు సీలేరు నుండి వచ్చిందన్నారు. నేను అనేదేమంటే – ఏప్రిల్ 15, 20 నెలాఖరు వరకు కూడా క్రాప్ వచ్చే అవకాశం ఉంది కాబట్టి, ఆ పంటలకు  కూడా నీరివ్వాల్సిన అవసరం ఉంది. ఉన్నటువంటి నీరు మనకు సరిపోయే అవకాశాలు కనపడటం లేదు. మీరు ఇవ్వాల్సిన నీటి కంటే ఇంకో నాలుగైదు టిఎంసిలు అదనంగా ఇవ్వాల్సిన అవకాశముంది.

ఇప్పటికే చాలా కాలువల్లో నీరు తక్కువగా ఉంది. ఇప్పటికే మీరు 7900 క్యూసెక్కుల నీరు ఇస్తున్నామన్నారు. ఇది సరిపోయే విధానంలో లేదు. మనకు ఇంచుమించుగా ఈ టైంలో చాలా ఎక్కువ నీరు కావాలి. అంటే పొట్టదశలో ఉన్నప్పుడు కొంచెం నీరు ఎక్కువ అవసరం పడుతుంది. ఈ టైంలో నీరు ఎక్కువ కావాలి. ఒక వెయ్యి క్యూసెక్కులు నీటి సరఫరా పెంచితే గాని సరిపోదు. లేదంటే రైతులకు ఇబ్బందులు వచ్చే అవకాశాలున్నాయి. కాబట్టి, నీటిని 1000 క్యూసెక్కులకు పెంచే విధానంపైన మీరు ఆలోచిస్తున్నారా అనేది ఒక ప్రశ్న. రెండవదేమంటే – ఒరిస్సా గవర్నమెంట్‌తో కూడా మాట్లాడాలి. గతంలో  2002లో కూడా మన ముఖ్యమంత్రి గారు ఒరిస్సా గవర్నమెంట్‌తో మాట్లాడారు. అప్పుడు తెలంగాణా ప్రాంతం కూడా కలిసి ఉంది. ఇప్పుడు ఆ ఇబ్బంది కూడా మనకు లేదు కాబట్టి, సీలేరులో చాలా బ్రహ్మాండంగా ఉంది. అయితే ఇంకా 4, 5 టిఎంసిలు అదనంగా తెచ్చే అవకాశముందేమో, గౌరవ ముఖ్యమంత్రి గారి ద్వారా ప్రయత్నం చేయవలసిందిగా, మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు:** అధ్యక్షా, మా ఏపీ జెన్కో అధికారులు, ఒరిస్సా జెన్‌కో అధికారులు మాట్లాడుకుని అక్కడున్న నీటిని చాలా జాగ్రత్తగా తీసుకోవడం జరుగుతోంది. తప్పకుండా గౌరవ సభ్యులు చెప్పిన సూచనల్ని కూడా పరిశీలించి, మా అధికారులను ఆ ప్రాంతానికి పంపించి, ఎక్కడ నీటి అవసరాలు ఎక్కువగా ఉంటే ఆ ప్రాంతాల్లో ఎక్కువతక్కువలు లేకుండా సర్దుకునే విధంగా, పై నుండి ఎక్కువ నీటిని తీసుకునే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాము.  తప్పకుండా పంటల్ని కాపాడతాము.

## హంద్రీ-నీవా ప్రాజెక్టు కోసం నిధులు

ప్రశ్న నెం. 10407(63)
**శ్రీ వెన్న పూస గోపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన జలవనరుల నిర్వహణశాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) 2014-15, 2015-16, మరియు 2016-17 ఆర్థిక సంవత్సరాలకు గాను హంద్రీనీవా  ప్రాజెక్టుపై విడుదలైన మరియు ఖర్చు చేసిన నిధుల పరిమాణం ఎంత;

ఆ) 2017-18, ఆర్థిక సంవత్సరానికి గాను ప్రాజెక్టు నిర్మాణం కోసం కేటాయించిన మరియు ఖర్చు చేసిన నిధుల పరిమాణం ఎంత;

ఇ) ఆ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటి?

**గౌరవనీయులైన జలవనరుల నిర్వహణ శాఖ మంత్రి (శ్రీ దేవినేని ఉమామహేశ్వరరావు):**

**అ)** హెచ్ఎస్ఎస్ఎస్ ప్రాజెక్టుకు సంబంధించి విడుదల చేసిన మరియు ఖర్చు చేసిన నిధుల పరిమాణం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయిః

| వరుస సంఖ్య | ఆర్థిక సంవత్సరం | కేటాయించిన బడ్జెట్ రూ. కోట్లలో | ఖర్చుచేసిన మొత్తం నిధులు రూ. కోట్లలో |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | 2014- 2015 | 100.28 | 4 |
| 2 | 2015-2016 | 212.00 | 522.75 |
| 3 | 2016-2017 | 483.20 | 1346.58 |

ఆ) 2017-18, ఆర్థిక సంవత్సరానికి గాను ప్రాజెక్టు నిర్మాణానికి కేటాయించిన మరియు ఖర్చు చేసిన నిధుల పరిమాణం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయిః

| వరుస సంఖ్య | ఆర్థిక సంవత్సరం | కేటాయించిన బడ్జెట్ రూ. కోట్లలో | ఖర్చుచేసిన మొత్తం నిధులు రూ. కోట్లలో |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 1 | 2017- 2018 | 483.20 | 1154.14 |

**ఇ)** చివరి 2018-19 చివరి నాటికి ప్రాజెక్టును పూర్తిచేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవడమయింది.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు(స్థానిక సంస్థలు - చిత్తూరు):** అధ్యక్షా, మీ ద్వారా మంత్రి గారికి మనవి చేసేదేమంటే - చిత్తూరు జిల్లాలో త్రాగునీటికి చాలా ఇబ్బందిగా ఉంది. అడవిపల్లి రిజర్వాయరు నుండి చిత్తూరు పట్టణానికి త్రాగునీరు తీసుకువచ్చేందుకు ఎన్ని రోజులు పడుతుంది? అడవిపల్లి నుండి చిత్తూరు పట్టణానికి పైపులైను పనులు టెండరు దశలో ఉన్నాయన్నారు. అవి ఎప్పుడు పూర్తి చేస్తారు? చిత్తూరు జిల్లాకు ఈ అడవిపల్లి ప్రాంతం టెయిల్ఎండ్ కాబట్టి, మామూలు ఛానెల్స్‌లోనే వచ్చిందా, లేదా పైప్‌లైన్ వచ్చిందా అనేది తెలియజేయాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని అడుగుతున్నాను.

**శ్రీ కె.ఇ.ప్రభాకర్(స్థానిక సంస్థలు – కర్నూలు):** అధ్యక్షా, గౌరవ మంత్రి గారిని అడిగేదేమంటే బడ్జెట్ అలొకేషన్ కన్నా ఎక్కువగా ప్రభుత్వం నిధులు ఖర్చుపెట్టడం జరిగింది. అందుకు చాలా సంతోషం. మనం అనుకున్న టైంకన్నా ముందుగానే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం కూడా చాలా అభినందించదగ్గ విషయం. అయితే, కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు దాకా నీళ్లు పోవాల్సిన అవసరముంది. కాబట్టి, పొలాల వెంట నీరు పోతుంటే రైతులు చూస్తూ ఊరుకోరు కాబట్టి ఆ పరిసర ప్రాంతాల్లోని చెరువుల్ని నింపాలన్న ఆలోచన ప్రభుత్వానికి కలిగింది. దాదాపుగా కర్నూలు జిల్లాలోని 106 చెరువుల్ని నింపాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది. మరి ఆ నిర్ణయం ఎంతవరకు వచ్చింది? కనీసం సగమైనా, ఒక **phased manner**లో చేయగలరా అని మంత్రి గార్ని అడుగుతున్నాను. అంతేగాకుండా, సాగునీరు కంటే త్రాగునీరు ఎక్కువ అవసరం కాబట్టి, సంజీవయ్య సాగర్‌లో (గాజులదిన్నె డ్యాం) హంద్రీనీవా నీళ్లని నిల్వచేస్తే, దాదాపుగా 7 నియోజకవర్గాల్లో నీటి సమస్య తీరుతుంది. ఎలాగూ మనం ఈ వేసవికాలంలో నీటిని ట్రాన్స్‌పోర్టు చేయడం కోసం రెండు, మూడు కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరముంటుంది. ఈ నీళ్లని మనం అలొకేట్ చేసుకుని, త్రాగునీటికి ప్రాధాన్యం ఇచ్చినట్లయితే ఆ సమస్య కూడా తీరుతుందని మంత్రి గార్ని కోరుతూ, అది ఎంత త్వరలో పూర్తి చేస్తారో తెలియజేయాల్సిందిగా మీ ద్వారా మంత్రి గారిని కోరుతున్నాను.

**ఉ.10.20**

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి(పట్టభద్రుల నియోజకవర్గం – చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, రాయలసీమ 4 జిల్లాలకు సంబంధించిన ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు ఇది. దీనితోబాటు గాలేరు–నగరి కూడా ఉన్నది. చాలా సందర్భాలలో మంత్రిగారు 2017 డిసెంబరులోపల పూర్తి చేస్తామని చెప్పారు. బడ్జెట్‌లో కూడా బాగానే ఖర్చు పెట్టారు. ప్రాథమికంగా దీనిని పూర్తిచేసేందుకు రూ.2,500 కోట్లు కాగా, ఈ సంవత్సరం బడ్జెట్‌లో సుమారు రూ.500 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈనాడు శ్రీశైలం డ్యామ్‌లో నీరు కనీస నీటిమట్టంకు చేరుకుంది. చిత్తూరు జిల్లా కుప్పం వరకూ టెయిల్ ఎండ్‌లో ఉన్నది. ఈ ప్రాజెక్టు కెనాల్స్ కొనసాగాలి కాబట్టి వర్క్స్ కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. రాయలసీమ చాలా దుర్భిక్ష ప్రాంతం, వాటర్ లో లెవల్‌కు చేరిపోయింది. ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేయాలని కోరుతున్నాను. త్రాగునీరు, సాగునీరు దృష్ట్యా దీనికి ఫస్ట్ ప్రయారిటీ ఇచ్చి నిర్ణీత గడువు ఫిక్స్ చేసి, పట్టిసీమ పూర్తిచేసేందుకు ఎలాంటి పట్టుదల చూపించారో, దీనిని కూడా ఆ విధంగా పూర్తిచేయాలని కోరుతున్నాను. గాలేరు–నగరి కూడా అంతే ప్రతిష్టాత్మకమైనది. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయితే తప్ప దుర్భిక్ష ప్రాంతాలు సస్యశ్యామలం కాలేవు. కాబట్టి, ఒక టార్గెట్ పెట్టుకుని, అవసరమైతే అదనంగా కొంత బడ్జెట్‌ను కేటాయించి ఎప్పటిలోగా పూర్తి చేస్తారని మంత్రిగారిని తమ ద్వారా అడుగుతున్నాను.

**శ్రీ గౌనివారి శ్రీనివాసులు(నామినేటెడ్):** అధ్యక్షా, ఆనాడు శ్రీ ఎన్.టి. రామారావుగారి మనసులో ఉద్భవించిన యోచన తెలుగుగంగ, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు–నగరి పథకాలు. వాటిని అపర భగీరథుడు లాగా శ్రీశైలం నుండి కుప్పం వరకూ తీసుకువెళుతున్న ఘనత చంద్రబాబునాయుడు గారిది. 400

మీటర్ల ఎత్తులో కుప్పంలో ఉంటే అక్కడకు నీళ్లు తీసుకువెళ్లాలని అనుకోవడం, దానికి జలవనరుల శాఖామంత్రి చొరవ తీసుకుని ముందుకు తీసుకువెళుతున్నారు. బడ్జెట్‌లో రూ.1,278.68 కోట్లు నాలుగేళ్లకు కేటాయిస్తే రూ.3,203.94 కోట్లు ఖర్చుపెట్టారు. అంటే 250 శాతం ఎక్కువ ఖర్చుచేశారు. మా సోదర సభ్యులు ఇంతకుముందు రూ.550 కోట్లు ఇవ్వాలని అడిగారు. వెయ్యి కోట్లు అయినా రెండు వేల కోట్లు అయినా ఈ ప్రభుత్వం ఖర్చుచేయడానికి సిద్ధంగా ఉన్న విషయం అందరికీ తెలిసినదే.

అధ్యక్షా, ఒక్క విషయం మాత్రం తమ ద్వారా మంత్రిగారికి విన్నవించేదేమిటంటే, వర్షాలు పడిన తరువాత ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. కాబట్టి, ఎట్టిపరిస్థితుల్లోనూ 2018 డిసెంబరునాటికి గౌరవ ముఖ్యమంత్రిగారు నీళ్లివ్వాలనే ఉద్దేశంతో ఉన్నారు కాబట్టి త్వరగా దీనిని పూర్తిచేయించాలని కోరుతున్నాను.

**శ్రీ పి. రామసుబ్బారెడ్డి:** ఈనాడు రాయలసీమ ప్రాంతంలో గాలేరు–నగరి, హంద్రీనీవా ప్రాజెక్టుల ద్వారా ఎవరూ ఊహించనట్లుగా 140 టిఎంసిలు నీళ్లు రావడమైనది. హంద్రీనీవా ద్వారా అనంతపురం జిల్లాలో కూడా చెరువులలో నీళ్లు వచ్చాయి. కడప జిల్లాలో కూడా గండికోటలో నీళ్లు ఉన్నాయి. మైలవరంలో 6.3 టిఎంసి నీళ్లు వచ్చాయి. గతంలో 20 సంవత్సరాల కాలంలో త్రాగడానికి కూడా నీళ్లు లేని పరిస్థితులు ఉండేవి. అటువంటిది ఈనాడు పట్టిసీమ ప్రాజెక్టు వల్ల మైలవరం రిజర్వాయర్‌లో 6.3 టిఎంసిల నీళ్లు వచ్చాయి. పులివెందులలో పైడిపాలెం, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లకు కూడా 9 నుండి 10 టిఎంసిల నీళ్లు ఉన్నాయంటే అది పట్టిసీమ ప్రాజెక్టు పుణ్యమే. ముఖ్యమంత్రిగారు పట్టుదలతో రాయలసీమ ప్రాంతాన్ని హార్టీ కల్చర్ హబ్‌గా మార్చాలని చేసిన కృషిఫలితమేనని మనవిచేస్తున్నాను. రాయలసీమను రతనాల సీమగా మార్చాలని ఆనాడు అన్న ఎన్.టి.రామారావుగారు కలలు కన్నారు. ఈనాడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారు పట్టుదలతో ఎన్ని అడ్డంకులు వచ్చినా ప్రజల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని పూర్తి చేయడం వల్ల మా రాయలసీమ ప్రాంతానికి 140 టిఎంసిల నీళ్లు రావడం జరిగింది.

అధ్యక్షా, మీ ద్వారా మంత్రిగారిని కోరేదేమంటే, మైలవరంలో 6 టిఎంసిల నీళ్లు ఉన్నాయి. కానీ, గత ప్రభుత్వ హయాంలో పనుల కొరకు టెండర్లు పిలిచారు. 2006వ సంవత్సరంలో హిందూస్తాన్ వంటి నవరత్న కంపెనీ వారు టెండర్లు వేశారు. కానీ ఈనాటికీ ఇంకా పనులు పూర్తి కాలేదు. నీళ్లుండి కాలవలు పనులు పూర్తి కాక, టెండర్లు క్యాన్సిల్ చేయక, రిపేర్లు చేయకుండా పెండింగ్‌లో ఉన్నాయి. పట్టిసీమ పుణ్యమా అని ముఖ్యమంత్రి మరియు జలవనరుల శాఖ మంత్రి కృషి వల్ల నీళ్లు వచ్చాయి. కానీ, ఉన్న నీళ్లను ఉపయోగించుకోవాలంటే పాత టెండర్లు క్యాన్సిల్ చేయాలి. 2006 నుండి పనులు ఆగిపోయాయి. ఆ టెండర్లను క్యాన్సిల్ చేసి కల్వర్టులు నిర్మించి, రిపేర్లు చేయించి, కాలువ పనులను చేయిస్తే బాగుంటుంది. పాతవి క్యాన్సిల్ చేసి, కొత్త టెండర్లు పిలిచి వెంటనే పనులు పూర్తిచేయాలని కోరుతున్నాను.

గతంలో మైలవరంకు వచ్చి మంత్రిగారు చూశారు. గాలేరు–నగరి కెనాల్ 52వ కి.మీ. దగ్గర బెడ్ లెవల్ స్లూయిజ్ ఏర్పాటు చేస్తే మైలవరానికి కృష్ణా నీళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రిగారు, మంత్రిగారు

కూడా దానిని ఏర్పాటు చేస్తామని తెలియచేశారు. ఆనాడు ముఖ్యమంత్రిగారు ఆదేశించారు. ఆ విషయం మంత్రిగారికి కూడా తెలుసు. అది పెండింగ్‌లో ఉంది. బెడ్ లెవల్ స్లూయిజ్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. ఆనాడు పట్టిసీమకు కూడా అడ్డంకులు ఏర్పడ్డాయి. అది పూర్తయితేనే గానీ నీళ్లు వచ్చే పరిస్థితి లేదు అలాగే, ఈనాడు పోలవరం ప్రాజెక్టు పూర్తిచేయాలంటే చాలా అడ్డంకులు వస్తున్నాయి. ప్రతిపక్షపార్టీతో సహా కేంద్రప్రభుత్వ యొక్క సహకారం లేకపోవడం వల్ల ప్రాజెక్టు ఆలస్యమవుతోంది. పట్టిసీమ ప్రాజెక్టు లేకపోతే రాయలసీమ వాసులం దుర్భర పరిస్థితుల్లో ఉండేవాళ్లం. త్రాగేందుకు కూడా నీళ్లు లేని పరిస్థితి వచ్చేది. ఎన్ని అడ్డంకులు వచ్చినా మంత్రిగారు, ముఖ్యమంత్రిగారు కృషి చేసి కృష్ణా జలాలను మాకు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేస్తున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి(ఉపాధ్యాయ నియోజకవర్గం – కర్నూలు, అనంతపురం, కడప):** అధ్యక్షా, రాయలసీమకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నటువంటి హంద్రీనీవాకు ఈ నాలుగేళ్ల కాలంలో మూడురెట్లు నిధులు పెంచడం చాలా అభినందనీయం. రాయలసీమలో ప్రాజెక్టులు, కాలవ గట్లు గురించి మంత్రిగారు శ్రద్ధ వహించి పనులు చేయించడం నేను కూడా ప్రత్యక్షంగా చూశాను. ప్రత్యేకించి 90 శాతం పనులు పూర్తయ్యి, 10 శాతం పనులు పెండింగ్‌లో ఉండడం వల్ల ఆశించిన ఫలితం రాకుండా పోతున్నది. డిసెంబరు 2018 నాటికి గౌరవ మంత్రిగారు వాగ్దానం చేసిన సమయానికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. అలాగే, రాయలసీమ నుండి కొన్ని ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వచ్చాయి. కర్నూలు జిల్లాలో రాజోలిబండ, గుండ్లకమ్మ, జరికోన వంటి ప్రాజెక్టులు, చెరువులకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలు వచ్చాయి. వాటికి కూడా ప్రభుత్వం వీలైనంత త్వరగా ఆమోదం తెలిపి వాటి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను. సాగునీటికి, త్రాగునీటికి కొన్ని ప్రాజెక్టులను మంజూరు చేశారు. ఉదాహరణకు రోళ్లమడుగు, రాయచోటి, వీరబల్లి, సుండుపల్లి మండలాలకు సంబంధించి ఎంతోమంది ప్రజల నీటిసౌకర్యానికి ఉపయోగపడే చిన్న చిన్న ప్రాజెక్టులు ఉన్నాయి. ఇలాంటి వాటికి చాలా తక్కువగా అమౌంట్ సరిపోతుంది. అంటే రూ.20, 30, 50 కోట్ల పనులకు టెండర్లు వేశారు కానీ, పనులు నత్తనడకన నడుస్తున్నాయి. వాటిపై కూడా వారం, వారం సమీక్ష చేసి సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తమద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ దేవినేని ఉమామహేశ్వర రావు:** అధ్యక్షా, హంద్రీనీవా ఎత్తిపోతల పథకం మరియు తెలుగుగంగ, గాలేరు–నగరి మహసీయుడు, శ్రీ నందమూరి తారకరామారావు గారి మానసపుత్రికలు అనడంలో ఎటువంటి అతిశయోక్తిలేదు. తమరు కూడా ఆనాడు శాసనసభ్యులుగా, మంత్రిగా ఉన్నారు. ఆ మహానుభావుడు ఆ కార్యక్రమాలను చేసినప్పుడు ఆయన ఇంటి దగ్గరకు వెళ్లి ప్రతిపక్షాల వారు ధర్నాలు చేశారు. ఆయన సెక్రటేరియట్‌కు వస్తుంటే ఆయన కారుకు అడ్డం పడ్డారు. మాకు ఈ ప్రాజెక్టులు ఇస్తున్నారు, అసలు నీళ్లు వస్తాయా, ఎందుకు చేస్తున్నారు, ఈ రాళ్లు కొండల్లో తవ్వుతున్నారు, ఇవి పూర్తవవు, నీళ్లు రావు, ఇదంతా మోసమని తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఆడిపోసుకున్నారు. ఈనాడు పట్టిసీమకు వీళ్లు అడ్డం పడితే, ఆనాడు వీళ్ల తండ్రులు తెలుగు గంగకు, హంద్రీనీవాకు,

గాలేరు-నగరికి అడ్డం పడ్డారు. పాదయాత్రలు చేశారు, తిట్టారు, రాళ్లు వేశారు, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేయాలో అన్నీ చేసినప్పటికీ ఆ మహానుభావుడు ఎన్‌టిఆర్ గారి పట్టుదల వల్ల మొదలుపెడితే ఈనాడు తెలుగు గంగ చంద్రబాబు నాయుడు గారి చేతులమీదుగా పూర్తవుతున్నది. ఈమధ్యనే పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు గాను రివైజ్డ్ ఎస్టిమేట్స్ ఇస్తే దాన్ని కూడా అవినీతి అని చెప్పి, కోట్లకు కోట్లు మేమేదో చేశామని సాక్షి పత్రికలో, ఛానెల్‌లో అడ్డగోలుగా మాట్లాడారు. తెలుగుగంగ పూర్తిచేసేందుకు మేము సంకల్పిస్తే దానిమీద ఆరోపణలు చేస్తున్నారు. నాలుగైదు రోజులుగా పోలవరం ప్రాజెక్టు మీద డిపిఆర్ (డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు)ను దిల్లీలో సెంట్రల్ వాటర్ కమీషన్ ఫైనల్‌గా ప్రాసెస్ చేసి క్లియర్ చేయబోతుంటే 5 రోజులుగా పేపర్లలో సీరియల్‌గా వార్తలు రాస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ భాస్కర్ నిజాయితీ పరుడుగా కష్టపడి పని చేసేవారు. ఆయన గురించి ఆ జిల్లాలో ఏ సామాన్యుడిని అడిగినా చెబుతారు. అతని మీద ఆరోపణలు. శాన్‌మోహన్ అనే ఐ.ఎ.ఎస్. అధికారి బాగా పనిచేస్తుంటే ఆయనను సిఆర్‌డిఎకు పంపించాము, అతని మీద ఆరోపణలు. సిఆర్‌డిఎ కమిషనర్ శ్రీధర్ మీద ఆరోపణలు చేశారు. ఈ రెండు జిల్లాల కలెక్టర్లు మరియు యంత్రాంగం మేమిచ్చిన రూ.3,000 కోట్ల మొత్తాన్ని నేరుగా నిర్వాసితుల అకౌంట్స్‌లోకి చేరేలా చర్యలు తీసుకున్నారు. ఎక్కడా ఏ ప్రజాప్రతినిధి గానీ, మేమెవ్వరం కూడా మా చేతితో ఎవ్వరికీ ఒక్క చెక్కు కూడా ఇవ్వలేదు. నేరుగా నిర్వాసితుల అకౌంట్స్‌లోకి చేరేవిధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. అందుకు సంబంధించి వెబ్‌సైట్‌లో అన్ని వివరాలు ఉన్నాయి.

ఉ.10.30

అధ్యక్షా, ఏదోవిధంగా పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్) ఫైనల్ అవ్వకుండా అడ్డం పడాలని అయిదు రోజులు సాక్షిపత్రిక, ఛానెల్‌లో జగన్మోహన్‌రెడ్డిగారు ఎంతగానో కష్టపడుతున్నారు. ఎందుకంటే, మనకు రావాల్సిన రూ.2500 కోట్లు దిల్లీనుంచి తెచ్చుకోవాలి. ఆ డబ్బులు రావాలంటే రూ.1080 కోట్లు పోను, మిగతా రూ.700 కోట్లు టూ డిపిఆర్ రిపోర్టులో రావాలి. దానికి అడ్డంపడడానికి అయిదురోజులుగా ప్రతిరోజూఅక్కడున ్న ప్రజా ప్రతినిధుల మీద, చివరికి కలెక్టర్లమీద బురదేస్తున్నారు. రెవెన్యూ యంత్రాంగాన్ని ఇంకా అభాసుపాలు చేయాలని, అడ్డదిడ్డంగా రాస్తున్నారు. వాళ్ళ తుది ప్రయత్నమేంటంటే డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు అవ్వకూడదు. కేంద్ర ప్రభుత్వం నుంచి డబ్బులు రాకూడదు, ఆ పనులు ఆగాలి, ఏదోవిధంగా మనల్ని తిట్టాలి. ఈ విధమైన కుట్రలు, కుతంత్రాలతో జగన్మోహన్ రెడ్డిగారు ఎన్నో కష్టాలు పడి వీటిని రాయిస్తున్నారు. అయినా ఇవేమీ కూడా మేం లెక్కపెట్టడంలేదు. నిజాయితీగా, నిర్భయంగా మా అధికారులు కానీ, ప్రభుత్వంకానీ, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయడానికే ముందుకెళ్తాం.

అధ్యక్షా, హంద్రీ-నీవా ప్రాజెక్టు గురించి చెప్పాలి. సోదరుడు కె.ఇ.ప్రభాకర్‌గారు, ఉప ముఖ్యమంత్రి కె.ఇ. కృష్ణమూర్తికానీ వీళ్ళంతా పత్తికొండ, డోన్ ప్రాంతాలలోని 106 చెరువులకు మొదటిదశలో అనుమతివ్వమని ముఖ్యమంత్రిగారు అక్కడికెళ్ళినప్పుడు కోరగా, వారు ఇది నా బాధ్యత అని చెప్పి వచ్చారు. తదనుగుణంగా వాటికి

సంబంధించిన పనులకు ఈ వారంలో ముఖ్యమంత్రిగారు రూ.200 కోట్లకు పైగా మంజూరు చేయబోతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఒక నెల రోజుల్లో టెండర్లు పూర్తిచేసి ఈ సంవత్సరం పత్తికొండ, కర్నూలు ప్రాంతాల్లో అన్ని చెరువులకు నీళ్ళిస్తామని తెలియజేస్తున్నాము.

అంతేగాకుండా, ఆనాడు ఎన్.టి.రామారావుగారు హంద్రీ-నీవా ప్రాజెక్టును పెట్టినప్పుడు దాని సామర్థ్యం 40 టి.ఎం.సిలు. ఇవాళ మన కె.సి కెనాల్‌కు 854 అడుగుల నీటిమట్టం లేకుండా నీళ్ళు వెళ్తున్నాయి. అయినా 854 అడుగులని మా మీద ఉద్యమాలు చేస్తూ ప్రతిపక్షం వాళ్ళు తిట్టేవాళ్ళు. ఇవాళ ఎట్లా వెళ్తున్నాయి? ముఖ్యమంత్రిగారి దూరదృష్టి. ఇక్కడ పట్టిసీమ ద్వారా 105 టి.ఎం.సిలు తెచ్చారు. పోతిరెడ్డిపాడు, హంద్రీ-నీవా, గాలేరు-నగరి ద్వారా 140 టి.ఎం.సిలు ఇచ్చారు. అదిగాకుండా, ఇవాళ శ్రీశైలంలో కృష్ణానదిలో 829 అడుగులున్నాయి. అయినా కె.సి కెనాల్‌కు నీళ్ళు వెళ్తున్నాయి. ఇవాళ కె.సి కెనాల్‌కు 456 అడుగులు, మల్యాల నుంచి హంద్రీనీవాకు 680 అడుగుల నీళ్ళు ఇస్తున్నాము. ఆ నీళ్ళు ఎలా ఇస్తున్నాము? అధ్యక్షా, పట్టిసీమ, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ఇవన్నీకూడా 10 సంవత్సరాల పాటు అడుగు ముందుకెయ్యలేదు. రెండు సంవత్సరాలు తిరగకుండా మూడవ సంవత్సరంలో చంద్రబాబునాయుడుగారు ప్రారంభోత్సవం చేశారు. ఇవాళ ముచ్చుమర్రిద్వారా కె.సి కెనాల్, కర్నూలుకి నీళ్ళు వెళ్తున్నాయి. హంద్రీనీవాకు మల్యాల దగ్గర ఎత్తిపోసి ముచ్చుమర్రి నుంచి ఇవాళ 829 అడుగుల్లో ఉన్న కృష్ణమ్మతల్లిని కాలువలో పోస్తున్నాము. ఆ విధంగా **24x7, 365** రోజులూ కూడా రాయలసీమ నాలుగు జిల్లాలకు కృష్ణాజలాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారికి, తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కుతుందని మీద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఒక టి.ఎం.సికి పట్టిసీమకు కోటి ఆరవై లక్షల రూపాయలు ఖర్చుపెడితే, ముచ్చుమర్రి దగ్గర రూ.12 కోట్లు ఖర్చు పెడ్తున్నాము. ఈ సంవత్సరం ఇంత తక్కువ నీళ్ళు వచ్చినా కూడా 33 టి.ఎం.సిలు ఇచ్చాము. కర్నూలుకు 12 టి.ఎం.సిలు, కె.సి కెనాల్‌కు 6 టి.ఎం.సిలు, అనంతపూర్‌కు 21 టి.ఎం.సిలు ఇవ్వడంవల్ల సుమారు రెండు లక్షల ఎకరాల బోర్లు ఛార్జ్ అయ్యాయి. చెక్ డ్యామ్‌లు నిండాయి. పాడైపోయిన బోర్లన్నీ కూడా ఈనాడు బ్రహ్మాండంగా ఛార్జ్ అయ్యాయి. హార్టికల్చర్ హబ్‌గా మారింది. ఈరోజు ఎవరైతే కర్నూలు, అనంతపూర్, చిత్తూరు జిల్లాల్లో అరటి, పూలమొక్కలు, । నీ వేశారో వారికి, లాభాలుంటున్నాయి.

అధ్యక్షా, చిత్తూరుకు, అనంతపూర్‌కు నీళ్ళు వెళ్ళకుండా ఒక రైతును తీసుకెళ్ళి సుప్రీంకోర్టులో కేసులు వేయించారు. మహానుభావుడు స్వర్గీయ ఎన్.టి.రామారావుగారు ప్రారంభించిన హంద్రీనీవా నీటిని ఈరోజు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపూర్ నియోజకవర్గం చెరువులకు బాలకృష్ణగారి చేతులమీదుగా నీటిని పంపుతున్నాము. ఈనెల 31వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి చేతులమీదుగా లేపాక్షి, హిందూపూర్ నియోజకవర్గానికి నీళ్ళిస్తున్నాము. ఏప్రిల్‌లో హిందూపూర్‌కు, మేలో మడకశిరకు నీళ్ళు తీసుకెళ్తాము. ఇలా చేస్తుంటే ఎకరానికి కోటి రూపాయలు కావాలని చెప్పి ఒక రైతును హైకోర్టుకు పంపించి ఆరునెలలు ఆపారు. అన్ని వివరాలను పరిశీలించిన

కోర్టువారు కేసు కొట్టేశారు. మేము పనులు మొదలుపెట్టగానే మళ్ళీ వెంటనే సుప్రీమ్‌కోర్టుకు వెళ్ళి స్టే తీసుకొచ్చారు. అడవిపల్లికి, మదనపల్లికి, తంబళ్ళపల్లికి, చిత్తూరుకు, కుప్పానికి, రాయచోటికి నీళ్లు వెళ్ళకుండా మొత్తం పనులు ఆపేశారు. మళ్ళీ మేము సుప్రీంకోర్టుకు వెళ్ళి వాస్తవాలన్నీ చెప్తే వాళ్ళు కూడా అర్థంచేసుకుని 23వ తారీఖున పనులు చేసుకోమని చెప్పారు. తప్పకుండా 23వ తారీఖు నుంచి వారం రోజులు పనిచేస్తే పూర్తవుతుంది. ఈ వారం రోజుల పనికోసం ఆరు నెలలపాటు లక్షలాదిమంది ప్రజలకు త్రాగునీరు వెళ్ళలేదు.

అధ్యక్షా, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీవారు ఎన్నో కుట్రలు చేస్తున్నారు. ప్రతిపక్షనాయకుడిగా ఉండి జగన్మోహన్ రెడ్డిగారు, పిఏసి ఛైర్మన్‌గా ఉన్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిగారు హంద్రీనీవా పనులు ఏ విధంగా ఆపుతున్నారో మీద్వారా రాష్ట్ర రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు, రాయలసీమవాసులకు తెలియాలని ఈ వివరాలన్నీ తెలియజేస్తున్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరుకల్లా ఆ కాలువ పనులు పూర్తిచేసి రాబోయే ఏప్రిల్ 15వ తేదీకల్లా చిత్తూరు జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు కుప్పం నియోజకవర్గంలో 2,000 అడుగుల ఎత్తున నీళ్ళు ఇవ్వాల్సి ఉంది. 2,000 అడుగులు ఎత్తితేకానీ ఆ ప్రాంతానికి నీళ్ళు వెళ్ళవు. అదికూడా ఏప్రిల్ 15వ తేదీకల్లా మొదటిదశలో, మే, జూన్‌కల్లా రెండోదశలోనూ కుప్పానికి నీళ్ళు ఇవ్వడం జరుగుతుంది. రామారావుగారు పెట్టిన ఈ హంద్రీనీవా పథకం ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి చేతులమీదుగా పూర్తవుతోంది. ఎందుకంటే, గతంలో మంత్రిగా పనిచేసిన మీకు ఆ కష్టాలు, బాధలు అన్నీ తెలుసు. ఎన్నో అవమానాలు చేశారు. ఎన్నో రాళ్ళేసారు. మిమ్మల్ని ఎన్నో తిట్లు తిట్టారు. అయినా, ఈ ముప్పై సంవత్సరాలలో మహానుభావుడు రామారావుగారు పెట్టిన ఈ పథకం చంద్రబాబునాయుడుగారి చేతులమీదుగా పూర్తవుతోంది.

## మునిసిపాలిటీలలో కబేళాలు

ప్రశ్న నెం. 10073 (64)

**శ్రీ రాము సూర్యారావు, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా?

**అ)** రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లలో ఉన్న కబేళాల సంఖ్య?

**ఆ)** కబేళాలు లేని పట్టణాలలో వాటి నిర్మాణం కోసం తీసుకున్న చర్యలు ఏమిటి?

**ఇ)** కబేళాలను ఆధునీకరించాలని ప్రభుత్వం ఉద్దేశిస్తున్నదా?

**గౌరవనీయులైన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ శాఖా మంత్రి (డా. పి.నారాయణ) :**

**అ)** రాష్ట్రంలో 61 కబేళాలు ఉన్నాయి.

**ఆ)** కబేళాలు లేని, 25 పట్టణ స్థానిక సంస్థలలో ఈ కబేళాలను ఏర్పాటు చేయడానికి చర్యలను తీసుకోవడమవుతున్నది. స్థలాలను గుర్తిస్తూ, మునిసిపల్ స్థలం లేనప్పుడు స్థలాల కేటాయించేందుకు రెవెన్యూ శాఖను సంప్రదించడమవుతున్నది.

**ఇ)** అవునండీ.

**శ్రీ రాము సూర్యారావు(ఉపాధ్యాయ నియోజకవర్గం – తూర్పు, పశ్చిమ గోదావరి):** అధ్యక్షా, మంత్రిగారు చెప్పిన లెక్కలు బాగానే ఉన్నాయి కానీ, అక్కడ ఆచరణలో మాత్రం అధికశాతం మునిసిపాలిటీలు, ఏలూరు కార్పోరేషన్‌లో కూడా ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. అందువల్ల, దయచేసి మీద్వారా మంత్రిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ కబేళాలు ఎంతవరకు ఉన్నాయి, ఆచరణలో ఎక్కడ జరుగుతున్నాయనేది దయచేసి ఒకసారి పరిశీలించవలసిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, ఈ కబేళా అంశం చాలా ముఖ్యమైంది. ఎందుకంటే 75 శాతం ప్రజానీకం మాంసాహారం భుజిస్తుంటారు. అందులో 90 శాతం మైనార్టీలు ఈ మాంసం విక్రయాన్ని వృత్తిగా చేసుకుంటూ జీవితం గడుపుతున్నారు. అటు తినేవారికీ, ఇటు వృత్తిగా జీవితం గడిపేవారికీ సంబంధించిన అంశం ఇది. ముఖ్యంగా మునిసిపాలిటీ శానిటరీ డిపార్టుమెంట్ దీనిమీద దృష్టిపెట్టాల్సిన అవసరముంది. అలాగే, సుప్రీంకోర్టు వారు పాతబడిన కబేళాలను మోడ్రనైజ్ చేయాలని, దానివల్ల ఆరోగ్యం మీద ప్రభావం పడే పరిస్థితి ఉంటుందనే ఉద్దేశంతో సుప్రీంకోర్టువారు నూతన డైరెక్షన్స్ ఇవ్వడం మూలంగా చాలాచోట్ల పాత కబేళాలను మూసేస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు, నిడదవోలు, తాడేపల్లిగూడెంలలో ఉన్న కబేళాలను అర్థాంతరంగా మూసేశారు. కాబట్టి ఇప్పుడు ఉన్నవి ఉన్నట్లుగా ఉంచడం కానీ, లేకపోతే వాటిని ఆధునికీకరించడం వంటి ఆలోచన చేయాల్సిన అవసరం ఈనాడు ప్రభుత్వం మీద ఉంది. మంత్రిగారు చెప్పినట్లుగా 50 మున్సిపాలిటీలలో 61 కబేళాలున్నాయి. రాష్ట్రంలో 115 మున్సిపాలిటీలు ఉన్నాయి. కాబట్టి, ప్రతీ మున్సిపాలిటీలో కబేళా ఏర్పాటు చేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఉంది. ఈరోజు కేంద్ర ప్రభుత్వం కూడా 50 శాతం సబ్సిడీ ఇస్తుందనేది వాస్తవమా, కాదా అనేది ఈరోజు మంత్రిగారు చెప్పాల్సిన అవసరముంది. విశాఖపట్నంలో పిపిపి మోడ్‌లో ఒక ఆధునికమైన మంచి కబేళాను (శ్లాటర్‌హౌస్) ఏర్పాటుచేశారు. ఆ రకమైన శ్లాటర్ హౌసుల్ని ప్రతీ పట్టణంలో కూడా ఏర్పాటు చేస్తే ఇటు వ్యాపారం చేసుకుంటున్న వాళ్ళకు ఇబ్బంది ఉండదు. అదేరకంగా తినే వాళ్ళ ఆరోగ్యం కూడా బాగుంటుందనే ఉద్దేశాన్ని మంత్రిగారు గమనించి, ఈనాడు మనం ఆధునిక యుగంలోకి వెళ్తున్నాం. కాబట్టి కబేళాల విషయంపై ప్రభుత్వం ఇంకా ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరముందని ఈ సందర్భంగా మంత్రిగారికి మనవి చేస్తున్నాను.

ఉ.10.40

**శ్రీ బచ్చుల అర్జునుడు(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, కబేళాల విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ప్రభుత్వానికి ఉంది. ఇవాళ కబేళాలు పేరుకు మాత్రమే ఉంటున్నాయి తప్ప, హెల్త్ ఆఫీసర్లు మున్సిపాలిటీలలో లేకపోవడం వల్ల, ఇళ్ల దగ్గరే జీవాలను కట్ చేసుకుని కబేళాలకు తీసుకొచ్చి మార్కెట్ చేస్తున్నారు. ఎక్కడైతే కబేళాలు కాకుండా ఔట్ సైడ్‌లో జీవాలను, మాంసాన్ని అమ్ముతున్నారో అక్కడ జీవాలను కోసే చోట ఆ జీవాలను కనీసం మంచి నీళ్లతో కూడా కడగడం లేదు. హెల్త్ ఆఫీసర్లు పురపాలక సంఘాల్లో లేక పోవడం వల్ల మంచి నీటి పర్యవేక్షణ లేకపోవడం వల్ల కూడా ఈ విధంగా జరుగుతోంది. అలాగే, కబేళాల దగ్గర 10-20 శాతం తప్ప కబేళాలపై గానీ, బయటివాటిపై గానీ పర్యవేక్షణ జరగటం లేదు. ఖచ్చితంగా హెల్త్ ఆఫీసర్ ఆ జీవాలను కోసే ముందు పరీక్షించాలి. పర్యవేక్షణ లేకపోవడం వల్ల అనారోగ్యంగా ఉన్న జీవాలను కూడా కోసి మాంసాహారంగా అమ్మే పరిస్థితి ఇవాళ ఉంది. దయచేసి మంత్రిగారు దీనిపై మనసు పెట్టి, పురపాలక సంఘాల్లో హెల్త్ ఆఫీసర్లను నియమించాలి. దీని వల్ల రెండు ప్రయోజనాలున్నాయి. ఒక పక్కన మాంసాహారం, మరో పక్క క్లోరినేషన్ వాటర్ ఏవిధంగా ఉంది, ఎంత శాతం ఉంది, అలాగే వాటర్‌ని శుద్ధి చేసేటప్పుడు వాడే అన్నింటినీ కూడా క్వాలిటీ లేకుండా చేయడం మూలన, ఈ వేసవిలో టైఫాయిడ్ ఎక్కువగా రావడానికి ప్రధాన కారణంగా ఉంది. హెల్త్ ఆఫీసర్లు లేకపోవడం వల్ల, అవసరమైన దానికంటే ఎక్కువ క్లోరినేషన్‌ను వాడటం, అది చివరికి వచ్చేటప్పటికి ట్యాపుల్లో అసలు క్లోరినేషన్ లేకుండా పోవడం, ఇలా రకరాలైనటువంటి ఇబ్బందులు వస్తున్నాయి. దయచేసి మంత్రిగారు ఈ విషయాలను నోట్ చేసుకోవాలి-పురపాలక సంఘాలలో మంచినీరు తయారయ్యే చోట వాడే ఆలం క్వాలిటీది వాడకపోవడం వల్ల సరైన శుభ్రత వాటర్‌లో రాకపోవడం వల్ల, ఈ వాటర్ తాగిన వాళ్లకి టైఫాయిడ్ రావడానికి అవకాశం ఉంది. ఆ ఆలం కూడా తగినంతగా వాడక పోతే ఖచ్చితంగా టైఫాయిడ్‌కి గురవుతారు. కాబట్టి, వీటన్నిటి మీదా దయచేసి మంత్రిగారు దృష్టి కేంద్రీకరించాలని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

**డా. పి. నారాయణ:** అధ్యక్షా, ఈ స్లాటర్‌హౌసెస్ మీద 01.11.2012 తేదీన జి.ఓ.నెం.415 ఇచ్చారు. దానిమీద 17.03.2015 తేదీన జి.ఓ.నెం.54 లో సి.డి.ఎమ్.ఏ. గారిని, మరొక రిటైర్డ్ జడ్జిని ఆ కమిటీలో వేయడం, ఆ తరువాత జి.ఓ.నెం.4 ను జారీ చేసి, డిస్ట్రిక్ట్ లెవెల్, సిటీ లెవెల్ కమిటీలు కూడా వేశాం. ఈ కమిటీలన్నీ పరిశీలన చేసి, ఈ స్లాటర్‌హౌస్‌లు ఎక్కడైతే ఉన్నాయో అక్కడ ఏవైతే నార్మ్స్ ఫాలో అయ్యే లాగా, ఆ నార్మ్స్ ఫాలోకాని వాటిని క్లోజ్ చేయడం, లాండ్స్ లేని వాటిని ఐడెంటిఫై చేయడం, మోడ్రనైజ్ చేయడం, అక్కడి నుంచి వచ్చే సాలిడ్ వేస్ట్ కానీ, లిక్విడ్ వేస్ట్ కానీ ప్రాపర్‌గా ట్రీట్ చేసి బయటికి పంపించేటట్లుగా నియమనిబంధనలు పెట్టి దానిమీద ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. రాష్ట్రంలో మొత్తం 110 మున్సిపాలిటీలు ఉంటే వాటిలో 51 మున్సిపాలిటీలలో 61 స్లాటర్ హౌస్‌లు ఉన్నాయి. వాటిలో 12 స్లాటర్ హౌస్‌లను క్లోజ్ చేయాల్సి వచ్చింది-ఎందుకంటే అవి ఎటువంటి పారామీటర్స్‌ను పాటించలేదు. ఐతే ఈ రోజు 25 మున్సిపాలిటీస్‌లో, ప్రత్యేకంగా 6 మున్సిపాలిటీలలో సైట్ లభ్యత ఉంది, గుడివాడ,

। రాల, । మకుర్తి, ఆత్మకూరు, రాయచోటి, యర్రగుంట్ల ఇక్కడ సైట్ ఐడెంటిఫై అయింది. అక్కడ త్వరలో కట్టబోతున్నాం. అదేవిధంగా 8 మున్సిపాలిటీలలో అంటే సాలూరు, నరసరావు పేట, వినుకొండ, నాయుడుపేట, తాడిపత్రి, గుత్తి, ప్రొద్దుటూరు, పుంగనూర్లలో సైట్స్ ఉన్నాయి, ఆల్రెడీ ఉన్న వాటిని రిపేరు చేసి బెటర్‌గా చేయడం జరుగుతుంది. అదేవిధంగా రెవెన్యూ డిపార్ట్‌మెంటుని రిక్వస్ట్ చేసి, 9 మున్సిపాలిటీలలో సైట్స్ కోసం చూస్తున్నాం. అదే విధంగా, తణుకు మున్సిపాలిటీలో సైట్ ఐడెంటిఫై అయింది, త్వరలో కన్‌స్ట్రక్షన్ మొదలు పెట్టబోతున్నాం. అమలాపురంలో ఆల్రెడీ కన్‌స్ట్రక్షన్ చేశారు, అయితే ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ రానందువలన ఆగింది. బహుశ అది కూడా త్వరలో వస్తుంది. రాగానే అక్కడ కూడా స్టార్ట్ చేయడం జరుగుతుంది. ఈ విధంగా ఈరోజు మనకు మున్సిపాలిటీల్లో ఉన్న ఈ సెక్షన్ 272(7), అదే విధంగా 530 ప్రకారం ప్రైవేటు వాళ్లు కూడా వీటిని స్టార్ట్ చేయవచ్చు. ఐతే, మోడ్రనైజేషన్ చేయటం గురించి సభ్యులు అడిగారు, మోడ్రనైజ్ చేయడానికి జి.ఓ.నెం.425ను 04.07.2016 తేదీన ఇవ్వడం జరిగింది. దానిని బేస్ చేసుకొని, జి.వి.ఎమ్.సి, ఏలూరు, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్, పాలకొల్లు, నూజివీడు, జగ్గయ్యపేట, తెనాలి మున్సిపాలిటీలలో మోడ్రనైజ్ చేయడానికి యాక్చ్యువల్‌గా ప్రారంభించాం. అదేవిధంగా ఆల్రెడీ జి.వి.ఎమ్.సి.లో ఒక స్లాటర్‌హౌస్‌ని మోడ్రనైజ్ చేశాం. రాజమండ్రిలో టెక్నికల్ శాంక్షన్ త్వరలో ఇస్తున్నాం. అది కూడా మోడ్రనైజ్ కాబోతోంది. ఏలూరులో బ్లడ్ వేస్ట్ ఏదైతే డ్రెయిన్‌లోకి పోతుందో దాని వల్ల కొల్లేరులో వాటర్ పొల్యూషన్ అవుతుంది. అందుకని ఎఫ్లుయంట్ ట్రీట్‌మెంట్ ప్లాంటు పెట్టే వరకూ దానిని టెంపరరీగా స్టాప్ చేశాం. సభ్యులు అడిగినట్లుగా విశాఖపట్నం మాదిరిగా అన్ని చోట్ల కట్టడానికి, అలా మోడ్రనైజ్ చేయడానికి అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తున్నాం. అదేవిధంగా హెల్త్ ఆఫీసర్ల పోస్టులను కూడా భర్తీ చేయడానికి వెంటనే చర్యలు తీసుకొని పరిష్కరించడం జరుగుతుంది. అదే విధంగా, వాటర్ ప్లాంట్స్‌లో వాడే ఆలం క్వాలిటీగా, సఫిషియంట్‌గా ఉండే విధంగా చేయమన్నారు, దాని మీద కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**శ్రీ మహ్మద్ అహ్మద్ షరీఫ్:** అధ్యక్షా, నిడదవోలు, తాడేపల్లిగూడెంలో అర్థాంతరంగా స్లాటర్‌హౌస్‌లను మూసివేయడం వల్ల వాళ్లకు జీవనోపాధి లేదు. బయట కోసుకుని అమ్ముకునే పరిస్థితి లేదు, తినేవాళ్లు ఎలా తింటున్నారో తెలియదు గానీ ఇప్పుడు నిడదవోలు, తాడేపల్లిగూడెంలో పూర్తిగా స్లాటర్‌హౌస్ లేకుండా పోయింది.

**డా. పి. నారాయణ:** స్లాటర్‌హౌస్ జనరల్‌గా సెంట్రల్ గవర్నమెంట్ యాక్ట్ 2001 రూల్స్ ప్రకారం ఏర్పాటు చేస్తాము. స్లాటర్‌హౌస్ డెఫినిషన్ ఏమిటంటే పదిగానీ, అంతకన్నా ఎక్కువ జీవాలను కట్ చేస్తుంటే దానిని స్లాటర్‌హౌస్‌గా తీసుకున్నారు. నగర పంచాయితీలలో పది కంటే తక్కువ ఉండే వాటికి ఈ రూల్స్ వర్తించవు. ఖచ్చితంగా ఏదైతే మున్సిపాలిటీల గురించి చెప్పారో అక్కడ ఏర్పాటు చేయడానికి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**మిస్టర్ చైర్మన్:** క్వశ్చన్ నెం.10385 మెంబర్ రిక్వస్ట్ మీద పోస్ట్‌పోన్ చేయడం జరిగింది. క్వశ్చన్ నెం.10426

## దీన్ దయాళ్ ఉపాధ్యాయ పథకం కోసం నిధులు

ప్రశ్న నెం.10426 (66)

**శ్రీ సోము వీర్రాజు, ఎం.ఎల్.సీ.,**

గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రిగారూ  దయచేసి ఈ క్రింది సమాచారమును తెలియచేస్తారా;

అ) రాష్ట్రంలో **24x7** గంటల విద్యుత్ పథకం క్రింద మెగావాట్లలో సౌరశక్తి సామర్థ్యాన్ని ఏమేరకు అనుమతించారు;

ఆ) రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎల్.ఇ.డి బల్బుల సంఖ్య ఎంత;

ఇ) రాష్ట్రంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ పథకం ద్వారా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు, జల్లాల వారీగా కేటాయించిన నిధుల వివరాలు ఏమిటి;

ఈ) దీనికి సంబంధించిన వివరాలు ఏమిటి?

**గౌరవనీయులైన ఇంధన శాఖ మంత్రి (శ్రీ కిమిడి కళా వెంకట్రావు):**

అ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో **24x7** గంటల విద్యుత్ పథకం క్రింద సౌరశక్తి ప్రాజెక్టుల లక్ష్యాల అదనపు సామర్థ్యం 5,105 మెగావాట్లుగా ఉన్నది.

ఆ) 05-03-2018 తేదీ నాటికి మెస్సర్స్ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీస్ లిమిటెడ్ (ఇఇఎస్ఎల్) వారు సరఫరా చేసిన 2,17,95,541 ఎల్.ఇ.డి బల్బులను ఎపిఎస్ఇఇడిసిఓ పంపిణీ చేసింది. ఆ వ్యయాన్ని ఏపి డిస్కంలు భరించడమవుతున్నది.

ఇ) డిడియుజిజెవై పథకం క్రింద కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణ అంశాన్ని బలపరుస్తూ రూ.191.41 కోట్ల నిధుల మొత్తాన్ని కేటాయించడమయినది.

ఈ)

| వరుస సంఖ్య | జిల్లా | సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం కేటాయించిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 1 | 2 | 3 |
| 1 | శ్రీకాకుళం | 9.52 |
| 2 | విజయనగరం | 11.63 |

| 1 | 2 | 3 |
|---|---|---|
| 3 | విశాఖపట్టణం | 19.92 |
| 4 | తూర్పు గోదావరి | 19.04 |
| 5 | పశ్చిమ గోదావరి | 24.15 |
| 6 | కృష్ణా | 14.39 |
| 7 | గుంటూరు | 18.65 |
| 8 | నెల్లూరు | 14.16 |
| 9 | చిత్తూరు | 14.83 |
| 10 | కడప | 12.12 |
| 11 | కర్నూలు | 17.6 |
| 12 | అనంతపురము | 15.4 |
| | మొత్తం | 191.41 |

ఉ.10.50

**శ్రీ గుండుమల తిప్పేస్వామి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, వ్యవసాయ రంగం చాలా ఇబ్బందులలో ఉంది. అనంతపురం జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం అప్లై చేసిన వారికి వెంటనే విద్యుత్ కనెక్షన్స్ ఇవ్వాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను. రెండవ అంశమేమంటే, సబ్‌స్టేషన్స్ మంజూరై చాలా రోజులు అయ్యింది. జి.యస్.టి. సమస్య వలన టెండర్లు పిలవడమే ఆలస్యమవుతోంది. గౌరవ మంత్రి గారు రాష్ట్రానికి రూ.191కోట్లు కేటాయించామని చెబుతున్నారు. జి.యస్.టి. సమస్యను వెంటనే పరిష్కరించి, అనంతపురం జిల్లాలో సబ్‌స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, పశ్చిమ గోదావరి జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్స్ కొరత ఎక్కువగా ఉంది. నిజాయితీ గల ఆఫీసరు అక్కడ పనిచేస్తున్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. దయచేసి మంత్రి గారు ట్రాన్స్‌ఫార్మర్స్ విషయంలో దృష్టి పెట్టాల్సిందిగా మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:** అధ్యక్షా, డార్క్ జోన్ అనే నిబంధనతో రైతులకు వ్యవసాయానికి కొత్త విద్యుత్ కనెక్షన్స్ ఇవ్వడం లేదు. దయచేసి దానిని రివైజ్ చేయాల్సిందిగా మంత్రిగారిని మీద్వారా కోరుతున్నాను. ఈ సమస్య ముఖ్యంగా చిత్తూరు జిల్లా రామచంద్రాపురంలో ఎక్కువగా ఉన్నది. రెండవ అంశమేమంటే, వైజాగ్ యస్‌పిడిసిఎల్ పరిధిలో 136 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లను చేర్చుకోలేదు. సుప్రీంకోర్టు తీర్పు తరవాత అన్ని జిల్లాలలో 10, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని తీసుకున్నారు. సదరు అంశమై మొన్న అజయ్‌జైన్ గారిని కలిస్తే వారిని విధులలోకి తీసుకుంటామని చెప్పారు కాని ఈరోజు వరకూ చేర్చుకోలేదు. దయచేసి వారి సేవల్ని గుర్తించి, వారిని విధులలోకి తీసుకునే అంశాన్ని పరిశీలించాల్సిందిగా మీద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ బి.యన్.రాజసింహులు:** అధ్యక్షా, చిత్తూరు జిల్లాలో పెనుమూరు మండలం ఉంది, దానిలో మొత్తం 16 రెవెన్యూ గ్రామాలుంటే అందులో 14 గ్రామాలు డార్క్ విలేజ్‌లుగా ఉన్నాయి. కేవలం రెండు గ్రామాలలో మాత్రమే మామూలుగా విద్యుత్ కనెక్షన్స్ ఉన్నాయి. నేను గతమాసం ఆ మండలానికి రెవ్యూకు వెళ్లాను. దాదాపు 14 ట్రాన్స్‌ఫార్మర్స్ దొంగలు ఎత్తుకు వెళ్లారు. దానిలో ఎస్.ఐ దొంగతనం జరిగినట్లు ఎఫ్.ఐ.ఆర్ ఇవ్వలేదని కేవలం 7 ట్రాన్స్‌ఫార్మర్స్ మాత్రమే పెట్టారు. మిగిలినవి పెట్టలేదు. అప్పుడు ఎస్.పి గారితో మాట్లాడి వెంటనే ఎఫ్.ఐ.ఆర్ ఇవ్వమని చెప్పడం జరిగింది. అక్కడ ఏమవుతుందంటే ఎఫ్.ఐ.ఆర్ గనుక కాపీ అయితే రికవరీలో లేట్ అవుతోందని వారు నాలుగు నెలలు లేట్ చేశారు. ఇప్పుడు అక్కడ డార్క్ ఏరియాలో ఉన్న 14 రెవెన్యూ గ్రామాలకు కల్వకుంటలో అక్కడ ఉన్న ఎన్.టి.ఆర్. జలాశయంలో గ్రౌండ్ వాటర్ బాగా పెరిగింది. దానిని చెయ్యాలంటే కేంద్ర ప్రభుత్వం చేయాలి. అప్పటివరకైనా విద్యుత్ కనెక్షన్స్ ఇచ్చి, ఏయే ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోయాయో అక్కడ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీమతి పామిడి శమంతకమణి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, అనంతపురం కరవు జిల్లా. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల కొరత ఎక్కువగా ఉంది. ఒక్కొక్క ట్రాన్స్‌ఫార్మర్‌కు డి.డి.లు కట్టి దాదాపు 6 నెలలు అవుతోంది. అయినప్పటికీ ఈ రోజుకు ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కూడా శాంక్షన్ చేయడం లేదు. ముఖ్యంగా సింగనమల నియోజకవర్గంలో ఎల్లనూరు మండలం ఉంది. అక్కడ 1500 అడుగులు తీసినా కూడా నీరు రాని పరిస్థితి ఉంది. అక్కడే మడుగుపల్లి అనే గ్రామంలో ఎక్కడ చూసినా 200 అడుగులకే నీళ్లు పడతాయి. కానీ ఆ ప్రాంతాన్ని డార్క్ జోన్‌గా పెట్టడం వలన కరెంటు సరఫరా లేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 15 కనెక్షన్స్‌కు ఒక ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడం వలన అక్కడి రైతులు కొట్టుకునే పరిస్థితి ఉన్నది, అక్కడ కరెంటు లేక నీళ్లు అందక అరటితోటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. త్వరలోనే సమస్యను పరిష్కరించాల్సిందిగా మీద్వారా మంత్రివర్యులను కోరుతున్నాను.

**శ్రీమతి అంగూరి లక్ష్మీ శివకుమారి:** అధ్యక్షా, తూర్పు గోదావరి జిల్లా రౌతులపూడి మండలం చాలా మెట్ట ప్రాంతం. అవి కొండలలో ఉన్న గ్రామాలు. అయితే అటు కోటనందూరు మండలానికి, ఇటు రౌతులపూడి మండలానికి కొత్తపేట సబ్‌స్టేషన్ నుండి కరెంటు రావడం జరుగుతోంది. రౌతులపూడి మండలంలో ఇంచుమించు

20 గ్రామాలు ఉన్నాయి. అక్కడుండే సబ్‌స్టేషన్ ద్వారా కరెంటు జీడిపిక్కల ఫ్యాక్టరీకి, హిందుస్తాన్ పెట్రోలియం ఆఫీస్‌కు, అలాగే 500 మంది రైతుల బోర్లకు, అలాగే 8000 గృహ కనెక్షన్స్‌కు రావాల్సి ఉంటుంది. కరెంటు లోడు ఎక్కువగా ఉండడం వలన ఓల్టేజ్ తక్కువగా ఉంటోంది. పిల్లల పరీక్షల సమయంలో వారు చదువుకోవడానికి సరిగ్గా కరెంటు లేక ఇబ్బంది పడుతున్నారు. మాకు దగ్గర్లో ఒక సబ్‌స్టేషన్ ఇస్తే బాగుంటుందని మీ ద్వారా మంత్రివర్యులకు విజ్ఞప్తి చేస్తున్నాము.

**శ్రీ కిమిడి కళా వెంకట్రావు:** అధ్యక్షా, రాము సూర్యారావు గారు, రాజసింహులు గారు, శమంతకమణి గారు, లక్ష్మీ శివకుమారి గారు, మరో ఇద్దరు గౌరవ సభ్యులు సప్లమెంటరీలు వేయడం జరిగింది. అధ్యక్షా, ఉద్యోగుల సర్వీసెస్ గురించి చెప్పారు, దానిని తప్పకుండా పరిశీలిస్తామని చెప్పి మీద్వారా తెలియజేస్తున్నాను. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్స్ అదనంగా అడిగారు, అవికూడా తప్పకుండా పరిశీలన చేసి ఇస్తాము. తూర్పుగోదావరి ప్రాంతంలో ఓల్టేజ్ సమస్య ఉన్నదని చెప్పారు, దానిని కూడా పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పి మీద్వారా గౌరవ సభ్యులకు మనవి చేస్తున్నాను.

ఈ ప్రశ్న దీనదయాళ్ గ్రామీణ జ్యోతి క్రింద వేశారు. ప్రశ్న వేసిన సభ్యులు సభలో లేకపోయినా, మిగతా సభ్యులందరికి తెలియాలి కాబట్టి కొన్ని వివరాలు చెప్పదలచుకున్నాను. ఈ పథకం క్రింద ప్రవేశించేటప్పుడు కేంద్ర ప్రభుత్వ వాటా 60%, రాష్ట్ర ప్రభుత్వ వాటా 40% అని అన్నారు. బడ్జెట్ కేటాయింపుల క్రింద భారతదేశం మొత్తం మీద 28 రాష్ట్రాలకు 42% ఇచ్చి, మిగిలిన 58% రాష్ట్రాల నుండి కేంద్రం పూలప్ చేసుకుంటుంది. ట్యాక్సేషన్ విషయంలో కూడా, ఇన్‌కమ్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్, మిగతా ట్యాక్సులు అన్నీ కలిపి కేంద్ర ప్రభుత్వం 58% తీసుకుంటుంది. అందులో కరెంటు క్రింద 28 రాష్ట్రాలకు కేటాయించాల్సిన దానిలో మన జనాభా ప్రకారం 4% రావాలి. 4% అంటే రూ.1849 కోట్లు పైచిలుకు రావాలి. కాని, మన రాష్ట్రానికి 2% ఇస్తూ రూ.921.75కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక్కడ గౌరవ సభ్యులందరూ తెలుసుకోవాల్సింది ఏమంటే, మన రాష్ట్రానికి రావాల్సిన మొత్తంలో 50 శాతం తక్కువగా మన రాష్ట్రానికి కేటాయింపులు చేసింది. ఉత్తరప్రదేశ్‌కు 17 శాతం, బీహార్‌కు 14 శాతం అదేవిధంగా జార్ఖండ్‌కు 9 శాతం కేటాయించింది. ఈ మూడు రాష్ట్రాలను కలిపి 40 శాతం ఇచ్చారు. కానీ, ఇక్కడుండే కొంతమంది సభ్యులు ఇది మా పథకం, మేము తీసుకువచ్చాము, మా బొమ్మ పెట్టండి, మమ్మల్ని పెట్టి మీరు ఊరేగండి, చెప్పండి అని అంటారు. ప్రజలకు రాజ్యాంగం ప్రకారం హక్కు ఉంది. ఆ హక్కు ప్రకారం వందశాతం కేటాయిస్తే రూ.1900 కోట్లు రావాలి, కాని కేవలం రూ.900 కోట్లు కేటాయించడం జరిగింది. ఈ కేటాయింపులలో కూడా ఈ పథకం క్రింద ఇస్తామన్న 60 శాతం నిధుల క్రింద ఇప్పటివరకూ రూ.568 కోట్లు ఖర్చు చేసాము. మిగతా నిధులు ఖర్చుచేయడానికి చూస్తున్నాము.

ఉ.11.00

అధ్యక్షా, ఈ స్కీము కింద రూ.568 కోట్లు మేము ఖర్చు చేశాము. అయితే, ఇప్పటివరకు కేంద్రప్రభుత్వం రూ.211 కోట్లు విడుదల చేయడం జరిగింది. రూ.900 కోట్లు రాష్ట్రానికి రావలసి ఉండగా అందులో రూ. 211 కోట్లు మాత్రమే ఇంతవరకు విడుదల చేశారు. ఇవన్నీ ఏమిటంటే, అక్కడ బడ్జెట్ కేటాయింపులు ఉంటాయి, ఇక్కడ బడ్జెటు కేటాయింపులు ఉంటాయి. అది దేశం, ఇది రాష్ట్రం అనే పద్ధతిలో మనం వెళ్లాలి. అంతేగానీ, కొత్త పోకడతో మాట్లాడే కొంతమంది సభ్యుల వల్ల గానీ, పార్టీల వల్ల గానీ, ఈ దేశంలో లేనిపోని విషయాలన్నీ ముందుకు వస్తున్నాయి. దానితో సెంటర్ స్టేట్ రిలేషన్స్, ఫెడరల్ సిస్టం తాలూకు ఉద్దేశాలు కూడా పక్కకు పోయి ఉద్వేగాలకు లోనయ్యి, ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశం, తూర్పు భారతదేశం అనే పద్ధతులు రావడానికి వీళ్లే కారణం అవుతున్నారు. కాబట్టి ఆ పద్ధతులను మార్చుకుని ఫెడరల్ సిస్టమ్‌లో కరెక్ట్‌గా వెళ్లాల్సి ఉందని సభ్యులందరికీ తమ ద్వారా నేను మనవి చేస్తున్నాను.

## అరకు కాఫీ

ప్రశ్న నెం. 10093(67)

**డా. ఎం.వి.వి.ఎస్. మూర్తి, శ్రీ వట్టికూటి వీర వెంకన్న చౌదరి, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం, సాధికారత శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) అరకు కాఫీ ప్రపంచ వ్యాప్తంగా ప్రశంస పొందిన విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, 2014-15, 2015-16 సంవత్సరాలలో ఉత్పత్తి వివరాలు ఏమిటి;

ఇ) ఉత్పత్తి మరియు సాగు విస్తీర్ణమును పెంచడానికి తీసుకున్న చర్యలు ఏమిటి?

**గౌరవనీయులైన సాంఘిక సంక్షేమం మరియు సాధికారత, గిరిజన సంక్షేమం మరియు సాధికారత శాఖ మంత్రి (శ్రీ నక్కా ఆనంద్‌బాబు) :**

అ) అవునండీ.

ఆ) 2014-15 సంవత్సరంలో 7044 మెట్రిక్ టన్నులు, 2015-16 సంవత్సరంలో 8824 మెట్రిక్ టన్నుల కాఫీని ఉత్పత్తి చేయడమయినది.

ఇ) 2015-16 నుండి ప్రారంభించి 10 సంవత్సరాల కాలంపాటు రూ.526.16కోట్ల మొత్తం వ్యయంతో కాఫీ అభివృద్ధి ప్రాజెక్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాజెక్టులోని ముఖ్య అంశాలు ఈ విధంగా ఉన్నాయిః-

1. 1.00 లక్ష ఎకరాలలో కొత్తగా కాఫీ తోటల విస్తరణ. ఇందులో భాగంగా 60,000 ఎకరాలలో షేడ్ ప్లాంటేషన్‌ను అభివృద్ధి చేయడం.

2. 45,000 ఎకరాలలో ప్రస్తుతం వున్న ప్లాంటేషను ఏకీకరణ మరియు పునరుజ్జీవింప చేయడం.

3. 10,000 ఎకరాలలో సేంద్రీయ కాఫీ తోటలను అభివృద్ధిపర్చడానికి సేంద్రీయ ధృవీకరణ.

4. 11,500 బేబి పల్‌పర్స్‌ను సరఫరా చేస్తూ వెస్ట్ పల్‌పింగ్‌ను అభివృద్ధి పర్చడం ద్వారా నాణ్యతను మెరుగుపర్చడం.

5. మెరుగైన గిట్టుబాటు ధర కోసం జి.సి.సి(గిరిజన సహకార సంఘం లిమిటెడ్) ద్వారా మార్కెటింగ్, మద్దతు.

**శ్రీ వి.వి.వి. చౌదరి(శాసనసభా నియోజకవర్గం):** అధ్యక్షా, విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో ఇంచుమించు పదకొండు మండలాలలోని లక్ష ఎకరాలలో కాఫీ తోటల పెంపకం జరుగుతోంది. మంత్రిగారు చెప్పినట్లుగా జి.సి.సి ద్వారా కాఫీ గింజల ప్రొక్యూర్‌మెంట్ చేస్తున్నప్పటికీ, 2015-16లో ప్రొక్యూర్‌మెంట్ స్టార్ట్ చేస్తే, 2016-17లో కొంచెం మందకొడిగా సాగింది. ఎందుకంటే దీనిలో మధ్యవర్తులు ఎంటర్ అయ్యి ఒకేసారి పేమెంట్ ఇవ్వడంతో జి.సి.సి.ప్రొక్యూర్‌మెంట్ కంటే మధ్యవర్తులవైపుకు మొగ్గు చూపడం జరిగింది. దీనిమీద ప్రభుత్వం ఆలోచించి, ప్రొక్యూర్‌మెంట్‌లో కొంత స్ట్రీమ్‌లైన్ చేసి, మిగిలిన క్యాష్‌క్రాప్స్‌లాగే ఈ రైతులకు కూడా రుణసదుపాయాలు, సబ్సిడీ సదుపాయాలు కల్పిస్తే ఇంకా ప్రొడక్షన్ మెరుగుపడే అవకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించాలని కోరుతున్నాను. అదేవిధంగా ప్రొక్యూర్‌మెంట్ విషయంలో జి.సి.సి.కి మరింత ఊతం ఇవ్వాల్సి ఉందని ఈ సందర్భంగా మంత్రిగారికి తమ ద్వారా తెలియజేసుకుంటున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్‌కు ఒక బ్రాండ్ ఇమేజ్‌గా అరకు కాఫీ ఉంది. అయితే, గిరిజన రైతాంగానికి మేలు చేకూర్చే విధంగా ఈ కాఫీ తోటల్లో అంతర్లీనంగా ఇతర పంటలను ప్రోత్సహించడానికి అవకాశం ఉందా? అలాగయితే వాటికి సంబంధించి తీసుకున్న చర్యలు ఏమని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను. ప్రత్యేకించి స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్ వంటి ఐదారు దేశాలకు కూడా దీనిని ఎగుమతి చేస్తున్నారు. అందులో భాగంగానే దీనిని ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉంది. అలాగే ఈ సమావేశాలు ముగిసే లోపు అరకు కాఫీ ఘుమఘుమలు మన గౌరవ సభ్యులకు, మీడియా మిత్రులకు రుచి చూపిస్తే, ఆ బ్రాండ్ ఇమేజ్‌ను ఇంకా కొంత ప్రచారం చేయడానికి అవకాశం ఉంటుందని మీ ద్వారా మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ విటపు బాల సుబ్రహ్మణ్యం(ఉపాధ్యాయ నియోజకవర్గం - చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు):** అధ్యక్షా, అరకు కాఫీ రుచిని గురించి మనం ఇక్కడ మాట్లాడుకోవడం లేదు. అది దొరకడాన్ని గురించే మాట్లాడుకోవాలి.

అది ఎక్కడా దొరకడం లేదు. దానిని దొరికేలా చేయండి. అది గిరిజన కార్పోరేషన్ స్టాల్స్‌లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఆ స్టాల్స్ ఎక్కడో మారుమూల ప్రాంతాలలో ఉంటాయి. అందువల్ల ఆ కాఫీ దొరకడం మహాకష్టంగా ఉంది. అరకు కాఫీని అందరికీ అందుబాటులో కి తెచ్చి ప్రచారం చేయాలి. ఇతర దేశాలకు తరువాత పంపుకోవచ్చు. ముందు మన దేశంలో వాడి ఇక్కడ ప్రచారంలోకి వస్తే, అప్పుడు ఇతర దేశాల వాళ్లకు పంపవచ్చు. మనకే అందుబాటులో లేకుండా ఫ్రాన్సుకు, ఇతర దేశాలకు అందుబాటులోకి తేవడమేంటి? ఫ్రెంచ్ వారికి అందుబాటులో ఉంటుంది, మాకు అందుబాటులో ఉండదా? ఇది అన్యాయం.

**శ్రీ నక్కా ఆనంద్ బాబు:** అధ్యక్షా, సభ్యులు శ్రీ వి.వి.వి. చౌదరి గారు, నర్సింహారెడ్డిగారు, బాల సుబ్రహ్మణ్యం గారు అడిగిన దానికి, అరకు కాఫీకి 100 సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పటి నుండి కూడా గిరిజన ప్రాంతాల నుండి మధ్యవర్తులే తీసుకువెళ్లి కర్ణాటకలో దానిని సేల్ చేసి, వాళ్ల సొంత బ్రాండ్ మీద ప్రమోట్ చేసుకుంటూ ఉండే వారు. ఇటీవల నాలుగు సంవత్సరాల క్రితం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అరకు కాఫీ బ్రాండ్ ఇమేజ్‌ని అంతర్జాతీయ స్థాయిలో తీసుకు వెళ్లడానికి అనేక చర్యలు తీసుకుంటున్నాము. దానివల్లే అరకు కాఫీకి ఇంత పేరు వచ్చింది. అయితే, అరకు కాఫీని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి కూడా చర్యలు తీసుకుంటున్నాము. అదేవిధంగా ఈ కాఫీ ఉత్పత్తిని పెంచే విధానంలో లక్ష అదనపు ఎకరాలు కాఫీ తోటల్ని పెంచడం కోసం ప్రభుత్వం రూ.534 కోట్లతో కొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అందులో ఇప్పటికే లక్ష అదనపు ఎకరాలలో కాఫీ తోటని విస్తరించడంకోసం, ప్రస్తుతం ఈ రెండు సంవత్సరాల్లో అందుబాటులో ఉన్న షేర్ ప్లాంటేషన్‌ని పెంచాల్సిన అవసరం ఉంది. షేర్ ప్లాంటేషన్‌లో 22వేల ఎకరాలలో కాఫీ తోటల్ని పెంచుతున్నాము. అందులో 60వేల ఎకరాలలో నీడ చెట్లు పెంచడం జరిగింది. అదేవిధంగా గతంలో ఉన్నటువంటి తోటలు లక్షా యాభై ఎనిమిది వేల ఎకరాలు ఉంది. అందులో కూడా హుద్‌హుద్ తుఫానప్పుడు కొన్ని తోటలు పాడైపోతే వాటిలో 45వేల ఎకరాలను బాగుచేసి వాటిల్లో పంట పండిస్తున్నాము. రాబోయే రోజులలో అంటే రాబోయే పది సంవత్సరాల్లో అదనంగా లక్ష ఎకరాల్లో కాఫీ తోటలను పెంచాలనేది లక్ష్యం. తప్పనిసరిగా దానిని రీచ్ అయ్యి కాఫీ తోటలను పెంచడమే కాకుండా, గతంలో దళారుల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే, ఈరోజు జి.సి.సి శాఖ ద్వారా మార్కెటింగ్ చేయడం వల్ల గిరిజనులకు 70 నుంచి 80 శాతం వరకు లాభాలు వస్తున్నాయి. తప్పనిసరిగా రాబోయే 10 సంవత్సరాలలో అదనంగా లక్ష ఎకరాలకు పెంచాలనేది ధ్యేయం. అక్కడ పండే పంటల ద్వారా ఖచ్చితంగా వాటి మీద వచ్చే లాభాలు పెంచే ఆలోచనతో చంద్రబాబునాయుడు గారి నేతృత్వంలో ముందుకు వెళుతున్నాము. అదేవిధంగా గౌరవ సభ్యులు చెప్పినట్లుగా అరకు కాఫీని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలలో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటాము. స్థానికంగా కూడా ఫ్రాంచైజీలు ఇచ్చి, అదేవిధంగా అందరికీ అందుబాటులో ఉండేవిధంగా తీసుకువచ్చి అరకు కాఫీ ఇమేజ్‌ని అంతర్జాతీయ స్థాయిలోనే కాకుండా, దేశంలో, రాష్ట్రంలోకూడా ఆ బ్రాండ్ ఇమేజ్‌ని కాపాడే ప్రయత్నం చేస్తాము. తప్పనిసరిగా మన అసెంబ్లీలో కూడా గౌరవ సభ్యులు చెప్పినట్లుగా వారికి కూడా అందుబాటులో ఉంచడానికి ప్రయత్నం చేస్తాము.

<u>కనిగిరి–ఉదయగిరి రోడ్డు విస్తరణ</u>

ప్రశ్న నెం. 10446(68)

**శ్రీ బీద రవిచంద్ర, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా;

అ) నెల్లూరు జిల్లాలోని కనిగిరి–ఉదయగిరి రోడ్డును నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరింపజేసే విషయం వాస్తవమేనా;

ఆ) అయితే, ఎప్పటిలోగా సదరు ప్రక్రియను పూర్తి చేయడమవుతుంది?

**గౌరవనీయులైన రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి (శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు):**

**అ)** లేదండీ.

**ఆ)** ఈ ప్రశ్న ఉత్పన్నం కాదు.

**శ్రీ బీద రవిచంద్ర(నామినేటెడ్):** అధ్యక్షా, కనిగిరి– ఉదయగిరి గురించి కాదు నేను అడిగింది, కావలి–ఉదయగిరి గురించి అడిగాను.

**మిస్టర్ చైర్మన్:** మీరు మెన్షన్ చేసింది కనిగిరి–ఉదయగిరి.

**శ్రీ బీద రవిచంద్ర :** అధ్యక్షా, కనిగిరి అంటే అలైన్‌మెంట్ మారిపోతుంది.

**మిస్టర్ చైర్మన్:** రవీ, మంత్రిగారి దగ్గర మీరు అడిగిన దానికి వివరణ కూడా ఉండాలి కదా.

**శ్రీ బీద రవిచంద్ర :** మాకు కావలి–ఉదయగిరికి ప్రతిపాదన ఉంది.

**మిస్టర్ చైర్మన్:** మీరు రాసిచ్చింది కూడా అదే ఉంది.

**శ్రీ బీద రవిచంద్ర :** అధ్యక్షా, నేను కావలి అని రాసిచ్చాను.

**మిస్టర్ చైర్మన్:** లేదండి, మీరు రాసిచ్చింది కూడా ఇక్కడే ఉంది, మీరే సంతకం పెట్టారు. కనిగిరి అని రాశారు. కావలి గురించి అడిగితే మంత్రిగారి దగ్గర సమాచారం ఉండాలి కదా? మంత్రిగారూ మీ దగ్గర సమాచారం ఉంటే ఇవ్వండి. లేకుంటే లేదు.

**శ్రీ సి.హెచ్. అయ్యన్నపాత్రుడు:** నా దగ్గర సమాచారం ఉంది, నేను చెబుతాను.

**మిస్టర్ చైర్మన్:** సరే, సమాచారం ఉంటే చెప్పండి.

ఉ. 11.10

**శ్రీ బీద రవిచంద్ర:** అధ్యక్షా, కావలి, కలిగిరి, ఉదయగిరి ప్రాంతాల గురించి నేనడిగాను. కనిగిరి అంటే ఒంగోలు జిల్లాకు వెళుతుంది. కావలి-ఉదయగిరి రోడ్డుకి సంబంధించి గతంలో కూడా సర్వే చేశారు. ఆ పనులు ఏమయినాయి అనే దానిపైన గౌరవ మంత్రిగారి నుండి తమ ద్వారా వివరాలను తెలుసుకోగోరుతున్నాను. గతంలో గౌరవ మంత్రిగారు "లేదు" అని సమాధానం చెప్పారు. ఎందుకంటే గతంలో మంత్రిగారు వచ్చి, అక్కడ సర్వే కూడా చేశారు. అటువైపున నెల్లూరు, కడప, బొంబాయి రోడ్డుకు, ఇటువైపున ఏర్పేడు రోడ్డుకు మధ్యన ఈ ప్రాంతం ఉంది. మాకు రెండు హైవేలకు కూడా కన్క్టివిటీ వస్తుంది. అదేవిధంగా మద్రాసు-కలకత్తా రహదారికి కూడా మూడు హైవేలకు కూడా కన్క్టివిటీ వస్తుంది కాబట్టి ఆ రహదారులను కూడా పరిశీలించ వలసిందిగా తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**మిస్టర్ చైర్మన్:** మీదగ్గర ఏదన్నా సమాచారం ఉంటే గౌరవ సభ్యులకు ఇవ్వండి. ఎందుకంటే, ప్రశ్నే తప్పు అంటున్నారు.

**శ్రీ సిహెచ్. అయ్యన్నపాత్రుడు** : అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగింది మాత్రం కనిగిరి-ఉదయగిరి రోడ్డుకు సంబంధించిన ప్రశ్నే అడిగారు. ఆయన ఏదో పొరపాటున ఆలోచిస్తూ వ్రాసుకుని అడిగి ఉంటారు. కానీ, నా దగ్గర సమాచారం ఉంది.

అధ్యక్షా, గౌరవ సభ్యులు అడిగింది ఏమిటంటే కావలి-ఉదయగిరి, సీతారాంపురం ఇది జాతీయ రహదారి కాదు, రాష్ట్ర రహదారి. దీనిని నాలుగు వరుసల రహదారిగా విస్తరణ చేయమని చెప్పి గౌరవ సభ్యుల తాలూకు ఉద్దేశం అయి ఉంటుంది. అయితే, వారు చెప్పింది ఏమిటంటే, నాలుగు వరుసల రహదారిగా విస్తరణ చేయాలంటే దానికి కొన్ని నియమాలు ఉన్నాయి. 24 గంటలలో ఆ రహదారిలో దాదాపుగా 15,000 వాహనాలు ప్రయాణిస్తే తప్పించి దానిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేసే అవకాశాలు మాకు లేవు. రెండు వరుసల రహదారిగా చేద్దామన్నా కూడా కనీసం రోజుకు 5,000 వాహనాలు ప్రతిరోజు ఆ దారిగుండా ప్రయాణించాలి. కానీ, గౌరవ సభ్యులు అడిగిన రహదారిలో కేవలం 1800 వాహనాలు మాత్రమే రోజూ ప్రయాణిస్తున్నాయి. ఇవి నియమాలకు వ్యతిరేకంగా ఉన్నాయి కాబట్టి, వీటిని చేయడానికి అవకాశం లేదు. సింగిల్ రోడ్డుగా అభివృద్ధి చేయమంటే తప్పనిసరిగా దానికోసం మేము ప్రయత్నం చేస్తామని తమ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

## పంచాయతీలకు ర్యాంకులు

ప్రశ్న నెం.10330 (69)

**శ్రీ చిక్కాల రామచంద్రరావు, ఎం.ఎల్.సి.,**

గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారాన్ని తెలియజేస్తారా;

అ) మిషన్ అంత్యోదయ ద్వారా గ్రామ పంచాయతీలకు ర్యాంకులను ఇవ్వడమవుతున్నదా ;

ఆ) అయితే, రాష్ట్రంలో ర్యాంకులు ఇచ్చిన గ్రామాల సంఖ్యా వివరాలు ఏమిటి?

**గౌరవనీయులైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక, విజ్ఞాన శాఖ, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ల శాఖ మంత్రి (శ్రీ నారా లోకేష్)**

అ) అవునండీ.

ఆ) 2213 గ్రామాలు : వివరాలను సభా సమక్షంలో ఉంచడమయింది.

### ప్రశ్న నెం.10330లోని (బి) ఖండానికి సమాధానం

| జాతీయ స్థాయిలో మిషన్ అంత్యోదయ క్రింద కేటాయించిన ర్యాంకింగుల ప్రకారంగా ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ పంచాయతీలు శ్రేణి (అప్ లోడ్ చేసిన డేటా ప్రకారంగా స్థితి) | | | | | | |
|---|---|---|---|---|---|---|
| వరుస సంఖ్య | ర్యాంకు | | గ్రామ పంచాయతీల సంఖ్య | 100 మార్కుల వెయిటేజికి గాను టాప్ స్కోర్ | 100 మార్కుల వెయిటేజికి గాను తక్కువ స్కోరు | సగటు స్కోరు |
| | నుండి | వరకు | | | | |
| 1 | 1 | 10 | 33 | 90 | 82 | 84 |
| 2 | 11 | 20 | 228 | 81 | 72 | 75 |
| 3 | 21 | 30 | 638 | 71 | 62 | 66 |
| 4 | 31 | 40 | 823 | 61 | 52 | 56 |
| 5 | 41 | 50 | 401 | 51 | 42 | 47 |
| 6 | 51 | 60 | 84 | 41 | 32 | 37 |
| 7 | 61 | 63 | 6 | 31 | 29 | 30 |
| మొత్తం | | | 2213 | | | |

గమనిక : జాతీయ స్థాయిలో టాప్ స్కోరు : 91 రాష్ట్ర స్థాయిలో టాప్‌స్కోరు : 90
జాతీయ స్థాయిలో తక్కువ స్కోరు : 6 రాష్ట్ర స్థాయిలో తక్కువ స్కోరు : 29
జాతీయ స్థాయిలో సగటు స్కోరు : 46 రాష్ట్ర స్థాయిలో సగటు స్కోరు : 59

**శ్రీ చిక్కాల రామచంద్రరావు:** అధ్యక్షా, ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. మన రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చెందితేనే గానీ ఆర్థికాభివృద్ధి కాదు. దేశంలోను, రాష్ట్రంలోను ముందుకు వెళ్ళాలంటే గ్రామాలు తప్పనిసరిగా అభివృద్ధి చెందాలి. మన గ్రామాలలో ఈ పోటీతత్వాన్ని ప్రోత్సహించడం, వాటికి మౌలిక సదుపాయాలు కల్పించడం, అనేక సంక్షేమ నిబంధనలను తీసుకురావడం కోసం ఈ ప్రభుత్వం అందరినీ సంతృప్తిపరచే విధంగాను, అందరూ సంతోషించే విధంగా చేయాలి. అందుకు ఈ ప్రభుత్వం 10 స్టార్ రేటింగ్ ఇవ్వడమనేది జరుగుతోంది. ఇది చాలా ముఖ్యమైనది. మన గౌరవ మంత్రిగారు శ్రీ నారా లోకేష్ గారి నాయకత్వాన ఈ 10 స్టార్ రేటింగ్ ఇస్తున్నారు. ఇది చాలా బాగా జరుగుతోంది. ఇందులో భాగంగానే మిషన్ అంత్యోదయ పథకం కూడా కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చింది. ఈ పథకంలో కూడా సమాజ, కుటుంబ వికాసం. వీటిలో భాగంగానే పేదరికం లేని గ్రామాలుగా తయారు చేయాలనే మంచి ఉద్దేశంతో పెట్టిన కార్యక్రమం. మన రాష్ట్రానికే 33 ప్రథమ ర్యాంకులు రావడమేది అభినందించతగ్గ విషయం. చాలా బాగా వచ్చాయి. 33 గ్రామాలు కూడా మొట్టమొదటి ర్యాంకులలోనే ఉన్నాయి. మన రాష్ట్ర యావరేజ్ స్కోర్ దాదాపు 59 ఉంటే మనకు 899 గ్రామాల వరకు ఉన్నాయి. మిగిలిన గ్రామాలు కూడా ఈ ర్యాంకింగ్ సిస్టంలో జాతీయ స్థాయిలో ముందుకు రావలసిన పరిస్థితి ఇంకా ఉంది. ఇప్పటికే బాగా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇంకా బాగా జరగాలని తమ ద్వారా కోరుతున్నాను. మన రాష్ట్రంలో సమాజ, కుటుంబ వికాసాలకు సంబంధించి ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వాన కార్యక్రమాలన్నీ చాలా చక్కగా జరుగుతున్నాయి. వాటిని మరింతగా ముందుకు తీసుకువెళ్ళాలి. మిగిలిన 2,213 గ్రామాలలో కూడా పూర్తిస్థాయిలో మొదటి ర్యాంకు వచ్చేలా తగిన ప్రయత్నం చేయాలని తమ ద్వారా గౌరవ మంత్రిగారిని కోరుతున్నాను.

**శ్రీ నారా లోకేష్:** అధ్యక్షా, ఈ మిషన్ అంత్యోదయ పథకం అనేది కేంద్రప్రభుత్వ కార్యక్రమం. మొదటి విడతలో 50,000 గ్రామ పంచాయతీలను రేటింగ్‌కు తీసుకోవడం జరిగింది. అందులో భాగంగానే 2,584 గ్రామ పంచాయతీలను ఆంధ్ర రాష్ట్రంలో తీసుకుంటే 2,213 గ్రామ పంచాయతీలకు ర్యాంకులు రావడం జరిగింది. అంటే, 85.6 శాతం గ్రామ పంచాయతీలకు ర్యాంకులు రావడం జరిగింది. ఇందులో 100 మార్కులు ఇస్తారు. దాదాపు 48 అంశాలపైన ర్యాంకులు ఇస్తారు. అవి 5 ఏరియాలను చూస్తారు. అందులో బేసిక్ ఇన్ఫర్మేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎకనామిక్ పారామీటర్స్, ఆరోగ్యం, పౌష్టికాహారం, ఉమెన్ ఎంపవర్‌మెంట్.

అధ్యక్షా, ఒకసారి మీరు వీటన్నింటిని గమనించినట్లయితే భారతదేశంలోనే టాప్ 10 లో దాదాపు 84 గ్రామ పంచాయతీలు వచ్చాయి. అందులో 33 ఆంధ్రరాష్ట్రం నుంచి వచ్చాయి. 2, 3, 4, 5, 6 గా ర్యాంకులు రావడం

జరిగింది. ఒకసారి మీరు వీటన్నింటిని చూస్తే ఆంధ్ర రాష్ట్రానికి 33 ర్యాంకులు వస్తే, తమిళనాడు రాష్ట్రానికి 23 ర్యాంకులు, కేరళ రాష్ట్రానికి 6, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలకు నాలుగేసి చొప్పున ర్యాంకులు వచ్చాయి. నార్త్ ఇండియా మొత్తం తీసుకుంటే కేవలం 7 ర్యాంకులు మాత్రమే వచ్చాయి. ఇదంతా మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోత్సాహం వల్ల మాత్రమే జరిగింది. 2014వ సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు స్మార్ట్ విలేజ్ అనే కార్యక్రమాన్ని కూడా తీసుకున్నాము. అందులో భాగంగానే 24 నాన్ నెగోషియబుల్స్‌ను తీసుకున్నాము. వాటి తరువాత కుటుంబ వికాసం 10 అంశాలు, సామాజిక వికాసం క్రింద 20 అంశాలను తీసుకోవడం జరిగింది. ఇప్పుడు 10 స్టార్ రేటింగ్ చేయడం జరిగింది. ప్రతి గ్రామ పంచాయతీకి 10 స్టార్లకు రేటింగ్ ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, ముఖ్యమంత్రి గారి ఆదేశాలు ఒక్కటే. భారతదేశంలో ఏ రేటింగులు జరిగినా ఫరవాలేదు. మన రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు రేటింగులు జరిగితే అన్నీ నెం.1 లోనే ఉండాలని ఆయన ఆలోచన. తప్పనిసరిగా మార్చి 2019 లోపల ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, చివరగా ఒక చిన్న పాయింటు. ఈరోజున నిజంగానే బాధ వేస్తోంది. ఈ ప్రభుత్వం పలు కార్యక్రమాలను ఇంత బాగా చేస్తుంటే, ప్రతిపక్ష పార్టీ నుంచి గౌరవ శాసనమండలి సభ్యులు ఎవరూ రాలేదు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎం.ఎల్.ఎ.లు, ఎం.పి.లు కేంద్రప్రభుత్వానికి ఉత్తరాలు వ్రాస్తున్నారు. ఉపాధి హామీ పథకాన్ని తప్పు దారిలో తీసుకువెళుతున్నారని, విపరీతంగా అవినీతి జరిగిపోతోందని ఇష్టం వచ్చినట్లుగా ఉత్తరాలు వ్రాసి ఈరోజు ఆ వేతనాలను సరైన సమయానికి రానివ్వకుండా చేస్తున్నారు. వాళ్ళు సభలోకి రాకుండా దొడ్డిదారిలో పారిపోతుంటే ఎలా? వాళ్ళపైన కూడా బాధ్యత ఉంది. వాళ్ళు జీతాలు తీసుకోవడం లేదా? ఇంత అద్భుతమైన కార్యక్రమాలను ఈ రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తుంటే, ఎవరూ ఊహించని విధంగా ప్రభుత్వం అన్ని కార్యక్రమాలను చేస్తుంటే, సభకు రాకుండా, మాట్లాడకుండా పోయే పరిస్థితి వచ్చిందంటే నిజంగా బాధాకరంగా ఉంది. ఏదిఏమైనప్పటికీ తప్పనిసరిగా యావత్ భారతదేశంలో ఎవరూ ఊహించని విధంగా మన రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను తెలుగుదేశం పార్టీ అభివృద్ధి చేయబోతోందని తమ ద్వారా సభ్యులకు తెలియజేస్తున్నాను.

## చేనేత కారులకు నిధులు

ప్రశ్న నెం.10246 (70)

**సర్వశ్రీ పిల్లి సుభాష్ చంద్రబోస్, గంగుల ప్రభాకర్ రెడ్డి, వెన్నపూస గోపాల్ రెడ్డి, ఎం.ఎల్.సి.లు.,**

గౌరవనీయులైన రవాణా, బిసి సంక్షేమం మరియు సాధికారత, చేనేత మరియు జౌళి శాఖ మంత్రిగారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియచేస్తారా ;

అ) చేనేతకారులకు 2017-18 సంవత్సరంలో కేటాయించిన నిధుల పరిమాణమెంత; విడుదల చేసిన నిధుల మొత్తమెంత;

ఆ) చేనేత కారులకు కేటాయించిన నిధులు; 2014-15, 2015-16 మరియు 2016-17 ఆర్థిక సంవత్సరాలలో విడుదల చేసిన నిధుల మొత్తమెంత;

ఇ) అందులో ఖర్చుచేసిన నిధుల మొత్తమెంత;

ఈ) చేనేతకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటి?

**గౌరవనీయులైన రవాణా, బిసి సంక్షేమం మరియు సాధికారత, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి (శ్రీ కె.అచ్చెన్నాయుడు)**

**అ)** 2017-18 సంవత్సరంలో కేటాయించి, విడుదల చేసిన నిధులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| సంవత్సరం | బడ్జెటు కేటాయింపులు | విడుదల చేసిన బడ్జెటు |
|---|---|---|
| 2017-18 | రూ.231.25 కోట్లు | రూ.69.72 కోట్లు |

**ఆ)**2014-15, 2015-16 మరియు 2016-17 ఆర్థిక సంవత్సరానికి కేటాయించి, విడుదల చేసిన నిధులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

| వరుస సంఖ్య | సంవత్సరం | బడ్జెటు కేటాయింపులు | విడుదల చేసిన బడ్జెటు |
|---|---|---|---|
| 1. | 2014-15 | రూ.99.87 కోట్లు | రూ.50.86 కోట్లు |
| 2. | 2015-16 | రూ.45.91 కోట్లు | రూ.40.93 కోట్లు |
| 3. | 2016-17 | రూ.125.84 కోట్లు | రూ.62.70 కోట్లు |

**ఇ)** 2014-15, 2015-16 మరియు 2016-17 ఆర్థిక సంవత్సరాలలో ఖర్చు చేసిన నిధులు ఈ క్రింది విధంగా ఉన్నాయి :

| వరుస సంఖ్య | సంవత్సరం | విడుదల చేసిన బడ్జెటు |
|---|---|---|
| 1. | 2014-15 | రూ.50.86 కోట్లు |
| 2. | 2015-16 | రూ.40.93 కోట్లు |
| 3. | 2016-17 | రూ.62.70 కోట్లు |

**ఈ)** చేనేత కారులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ క్రింది అభివృద్ధికరమైన పథకాలను అమలు చేయడమవుతున్నది.

1. వడ్డీ సబ్సిడీ / రిబేటు పథకం / పావలా వడ్డీ పథకం
2. ముడి సరుకులు అంటే చిలపనూలు, అద్దకపు రంగులు మరియు రసాయనాల కొనుగోలుపై 20 శాతం సబ్సిడీ పథకం.
3. చేనేత రంగానికి శిక్షణ మరియు మౌలిక సదుపాయాల మద్దతు పథకం.
4. చేనేత కారులకు ఆర్థిక సహాయం.

**శ్రీ పి. రామసుబ్బారెడ్డి:** అధ్యక్షా, ఈ చేనేత కార్మికుల విషయంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వర్గీయ ఎన్.టి.రామారావుగారి కాలం నుంచి కూడా పెద్దఎత్తున వారి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతోంది. ఆరోజున అన్న ఎన్.టి.రామారావు గారు జనతా వస్త్రాల స్కీమును కానీ, నూలు సప్లయ్ చేయడం మొదలైన కార్యక్రమాలన్నీ చేపట్టడం జరిగింది. చేనేత వర్గాలు కూడా ఎప్పుడూ తెలుగుదేశం పార్టీకి ముఖ్యమంత్రిగారికి అండగా ఉంటారు. ఈ రోజు చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ఈ ప్రభుత్వం కూడా దాదాపుగా రూ.78 కోట్లు ఋణాలను మాఫీ చేయడం జరిగింది.

**ఉ.** 11.20

అధ్యక్షా, చేనేత కార్మికుల పాతపద్ధతులకు కాలం మారిపోయింది. ఇప్పడు స్కిల్ డవలప్‌మెంట్‌ను పెంచాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన బట్టను తయారు చేయడంలో స్కిల్స్‌ను పెంచి మార్కెటింగ్ ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానికి ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం ఆదరణ పథకాన్ని తిరిగి తీసుకురావడం జరిగింది. సబ్సిడీ కింద వృత్తిపరమైనటువంటి పనిముట్లు అందించే విధంగా ఏర్పాటు చేయాలి. చేనేత కార్మికులు మగ్గాలు, పనిముట్లను చాలా కాలం నుండి వాడడం వలన అన్నీ కూడా పాతవైపోయాయి. వారు మరలా నేత నేయడానికి కొత్త మగ్గాలు కొనుక్కోవడానికి సబ్సిడీ కింద వారికి అవసరమైన పనిముట్లు అందజేయాలని తమ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను.

అదే విధంగా టెక్స్‌టైల్ పార్కులను ఏర్పాటు చేసి అక్కడ మౌలిక సదుపాయాలను కల్పించారు కానీ ఇంకా కార్యకలాపాలు జరగడంలేదు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో గాని మిగతా రాష్ట్రాలలో ఎక్కడైతే ఈ చేనేతకు సంబంధించి టెక్స్‌టైల్ పార్కులు ఉన్నాయో వాటిని అధ్యయనం చేసి మౌలికసదుపాయాలను మనము కలుగజేస్తే, ప్రైవేట్ వారు వచ్చి టెక్స్‌టైల్ పార్కులు, అపరల్ పార్కులలో యూనిట్స్‌ను పెట్టుకోవడానికి ముందుకు వచ్చి అక్కడ కార్యకలాపాలను ప్రారంభిస్తారు. అక్కడ వసతులు కల్పిస్తున్నాము గాని వారిని ప్రోత్సహించే ఏర్పాట్లు ఏమీ చేయడం లేదు. జనతా వస్త్రాలకు 50శాతం సబ్సిడీ కింద ఈసారి బడ్జెట్‌లో రూ.200కోట్లు కేటాయించి చేనేత కార్మికుల నుండి బట్టలు

కొనుగోలు చేస్తామని చెప్పడం జరిగింది. ఇది కూడా మంచి కార్యక్రమం. వారికి ఋణాలను సబ్సిడీ క్రింద ఇచ్చే విధంగా బ్యాంకర్లను సపోర్టు చేయమని హైలెవల్ బ్యాంకర్స్(హెచ్ఎల్‌బి) సమావేశాలు జరిగినప్పుడు వారికి చెప్పి చేనేత కార్మికులకు ఋణాలు ఇప్పించాలని తమ ద్వారా గౌరవ మంత్రి గారిని కోరుతున్నాను.

**శ్రీ కె.అచ్చెన్నాయుడు:** అధ్యక్షా, వారు తీసుకున్న నూలు మీద 20 శాతం రాయితీ ఇప్పటికే ఇస్తున్నాము. పింఛన్లు కూడా గతంలో 70,000 ఉంటే మరలా 25,000 పింఛన్లు పెంచి 50 సంవత్సరాలు నిండిన వారికే ఇస్తున్నాము. ఋణమాఫీ క్రింద రూ.100 కోట్లు కేటాయించాము. అందులో రూ.78 కోట్లు ఇచ్చాము. ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారుంటే, వారందరికీ ఇస్తాము. అదే విధంగా టెక్స్‌టైల్ పార్కుల మీద ఎక్కువగా దృష్టి పెట్టాము. గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో అహ్మదాబాదులో ఏర్పాటు చేసిన సమావేశానికి కూడా వెళ్లడం జరిగింది. ఈ మధ్యనే మన రాష్ట్రం వైపు మొగ్గు చూపి చాలా మంది వస్తున్నారు. వారికి మౌలికసదుపాయాలను సమకూర్తున్నాము. ఇప్పటికే నెల్లూరు, కృష్ణా జిల్లాలలో రెండు మూడు పార్కులు బాగా అభివృద్ధి చెందాయి. అనంతపురం జిల్లా మీద కూడా తప్పనిసరిగా దృష్టి పెడతామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇప్పటికే 200 క్లస్టర్లు కావాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించాము. మన రాష్ట్రానికే ఎక్కువగా కేటాయించారు. వాటిని కూడా ఏర్పాటు చేస్తున్నారు. నిన్ననే గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో ఆదరణ పథకాన్ని మరలా తీసుకువచ్చాము. నిన్న కూడా ఎగ్జిబిషన్‌లో చూశాం. పాత మగ్గాలతో చాలా శ్రమ పడి ఎక్కువ సమయం తీసుకుని కష్టపడితే తక్కువ ఆదాయం వస్తుంది. అందుకే వాటికి కొంత టెక్నాలజీ జోడిస్తే తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం రావడానికి, శ్రమ తగ్గడానికి అవకాశం ఉన్నటువంటి మగ్గాలు కూడా వచ్చాయి. దానికి ఒక్కొక్క మగ్గానికి అదనంగా రూ.25,000 ఖర్చు అవుతుందని చెప్పారు. మన గౌరవ ముఖ్యమంత్రి గారు మొత్తం ఈ రాష్ట్రంలో ఎన్ని మగ్గాలు ఉన్నాయో అన్నింటికీ ఒకేసారి కొత్త టెక్నాలజీ ఏర్పాటు చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

అధ్యక్షా, అదే విధంగా ఎప్పుడూ లేని విధంగా మరలా చేనేత రంగానికి పూర్వ వైభవాన్నికి తీసుకురావాలనే ఉద్దేశంతో జనతా వస్త్రాల మీద 50శాతం సబ్సిడీ కింద రూ.200 కోట్లు మొదటి సారి ఈ బడ్జెట్‌లో కేటాయించడం జరిగింది. వ్యవసాయ రంగం తరువాత అతి ప్రధానమైన రంగం చేనేత రంగం. ఈ రంగానికి మరలా పూర్వ వైభవం తీసుకురావడానికి పూర్తి స్థాయిలో ప్రయత్నం చేస్తున్నాము. ఈరోజు చేనేత సహకార రంగాలలో కొంతమందే పని చేస్తున్నారు. మిగతా వారికి ఎటువంటి సహాయం అందడం లేదు. అటువంటి వారికి కూడా సహాయం చేయాలని ఆలోచిస్తున్నాము. తప్పని సరిగా మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకురావడం జరుగుతుంది. ఎవరైతే వృత్తి లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారో వారందరూ మరలా తమ తమ గ్రామాలకు వచ్చి వారి వృత్తి కొనసాగించే విధంగా, ఈ వృత్తిని పెంపొందించే విధంగా అన్ని రకాల కార్యక్రమాలను చేస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాము. అనేక కేంద్రాలను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తున్నాము. తప్పనిసరిగా ఈ శిక్షణను కూడా పెంచుకోవాలి. దీనితోపాటు అతి ప్రధానమైనది మార్కెటింగ్. ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా మార్కెటింగ్ లేకపోతే దాని వలన ఫలితం ఉండదు. కాబట్టి ఈ మార్కెటింగ్ వ్యవస్థను పెంపొందించడానికి మన దగ్గర తయారైన వస్త్రాలు మరియు డిజైన్స్‌ను ఇతర దేశాలు, రాష్ట్రాలలో మార్కెటింగ్‌ను పెంచాలని ఇప్పటికే చాలా ప్రాంతాలలో ఎగ్జిబిషన్స్ పెడుతున్నాము. షో లు ఏర్పాటు చేసి మార్కెటింగ్‌ను పెంచడానికి అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. చేనేత మీద ఎవరికి ఎక్కువ అనుభవం ఉందో వారి సలహాలు కూడా తప్పనిసరిగా తీసుకుంటున్నాము. గ్రామాలకు వెళ్లి వాస్తవ పరిస్థితులన్నీ తెలుసుకుని మరలా ఏదో మాటలు చెప్పడం కాదు. ఏదో నామమాత్రంగా చేయడం కాకుండా ఒక ఫూల్‌ప్రూఫ్‌గా ఈ వ్యవస్థ పూర్వ స్థితికి రావాలి. చేనేత కార్మికులు అంటే మరలా మా బ్రతుకులు మేము బ్రతుకుతున్నాము అనుకునే విధంగా, ఆదాయం పెంచే విధంగా వారికి ఒక మంచి మార్గాన్ని చూపించడానికి తప్పని సరిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

MR.CHAIRMAN: Question hour over. Now, Special Mentions. Sri Boddu Nageswara Rao Garu....

## 2. సభా కార్యక్రమం – ప్రత్యేక ప్రస్తావనలు

**శ్రీ బొడ్డు నాగేశ్వరరావు(పట్టుభద్రుల నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు) :** అధ్యక్షా, ఈ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు వేల సంఖ్యలో ఉన్నాయి. విద్యార్థులు, అధ్యాపకులు లక్షల సంఖ్యలో ఉన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను, అధ్యాపకులను, విద్యార్థులను కూడా బోధనేతర, విద్యేతరమైన కార్యక్రమాలకు పెద్దయెత్తున తరలిస్తున్నారు. దీని వలన విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడే పరిస్థితి ఉంది. ముఖ్యంగా ఇందులో రెండు రకాలు ఉన్నాయి. ప్రభుత్వ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఏ కార్యక్రమాలు జరిగినప్పటికీ కూడా ఈ విద్యార్థులు, ఉపాధ్యాయులే పెద్దయెత్తున తరలివెళ్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదని తెలియజేస్తున్నాను. అలాగే పాఠశాలల్లో కూడా కంప్యూటరైజేషన్‌కు సంబంధించి ఆన్‌లైన్ పనుల వలన ఉపాధ్యాయుల బోధనకు అడ్డంకిగా ఉంది. ఈ పరిస్థితిని తప్పించాలని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**డా. గాదె శ్రీనివాసులు నాయుడు:** అధ్యక్షా, రాష్ట్రంలో ఉన్న పశుసంవర్ధక శాఖకు గోపాల మిత్రులని ఇవ్వడం వలన, ఎక్కువగా ఈ పశు సంపదను, కోళ్లు, మేకలు వంటి వాటిని కాపాడుకోవడంతో చిన్న చిన్న కుటీర పరిశ్రమలు పెరగడానికి అవకాశం పెరిగింది. వాటిని ఇంకా బాగా కాపాడుకోవడానికి ఏదైతే రూరల్ లైవ్ స్టాక్ యూనిట్స్ ఉన్నాయో వాటిని వెటర్నరీ డిస్పెన్సరీలుగా అప్‌గ్రేడ్ చేసి అక్కడ ఒక వెటర్నరీ డాక్టర్‌ను నియమించినట్లయితే గ్రామాల్లో, గ్రాస్

రూట్ లెవల్‌లో ఇంకా ఎక్కువగా ఫలితాలు పొందవచ్చు. మనుష్యులకు ఆరోగ్యపరంగా ఏ విధంగా రక్షణ కల్పిస్తున్నామో, అదే విధంగా వాటికి కూడా రక్షణ కల్పించాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ, మైనార్టీ, వసతి గృహాలలో అనేక మంది విద్యార్థులు ఉంటున్నారు. పాఠశాలలు అయితే చాలా బాగున్నాయి. హాస్టల్స్‌లో ఉండే వారికి మెనూ ఛార్జీల నిమిత్తం నెలకు రూ.750, 850, కాలేజీ విద్యార్థులకు రూ.1050 ఇస్తున్నారు. ఈ మెనూ ఛార్జీలు వారికి ఏమాత్రం సరిపోవడం లేదు. ట్యూటర్స్‌కు కూడా రూ.1,000 మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచుతామని హామీ ఇచ్చింది. తప్పని సరిగా ఆ హామీని అమలు చేసి ఆ మెనూ ఛార్జీలను పెంచి హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేటట్లు చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ రాము సూర్యారావు:** అధ్యక్షా, ప్రభుత్వ వైద్యశాలలకు గత మూడు నెలల నుండి మందులు సరిగా సరఫరా కావడం లేదు. పశ్చిమగోదావరి జిల్లాలో మూడు నెలలుగా క్యాల్షియం ట్యాబ్లెట్స్ లాంటివి కూడా సరఫరా కావడం లేదు. అందువలన తమరి ద్వారా ఈ విషయాన్ని గౌరవ మంత్రి గారికి తెలియజేసి మందుల కొరత తీర్చాలని ప్రత్యేక ప్రస్తావన ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:** అధ్యక్షా, పొదుపు సంఘాల ఏర్పాటు విషయంలో, వెలుగు విఓఎలు(Village Organisation Assistant) కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. అదే విధంగా ప్రభుత్వ పథకాలకు, ప్రభుత్వం నిర్వర్తించే అనేక కార్యక్రమాలకు ప్రజలను సమీకరించడం, ప్రభుత్వ పథకాల అమలు గురించి సర్వే చేయడంలో వీరు కీలకమైన పాత్ర పోషిస్తున్నారు. కానీ మన రాష్ట్రంలో వీరికి చాలా తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విఓఎలకు రూ.5,000 వేతనం చెల్లిస్తున్నది. మన రాష్ట్రంలో కూడా రూ.5,000 వేతనం చెల్లించాలని, అదే విధంగా వీరికి గుర్తింపు కార్డులు, సర్వీస్ బకాయిలు చెల్లించాలని, ఏదైనా ప్రమాదాలలో చనిపోతే రూ.5,00,000 ఎక్స్‌గ్రేషియో కూడా చెల్లించాలని, ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

MR.CHAIRMAN: Paper included in the agenda is deemed to have been laid on the Table of the House.

## 3.**PAPER LAID:**

"A copy of the Notification issued in Regulation Nos. 1 and 2 of 2017 of the Andhra Pradesh Electricity Regulatory Commission, as required under Section 182 of the Electricity Act, 2003."

I have an announcement to make

## 4. సభా కార్యక్రమం–ప్రకటన

గౌరవ సభ్యులు ఉగాది పండుగ సందర్భంగా తేదీ.19.03.2018 శాసనమండలికి విరామం ఇవ్వాలని కోరారు. కాబట్టి తేదీ.19.03.2018న సోమవారం సభకు విరామం ఇస్తున్నాము. మంగళవారం తేదీ. 20.03.2018న సభ ఉంటుందని గౌరవ సభ్యులందరికీ ఈ సభ ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

Short discussion on A.P. Re-Organisation Act will be taken up after tea break. దానిపై గౌరవ ముఖ్యమంత్రిగారు మాట్లాడతారు. Now, tea break for 10 Minutes.

(The House then adjourned at 11.30 a.m.)

ఉ.11.40

(తేనీటి విరామానంతరం సభ ఉదయం గం.11.48 ని.లకు పునః ప్రారంభమైంది.)

(గౌరవ డిప్యూటీ చైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

## 5. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలుపై లఘుచర్చ

**శ్రీమతి పామిడి శమంతకమణి:** అధ్యక్షా ఈ పునర్వస్థీకరణ విభజన గురించి మాట్లాడటానికి నాకు అవకాశం ఇచ్చినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆ పునర్విభజన అనే మాట, ఆ రోజుల్లో జరిగిన ఉద్యమాలను తలచుకుంటే శరీరం అంతా ఒక్కసారిగా గగుర్పొడుస్తుంది . ఉద్యోగస్తులు జిల్లా ఆర్డీవో ఆఫీసు వద్ద వేసుకున్న చిన్న షామియానాలో జరిగిన దర్నా అది వటుడు ఇంతింతై అన్నట్టుగా పెరిగి రాష్ట్రంలోని ప్రజలంతా కూడా ఒక జన సముద్రంగా మారి ఆ ఉద్యమాన్ని తీసుకురావడం జరిగింది. ప్రతి ఒక్కరు విభజన వద్దు సమైక్యంగా ఉండాలి, సమైక్యాంధ్రా కావాలి సమైక్యంగా ఉంటేనే రాష్ట్రం బాగుపడుతుంది, ప్రజలు అభివృద్ధి చెందుతారు, జిల్లాలు అభివృద్ధి చెందుతాయి. 60 ఏళ్ల అనుబందంతో ఉన్న హైదరాబాద్‌ను మేము ఎక్కడ విడిపోతామో, మేము పిల్లలను ఇచ్చుకున్నాము, బంధుత్వాలను పెంచుకున్నామని, మరొక ప్రక్క అయ్యో ఎక్కడో మారుమూలన ఉన్న హైదరాబాదును తీర్చిదిద్ది ఈ రోజు వ్యాపార రంగంలో మేము ముందుకు తీసుకొచ్చామని కోస్తా ఆంధ్ర ప్రాంతాల వాళ్లు, వారు తినే జొన్న అన్నాన్ని మార్చి అనేక రుచులతో కూడిన భోజనాన్ని మేము నేర్పించామని నెల్లూరు వాళ్లు అనడం జరిగింది. రెండు నెలలు పిల్లాజెల్లా, ముసలీ, ముతకా, అని తేడా లేకుండా రోడ్ల మీదకు వచ్చి అయ్యో మమ్మల్ని విడగొటొద్దు. ఈ విభజన అవసరం లేదు, ఇది అన్యాయం మేము సమైక్యంగానే ఉంటామని ఆ రోజులలో అందరు ఆర్తనాదాలతో ప్రజలు రోడ్లెక్కారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రోడ్ల మీదే పడిగాపులు కాచి, రోడ్ల మీదే వంటా వార్పులు చేసుకొన్నారు. చేతి వృత్తుల వారు ఒక రోజు, కుల వృత్తుల వారు ఒక రోజు సమైక్యాంధ్రా ఉద్యమాన్ని తీసుకురావడం జరిగింది. ఆ రోజులలో అంటే 2013వ సంవత్సరంలో మేము అందరం కూడా హైదరాబాద్‌లో ఎమ్మెల్సీలుగా

ఉన్నాము. నేను నన్నపనేని రాజకుమారి గారు కౌన్సిల్ ముందు ఎన్ని డ్రామాలు వేశామో, ఎన్ని విషయాలు గురించి మాట్లాడామో, ఎన్ని రకాలుగా ఏడ్చామో, ఆ రంగులు తుడుచుకున్నామో మాకే తెలుసు, ప్రతి రోజు ఒక సంఘటనను తెర మీదకు తీసుకురావడం జరిగింది. సమైక్యాంధ్రా ఇంత మంది ప్రజలు ఆర్తనాదాలతో, ఆవేదనలతో ఎలుగెత్తి మాట్లాడినా ఏ ఒక్కరి ఆక్రందనలు కూడా దిల్లీలోని అధిష్టానానికి చేరలేదు.

ఉ.11.50

ఆ పార్లమెంటు గోడలకు కూడా వారి ఆలోచన గాని, వారి మాటలు గాని, వారి ఆవేదన గాని అందలేదు. అసలు గమనిస్తే, ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో దిల్లీలో రాజ్యాంగాన్ని నడిపే అధిష్టానం ఉంది. ప్రజల్ని మోసం చేస్తూ, ఆనాటి కాంగ్రెస్ పార్టీ ఇక్కడి నుండి కమిటీలను వేసుకుని ప్రతిసారి దిల్లీకి విమానాల మీద ప్రయాణమై పోవడం, మేం మీటింగ్ పెట్టాము, మేం మాట్లాడాం, సోనియాగాంధీతో మాట్లాడాం, రాష్ట్రపతితో మాట్లాడాం, మన్మోహన్‌సింగ్ గారు ఒప్పుకున్నారు, వీళ్లు ఒప్పుకున్నారు, వాళ్లొప్పుకున్నారని మోసం చేయడం జరిగింది.

రెండు నెలల రాష్ట్రవిభజన ఉద్యమం తరువాత, అసెంబ్లీలో గాని, కౌన్సిల్లో గాని సభ్యులు రెండుగా విడిపోవడం జరిగింది. తెలంగాణా వాళ్లు ఒకప్రక్క, ఆంధ్రావాళ్లం ఒకప్రక్క. ఒకరికొకరం ఆవేశంగా మాట్లాడుకోవటం జరిగింది. ఈనాటి తెలంగాణా కౌన్సిల్ ఛైర్మన్ స్వామిగౌడ్ గారు, ఆ రోజున మాట్లాడుతూ ప్రెస్‌మీట్‌లో సభ్యురాలు శ్రీమతి నన్నపనేని రాజకుమారి గార్ని తోసివేయడం జరిగింది. మరలా ఆయనతో క్షమాపణలు చెప్పించుకున్న రోజులు కూడా ఉన్నాయి. మరి అటువంటి రోజుల్లో ఇంత ఉద్యమం జరిగిన తరువాత కూడా ఆంధ్రులకు అన్యాయమే జరిగింది తప్ప, న్యాయమనేది ఎక్కడా కూడా జరగలేదు. రెండు నెలల ఉద్యమం తరువాత, ఈ రోజు తప్పనిసరిగా ఏదో ఒక నిర్ణయం తీసుకుంటారని అంటే, నిజంగా ఆ రోజు ఎంత ఉత్కంఠగా గడిచిందంటే, ఏ ఒక్కరూ కూడా టీవీని విడిచి అరంగుళం కూడా పక్కకు జరగలేదు. అక్కడే కాఫీలు, అక్కడే భోజనాలు, అక్కడే నీళ్లు. ఏమో! ఏ క్షణంలో ఏం నిర్ణయం తీసుకుంటారో, ఏం జరుగుతుందో, ఆంధ్రులకు ఏం అన్యాయం జరుగుతుందోనని ప్రజలంతా ఎదురుచూడటం జరిగింది. జరిగిందేదో జరిగిపోయింది. అర్ధరాత్రి పూట, అపరాత్రిలో పార్లమెంటు భవనం ద్వారాలు మూసి, కరెంటు ఆపుచేసి, విభజన చేశాం పోండహో అన్నట్లుగా రెండు భాగాలుగా రాష్ట్రాన్ని విభజించారు.

అధ్యక్షా, ఒక సినిమాలో “నీ ఆశ అడియాస.. చేజారే మణిపూస... బ్రతుకంతా అమవాస... లంబాడోళ్ల రామదాస.. “అని పాడినట్లుగా... అటువంటి రోజుల్లో ఉన్న సమయంలో, కౌరవులు పాండవుల్ని ఏవిధంగా అరణ్యవాసానికి పంపించారో, ఆ విధంగా ఆంధ్రులను బయటకు పంపడం జరిగింది. తదనంతరం జరిగిన ఎన్నికల్లో ప్రజలందరూ కూడా ఒక ఆలోచన చేయడం జరిగింది. ఇటువంటి కఠోర పరిస్థితుల్లో, ఇటువంటి దీనావస్థలో ఉన్న మనం, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మనం, కూర్చోవడానికి ఒక కుర్చీ లేదు, ప్రభుత్వ పాలన జరపడానికి ఒక ఆఫీసు లేదు, అలో లక్ష్మణా అనే పరిస్థితిలో మనకంటూ ఒక నాయకుడు అవసరమని గుర్తించాము. ఆ నాయకత్వంలోనే మనకు న్యాయం జరుగుతుందనే ప్రగాఢమైన విశ్వాసంతో శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మీద నమ్మకాన్ని

పెంచుకుని, ప్రజలందరూ కూడా అత్యధిక శాతం ఓట్లు వేసి, తమ అస్త్రాలను ప్రయోగించి కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కకుండా చేయడం జరిగింది. ఎక్కడ చూసినా, మంత్రులైన వారు గాని, సీనియర్ నాయకులు గాని ఒక్కరు కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన పాపాన పోలేదు. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి మీద అచంచలమైన విశ్వాసంతో ఆయనకు ఓటువేసి, తెలుగుదేశం పార్టీని గెలిపించి ముఖ్యమంత్రిని చేయడం జరిగింది. ఎలాంటి వనరులూ లేని పరిస్థితుల్లో, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పరిస్థితుల్లో... ఎలా ఉంటుందంటే అధ్యక్షా... మామూలుగా తెలుసు. మనం కూడా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వాళ్లమే. ఇద్దరు అన్నదమ్ములు ఉంటే, ఆస్తులు పంచుకోవాలనుకుంటే సొంత మేనమామల్నో, పెదనాన్న గారినో పిలిపించుకుని పంచాయతీ పెట్టి ఏవిధంగా తండ్రి ఆస్థిని మనం పంచుకోవాలో మీరు పెద్దమనుషులుగా కూర్చుని తీర్పివ్వండని చెప్పడం జరుగుతుంది. అప్పట్లో పెద్దోడు కాబట్టి, అదిగో అమ్మవారి గుడి దగ్గర ఉన్న ఆ చేను పెద్దోడికివ్వండి, ఊరవతల ఉన్న చేను చిన్నోడికివ్వండి, ఆడపిల్ల కాబట్టి ఆ పాపకు ఒక ఎకరానో, రెండెకరాలో ఇవ్వండని తీర్పిస్తే ఆ రకంగా పంచాయతీల్లో తండ్రి ఆస్తి పంచుకోవడం జరుగుతుంటుంది. కాని, ఎటువంటి పంచాయతీలు లేకుండా, ఏదో హామీలిచ్చాం, చట్టాల్ని అమలుచేస్తాం, ఇవన్నీ మేము విభజన చట్టంలో పెట్టాం, మన్మోహన్ సింగ్ గారు ఒప్పుకున్నారు, వీళ్లొప్పుకున్నారు, వాళ్లొప్పుకున్నారని చెప్పారు. తీరా చూస్తే, ఏమీ లేదు. చేతులెత్తేయడం జరిగింది. అటువంటి పరిస్థితుల్లో చంద్రబాబు నాయుడు గారు ధైర్యంగా నిలబడ్డారు. నడిసంద్రంలో నావకు చుక్కాని నడిపించే సారంగు ఏవిధంగా ఉంటాడో, ఆ విధంగా ప్రభుత్వాన్ని, రాష్ట్రాభివృద్ధిని ఒంటిచేత్తో నడిపించి ఒక తీరానికి తీసుకువచ్చి, ఈ రోజు రాష్ట్రం అభివృద్ధి చెందడానికి అనేక ఆలోచనలు వారు చేయడం జరిగింది.

అధ్యక్షా, నిన్ననే ఆయన 40 సంవత్సరాల రాజకీయ అనుభవాన్ని పూర్తి చేసుకున్న రోజు. మనమందరం చూశాము. నిజమే అధ్యక్షా. ఒక మనిషికి, ఆయన ఆలోచనా విధానం గాని, ఆయన అనుభవం గాని, ఆయనలోని ధైర్యం గాని, తేజస్సు గాని ఆ మనిషి యొక్క భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. అప్పుడప్పుడు కల్పించుకుంటే, ఏదో నలుగురితో జిందాబాద్ అనిపించుకుంటే నేనొక లీడర్‌ని అనడం కాదు. ఒక నాయకుడు అనుకుంటే, ఒక లీడర్‌కు ఉండాల్సిన లక్షణాలు ఆ మనిషిలో ఉంటాయి. అటువంటి నాయకుడు, అపూర్వమైన రాజకీయం చేయగల నాయకుడు మన ముఖ్యమంత్రి. చాణక్యుడు తనను అవమానపరిచిన నందరాజుల్ని తొక్కివడేసి, చంద్రగుప్తుని ఏవిధంగా సామ్రాట్టుని చేశాడో అదేవిధంగా శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు తన రాజకీయ అనుభవంతో ఒక చాణక్యుడిలాగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధివైపు తీసుకురావడం జరుగుతోంది. ఈ విషయాన్ని గమనించండి అధ్యక్షా. ఈ రోజు అందరూ చాలా మాటలు చెబుతున్నారు.

మ.12.00

ముఖ్యంగా అప్పుడే పుట్టిన బిడ్డను ఏ తల్లైనా కాపాడుకోవడానికి అనేకవిధాలుగా ప్రయత్నం చేస్తుంది. తన చనుబాలు లేనప్పుడు పోతపాలైనా పట్టి ఆ బిడ్డను కాపాడుకోవాలనే ఆకాంక్ష, అభిలాష తల్లికి ఉంటుంది. ఆ విధంగానే

మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు గుడ్డి కన్నా మెల్ల మేలు, ఏదో కేంద్రం చెబుతోంది అని అనేక ఆశలతో ఈ ప్రభుత్వాన్ని నడిపించడం జరిగింది.

అధ్యక్షా, అమరావతి శంకుస్థాపన సమయంలో మనమందరం ఎన్నో ఆశలతో పాల్గొన్నాము. అమరావతి నగర శంకుస్థాపన జరుగుతోంది, స్వయంగా ప్రధానమంత్రిగారే వస్తారు, మన రాష్ట్రానికి ఏమిస్తారో, ఏం వరాలు ప్రకటిస్తారో అని ఎదురు చూశాము. మనందరం కూడా ఎవ్వరూ తొక్కని పుట్టమన్నును తీసుకువచ్చాము. అలాగే, పవిత్రజలాలను తీసుకు వచ్చాము. రాజు వెడలె సభకు రయముగ అన్న విధంగా ప్రధానమంత్రిగారు వచ్చారు. ఆంధ్రరాష్ట్రానికి ఎన్ని వరాలు కురిపిస్తారో అన్నట్లుగా ఆంధ్రరాష్ట్రం అభివృద్ధి చెందడానికి ఏ ఆలోచనలు చెబుతారో, ఏ పథకాలు చెబుతారో, వాటికి ఎంత నిధులు విడుదల చేస్తారో, ఏఏ హామీలు ఇస్తారో అని అందరం అనుకున్నాము. ఈ సందర్భంలో నాకొక కథ గుర్తొస్తున్నది. ఒక గ్రామంలో నాబోటి ఆవిడ ఉన్నదిట. వాళ్ల ఇంటి ముందు సర్కస్ వచ్చిందిట, అందులో ఒక పెద్ద ఏనుగును తీసుకువచ్చి వాళ్ల ఇంటిముందు కట్టి ఉంచారుట. అయితే, ఆవిడ ఏనుగే ఇంత పెద్దగా ఉంది, మరి గాలి ఎంత శబ్దంతో బయటకు వస్తుందో అని ఉదయం నుండి సాయంకాలం వరకూ కాచుకుని కూర్చుందట. సరే, ఇంతలో రాజేంద్రప్రసాద్ వంటి కుర్రాడు వచ్చి ఏమమ్మా, పొద్దున్నుంచి ఇక్కడే కూర్చున్నావు ఏమి నీ కథ అని అడిగాడుట. అప్పుడామె, ప్రసాదు, ప్రసాదు, ఏనుగే ఇంత లావు ఉందయ్యా, దీని గాలి ఎంత పెద్దగా ఉంటుందోనని నేను కాచుకుని కూర్చున్నానయ్యా అందట. అప్పుడా అబ్బాయి, ఒసే ముసలిదానా, ఎప్పుడో ఏనుగు తుస్సుమంది, ఇంకా కాచుకుని ఉన్నావా అన్నాడట. ఈ కేంద్రం యొక్క హామీ ఆ విధంగా ఉన్నది అధ్యక్షా. కేంద్రప్రభుత్వ హామీలు ఆ విధంగా ఉంటాయని నేననుకోలేదు.

అధ్యక్షా, మా చిన్నతనంలో బొమ్మలపెళ్లిళ్ల ఆటలు ఆడుకునేవారం. మట్టితో చేసిన చిన్న కుండల వంటి వాటిని బుడిగీలు అని అంటాము. ఆదివారం వస్తే బొమ్మల పెళ్లిళ్లలో ఆడపిల్లలం అందరం కలిసి ఆ బుడిగీలతో వంట చేసుకుని, మర్రి ఆకులతో విస్తళ్లు కుట్టుకుని తినేవాళ్లం. ఆ విధంగా ప్రధానమంత్రిగారు రెండు బుడిగీలు తీసుకువచ్చారు. ఒక బుడిగీ నీరు, ఒక బుడిగీ మట్టి తీసుకువచ్చారు. ఒక దాంట్లో గంగా నీరు, మరొక దాంట్లో పార్లమెంట్ మట్టి అని చెప్పారు. ఆ పార్లమెంట్ మట్టిని ఎంతమంది పాపులు తొక్కి ఉంటారు అధ్యక్షా. మనమన్నా పుట్టమన్ను నెత్తికి పెట్టుకుని వచ్చాము. చంద్రబాబునాయుడు గారు చెప్పారని, మేమందరం పుట్టలన్నీ వెతికి ఎవరూ తొక్కనటువంటి మంచి మట్టిని తీసుకురావడం జరిగింది. తీరా, ప్రధానమంత్రి గారు పార్లమెంట్ మట్టి తీసుకువచ్చారు. పార్లమెంట్ మట్టిలో ఎంతమంది రక్తం చింది ఉంటుంది, ఎంతమంది పాపులు తిరిగి ఉంటారు? గాంధీతాత నడిచిన భూమి ఇంకా ఉందా అధ్యక్షా? నెహ్రూ నడిచిన భూమి ఉందా అక్కడ? ఎంతమంది పాపులు వచ్చి ఉంటారు, వారు నడచిన మట్టిని ప్రధానిగారు తీసుకువచ్చి – ఇదిగో నాయనా చంద్రబాబు! ఈ మట్టి తీసుకో, ఇదిగో గంగా జలము తీసుకో అన్నారు. గంగా జలము ఇంకా పవిత్రంగా ఉన్నదా అధ్యక్షా? ఎన్నో శవాలు కొట్టుకుని వచ్చి ఈనాడు ఆ నది ఎంతో కలుషితమయింది. అనేక పిండ ప్రదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. అన్నీ అక్కడే జరుగుతున్నాయి.

అలాంటి నీరు తీసుకువచ్చి అమాయకమైన మా చంద్రబాబుని నీకు ఓపిక ఉన్నంతవరకూ నీటిని మట్టిని పిసుక్కో, నీ అదృష్టం అన్నారు. ఆరోజే సీనియర్ నాయకులు బుచ్చయ్య చౌదరి గారు అన్నమాట ఈరోజుకీ మరచిపోలేను. ఒకాయన పార్లమెంట్‌లో 5 సంవత్సరాలెందుకు, పది సంవత్సరాలు హోదా ఇచ్చినా చాలా తక్కువ అని గట్టిగా మాట్లాడారు. ఆయన ఇంకా సజీవంగానే ఉన్నారు. సరే, ప్రధానమంత్రిగారు శంకుస్థాపనకు వచ్చారు చాలా సేపు మాట్లాడారు, మన ముఖ్యమంత్రిగారు పూలతో సెట్టింగులు వేశారు. మా ప్రాంతం నుండి వచ్చిన కార్యకర్తలు, నాయకులు నోళ్లు తెరచుకుని ఏ రకంగా శంకుస్థాపన కార్యక్రమం పెట్టారని చూస్తూ ఉండిపోయారు. తీరా చూస్తే, ఏమీ లేదు. ఒక మట్టి కుండ, అన్ని నీళ్లు ఇచ్చారు. వాటితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందా అధ్యక్షా? ఎన్ని హామీలు ఇచ్చారు, విభజన చట్టంలో ఎన్ని హామీలను చెప్పారు, ఒక్కటన్నా నెరవేర్చారా? ఎవడబ్బ సొమ్మనుకుంటున్నారు? మన రాష్ట్రం సొమ్ము అది. మన హక్కు. హక్కు అడగడంలో తప్పేముంది? హోదా అంటే ఈ రకంగా రాదు, అందువల్ల ప్యాకేజీ కింద కేంద్రం రాష్ట్రానికి కొన్ని ఇస్తామన్నప్పుడు నిజంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం ఒప్పుకోవడంలో తప్పు లేదు. ఒప్పుకున్నారని అన్నింటిలోనూ మోసం చేసి, మొండి చేయి చూపిస్తే ఎక్కడి న్యాయమని నేను కేంద్రాన్ని అడుగుతున్నాను. ఒక రోజా, రెండు రోజులా ఎన్ని రోజులు ఎదురుచూడాలి? పెళ్లి చేసుకున్న తరువాత తన భర్త ఎలా చూసుకుంటాడో అని భార్య సంవత్సర కాలం ఓపికగా ఎదురుచూస్తుంది. తన కోరికలు ఏవిధంగా తీరుస్తాడు అని, తన పిల్లలకు ఏమేమి తీసుకువస్తాడు అని చూస్తుంది. ఒకరోజు కాదు, రెండు రోజులు కాదు, మూడు ఏళ్లు, నాలుగేళ్లు అయినా ఇదిగో ద్రాక్ష, అదిగో పండు అని ఎగిరేలా చేశారు. అలసిపోయారు. యూనివర్శిటీలన్నారు, ఇంకా ఏమేమో అన్నారు. అనంతపురంలో సెంట్రల్ యూనివర్శిటీ అన్నారు. 300 ఎకరాలు ఎంత కష్టపడి తీసుకువచ్చాము. కానీ, అక్కడ శంకుస్థాపన కూడా చేసిన పాపాన పోలేదు. ఎవరిని మోసం చేస్తారు? ఎన్ని హామీలు ఇవ్వడం జరిగింది? కానీ వాటిని నెరవేర్చడం లేదు.

అధ్యక్షా, మన రాష్ట్రానికి మణిహారంలాగా మనకు ఎంతో పొడవైన సముద్రతీరం ఉన్నది. చరిత్రలోకి చూస్తే, గతంలో ఆంగ్లేయులు సముద్రమార్గం ద్వారా మనదేశంలో వ్యాపారం చేయడానికి వచ్చారు. తద్వారా ఆర్థికంగా పుంజుకున్నారు. అటువంటి ఎన్నో కిలోమీటర్లు కలిగిన సముద్ర తీరాన్ని ఆ తరువాత ఎవరూ పట్టించుకోలేదు. ఏది చేసినా చంద్రబాబు నాయుడు గారే చేశారు. దేశాలవెంట వెళ్లారు. అయ్యా, రండి నాయనా, మా ఆంధ్రాలో అన్ని వనరులూ ఉన్నాయి, మీరు వచ్చి పెట్టుబడులు పెట్టండి, మీకు కావలసిన సహాయం చేస్తాము, మీకు కావలసిన వనరులను మేము కల్పిస్తామని ఆయా దేశాలలో ఉన్న పెట్టుబడిదారులకు చెప్పారు. కేంద్రం మనకు ఏ ఒక్క సహాయం చేయకపోగా మనమీదే ఎదురుదాడి చేస్తున్నది.

అంతేకాకుండా, రాష్ట్రంలో చంద్రన్న బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రవేశపెడితే, మీ పేరు ఎందుకు పెట్టుకుంటారు, మా పేరు పెట్టండి అని అన్నారు. ప్రతిదానికి అలాగే అన్నారు. రాబోయే రోజులలో మోదీ క్షురశాల, మోదీ రజకశాల అని కూడా పెడతారేమో అధ్యక్షా. ఈనాడు సంక్షేమ కార్యక్రమాల్లో అనేక ఇబ్బందులున్నా ఎన్‌టిఆర్

భరోసా పథకం ఒక్కటే ప్రజల మన్ననలను పొందిన కార్యక్రమమనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు అధ్యక్షా. గతంలో అయితే, వయసు మళ్లిన మావంటి వారికి సంతానం యొక్క ప్రేమ అభిమానం కొరవడి కాల పరిస్థితిని బట్టి, ఆర్థిక ఇబ్బందులను బట్టి ఏ చెట్టుకిందో పడేసేవారు. ఇన్నేళ్లు బతికావు, ఇంకా బతకాలని ఉందా, ఇంకా మమ్మల్ని ఏం సతాయిస్తావని కోడళ్లు మూడు మూతి విరుపులు విరిచేవారు.

మ.12.10

కానీ, ఈరోజు చంద్రబాబునాయుడుగారు ఇచ్చిన రూ.1000 పెన్షన్‌తో ఉదయం 11, 12 గంటలు కాగానే అత్త దగ్గరికి వచ్చి అత్తా రా, ఉడుకుడుకు సంగటి, వంకాయ కూర చేశానని తినడానికి రమ్మని కోడలు అడుగుతోంది. ఆ అభిమానం ఎలా వచ్చింది అధ్యక్షా? ఆ ఉడుకుడుకు ముద్ద తినే ఆ ముసలివాళ్ళు నాయనా, చంద్రబాబునాయుడూ నూరేండ్లు బ్రతుకు తండ్రీ అని ఆశీర్వదిస్తున్నారు. చంద్రబాబునాయుడుగారు ఈ వయసులో కూడా అంత సంపూర్ణ ఆరోగ్య వంతుడాయ్యరంటే ఆ ముసలివాళ్ళ ఆశీర్వాదమే కారణమని నేను అనుకుంటున్నాను.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:** త్వరగా పూర్తిచెయ్యండి.

**శ్రీమతి పి.శమంతకమణి:** ఈ సంక్షేమ కార్యక్రమాలద్వారా ఎన్ని కష్టాలెదుర్కొన్నా, ఎన్ని నష్టాలు ఎదుర్కొన్నా ధైర్యంగా ధీరోదాత్తుడుగా ఉన్నారు మన చంద్రబాబునాయుడుగారు. తను నమ్మిన సిద్ధాంతాన్ని, తను చేసిన సంకల్పాన్ని ఏరోజు వెనకాడకుండా రాష్ట్రాన్ని అభివృద్ధివైపు కొనసాగించడంలో మూల పురుషుడై ఉన్నారు. మరి ఆయన సంకల్పం అటువంటిది.

**మిస్టర్ డెప్యూటీ ఛైర్మన్:** త్వరగా కంప్లీట్ చేయండి. 20 నిమిషాలైంది.

**శ్రీమతి పి.శమంతకమణి:** ఈరోజు ఇక్కడున్న పెద్దలందర్నీ కూడా నేను కోరుతున్నాను. మనం మొట్టమొదట ఈ రాష్ట్ర పౌరులం. ఆ తరువాతే బీజేపీనా, తెలుగుదేశమా, కాంగ్రెస్‌నా అవన్నీ వేరు. ఈ రాష్ట్రానికి పుట్టిన మనం తల్లి రుణం తీర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈయొక్క హోదా గురించి, ఈరోజు కేంద్రం చేసే మోసాన్ని, వక్రమార్గాన్ని అరికట్టడానికి చంద్రబాబునాయుడుగారు చేస్తున్న సంకల్పాన్ని, ఆయన ఎంచుకున్న మార్గాన్ని మనం బలోపేతం చేసి ముందు రాష్ట్రాన్ని బ్రతికించుకోవాల్సిందిగా ఇక్కడ చేరిన పెద్దలందర్నీ కోరుతున్నాను. ఆయన మీద మనం విమర్శించడం కాదు. ఒకరిమీద మనం అనరాని మాటలు అనడం కాదు. మన రాష్ట్రాన్ని, మన జన్మభూమిని, మన తల్లిని మనం కాపాడుకోవాలి. మన తల్లిని మనం ఎప్పుడు కాపాడుకుంటామో ఆరోజే మనం నిజమైన సంతతిగా, ఈ రాష్ట్ర పౌరులుగా మనముంటామని మనవి చేస్తూ, ఈ అవకాశాన్నిచ్చిన మీకు నా ధన్యవాదాలు. జై జన్మభూమి. జై చంద్రబాబునాయుడు.

**శ్రీ కత్తి నరసింహారెడ్డి:** అధ్యక్షా, రాష్ట్రవిభజన చట్టంపైన మన రాష్ట్రానికి హక్కుగా సాధించుకోవాల్సిన అంశాలు, రాష్ట్రాభివృద్ధికోసం హామీగా పొందిన అంశాల గురించి మాట్లాడే పరిస్థితి కానీ, ఉద్యమించే పరిస్థితికానీ వస్తుందని కలలో కూడా ఊహించలేదు. 1953వ సంవత్సరంలో రాష్ట్రం విడిపోయి కర్నూలు రాజధాని ప్రాంతంగా గుడిసెల్లోనూ, డేరాల్లోనూ కాపురం చేసుకుని పరిపాలన సాగిస్తున్న సమయంలో హైదరాబాద్ కేంద్రంగా అభివృద్ధి చెందినటువంటి పట్టణం ఉంది, మీరు ఈ ప్రాంతానికి రండి, మాలో కలవండని ఆరోజు నిజాం ప్రభుత్వం, ఆరోజున్న పాలకులు అసెంబ్లీలో తీర్మానం చేసిన తరువాతనే 1956వ సంవత్సరంలో కర్నూలు నుంచి రాజధాని ప్రాంతం హైదరాబాద్‌కు వెళ్ళడం జరిగింది.

అధ్యక్షా, 1972వ సంవత్సరంలో ముల్కీ నిబంధనలు, హైదరాబాద్ ప్రాంతంలోని స్థానికులకే స్థానిక ఉద్యోగాలు రావాలనే ఒక ఉద్యమం వచ్చినప్పుడు ఆంధ్రా ప్రాంతంలోని 13 జిల్లాల్లోని మొత్తం ప్రజానీకమంతా జై ఆంధ్రా ఉద్యమం చేసి మేం విడిపోతామనీ, మా రాష్ట్రాన్ని మేము పరిపాలించుకుంటామంటే లేదు, లేదు కలిసే కాపురం చేయాలని కేంద్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2014వ సంవత్సరంలో విడిపోవాలని ఉద్యమం వచ్చినప్పుడు గతంలో మీరు కలిసి ఉండమని చెప్పినప్పుడు మీరు చెప్పినట్లు మేము విన్నాము, ఇప్పుడు మేం కలిసే ఉంటామంటే లేదు, లేదు మీరు విడాకులు తీసుకోవాల్సిందే, రాష్ట్ర విభజన చేయాల్సిందే అని కేంద్రంలో నిర్ణయం తీసుకుంది అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ, ప్రతిపక్ష పార్టీ బీజెపి. ఇలా ఈ రెండు రాజకీయ పార్టీలు కేంద్రంలో నిర్ణయం తీసుకోవడంవల్లనే రాష్ట్ర విభజన జరిగింది.

అధ్యక్షా, రాష్ట్ర విభజన వల్ల జరిగే నష్టాలు కానీ, అభివృద్ధిలో పాలుపంచుకోవాలనే ఉద్దేశంతో పార్లమెంట్ సాక్షిగా సాక్షాత్తూ దేశ ప్రధానమంత్రిగారే మన రాష్ట్రానికి కొన్ని హామీలిచ్చి విభజనచట్టంలో పొందుపరిచారు. ఆ హామీలన్నీ అమలుకు నోచుకుని రాష్ట్రం కొంతన్నా అభివృద్ధి చెందుతుందని ఆశించిన ప్రజానీకానికి నాలుగేళ్ళ తర్వాత కూడా నిరాశనే కలిగింది.

అధ్యక్షా, మొదట్లో మీరు విభజన అశాస్త్రీయంగా చేశారనీ, మేము అధికారంలోకి వస్తే అద్భుతంగా చేస్తామని, గతంలో మేము ప్రజల ఆమోదంతో శాస్త్రీయంగా రెండు, మూడు రాష్ట్రాలను విభజన చేశామని చెప్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఊరూరా తిరుగుతూ మేము అధికారంలోకి వస్తే గనుక ప్రత్యేకహోదాను అయిదేళ్ళు కాదు పదేళ్ళు ఇస్తామని, అలాగే దిల్లీని తలపించే రాజధానిని కూడా నిర్మిస్తామని అనేకమైన వాగ్దానాలు చేసి, అదే రాజకీయపార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. అలా వచ్చిన తరువాత చేసిన వాగ్దానాలను అమలుచేయకపోతే దీనికి బాధ్యులెవరు? ఆరోజు మేము విడిపోతామంటే లేదూ కలిసే ఉండాలని చెప్పారు. ఇప్పుడు మేము కలిసి ఉంటామంటే విడిపోవాలని చెప్పారు. నిర్ణయం తీసుకుంది కేంద్ర ప్రభుత్వమే.

అధ్యక్షా, కేంద్రంలో ఉన్న బీజెపి, కాంగ్రెస్ రెండు పార్టీల నిర్ణయంతోనే ప్రధానంగా రాష్ట్ర విభజన జరిగింది కాబట్టి ఈ రాష్ట్రానికి మేలు చేసి, అభివృద్ధిపథంలోకి నడిపించాల్సిన బాధ్యత కూడా కేంద్ర ప్రభుత్వం పైననే ఉన్నదని కూడా నేను మనవి చేస్తున్నాను. రాష్ట్ర విభజన జరిగినప్పుడు 2015-16 సంవత్సరంలో మన వార్షిక బడ్జెట్ రూ.1,13,049 కోట్లు. అదే తెలంగాణ రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.1,15,689 కోట్లు. మనదేమో అయిదుకోట్ల జనాభా. అలాగే అక్కడేమో మూడున్నర కోట్ల జనాభా. వ్యత్యాసం చాలా ఉంది.

అధ్యక్షా, జనాభా ప్రాతిపదికగా అప్పుల్ని, ప్రాంతాలవారీగా ఆస్తుల్ని పంచడం వల్ల మనకు నష్టం జరిగింది. అలా చేయడంవల్ల రూ.1,30,000 కోట్లు వారసత్వంగా మనం అప్పుని తీసుకురావడం జరిగింది. అలాగే, సింగరేణికి సంబంధించి, విద్యుత్‌కు సంబంధించి, 9, 10 షెడ్యూల్‌లోని ఆస్తుల పంపకాల వల్ల దాదాపు నలభై, యాభై వేల కోట్ల రూపాయలు మన రాష్ట్రానికి రావాల్సిన ఆవశ్యకత ఉంది. వీటన్నింటినీ అశాస్త్రీయంగా విభజించారు. దీనిని సవరించాలని కేంద్రం కోరుతున్నా ఆ అవకాశం లేకపోవడమనేది చాలా విచారకరం.

అధ్యక్షా, పార్లమెంట్ సాక్షిగా చాలా హామీలిచ్చారు. అందులో ముఖ్యమైంది ప్రత్యేకహోదా. దీనివల్ల ప్రభుత్వం నుంచి 90 శాతం గ్రాంట్లు, రాయితీలు వచ్చే అవకాశముంటుంది. అయినా మేము ప్రత్యేకహోదా ఇవ్వమని చెప్పారు. కానీ, జి.ఎస్.టి నుంచి వచ్చిన పన్నుల నుండి 11 ఈశాన్య రాష్ట్రాలకు రూ.27,413 కోట్ల రాయితీలు ఏ విధంగా ఇచ్చారు. అక్కడ ఎన్నికలు జరుగుతాయి కాబట్టి అక్కడ ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతోనే ఇచ్చినట్లుగా ఇప్పుడు కనబడుతోంది. ప్రత్యేకహోదాగల ఈశాన్య రాష్ట్రాల గణాంకాలు చూసుకుంటే జీతాలపై ఆధారపడ్డ కుటుంబాలు హిమాచల్‌ప్రదేశ్‌లో 33.93 శాతం, ఉత్తరాఖండ్‌లో 23.67 శాతం, జమ్మూ కాశ్మీర్‌లో 22.37 శాతం, సిక్కింలో 26.86 శాతం, నాగాలాండ్‌లో 22.34 శాతం, అరుణాచల్‌ప్రదేశ్‌లో 19.6 శాతం, మణిపూర్‌లో 19.10 శాతం, మిజోరాంలో 15.92 శాతం, మేఘాలయలో 12.73 శాతం, త్రిపురలో 12.48 శాతం, అస్సాంలో 12.27 శాతంగా ఉన్నాయి. అంటే ప్రత్యేక హోదా కేటగిరీ పరిధిలోని ఈ పదకొండు రాష్ట్రాలన్నీ కూడా డబుల్ డిజిట్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం జీతాలపైన ఆధారపడ్డ కుటుంబాలు కేవలం 4.56 శాతం మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలన్నీ కూడా ఆంధ్రప్రదేశ్‌లో 1.93 శాతముంటే, ప్రత్యేక హోదాగల 11 రాష్ట్రాల్లో 7.61 నుంచి 23 శాతం వరకూ ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు కూడా ఆంధ్రప్రదేశ్‌లో 0.31 ఉంటే, ప్రత్యేకహోదాగల 11 రాష్ట్రాలలో 3.12 శాతంగా ఉన్నాయి. అదేవిధంగా ప్రైవేటు ఉద్యోగాలలో ఆంధ్రప్రదేశ్‌లో 0.50 ఉంటే, హిమాచల్‌ప్రదేశ్‌లో 45.5 శాతం ఉంది. అలాగే మిగిలిన అన్ని రాష్ట్రాలలో కూడా ఎక్కువగా ఉన్నాయి. పదివేలకు పైగా ఆదాయం ఉండే కుటుంబాలు ఆంధ్రప్రదేశ్‌లో 3.20 శాతంగా ఉంటే, అస్సాంలో 11.0 శాతంగా ఉండగా, హిమాచల్‌ప్రదేశ్‌లో అతి ఎక్కువగా 28.5 శాతం ఉంది. అంటే ఏ రూపంలో తీసుకున్నా రాష్ట్ర విభజన జరిగేటప్పటికి ఉద్యోగాల్లోకానీ, ప్రైవేటుసంస్థల్లోకానీ, కుటుంబ ఆదాయాల్లో కానీ ఆ పదకొండు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్‌కంటే కూడా అదనంగానే ఉన్నాయి.

మ.12.20

అధ్యక్షా, ఏ రూపంలో తీసుకున్నా రాష్ట్ర విభజన జరిగేటప్పటికి ఉద్యోగాలలో గానీ, ప్రైవేటు సంస్థలలో గానీ కుటుంబ ఆదాయాలలో గానీ ఆ 11 రాష్ట్రాలు ఏపీ కంటే కూడా ఎక్కువగా ఉన్నాయి. అలాంటప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవలసిన ఆవశ్యకత కూడా కేంద్ర ప్రభుత్వం పైన ఉందని నేను మనవి చేస్తున్నాను. మన రాజ్యాంగంలో కూడా 282 వ ఆర్టికల్ ప్రకారంగా కేంద్ర ప్రభుత్వం గనుక రాష్ట్రాలకు నిధులివ్వాలనుకుంటే వాళ్ల విచక్షణాధికారాన్ని బట్టి ఇచ్చే ప్రొవిజన్‌ను కల్పించడం జరిగింది. బీహార్ ఎన్నికలలో మీకెంత కావాలని అడిగి తరువాత ఎనౌన్స్ చేసినటువంటి అంశం కూడా మనం చూశాం. ఆ రాష్ట్రాలకు ఇవ్వద్దు అని కాదు కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏవైతే హామీలు ఇచ్చారో ఆ హామీలను నెరవేర్చాలి. అందులో భాగంగానే లోటు బడ్జెటు రూ.16,500కోట్లు గానీ, అమరావతి రాజధానికి గానీ వెనుకబడినటువంటి ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు గానీ, కడప ఉక్కు ఫ్యాక్టరీ గానీ, విశాఖ రైల్వే జోన్ గానీ, పోలవరం ప్రాజెక్టు గానీ, అలాగే 11 విద్యాసంస్థలకు గానీ ఇవన్నీ పూర్తి కావాలంటే కనీసం 10 శాతం కూడా ఇవ్వకుండా ఉంటే ఎన్ని సంవత్సరాలకు ఇవి పూర్తవుతాయని నేను అడుగుతున్నాను. అధికారమనేది శాశ్వతం కాదు. 1984 సంవత్సరంలో 2 సీట్లున్న బీ.జె.పి పార్టీ ఇప్పుడు అధికారంలోకి రావడం జరిగింది. అలాగే నిన్న మొన్న కూడా మనం చూశాం ఆంధ్రప్రదేశ్‌లో కొన్నేళ్ల పాటు అధికారంలో ఉన్న ఒక పార్టీ డిపాజిట్ కోల్పోయిన పరిస్థితి ఉంది. అలాగే మొన్ననే ఉత్తర్ ప్రదేశ్ ఉప ఎన్నికలు కూడా చూశాం. జనరల్ ఎలక్షన్స్‌లో 3 లక్షల 13వేల ఓట్ల మెజారిటీతో గెలిచి, ఏడాది తిరగకముందే అది వేరే పార్టీ గెలుచుకున్న విషయాన్ని మనం గమనించాము. అధికారం శాశ్వతం కాదు, వాళ్లు ఇచ్చినటువంటి హామీలు, ఆచరణలే ప్రజలు గమనిస్తూ ఉంటారు. అందుకోసమే ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం పైన ఉంది. ఇది భిక్ష కాదు. 5 కోట్ల ఆంధ్ర ప్రజల హక్కు. మీరేదైతే పార్లమెంటు సాక్షిగా హామీలు ఇచ్చారో, బైఫర్‌కేషన్ యాక్టులో పేర్కొన్నారో అవన్నీ అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఇవ్వాలని కోరుతున్నాను. ఇందు నిమిత్తం దీనికి రాష్ట్రంలో ఉన్నటువంటి అన్ని రాజకీయ పార్టీలను రాష్ట్రప్రభుత్వం సమాయత్తం చేయాలి. ప్రజా సంఘాలను కూడా సమాయత్తం చేయాలి, సినీ నటులను కూడా సమాయత్తం చేయాలి. ఒక్క బాహుబలి సినిమానే దాదాపు రూ.2,000 కోట్లు వసూలు చేసింది. తెలుగు ప్రజలలో అంత ప్రతిభ ఉంది. ప్రజలపై సినిమా ప్రభావం కూడా ఉంది కాబట్టి సినిమా నటులు కూడా సమాయత్తం కావాలి. ఈరోజు చిరంజీవి గారు, నాగార్జున గారు, మహేశ్ గారు, వెంకటేష్ గారు, రవి తేజ గారు సినీ నటులందరూ తమిళనాడు రాష్ట్రంలో మాదిరిగా రాష్ట్ర ప్రయోజనాలకోసం ఏకం కావలసిన ఆవశ్యకత ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, విభజన చట్టంలో పేర్కొన్న వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సాధించుకోవడానికి 5కోట్ల ప్రజలందరూ ఏకం కావలసిన తరుణం ఇది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా చొరవ తీసుకోవాలని మీద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

**శ్రీ బి.ఎస్.రాజసింహులు:** అధ్యక్షా, ఈ రోజు 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంపై మాట్లాడేందుకు అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. ఈ రోజు ఆంధ్రప్రదేశ్ ఏ విధంగా విభజన జరిగింది, ఎందుకు చేశారు, ఏవిధంగా చేశారు అనేదానిగురించి సభ్యులు చెప్పడం జరిగింది. ఆరోజు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎవరూ కోరుకోకపోయినా బలవంతంగా విభజన చేయడం జరిగింది. అయితే అది ఏ విధంగా చేశారంటే పార్లమెంటు సభ్యులందరినీ కూడా బయటకు పంపి, ఒక యుద్ధ వాతావరణంలో, లైట్లు ఆర్పివేసి, అక్కడున్న ప్రెస్ వారిని కూడా బయటకు పంపి ఇరవై నిమిషాలలోనే రాష్ట్రాన్ని విభజించడం జరిగింది. అక్కడేదో వార్ రూమ్ ఏర్పాటు చేశారంట. వార్ ఎక్కడా జరగలేదు. వార్ రూమ్‌లో డిస్కస్ చేసి యుద్ధ విమానంలో ఆంధ్రప్రదేశ్‌కు తీసుకుని వచ్చి అసెంబ్లీలో పెట్టినా ఏదో తూతూ మంత్రంగా చేసి ఇమ్మీడియట్‌గా తీసుకొని పోయి, ఇటలీకి స్వాతంత్ర్యం వచ్చిన రోజునే ఆంధ్రప్రదేశ్‌ను విభజన చేయడం జరిగింది. అప్పుడున్న నాయకుల స్వార్థం కోసం ఇటలీకి స్వాతంత్ర్యం వచ్చిన రోజున ఆంధ్రప్రదేశ్‌ను అసంబద్ధంగా విడగొట్టిన సంగతిని గుర్తుచేస్తున్నాను. ఆవిధంగా చేసినందుకు 2014 సంవత్సరంలో వాళ్లకు ప్రజలు ఏవిధంగా బుద్ధి చెప్పారో అందరికీ తెలిసిందే. ఆరోజు వాళ్లు తల్లీ, బిడ్డను వేరు చేసి, బిడ్డను చంపేశారు తల్లిని బ్రతికించారు అని ఆరోజు ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఉన్న మోదీ గారు తిరుపతి వచ్చినప్పుడు, నేను తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేస్తాను, ఈ తల్లిని బ్రతికిస్తాము, ఈ తల్లికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, చెప్పడం జరిగింది. ఈ రోజు దానికొక చిన్న ఉదాహరణ చెబుతాను. ఈ రోజు చంద్రబాబునాయుడు గారు తల్లీ బిడ్డా ఎక్స్‌ప్రెస్‌ను పెట్టి ఆ పుట్టిన బిడ్డ నుం। చనిపోయేంత వరకూ కూడా అన్ని సౌకర్యాలు కలుగచేసిన ఘనత ఈరోజు చంద్రబాబునాయుడు గారికే దక్కుతుంది. అయితే తల్లిని బిడ్డను వేరు చేసింది ఒక పార్టీ. ఇప్పుడు ఇంకొక పార్టీ వచ్చి ఆ తల్లిని కూడా స్కెలెటెన్‌ను చేసే పరిస్థితి తీసుకొచ్చింది. ఇది చాలా బాధాకరమైన సంగతి. దానికి ఆరోజు కేంద్రంలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ఈ విధంగా ప్రత్యేక హోదా కావాలి, దీనికి ఏవైతే లోటులున్నాయో అవన్నీ కూడ పూర్తి చేయాలని చట్టం చేస్తే దానిని కూడా పూర్తిగా ఖాతరు చేయకుండా ప్రత్యేక హోదా కానివ్వండి, అదే విధంగా మన రాష్ట్రానికి రావలసిన రెవెన్యూ లోటు కానివ్వండీ, మనకు రావలసిన సెంట్రల్ యూనివర్సిటీస్, ఇన్‌స్టిట్యూషన్స్ కానివ్వండి, కడప ఉక్కు కర్మాగారము కానివ్వండి, అదే విధంగా వైజాగ్ రైల్వే జోన్ కానివ్వండీ, ఇవన్నీ ఇస్తామని సుమారు 19 అంశాలను చేర్చి, ఈ రోజు ఏదీ ఇవ్వకుండా ఉత్త చేతులు మనకు చూపేది కాక హేళన చేస్తున్నారు. తెలుగు వారి పౌరుషం ఈరోజు ప్రతి ఒక్కరూ చూశారని గుర్తు పెట్టుకోవాలి.

1984 సంవత్సరంలో మూకుమ్మడిగా ఎన్టీ రామారావు గారిని ఇబ్బంది పెట్టారు. ఆయన అమెరికాలో శస్త్ర చికిత్స చేయించుకొని వచ్చిన తరువాత కూడా స్వర్గీయ ఇందిరా గాంధీ కూడా మళ్లా రీ-ఇన్‌స్టేట్ చేయడం జరిగింది. మళ్లీ 2014వ సంవత్సరంలో అసంబద్ధంగా రాష్ట్రాన్ని విభజన చేస్తే, వాళ్లకు ఒక్క సీటు కూడా డిపాజిట్ రాకుండా చేసింది తెలుగు వారే. నేనీరోజు ఒక్కటే చెబుతున్నాను. తెలుగువారితో పెట్టుకుంటే తెలుగువారి కోపం ఏవిధంగా ఉందో చేసి చూపిస్తారని ఈ సందర్భంగా మిగిలిన పార్టీలకి కూడా తెలియచేస్తున్నాను. అంతేకాదు పార్లమెంటులో

మన పార్లమెంటు సభ్యులు అంతా ప్రత్యేక హోదా గురించి మాట్లాడినప్పుడు ఆరోజున ఉన్న కాంగ్రెసు ప్రభుత్వం, 5సంవత్సరాలు ఇస్తామని అన్నప్పుడు ఆరోజున వెంకయ్యనాయుడు గారు 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా కావాలని పట్టుపట్టారు. మన ఎంపీలంతా 15 సంవత్సరాలు ప్రత్యేకహోదా కావాలని అడిగితే, 10 సంవత్సరాలు ఇస్తామని చెప్పి ఈ రోజు వాళ్ల ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రత్యేక హోదా ఇవ్వం అని చెప్పడం కూడా ఈరోజు మనం గమనించాల్సిన అవసరముంది.

అంతే కాదు, ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి పోలవరం. పోలవరం ప్రాజెక్టు తప్పకుండా ఇస్తామని ప్రామిస్ చేశారు, అది జాతీయ ప్రాజెక్టు అని చెప్పారు. రూ.54,000 వేల కోట్లు అవుతుందంటే ఈరోజుకు రూ.33,000కోట్లు ఇవ్వాల్సి ఉంటే కేవలం రూ.7,780 కోట్లు మాత్రమే ఇవ్వడం కూడా జరిగింది. దానిలో కూడా చూస్తే ఎక్కువ అడ్డంకులు పెడుతున్నారు. ఇప్పుడున్న ప్రతిపక్ష పార్టీ వాళ్లు ప్రజల చేత ఎన్నుకోబడ్డారో, ఏమో మాకైతే అర్థం కాలేదు కానీ ఈరోజు వాళ్లు సభకు రారు, సభకు వస్తే అన్ని విషయాలు వాళ్లు కూడా మాట్లాడవచ్చు. అయితే మన దుర దృష్టం–వాళ్లు సభకు రారు, బయట వుండి, ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకునేలా చేస్తున్నారు. ఈ రోజు మనం చూస్తే, 33,000 ఎకరాలు రైతులు ఇచ్చారు. వాళ్లకు మనం దండం పెట్టాల్సిన అవసరముంది. ఈరోజు ఎక్కడా ఒక్క ఎకరా కూడా ఇవ్వకుండా ఉండే సమయంలో 33,000ఎకరాలు మూడు పంటలు పండేది రూ.45,000కోట్ల విలువ చేసేది వాళ్లు మనకు ఇస్తే దానికి కూడా మన పక్కనున్న వై.ఎస్.ఆర్. శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణగారు కోర్టుకు వెళ్లారు. పోలవరం పైన కోర్టుకు వెళతారు. వాళ్లకు అభివృద్ధి కార్యక్రమాలు అవసరం లేదు. ఒక పక్క ఒక పార్టీ రాష్ట్రాన్ని అసంబద్ధతగా విభజన చేస్తే, ఇంకొక పార్టీ చెప్పిన హామీలను నిలబెట్టుకోకపోతే ఇక్కడున్న ఆంధ్రప్రజలలోని కొంత మంది మరియు కొన్ని పార్టీలు దానిని వ్యతిరేకిస్తున్న విషయాన్ని మనం గమనించాలి. అంతేకాదు వాళ్లు చెప్పిన హామీల అమలుకు రూ.3,55,464 కోట్లు ఇస్తామని చెప్పారు. ఐతే ఈరోజు చూస్తే రూ.12,918కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగింది. మరి ఎందుకు ఇవ్వలేదని అడిగినప్పుడు ప్రతి రోజువాళ్లు ఏదో ఒక కుంటి సాకులు చెబుతూ ఉన్నారు. అంతేకాదు ఈరోజు రూ.16,000కోట్లు లోటు బడ్జెట్ ఉంటే, కేవలం రూ.3,979 కోట్లు ఇచ్చి ఇంకా మీకు రూ.138కోట్లే ఇవ్వవలసినవి అని స్వయాన ఫైనాన్స్ మినిస్టర్ జైట్లీ గారే చెబుతున్నారు.

మ.12.30

అధ్యక్షా, ఈరోజు మనం అడిగిన రూ.22,113 కోట్లు వారివ్వాలి. రెవెన్యూలోటు ఉందని 14వ ఆర్థిక సంఘం, కేంద్ర ప్రభుత్వం కూడా ఒప్పుకుంది. కానీ, ఈరోజు మాట మార్చి ఇవ్వాల్సింది కేవలం రూ.138కోట్లు మాత్రమే అని చెప్పడం జరుగుతోంది. మన రాజధాని నిర్మాణం కోసం, అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు వంటి ప్రభుత్వ శాశ్వత భవనాలు నిర్మించేందుకు భూమిపూజ చేసినప్పుడు మన ప్రధానమంత్రిగారు కూడా వస్తే భవనాల నిర్మాణానికి మొత్తం రూ.42,931కోట్లు కావాలని అంటే కేవలం రూ.2500కోట్లు మాత్రమే ఇచ్చింది. గుంటూరు

అర్బన్ డ్రైనేజ్‌కు రూ.500కోట్లు, విజయవాడ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్‌కు రూ.500కోట్లు ఖర్చయితే మనం ఉండే ఈ బిల్డింగ్స్ అన్ని కూడా 6 లక్షల చదరపు అడుగులలో కట్టుకున్నది మిగతా రూ.1500కోట్లతో మాత్రమే కాకుండా ఇంకా ఎక్కువగానే ఖర్చు పెట్టుకోవడం జరిగింది.

అధ్యక్షా, అంతేకాదు, వెనుకబడిన జిల్లాలైన రాయలసీమలో నాలుగు జిల్లాలు, ఉత్తరాంధ్రలో మూడు జిల్లాలకు కలిపి రూ.24,350కోట్లు అడిగితే దానికి వారు కేవలం రూ.1050కోట్లు మాత్రమే ఇవ్వడం జరిగింది. అంతేకాకుండా 24గంటల విద్యుత్ ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం అంటున్నది. ఆర్.టి.ఐ యాక్ట్ ద్వారా ఏ రాష్ట్రానికి ఎంతెంత ఇచ్చారనే వివరాలు కూడా తీసుకుని వచ్చాను. ఒకసారి చూస్తే ఉత్తరప్రదేశ్‌కు రూ.11,000కోట్లు, బీహార్‌కు రూ.8,000కోట్లు, చిన్న రాష్ట్రమైన జార్ఖండ్‌కు రూ.7,000కోట్లు ఇచ్చారు. మన రాష్ట్రానికి రూ.1593కోట్లు అడిగితే రూ.165 కోట్లు ఇచ్చారు. మేము ఇచ్చాము, మేము ఇచ్చాము అంటే దేనికి ఇచ్చారని అని అడిగితే ఉపాధ్యాయ గ్రామ జ్యోతి యోజన, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీమ్‌కు ఇచ్చామని చెప్పారు. ఇది కేవలం పవర్ ట్రాన్స్‌మిషన్‌కు, లైన్స్‌కు ఇచ్చారు కాని జనరేషన్‌కు కాదు.

అధ్యక్షా, ఈరోజు భారతదేశంలో 29 రాష్ట్రాలు ఉంటే 15 రాష్ట్రాలలో బీ.జె.పి. ప్రభుత్వం అధికారంలో ఉంది, 5 రాష్ట్రాలలో మిత్రపక్షాలు ఉంటే కేవలం 4 రాష్ట్రాలకు మాత్రమే ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఢిల్లీ, గుజరాత్‌కు 24 గంటలు కరెంటు ఇస్తే మేము కరెంట్ ఇచ్చామని చెబుతారు. అన్నీ తప్పుడు లెక్కలు చెబుతారు. అంతేకాదు, లక్షకోట్ల రూపాయలు రోడ్ల అనుసంధానం కోసం ఇచ్చామని అంటారు, డబ్బులు వచ్చింది కేవలం రూ.6,000 కోట్లు మాత్రమే. తప్పుడు సమాచారాలు చెప్పొద్దని మొన్న కూడా చెప్పాము.

అదేవిధంగా ఎయిమ్స్ విషయానికి వస్తే రూ.1850 కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని దానికి ఇచ్చాము, వారు కేవలం రూ.54 కోట్లు ఇచ్చారు. 2018-19వ సంవత్సరంలో క్లాసులు ప్రారంభిస్తామన్నారు. మొన్న ఫోటోలు కూడా తీసుకుని వచ్చారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన రూ.54కోట్లు మాత్రమే కాక, ఇంకా రాష్ట్రప్రభుత్వం నిధులు కూడా ఖర్చుపెట్టడం జరిగింది. కాని కేంద్రప్రభుత్వం వారే మొత్తం నిధులు ఖర్చుపెట్టామని చెప్పకుంటున్నారు. అలాగే విజయవాడ విశాఖ మెట్రోరైలుకు నిధులు అడిగితే, బెంగుళూరుకు రూ.17,000 కోట్లు, ముంబాయికి రూ.50,000 కోట్లు, అహ్మదాబాద్ ముంబాయి బుల్లెట్ ట్రైన్‌కు రూ.1011 కోట్లు ఇచ్చారు కాని మనకు మాత్రం ఏ కార్యక్రమాలు చేయకుండా అడ్డుపడుతున్నారు.

అలాగే జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని పెట్టి చేశామని చెబుతున్నారు. నిన్ననే ఒకాయన మీటింగు పెట్టి తాము చేశామని అంటున్నారు. వారి లెక్కల ప్రకారం రూ.54 కోట్లయితే ఈరోజు ఏమీ చేయలేదు, నాలుగు సంవత్సరాలు గమ్మున ఉన్న వ్యక్తి ఇప్పుడే అన్ని గుర్తుకు వచ్చి ఎలా చేస్తాడనే దానిని మనం గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. జనసేన పార్టీ, లోక్‌సత్తా పార్టీవారు చెప్పిన ప్రకారమే రూ.74,542కోట్లు ఇంకా కేంద్రప్రభుత్వం నుండి రావాల్సి ఉందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఇవన్నీ కూడా మనం గమనించాల్సిన అవసరముంది.

అధ్యక్షా, ఈరోజు ఆంధ్రప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. వారు మొన్నకూడా ఏమంటున్నారంటే కొంతసేపు ఆగితే ఆర్మీకి ఇచ్చిన నిధులు కూడా అడిగేలా ఉన్నారని హేళన చేస్తున్నారు. ఇది సరియైన పద్ధతి కాదు. ఆవిధంగా చేసినందుకే ఆర్కే నగర్‌లో మొన్న జరిగిన ఎలక్షన్స్‌లో నోటాకు 2,373ఓట్లు వస్తే ఆ పార్టీకి కేవలం 1417ఓట్లు మాత్రమే వచ్చాయి. అంతేకాకుండా యు.పిలో, బీహార్‌లో ఏ పరిస్థితి ఉందో ఆలోచించుకోవాలి. దయచేసి తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయకండి, దెబ్బతీసినవారి పరిస్థితి ఏమైందో కూడా గుర్తుపెట్టుకోవాల్సిన అవసరముందని తెలియజేస్తూ, దయచేసి ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం కళ్లు తెరచి ఆంధ్రప్రదేశ్‌కు న్యాయంగా రావాల్సిన నిధులను ఇవ్వాల్సిందిగా మీద్వారా కోరుతూ, విరమించుకుంటున్నాను.

**డా.ఎ.యస్.రామకృష్ణ(ఉపాధ్యాయ నియోజకవర్గం – కృష్ణా, గుంటూరు):** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మీద మాట్లాడేందుకు అవకాశం కల్పించిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. రాష్ట్రం విడిపోకూడదని మనమందరం సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నాము. దానికి బలమైన కారణాలున్నాయనే విషయం మనందరికి తెలుసు. ఈరాష్ట్రం విడిపోకూడదని కోరుకోవడానికి ముఖ్యకారణమేమంటే హైదరాబాదు మనమందరం కలిసి నిర్మించుకున్న సిటీ. ముఖ్యంగా మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడి గారి కృషి వలన మనం హైదరాబాదు అభివృద్ధిని కళ్లారా చూశాము. 1990వ సంవత్సరంలో మన ముఖ్యమంత్రిగారు తీసుకున్న చర్యల వల్లనే ఈరోజు హైదరాబాదు బాగా అభివృద్ధి చెందింది. హైదరాబాదులో పెట్టిన పెట్టుబడులు మనవి, అక్కడి పరిశ్రమలు మనవి, అక్కడి వ్యాపారాలు మనవి, అక్కడి ఆదాయాలు మనవి, ఆ విధమైన స్థితికి హైదరాబాదును తీసుకురావడానికి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారే కాకుండా, ఆంధ్రప్రజలు పెట్టిన పెట్టుబడుల వలన హైదరాబాదు అనేది వాణిజ్య, పారిశ్రామిక కేంద్రంగా మాత్రమే కాకుండా సాఫ్ట్‌వేర్ హబ్ సిటీగా మారిన సంగతి అందరికీ తెలుసు. హైదరాబాదు, సికింద్రాబాదు తోపాటు సైబరాబాదును కూడా కలిపిన ఘనత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుంది.

సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఓవైసి గారు అన్న మాటలు గుర్తుపెట్టుకోవాలి. నిన్న గాక మొన్న కె.సి.ఆర్ గారు అన్న మాటలు కూడా మనం మననం చేసుకోవాల్సిన అవసరముంది. హైదరాబాదును స్వయం పాలిత ప్రాంతంగా, లేదంటే కేంద్రపాలిత ప్రాంతంగా ఉంచాలనే చర్చ జరిగినప్పుడు ఓవైసి గారు మాట్లాడుతూ హైదరాబాదు లేని తెలంగాణ తెలంగాణానే కాదు, అది ఒకరకమైన శవం వంటిదని అనడం జరిగింది. హైదరాబాదు లేని తెలంగాణా సాధించుకోవాలంటే ఎప్పుడో వచ్చేదని ఇటీవలే కె.సి.ఆర్ గారు ప్రకటించడం జరిగింది.

విభజన సమయంలో దురదృష్టవశాత్తు హైదరాబాదు మనకు కాకుండా పోయింది. ఆరోజున విభజన సమయంలో రాజ్యసభలో చాలా స్పష్టంగా హామీ ఇచ్చారు. మీకు జరిగిన నష్టమేదో జరిగింది, ఆ నష్టాన్ని తు.చ. తప్పకుండా పూరిస్తామని రాజ్యసభ సాక్షిగా బి.జె.పి నాయకులు, అదేవిధంగా ఆరోజున అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా హామీ ఇవ్వడం జరిగింది. స్వయానా దేశ ప్రధానమంత్రి కూడా హామీ ఇవ్వడం జరిగింది.

అయితే అది చట్టంలో ఎందుకు పెట్టలేదని అంటున్నారు. ప్రధానమంత్రి ఇచ్చిన హామీకే దిక్కులేనప్పుడు ఇంక ఎవరికి చెప్పాలనేది ఆలోచించాల్సిన అవసరమున్నది. దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచిపోయింది. శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు దాదాపు 29సార్లు ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రిని, మిగిలిన కేంద్రమంత్రులను విభజన హామీలు అమలు చేయాల్సిందిగా కోరడం జరిగినా అది చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లుగానే మిగిలిపోయిందనేది వాస్తవం. మనం ఈరోజు చూసినట్లయితే ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క అంశాన్ని కూడా అమలు చేసిన పాపాన పోలేదు.

అధ్యక్షా, ఇందాక మన మిత్రులు చెప్పినట్లు ఆరోజున బిల్లును యుద్ధవిమానాలలో తీసుకుని వచ్చి ఆమోదించి తీసుకువెళ్లడం జరిగింది. ఆర్టికల్ (3) ప్రకారం ఏదైనా ఒక రాష్ట్రాన్ని విభజించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది. అయినప్పటికీ ఆర్టికల్ (3) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వంలో ఉండే శాసనసభ్యుల అభిప్రాయం తీసుకోవాల్సిన అవసరముంది కాబట్టి ఆరోజున ముక్త కంఠంతో మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న శాసనసభ, శాసన మండలి కూడా ఏకగ్రీవంగా మెజారిటీ ఓట్లతో సమైక్యాంధ్ర ఉండాలని తీర్మానించి పంపించాయి.

మ.12.40

అధ్యక్షా, దానిని కూడా పరిగణనలోకి తీసుకోకుండా, దురదృష్టవశాత్తు మన రాష్ట్రాన్ని విభజించడం జరిగింది. ఫర్వాలేదు, విభజించారు కాబట్టి, మీకు కావాల్సిన నిధులు ఇస్తాము, రాజధాని నిర్మాణానికి కూడా నిధులిస్తామని, వెనుకబడిన ప్రాంతాలకు నిధులిస్తామని మనకు కేంద్రప్రభుత్వం హామీలిచ్చింది. కానీ, గత నాలుగు సంవత్సరాల్లోను మనం చూసినట్లయితే, నాకు ఒక అనుమానం కలుగుతోంది. అదేమంటే, ఇన్ని సార్లు చంద్రబాబునాయుడు గారు కేంద్రప్రభుత్వం దగ్గరికి వెళ్లినా ఫలితం లేకపోయింది. మన 2018-19 రాష్ట్ర బడ్జెట్‌ను చూశాము. దానిలో సంక్షేమ కార్యక్రమాలు ఒకవైపు, అభివృద్ధి కార్యక్రమాలు ఒకవైపున ఉన్నాయి. మనం రెండంకెల అభివృద్ధి సాధించామని కూడా చెబుతున్నారు. మన పంచాయితీ రాజ్ శాఖకు దాదాపు 38 అవార్డులు వచ్చాయి. ఇన్ని అననుకూల పరిస్థితుల్లో కూడా, ఇన్ని విజయాలు చంద్రబాబునాయుడు గారు సాధించారంటే, ఈయన మామూలు వ్యక్తి కాదు, ఈయనది మామూలు తెలివి కాదు, ఈయన సృజనాత్మకత మామూలుది కాదు, ఈ దేశంలోనే అత్యంత అనుభవం, నాలెడ్జ్, స్కిల్, దూరదృష్టి కలిగినటువంటి నాయకుడు ఈయన. Under all circumstances, ఈ నాయకుడు అద్భుతాలు సృష్టించగలడు అనడానికి గత నాలుగు సంవత్సరాలుగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే నిదర్శనం. మనం గనుక విభజన చట్టంలో చెప్పినట్లు నిధులు ఇచ్చినట్లయితే ఈ దేశంలోనే మన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు 2022 నాటికి ఈ రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామి రాష్ట్రాలలో మొదటి మూడింటిలో ఒకటిగా తయారుచేస్తామని, 2029 నాటికి భారతదేశంలోనే తలసరి ఆదాయం విషయంలో, జీవన ప్రమాణాల విషయంలో, పెట్టుబడులు ఆకర్షించడంలోనే కాదు, అనేక ఇతర విషయాలలో కూడా ఆంధ్రప్రదేశ్‌ని నెం.1గా తయారుచేస్తామని, 2050నాటికి ఈ రాష్ట్రాన్ని ఒక డెస్టినేషన్ పాయింట్‌గా తయారు చేస్తామని లక్ష్యాలుగా పెట్టుకుని

పనిచేస్తున్నారని, ఇవి సాకారం చేసేటువంటి ప్రమాదం ఉందని కేంద్రం అనుకుంది. ఈయన దేశంలోనే చక్కటి నాయకుడిగా, బ్రహ్మాండమైన నాయకుడిగా ఎదిగేటటువంటి ప్రమాదం ఉంది, ఇక ఎవరూ ఈయన్ని ఎదిరించలేరు, ఇన్ని అననుకూల పరిస్థితుల్లోనే ఇన్ని మంచి పనులు చేసిన ఈయనకు మనం అనుకున్నట్లు నిధులు ఇస్తే, మనకే ఏకుకు మేకై కూర్చుంటాడని, ప్రధానమంత్రిని కూడా దాటిపోయే ప్రమాదం ఉంది అనే శంఖ వాళ్లలో ఉందనే అనుమానం నాకు ఉంది. అందుకనే ఈరోజు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్ల నారాచంద్రబాబునాయుడు గారి పట్ల ఈవిధమైన ప్రవర్తనను అనుసరిస్తున్నారని నాకు అనిపిస్తోంది.

అధ్యక్షా, ఈ మధ్య నేనొక వీడియో చూశాను. ఆ వీడియోలో ఒక వైపున అద్వానీ గారు, మరోవైపున త్రిపుర మాజీ ముఖ్యమంత్రిగారు కూర్చున్నారు. ఇంకొకవైపున కొంతమంది కూర్చున్నారు. ఆయన అద్వానీగారిని ఏ మాత్రం లెక్క చేయకుండా వెళుతున్నారు. అద్వానీగారిని చూస్తే నాకు చాలా జాలి వేసింది. చేతులు కట్టుకుని నిలబడి ఉన్నారు. ఆయనను పట్టించుకోకుండా ప్రక్కన ఉన్న సర్కార్‌గారితో ఆ ప్రధానమంత్రి మాట్లాడుతుంటే, ఆ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరికి జాలి వేసింది. దీనిని ప్రస్తావించడం జరుగుతోందంటే, ఒక రకమైన అహంభావం పెరిగిపోయిందేమోనని అనిపిస్తోంది. అంతేగాక, చంద్రబాబునాయుడు గారి పట్ల ఒక రకమైన భయం ఉందేమోనని అనిపిస్తోంది. మన విభజన చట్టంలో ఉన్న ఏ హామీని కేంద్రం వారు అమలు పరిచారు ? అన్నీ అబద్ధాల లెక్కలతో ఉన్నాయి. ఈమధ్య టి.వి. చర్చలలో ఒక బీ.జె.పి. నాయకుడు మాట్లాడుతూ, మీకు మూడు లక్షల డెబ్బై కోట్ల రూపాయలు ఇచ్చామని చెప్పారు. నాకయితే అర్థం కాలేదు. ఇక్కడ ఎవరైనా బీ.జె.పి నాయకులు ఉంటే మూడు లక్షల డెబ్బై కోట్ల రూపాయలు ఇచ్చారా, ఇవ్వలేదా అనేది చెప్పాలి. కాకి లెక్కలతో, అబద్ధాలతో ప్రజలను మోస పుచ్చాలని ప్రయత్నిస్తున్నారు. ఈ మోసాలన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఈ మధ్య పార్ట్‌టైం లెక్చరర్ ఒకరు వచ్చారు. ఎందుకంటే అంతకుముందు పార్ట్‌టైం లెక్చరర్‌గా ఉంటే తిరస్కరించాము. ఫుల్‌టైం లెక్చరర్ కావాలనుకున్నాడు. అయినా ఆయనను తిరస్కరించారు. ఇప్పుడు ఒక పార్ట్‌టైం లెక్చరర్ వచ్చాడు. అప్పుడప్పుడు కనిపిస్తూ ఉంటాడు. నిన్న విపరీతంగా విమర్శలు గుప్పించడం జరిగింది. వచ్చినటువంటి యువజనాన్ని చూసుకుని ఎవరున్నారో మనకు తెలియదు కానీ, మనం గుర్తు పెట్టుకోవాల్సినది ఒకటి ఉంది. ఇటువంటి వాళ్లను చాలా మందిని చంద్రబాబు నాయుడుగారు వారి యొక్క 40ఏళ్ల రాజకీయ జీవితంలో చూశారు. వారు రాష్ట్ర ప్రభుత్వానికి మేలు చేయకపోగా, రాష్ట్రప్రభుత్వానికి మేలు చేయాలని అహర్నిశలు, రోజుకి 18 గంటలు కృషి చేస్తున్న చంద్రబాబునాయుడు గారిని ఆడిపోసుకోవడం మంచిది కాదు. ఇవాళ టి.వి. చర్చలో నేను చూశాను. టి.వి.5 లో ఒక ఓటింగ్ పెట్టారు. అదేమంటే ఇవాళ ప్రతిపక్ష నాయకులందరూ కలిసి చంద్రబాబునాయుడుగారి మీద దాడి చేస్తున్నారు, ఇది నిజమా, కాదా అని ఓటింగ్ పెడితే, 80 శాతం మంది చంద్రబాబునాయుడుగారికి అనుకూలంగా ఉన్నారని చూస్తుంటే, ఇవాళ రాష్ట్రప్రజలు ఎవరివైపుకి చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ వివక్షత మంచిది కాదు. వెనుకబడిన 7 జిల్లాలకు నిధులు ఇస్తామని అన్నారు, అవి ఇవ్వలేదు. తాత్కాలిక భవనాలు కట్టమని మీకు ఎవరు చెప్పారని నిన్న ఒక బీ.జె.పి

నాయకుడు మాట్లాడుతున్నారు. ఇవాళ మనం కూర్చున్నటువంటి ఈ భవనం తాత్కాలిక భవనమా? 1375 ఎకరాలలో త్వరలో శాశ్వత భవనాలు కడుతున్నారు. హైదరాబాదులో బేగంపేట ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని కట్టి, దానిని మనం కూల్చేశామా? వేరే అవసరాలకు ఉపయోగించుకోవడం జరుగుతోంది. అదేవిధంగా, రేపు ఇక్కడి నుండి మనం శాశ్వత భవనాలకు వెళ్లిన తరువాత వీటిని కూడా వేరే అవసరాలకు ఉపయోగించుకుంటాము. దాదాపు 6 లక్షల చదరపు అడుగుల భవనాలు ఇక్కడ మనకు ఉన్నాయి. వీటన్నింటిని మనం తాత్కాలిక భవనాలు అనడానికి వీలు లేదు. కార్యకలాపాలను మాత్రమే మనం తాత్కాలికం చేసుకుంటున్నాము తప్ప, ఈ భవనాలను తాత్కాలిక భవనాలు అనడానికి వీలు లేదు. ఎంత స్మార్ట్‌గా ఉన్నాయి. నేనయితే జీవితంలో ఇటువంటి భవనం ఎప్పుడూ చూడలేదు. వీటిని పట్టుకుని తాత్కాలిక భవనాలు అనడం మంచిది కాదు.

అధ్యక్షా, అలాగే దాదాపు 11 కేంద్రప్రభుత్వ సంస్థలు ఇస్తామని అన్నారు. ఇవాళ చూస్తే ఆశ్చర్యంగా ఉంది. నిట్ ఇస్తామని అన్నారు. ఇన్ని సంవత్సరాలలో ఇచ్చింది రూ.50కోట్లు. రూ.450కోట్లు మనకు ఇవ్వాలి. కానీ ఈ సంవత్సరం పదికోట్లు ఇచ్చారు. తాత్కాలిక భవనాలు వాసవి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్మించారు. తెలుగుదేశం పార్టీలో టీచర్స్ ఎమ్మెల్సీగా నేను ఉన్నాను కాబట్టి ఈ మధ్యనే ఇంజనీరింగ్ కాలేజి స్టూడెంట్స్ నాకు ఫోన్‌చేసి ఇదేమి అన్యాయం? నిట్‌లో చదువుతున్నామనే తృప్తి మాకు లేకుండా పోయింది. ఒక ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో నిట్ పెట్టడమేంటి? పర్మినెంట్ ఫ్యాకల్టీ లేరు, సరైనటువంటి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదు, మాకు సరైనవిధంగా బోధన జరగడం లేదు, మీరన్నా ఆదుకోండి, పర్మినెంటు ఫ్యాకల్టీని ఇవ్వండని అడిగారు. ఈవిధంగా సంవత్సరానికి రూ.10కోట్లు ఇచ్చుకుంటూ పోతే, ఒక్క నిట్‌కు సరిపోయే నిధులు ఇవ్వడానికే దాదాపు 50 సంవత్సరాలు పట్టే అవకాశం ఉంది. ఏవిధంగా చూసినా కూడా మనరాష్ట్రం మీద కేంద్రప్రభుత్వం సీతకన్ను వేస్తోంది. ఇది మంచిది కాదు. ఆల్‌రెడీ ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలు గుణపాఠం చెప్పాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏదైతే గతి పట్టిందో బీ.జె.పి. ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుంది. త్వరలోనే ఆ విధమైన మార్పును చూస్తారని నేను అనుకుంటున్నాను. ఈ రాష్ట్రానికి దిశ, దశ నిర్ణయించేటువంటి వారు చంద్రబాబునాయుడు గారే అనేటువంటి అభిప్రాయానికి ప్రజలు వచ్చారు. ఆ విధమైన శ్రమ చేశారు కాబట్టే, ఇప్పుడు చంద్రబాబునాయుడు గారి పట్ల, ఆయన ప్రభుత్వం పట్ల ప్రజలలో ఆదరణ ఉందని భావిస్తూ, విభజన చట్టం మీద మాట్లాడేందుకు అవకాశం కల్పించిన మీకు నమస్కారాలు తెలియజేస్తూ, ముగిస్తున్నాను.

**శ్రీ యండపల్లి శ్రీనివాసులు రెడ్డి:** అధ్యక్షా, విభజనచట్టం మీద మాట్లాడాలని మా ఫ్లోర్ లీడర్ ఇప్పుడే చెప్పారు. నేను మాట్లాడడానికి మీరు అనుమతిచ్చినందుకు ధన్యవాదాలు. విభజనచట్టం, 2014 తెలుగుజాతికి తీరని అన్యాయం జరిగిన సందర్భం. ఆనాడు భాషా సంయుక్తరాష్ట్రాలు అవసరమని వివిధ రాష్ట్రాలలో ఉన్న తెలుగుజాతిని ఏకం చేసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఈ రాష్ట్రంలో రాజకీయ ప్రయోజనాల కోసం, అధికారాలు చేజిక్కించుకోవాలని స్వార్థపర శక్తుల చేత రాజకీయ పార్టీలు ఈ రాష్ట్ర విభజనకు పూనుకున్నాయి. ఇందులో బి.జె.పి అని గానీ, వై.ఎస్.ఆర్.సి.పి అని గానీ, తెలుగుదేశం అని గానీ, ఇంకొక పార్టీ అని గానీ లేకుండా, ఎందుకో తెలియదు గానీ, నర్మగర్భంగా

అందరూ ఏకమై ఒకే ఒక రాజకీయ పార్టీ మినహా దోబూచులాడి ఈ రాష్ట్రాన్ని విభజించాయి. ఆ సమయంలో కాంగ్రెస్‌పార్టీ చెప్పిన మాయమాటలు, స్పెషల్ స్టేటస్, స్పెషల్ ప్యాకేజిలు ఇవన్నీ కూడా మనం ప్రస్తావించుకుంటూ ఉన్నాము. రాష్ట్రం విభజన జరిగి నాలుగేళ్లు గడిచిపోయింది. కానీ, విభజన సందర్భంగా వచ్చిన హక్కులను కాపాడుకోవడంలో, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ఈ రోజు వరకు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా అన్ని రాజకీయ పార్టీలు ఏమి చేస్తున్నాయని యువత అయిన మేధావి వర్గం ప్రశ్నిస్తోంది. ప్రధానంగా ఇందులో ఆశాజనకంగా కనిపించే ఆరు అంశాలు ఉన్నాయి. ఇదే సభలో స్పెషల్ ప్యాకేజి వల్ల అన్ని రాష్ట్రాలు వారి వారి రాష్ట్రాలను అభివృద్ధి చేసుకున్నాయని, అలాగే మన రాష్ట్రాన్ని కూడా అభివృద్ధి చేసుకుందామని చెప్పారు.

మ.12.50

అధ్యక్షా, చివరకు ఆ స్పెషల్ ప్యాకేజి కూడా వచ్చిన పాపాన పోలేదు. ఫలితంగా రాయలసీమ వెనకబడిన జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లా ఈరోజు అభివృద్ధి పథంలో లేకుండా తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అందువలనే ఇందాక ప్రస్తావించుకున్న మా హంద్రీనీవా ప్రాజెక్టులు పూర్తికాకుండా ఉన్నాయి. గాలేరు-నగరి, ప్రాజెక్టు పనులు కరకంబాడి తిరుపతిని దాటి నగరి దాకా చేరుకోలేని పరిస్థితులలో ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్టు చూస్తే అక్కడ ఉన్న టన్నెల్ వర్క్స్‌లో బెల్డ్ సరిగ్గా లేని కారణం చేత మరియు నిధులు సరిగ్గా లేని కారణం చేత అవి ఆగిపోయాయి. అవి లేకపోతే ప్రకాశం జిల్లాలోని వెనుకబడిన ప్రాంతాలకు చెందిన కర్నూలు నుంచి ఏర్పడిన గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి ప్రాంతాలలో తీవ్రమైన నీటి కొరతే కాకుండా, రక్షిత మంచినీరు లేక ఆ ప్రాంతాలన్నీ సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భం ఇది.

అధ్యక్షా, ఈనాడు విశాఖ ఉక్కు తరువాత, అంతటి పబ్లిక్ సెక్టార్ కడప. మెకన్ కంపెనీ కూడా ఎక్కడెక్కడ ఉక్కు ఖనిజాలు ఉన్నాయనే విషయాన్ని తెల్చి చెప్పింది. ఆరు నెలల లోపల ఈ పూర్తి నివేదికలన్నీ మాకు సమర్పించాలని స్పెషల్ హోదాలో ఉన్న సందర్భం కూడా ఉంది. అలాగే, కడప స్టీలు ఫ్యాక్టరీ గానీ, రైల్వే జోన్ గానీ, ఇండస్ట్రియల్ కారిడార్ గానీ, దుగరాజపట్నం, పోలవరం మొదలైన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. మన రాష్ట్రానికి కడప ఉక్కు ఫ్యాక్టరీ వస్తుందని, రాయలసీమ ప్రాంతాలలో కడప ఉక్కు మా హక్కు అనే ఒక పెద్ద ఉద్యమం కూడా ఉన్నది. చిత్తూరు జిల్లాలో ఏర్పడిన మన్నవరం అనే జాతీయ పబ్లిక్ సెక్టార్‌కు చెందిన ఎన్‌టిపిసి, బిహెచ్ఇఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టును కూడా నిర్వీర్యం చేశారు. దాదాపు రూ.6,500కోట్లకు సంబంధించిన ఆ ప్రాజెక్టు అది. అందులో 15,000 ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చే ఆ ప్రాజెక్టును రూ.50కోట్ల మేర నష్టాలు వస్తాయని చెప్పి మన రాష్ట్రానికి రాకుండా దానిని తప్పించారు. ఈనాడు రాయలసీమ ప్రాంతం ఏ ఒక్క అభివృద్ధికి నోచుకోకుండా కడప ఉక్కు అనేది కూడా తేల్చలేని పరిస్థితిలో ఉన్నారు.

అధ్యక్షా, ఇక రైల్వే జోన్‌కి సంబంధించి చూసినట్లయితే – గుంతకల్లు, విజయవాడ, విశాఖపట్టణం మొదలైన ప్రాంతాల్లో కూడా ఆనాడు విభజన చట్టంలో, ఏ ఒక్క ప్రాంతానికి రైల్వే జోన్ ప్రకటించలేదు. ఈనాడు రైల్వే జోన్ ఎక్కడ అవసరం అనేది కూడా ఆలోచించాలి. అభివృద్ధి అంతా కేంద్రీకృతమా, వికేంద్రీకృతమా అనే దిశగా ఆలోచన చేసుకోలేని పరిస్థితులలో మనము ఉన్నాము. అందువలన మన రాష్ట్రం ఈ రైల్వే జోన్‌ను కూడా సాధించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని ఈ సందర్భంగా తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. ఆరోజున రైల్వే జోన్‌కు అనుమతించిన ప్రభుత్వం ఈనాడు ఎందుకు మాట తప్పుతోందో తెలియడం లేదు. ఉత్తరాది రాష్ట్రాలలోనే ఎక్కువగా రైల్వేజోన్లు ఉంటున్నాయి. రైల్వే ఆస్తులన్నీ కూడా ఉత్తరాదిలోనే ఉంటున్నాయి. గడచిన కాలాలలో మన ఆంధ్రప్రదేశ్‌కు 40 యేళ్ళుగా అభివృద్ధి కార్యక్రమాలలో అన్యాయం జరుగుతూనే ఉంది. ఇది గుంతకల్లులో పెడతారో, విశాఖపట్టణంలో పెడతారో తెలియదు. వీటిని మేము ఎటువంటి ప్రాంతీయ విభేదాలు లేని వాళ్ళంగా చెపుతున్నాము. ఈ రైల్వే జోన్‌ను మనం తప్పనిసరిగా సాధించుకుని తీరాలి.

అధ్యక్షా, ఈరోజు దుగరాజపట్టణం ఓడరేవును 2018వ సంవత్సరంలో పూర్తిచేస్తామని ఇస్రో ఏదో అభ్యంతరం చెపుతోందని చెప్పి అంటున్నారు. ఒక ఓడరేవు రావడమనేది అభివృద్ధికి చిహ్నమో కృష్ణపట్నం పోర్టు వచ్చిన తరువాత తెలుస్తోంది. దుగరాజపట్నం కాకపోతే రామాయ్యపట్నం పోర్టు అభివృద్ధికి అవకాశం ఇవ్వమని తమ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మనం ఒక పోర్టును సాధించుకునే దానిలో ఎంత వెనుకబడి ఉన్నామో, ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నామో తెలుస్తోంది. ఈరోజున తమ ద్వారా నేను అడిగేది ఏమిటంటే – నాలుగు సంవత్సరాలుగా ఈ విభజన హామీ చట్టంలోని ప్రతి ఒక్క అంశం చూస్తే దుగరాజపట్నం గానీ పోలవరం జాతీయ ప్రాజెక్టు అని ప్రకటించి దాదాపు రూ.5,092కోట్లు పై చిలుకు మాత్రమే విడుదల చేసింది. మనమందరం కలిసి అంటే మన జాతి మొత్తం కలిసి తమిళనాడు రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని ఎందుకు ముందుకు వెళ్ళకూడదని తమ ద్వారా ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఈనాడు మన రాష్ట్రంలో క్రొత్త క్రొత్త రాజకీయ పార్టీలు వస్తున్నాయి. అందరం కలిసి విభజన చెందిన సందర్భంగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకువెళ్ళడం కోసం రాజకీయ ఎత్తుగడలతో పోతున్నామే గానీ, మన రాష్ట్రానికి రావలసిన వాటిని మరియు మన కోర్కెలను సాధించుకునే దానిలో మాత్రం కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచి, దించి, ఆ జాతీయ ప్రాజెక్టుకు ముష్టివేసినట్లు వెయ్యికోట్ల రూపాయలు, రెండు వేల కోట్ల రూపాయలు ఇస్తే, అది వచ్చేది కాదు. ఖచ్చితంగా ఈ రాష్ట్ర ప్రజలు ఐక్యం కావలసిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా తమ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మరొక అంశం ఏమిటంటే – జాతీయ పార్టీ అయిన ఎన్‌డిఏ ప్రభుత్వం కూడా ఒక విభజన చెందిన రాష్ట్రానికి చూపించవలసిన జాలి, దయ, ఇవ్వవలసిన పద్ధతులు ఇవి కావు అని చెప్పి చెపుతున్నాము. నాలుగేళ్ళుగా ఆ పార్టీతో భాగస్వామ్యంలో ఉంటున్న మనం కూడా ఇంతకాలం ఎందుకు నిలదీయలేకపోతున్నామో అర్థం కావడం

లేదు. ఈరోజున ఆ పార్టీ యు టర్న్ తీసుకుని, ఎక్కడెక్కడ ఏయే పార్టీలు ఎట్లా వస్తున్నాయి అని అనుకునే పద్ధతిలో ప్రజలు గందరగోళమైన పరిస్థితిలో ఉన్నారు. ఈరోజు అవిశ్వాస తీర్మానాలు, ప్రధాన రాజకీయ పార్టీలు పెట్టాయి. అవిశ్వాస తీర్మానంతో ఒరిగేది ఏం ఉంటుందో మాకయితే అర్థంకాని పరిస్థితి ఉన్నది. వాటివలన పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదాలు పడతాయి తప్పితే ఒక ఫలితం వచ్చే సందర్భమయితే ఎక్కడా కూడా కనపడే సందర్భం లేదు.

అధ్యక్షా, ఈనాడు ఖచ్చితంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి అటు కోస్తా ఆంధ్ర, ఇటు ప్రకాశం జిల్లా, రాయలసీమ జిల్లాల్లో 11 జాతీయ విద్యా సంస్థలు వస్తున్నాయని చాలా సంతోషపడిపోయాము. మా తిరుపతి పట్టణానికి సంబంధించి కూడా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అదేవిధంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ రీసెర్చ్, నిట్ మొదలైన వాటికి సంబంధించి కూడా పెద్దలు చెప్పారు. 11 జాతీయ విద్యా సంస్థలకు సంబంధించి రూ.11,673కోట్లతో వాటి నిర్మాణాలు పూర్తి చేయడానికి కావాలంటే, వాటి ప్రహరీ గోడలు మరియు మరుగుదొడ్లకు కూడా సరిపడని నిధులు కేంద్రం నుండిఅక్కడకు వస్తున్నాయి. మా అనంతపురానికి కూడా ఒక సెంట్రల్ యూనివర్శిటీ, ట్రైబల్ యూనివర్శిటీ కూడా అసలు వస్తుందో రాదో తెలియని పరిస్థితి నేడు ఉన్నది. వాటికి సంబంధించిన స్థలాలు మాత్రం కేటాయించేశాము. ఇండ్ల స్థలాలు లేని పేదలు ఒక ప్రక్కన ఉంటే, కౌలు రైతులకు వ్యవసాయదారులకు కూడా భూములే లేని పరిస్థితులు ఉంటున్నాయి. కనీసం ఈ జాతీయ విద్యాసంస్థలైనా మన రాష్ట్రానికి వస్తాయేమోనని అనుకుంటే, అవి కూడా రాని నేపథ్యం నేడు కొనసాగుతోంది.

అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు కాదు కదా, ఊరికే ఈ రాష్ట్రాన్ని విభజించేసి అక్కడ ఒక రాష్ట్రం, ఇక్కడ ఒక రాష్ట్రం ఏర్పడిపోయి, కాంట్రాక్టర్ల కోసం ఏమైనా చట్టాలు వస్తున్నాయా అనే అనుమానాలు కూడా ఉండే నేపథ్యంలో ఇవన్నీ కొనసాగుతున్నాయి. సంక్షేమం వైపు అడుగులు వేయడానికి చక్కటి ప్రణాళికలు వేసుకున్నారు. (మైకు లేదు) అదే పరిస్థితులలో దేశభక్తితో కూడుకున్న ఈ సమయంలో రాజకీయ నాయకులు అధికారాలు చేపట్టిన ట్రెజరీ బెంచ్ కూడా ఈరోజున అందరినీ కలుపుకుని ముందుకు వెళ్ళాలి. స్పెషల్ స్టేటస్ అనేది మొదటి వాక్యంగా చెప్పిన ప్రధాన మంత్రి బుందేల్‌ఖండ్‌కు ఇచ్చిన అవకాశాన్ని గానీ, ఒడిశాకు ఇచ్చిన అవకాశాన్ని పోగొట్టుకోవడం అంటే ఈ జాతి మనలను క్షమించదు. కొన్ని యేళ్ళపాటు ఈరోజున హైదరాబాదు నగరంగా అభివృద్ధి చెందాలంటే దాదాపు రూ.5 లక్షల కోట్లు అవసరమవుతాయి. బెంగళూరుగా మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే దాదాపు రూ.8లక్షల కోట్ల వరకు నిధులు కావలసి వస్తాయి. ఇప్పటికైనా ఈ రాష్ట్రానికి కావలసిన నిధులు రాకపోతే ఈ రాష్ట్రం అభివృద్ధి చెందదు. ఈ జాతి భవిష్యత్తును మనం కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. మన రాష్ట్రాన్ని విభజించినప్పుడు స్పెషల్ స్టేటస్‌ను మన రాష్ట్రానికి సాధించే విధంగా ఈ ప్రభుత్వం కృషిచేయాలని, అందుకు అందరూ ముందుకు రావాలని తమ ద్వారా ఈ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**శ్రీ కె.ఈ.ప్రభాకర్:** అధ్యక్షా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014కు సంబంధించి వాటి గురించి మాట్లాడడానికి అవకాశం కలగజేసినందుకు ముందుగా మీకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ముఖ్యంగా ఆరోజున ఈ ఆంధ్రప్రదేశ్‌ను అశాస్త్రీయంగా పార్లమెంటులో లైట్లు తీసేసి, తలుపులు మూసి, ప్రత్యక్ష ప్రసారాలను నిలిపివేసి, పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేసి, భారతదేశ చరిత్రలోనే జరగకూడని విధంగా ఏ విధంగా చేశారో దానికి మద్దతు తెలిపిన పార్టీలకు సంబంధించి వారంతా చరిత్ర హీనులుగా మారిపోతారని చెప్పడానికి నేను సందేహపడడం లేదు. ఆనాడు అంత దారుణంగా, అశాస్త్రీయంగా మన రాష్ట్రాన్ని విభజించినప్పుడు మన రాష్ట్రానికి మేలు కలగజేస్తామని చెప్పారు. చిన్న పిల్లలు ఏడుస్తుంటే అది ఇస్తాము, ఇది ఇస్తామని చెప్పి ఏ విధంగా వారిని ఓదారుస్తామో అలా కేంద్రం కూడా దాదాపు 19 అంశాలపైన మన రాష్ట్రానికి ఆశలు చూపించింది. ఇవన్నీ కేంద్రం చేస్తానని మనల్ని ఒప్పుకోండి అని ఆనాడు బలవంతంగా ఈ రాష్ట్రాన్ని విభజించిన సంగతి మనం ఎప్పుడూ మర్చిపోకూడదు. ఆ 19 అంశాలకు సంబంధించి ఇంతవరకు పరిపూర్ణంగా చేయకపోవడం చాలా శోచనీయమైన విషయం.

అధ్యక్షా, మన ముఖ్యమంత్రిగారు ప్రధానమంత్రిగారిని కూడా నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని శంకుస్థాపన కోసం ఆహ్వానించినప్పుడు ఆయన కేవలం మట్టి, నీరు, తీసుకువచ్చి కంటి తుడుపు చర్యగా ఏ విధంగా చేశారో అందరూ రెవ్యూ చేసుకోవలసిన అవసరం కూడా ఉంది. అయితే, ముఖ్యమంత్రిగారు చేసే పనులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ఈ తెలుగు ప్రజలందరూ నిలబడేందుకు కొన్ని ఉదాహరణలను తమ ద్వారా తెలియజేస్తాను.

కర్నూలు జిల్లాలో అమరావతి శంకుస్థాపన జరిగిన రోజున ప్రభుత్వ ఆసుపత్రిలో పుట్టిన పిల్లలందరికీ కూడా అంటే ఆడపిల్లలైతే అమరావతి అని, మగపిల్లలైతే అమర్‌బాబు అని దాదాపు 12 మంది పిల్లల వరకు పేర్లు పెట్టడం కూడా జరిగిందని తమ ద్వారా తెలియజేస్తున్నాను. ఆ విధమైన కమిట్‌మెంట్‌తో ఈ తెలుగు జాతి అంతా ముందుకు పోవడమనేది తమ దృష్టికి తీసుకువస్తున్నాను. ఈరోజున బీజేపి ప్రభుత్వం గానీ, మరొకరు గానీ దాదాపు లక్షకోట్ల వరకు రహదారులకు ఇచ్చామని చెపుతున్నారు. అధ్యక్షా, ఇవన్నీ ఎవరికోసం ఇస్తున్నారు? అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే మన రాష్ట్రానికి కూడా ఇచ్చారు. మనం పన్నుల రూపేణా ఇస్తే తిరిగి మనకు ఋణాల రూపేణ వాళ్ళు ఇస్తున్నారు. అన్ని రాష్ట్రాల మాదిరిగానే ఇవన్నీ జరుగుతున్నాయని ఈ సందర్భంగా నేను తెలియజేస్తున్నాను.

మ.01.00

అధ్యక్షా, అదే కాకుండా ఇప్పుడే అందరికీ చెప్పడం జరిగింది. పంతొమ్మిది అంశాలకు సంబంధించిన విషయంలో ఏమి హామీలు ఇచ్చారో వాటిని నెరవేర్చడానికి మోదీ గారి ప్రభుత్వం ఏమ చేసిందో చెప్పడం లేదు. కనీసం వయస్సుకు కూడా మర్యాద ఇవ్వకుండా ఎల్.కె.అద్వానీ గారి పట్ల ఏ విధంగా వ్యవహరించారో మోదీగారి ప్రవర్తన తెలుస్తుంది. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు అనేక విదేశీ పర్యటలు చేసి

ఇక్కడకు అనేక కొత్త పరిశ్రమలు తీసుకురాగలుగుతున్నారే మేమయితే ఆ పని చేయలేమనే అభద్రతా భావం మన గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారిలో ఉందని నేను అనుకుంటున్నాను. వారికి వ్యక్తిగత కోపమా, లేకపోతే మన ఆంధ్ర రాష్ట్రం పైన చిన్న చూపా అనేది అర్థం కావడం లేదు. గౌరవ వెంకయ్య నాయుడు గారిని పక్కన పెట్టిన విషయాన్ని కూడా ఒకసారి ఆలోచించవలసి ఉందని తమ ద్వారా తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, అంతేకాకుండా మన కోసం ప్రత్యేకంగా ఏవైతే వాగ్దానాలు చేశారో పార్లమెంటు సాక్షిగా అవన్నీ కూడా అమలు చేయాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ మరచిపోయిన కాంగ్రెస్‌కు ఒక్కరూ కూడా గెలవకుండా ఏ గతి పట్టిందో అటువంటి పరిస్థితే మిగతా పార్టీలకు కూడా పట్టడానికి అవకాశం ఉంది. ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక హోదా గురించి అందరం కలసి పోరాడవలసిన అవసరం ఉంది. అటువంటి పోరాటానికి అందరూ సంసిద్ధులు కావాల్సిన అవసరముందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను ఈ అవకాశం ఇచ్చిన తమరికి ధన్యవాదములు తెలియజేస్తూ శెలవు తీసుకొంటున్నాను.

**శ్రీ రాము సూర్యారావు :** అధ్యక్షా, విభజన చట్టం మీద మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. డా.బి.ఆర్ అంబేద్కర్ గారన్న మాట ఒకటి ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. చరిత్ర లేని వాడు చరిత్ర నిర్మించలేడని డా.బి.ఆర్ అంబేద్కర్ గారు ఆనాడు చెప్పడం జరిగింది. ఎందరు అంగీకరించినా, అంగీకరించకపోయినా మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆనాడు ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం విడిపోయే పరిస్థితి వచ్చేది కాదని నేను వ్యక్తిగతంగా అభిప్రాయపడుతున్నాను. అలాంటి సమర్థవంతమైన ముఖ్యమంత్రి అప్పుడు మనకు లేక ఆంధ్రప్రదేశ్‌ను విభజించడం జరిగింది. ప్రపంచ చరిత్రలో ఏ దేశం విడిపోయినా, ఏ రాష్ట్రం విడిపోయినా ఆ రాష్ట్ర రాజధానిని విడిపోతామన్న వారికి ఇవ్వకుండా వాళ్లకు వేరే రాజధానిని ఏర్పాటు చేసి, విడిపోము అన్న వారికి మాత్రమే రాజధానిని ఉంచేవారు. కానీ, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మనం విడిపోమని, సమైక్యంగానే ఉంటామని అన్నాము. కానీ, విడిపోతామన్న వారికి పూర్తిగా అన్ని సౌకర్యాలు కల్పించారు. 11వ శతాబ్దం నుంచి మన ఆంధ్రప్రజలే ముఖ్యంగా గోదావరి జిల్లాల ప్రజలు అందరూ కూడా కలిసి దానిని నిర్మించారని చరిత్ర చెబుతుంది. ఇలా మన కష్టాన్ని, మనం చేసిన నిర్మాణాలను తరువాత మన ప్రియతమ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు నిర్మించిన రాజధానిని వారికి మనకు కనీసం పార్కు కూడా లేకుండా చేశారు. ఇది ఎవరు చేశారనేది వేరుగా చెప్పనవసరం లేదు. అందరూ చెబుతున్నారు. వారు తీవ్రంగా పార్టీ పరంగా కూడా నష్టపోయారనేది మనకు ఇప్పుడు రుజువైంది. వీటన్నింటి గురించి, ఒక పార్టీ గురించి ఒక పార్టీ వారు నవ్వుకుని, ఒక పార్టీ మీద ఒక పార్టీ నిందలు వేసుకుని నువ్వు చేశావు, నువ్వు చేశావనే దాని కంటే మన అందరి బాధ్యత ఏమిటి? మనం ముందు ఏమి చేయాలనేది ఆలోచించాలి. నిన్న కుడా నేను ఒక విషయంలో చెప్పాను. John f Kennedy గారు చెప్పిన సూక్తిలో నీవు దేశానికి ఏమి చేస్తున్నావు? దేశం

కోసం ఏమి చేస్తున్నావని మనమంతా ఆలోచించాలి. మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు, రామకృష్ణగారు మరియు మిగతా అందరూ నాయకులు చెప్పినట్లు చక్కని భవనాలను ఇప్పటికే నిర్మించారు. ఎవరో తాత్కాలిక భవనాలు అని అంటున్నారు కానీ ఇవే శాశ్వత భవనాలుగా వారి కష్టంతో ఆయన మెబిలైజేషన్‌తో నిర్మించడం జరిగింది. ఇంకా ఎన్నో భవనాలు నిర్మిస్తామన్నారు. అది సంతోషమే కానీ ఉన్న భవనాలతో మనం సంతృప్తిగా ఉండవచ్చు. నేను ఒక సంఘసేవకుడిగా శాసనమండలి సభ్యునిగా అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారే దేశ, విదేశాలు వెళ్లి మెబిలైజ్ చేసి ఫండ్స్ పోగుచేసి ఈ అమరావతి నిర్మాణానికి పూనుకోవడం అనేది కాదు. మన అందరం కూడా ఈ విధంగా చేయాలని నేను కోరుతున్నాను. ఎందుకంటే స్థాయి ఉన్న మన ముఖ్యమంత్రి ఒక ప్రధానమంత్రిగారి దగ్గరకు సుమారుగా 28 సార్లు వారి వద్దకు వెళ్లి కోరడం అనేది నాకు మాత్రం నచ్చలేదు. ఆయన ఎందుకు కోరాలి. వారెందుకు ఇవ్వకూడదు. వాళ్లే మీరు రాకూడదు మేమే చేయాలన్నారు. కానీ, చేయలేదు. అది పక్కకు పెట్టేసారు. మనలోనే చాలా మంది మెబిలైజ్ చేసే శక్తి ఉన్న వారు ఉన్నారు. వారి పేర్లు చెప్పక్కరలేదు. ఉదాహరణకు మా జవహర్‌గారికి అన్ని సామాజిక వర్గాలతో మంచి సంబంధాలు ఉన్నాయి. అలాగే మంత్రులు కూడా చాలా మంది ఉన్నారు. మా హోమ్ మంత్రి గారు ఉన్నారు. వారు తలచుకుంటే ఈ రాష్ట్రంలోనే కాదు, దేశ, విదేశాల్లో మొబిలైజేషన్ చేయవచ్చు. అలాగే గౌరవ మంత్రి ఉమా గారి గురించి కూడా చెప్పనవసరం లేదు. అలాగే చాలా మంది శాసనమండలి, సభ్యులు ఉన్నారు. మనమంతా కూడా మన సోర్సెస్‌తో మెబిలైజ్ చేసి ఫండ్స్ కోసం ఎవరి దగ్గరకో వెళ్లి, వాళ్లను దేహీ అనడం మంచిది కాదని నేను వ్యక్తిగతంగా అభిప్రాయపడుతున్నాను. మనమంతా అవకాశమున్నవాళ్లము. మెబిలైజ్ చేసి గౌరవ ముఖ్యమంత్రి గారికి అండగా ఉండి ఆ విధంగా చేస్తే, అసలు మనం వాళ్ల దగ్గరకు వెళ్లడం ఎందుకు? మన దగ్గరకే వాళ్లు వచ్చే స్థితికి తీసుకురావాలని నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. జరిగిపోయింది ఎలాగో జరిగిపోయింది. కేశవ్ గారు లాంటి వారందరికీ కూడా నేను మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నాను. వాళ్ల దగ్గరకు వెళ్లి వాళ్లను అడగడం వద్దు వాళ్లు మన దగ్గరకే త్వరలో వచ్చి మేము పొరపాటు చేశాం, మీరు రాజధానిని చక్కగా నిర్మించుకున్నారు, మీరే సోర్సెస్ ఏర్పాటు చేసుకున్నారని అనే విధంగా చేయాలి. నిన్న మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చక్కని మాట చెప్పారు. జపాన్ తరహాలో మన రాష్ట్రాన్ని అభివృద్ధి చేద్దామని అన్నారు. జపాన్ వారు స్ట్రైక్స్ చేయరు, ఉద్యమాలు చేయరు. పని ద్వారా వారు అభివృద్ధి చేసుకుంటారు. అలాగే, మన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రధానంగా నాయకులు, దాతృత్వం ఉన్న వ్యక్తులందరూ కూడా చేయాలి. నేను ఈ సందర్భంగా నా విషయం కూడా చెబుతున్నాను. మా ఇంటిలో 52 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ 52 మంది విద్యార్థులకూ ఒక సోర్సెస్ కాదు. ఎవరైనా సహాయం చేస్తారు. మంచి పనులు చేస్తే ఎవరైనా సహాయం చేస్తారు. మన ప్రియతమ ముఖ్యమంత్రి గారు చాలా మేధావి. వారి దగ్గర చాలా మంచితనం ఉంది. అందువలన వారు చేసే మంచి పనులకు ప్రపంచ వ్యాప్తంగా స్పందిస్తారని, మనమంతా మెబిలైజ్ చేయాలని తమరి ద్వారా నేను అందరికీ విజ్ఞప్తి చేస్తూ అవకాశం ఇచ్చిన మీకు కృతజ్ఞతలు తెలుపుతూ శెలవు తీసుకుంటున్నాను.

మ.01.10

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మాధవ్ గారు పది నిముషాలు మాట్లాడండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్(పట్టభద్రుల నియోజకవర్గం – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం):** అధ్యక్షా, ధన్యవాదాలు కానీ, పది నిముషాలంటే చాలా దారుణం.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** ముఖ్యమంత్రి గారి రిప్లై ఉంది. మీరు రావడం ఆలస్యంగా వచ్చారు.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, నేను అతిసార వ్యాధి పర్యవేక్షణ కోసం గుంటూరు వెళ్ళి రావడం వలన ఆలస్యం అయింది. ఎందుకంటే విభజన చట్టం గురించి ముద్దాయిగా నిలబడిన మాకు మాట్లాడేటప్పుడు ఎక్కువ సమయం ఇవ్వాలి.

**శ్రీ పితాని సత్యనారాయణ:** (మైకు లేకుండా) ముద్దాయిలమని మీఅంతట మీరే ఒప్పుకుంటున్నారన్నమాట.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, మేము మిత్ర పక్షంగా సభలోకి వచ్చి మా మంత్రులు మంత్రి వర్గం నుంచి బయటికి వచ్చిన తరువాత మేము మిత్రపక్షమా, స్వపక్షమా అనే విషయం అర్థం కాని పరిస్థితిలో ఈ రోజు ప్రతిపక్షంగా మార్చిన తరుణంలో విభజన చట్టంపై మొదటి సారిగా ప్రతిపక్షపాత్ర పోషిస్తూ మాట్లాడే అవకాశం ఈనాడు వచ్చింది. నిన్నటి వరకు ఏమిటి అనేది నాకు అర్థం కాలేదు. నేను మిత్రపక్ష ఎమ్మెల్సీగా గెలిచి శాసన పరిషత్తులో సభ్యుడిగా వచ్చాను. తెలుగుదేశం పార్టీకి సంబధించిన మిత్రులందరి పూర్తి సహకారం కారణంగానే ఈ సభకు రావడం జరిగింది. ఈ సందర్భంలో ఇవి చెప్పాలి అనిపిస్తుంది. కానీ, ఇది సందర్భమో కాదో తెయదు. నాకు చిన్నప్పటి నుంచి రాజకీయాలతో అతి దగ్గర సంబంధం ఉంది. నేను తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ నందమూరి తారక రామారావు గారిని అతి చిన్నప్పడే దూరంగా చూడడం జరిగింది. తెలుగుదేశం పార్టీ 1983 సంవత్సరం నుంచి ప్రారంభించిన దశ నుండి భారతీయ జనతా పార్టీ ఒక సరైన మిత్రుడిగా ఈ పార్టీతో ఎప్పటికప్పుడు ఉంటూ వచ్చింది. 1984వ సంవత్సరంలో మన ప్రజాస్వామ్యంపై ఒక కుట్ర జరిగింది. ఆ కుట్రలో నిలబడి భారతీయ జనతాపార్టీ ఒక క్రియాశీలక పాత్రను పోషించిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. ఆ రోజు మా నాన్నగారు ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీకి అధ్యక్షులుగా ఉండే వారు. శ్రీ ఎం. వెంకయ్య నాయుడు గారు అందరూ కలిసి బెంగళూరు వెళ్ళి ప్రధానమైన పాత్ర పోషించారని ఈ రోజుకీ మా ఇంట్లో కథలు చెబుతూ ఉంటారు. అప్పటి నుంచి ప్రారంభమైంది మా మిత్రుత్వం. 1989లో తెలుగుదేశం పార్టీ ఓటమి పాలైతే, ఆ నెపాన్ని భారతీయ జనతా పార్టీ కారణంగా ఓడిపోయామని చెప్పడం జరిగింది. 1999వ సంవత్సరంలో శ్రీ అటల్ బిహారీ వాజ్‌పేయి గారి కాలంలో అద్భుతమైన వాతావరణం నెలకొని ఉంది. ఆ సమయంలోనే రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్నో అద్భుతమైన సంస్కరణలను తీసుకురావడం జరిగింది. 2004వ సంవత్సరంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం ఓడిపోతే అప్పుడు కూడా భారతీయ జనతా పార్టీపైనే నెపం

తోసి బయటకి రావడం జరిగింది. మళ్లీ నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ భారతీయ జనతా పార్టీతో ఎప్పుడూ కలసి నడవనని చెప్పడం జరిగింది. మాకు చాలా బాధ వేసింది. సరైన మిత్రుడిగా ఉండడం జరిగింది. అయినా 2014లో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీతో మళ్ళీ కలిసి రావడం జరిగింది. అన్నింటికి కూడా అంటే ఎప్పుడెప్పుడు భారతీయ జనతా పార్టీతో కలిసి ఉన్నారో అప్పుడప్పుడు రాష్ట్రం, దేశానికి సంబంధించిన పురోభివృద్ధి శర వేగంగా సాగిందనే విషయం ఇక్కడ ఉండే సభ్యులందరికీ తెలుసు. పెద్దలు కరణం బలరామ కృష్ణమూర్తి గారికి, శతృచర్ల విజయరామరాజు గారికి, పప్పల చలపతి రావు గారికి, అప్పటి నుంచి ఉన్న సభ్యులందరికీ కూడా మా యొక్క ధర్మం ఏ విధంగా పాటించామని తెలుసు. ఈ రోజు బయటికి వచ్చాము కానీ, శత్రువులమైతే కాదు. రాజకీయాల్లో శత్రువులు ఎవరూ ఉండరని మా పెద్దలందరూ చెప్పారు. అందరూ ప్రత్యర్థులే కానీ, శతృవులు కారు. శతృవులని అనుకోవడం శతృ, మిత్ర భేధాలు అన్నీ తమిళనాడు రాష్ట్రంలోనే...

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మాధవ్ గారు మీకు ఇచ్చిన సమయంలో మూడు నిముషాలు అయిపోయింది.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, కానీ, ఈ రోజే ఆ యొక్క ప్రకటన జరిగిన సందర్భం కాబట్టి, ఈ విషయం జరిగింది కాబట్టి, చెప్పాల్సిన అవసరమైతే ఉంది.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మీరు విభజన చట్టం మీద చర్చలోకి రండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** దీని గురించిన ఐదు నిముషాల సమయం కేటాయించడం జరిగింది. తరువాత విజభన చట్టం మీద చర్చలోకి రావాలనుకుంటున్నాను. వీటిని చెప్పాల్సిన నేపథ్యం కూడా ఉంది. ఇటువంటి నేపథ్యం ఎందుకంటే రాజకీయాల్లో హత్యలు ఉండవు, ఆత్మ హత్యలే ఉంటాయని చెప్పి పెద్దలు అన్నారు. ఎందుకంటే నిజంగానే నాయొక్క అభిప్రాయం ఆత్మహత్యా సదృశ్యం పాలక పక్షానికి సంబంధించింది.

ఈ రోజు వరకు అనేక మంది పెద్దలు కేంద్రం వద్దకు వెళ్లి అనేక మందిని కలవడం జరిగింది. మా పెద్దలు శ్రీ ఎం.వెంకయ్య నాయుడు గారు కానీ, అనేక మంది మంత్రులు చూపించిన చొరవ గుర్తు లేదా అని ఈ సందర్భంగా అడుగుతున్నాను. నిన్న మొన్న కూడా వారందరూ వెళ్ళడం జరిగింది. అందరూ హత్తుకుని, ఈ పని చేయలేదని చెప్పండి. మన మంత్రులు తమ రాజీనామాలను ఇవ్వడానికి ప్రధాన మంత్రి దగ్గరకు వెళితే ఆయన వారిని అడిగారు. ఎంత అన్యాయం, ఎప్పుడు మీకు ఏమి చేయలేదో చెప్పండి అనే మాట అడిగారు. కానీ, తప్పదు సార్ అనేక రాజకీయ కారణాలు, చెప్పలేని కారణాలున్నాయని వారు తమ రాజీనామా పత్రాలు సమర్పించిన సందర్భంలో చెప్పిన విషయాలను కూడా మనం ఒకసారి గుర్తు చేసుకోవాలి. పెద్దలు దేవినేని ఉమామహేశ్వరరావు గారికి కూడా ఈ విషయాలన్నీ తెలుసు. వారు నితిన్ గడ్కరీ గారి దగ్గరకు ఎప్పుడు వెళ్లినా కూడా అన్ని రకాల అవకాశాలు కల్పించి, రాష్ట్రానికి సంబంధించి అనేక రకాలయినటువంటి పనులు చేశారు. అటువంటి ఒక నిర్మాణాత్మక పాత్ర పోషించామని ఈ

సందర్భంగా తెలియచేయడం కోసమే ఈ విషయాన్ని తమ ద్వారా అందరికీ తెలియజేస్తున్నాను. ఇలాంటివి చేసినా కూడా మాపై నెపాన్ని వేయడం సరైన పద్ధతి కాదని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

నిన్న ప్రముఖ ప్రొఫెసర్ సతీష్ ధావన్ గారి పుట్టిన రోజు జరిగింది. ఆయన మనకు మిసైల్, స్పేస్ టెక్నాలజికి సంబంధించిన ఆద్యుడు. ఆయన రోహిణి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టాడు. ఆయన ఇస్రో ఛైర్మన్‌గా కూడా ఉన్నారు. 1979వ సంవత్సరంలో రోహిణి ఉపగ్రహాన్ని లాంచ్ చేసే సమయంలో అబ్దుల్ కలాం గారు రోహిణి మిషన్‌కి నాయకుడు. రోహిణి అంతరిక్షంలోకి పంపించే సమయంలో బటన్ నొక్కబోయే ముందు కంప్యూటర్ ఫెయిల్ అయితే దానిని మాన్యువల్ మోడ్‌లో అబ్దుల్ కలాం గారు చొరవ చూపించి ముందుకు వెళ్లారు. అయితే ఆ మిషన్ ఫెయిల్ అయ్యింది. చాలా భయపడిపోయి ఎవరైనా నన్ను ఏమైనా అంటారేమోనని భయపడిపోయారు. అబ్దుల్ కలాం గారు దాని సక్సెస్‌లో ఏమి చెప్పారంటే, ప్రొఫెసర్ సతీష్ ధావన్ గారు ఆరోజు చూపించిన చొరవ కాకుండా, ఆరోజు ఆయన మాటల కారణంగా ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానని చెప్పడం జరిగింది. ఆరోజున ఆయన ఏం చెప్పారంటే, ఆరోజు ప్రెస్ కాన్ఫరెన్సుకు భయపడుతూ వెళ్లిన అబ్దుల్ కలాం గారి వెన్ను తట్టి, రోహిణి స్పేస్ మిషన్ ఏదైతే ఉందో దాని సక్సెస్ అంతటికీ అబ్దుల్ కలామే కారణం అని చెప్పారు. అంతకు ముందు అది ఫెయిల్ అయిందో అది నా కారణంగా జరిగిందని **failure is mine, success is yours** అని ప్రోత్సహించిన కారణంగా అబ్దుల్ కలాం గారు అంత పేరు ప్రఖ్యాతులను సంపాదించి, దేశంలోనే అగ్రభాగాన ఉండడం జరిగింది. నేను ఇది ఎందుకు చెబుతున్నానంటే మనకు ఏదైనా తొట్రుపాటు కలిగినప్పుడు ప్రక్కవాళ్ళపై నెపం వేయకుండా మనం సావధానంగా ఆలోచించి ముందుకు వెళితే చాలావరకు సమస్యలు పరిష్కరించబడతాయని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. మేము విభజన చట్టంలో ఇచ్చిన హామీలకు ఏమీ ఇచ్చారనే మాటకు సంబంధించి చూసినట్లయితే ....ఇచ్చింది కొంత, ఇవ్వాల్సింది కొండంత, ఇస్తామంతా, దానికీ ఉంటుంది కేంద్రం మెండుగా అండా, దండాగా ఉంటుందని చెప్పి, మీకు అపోహలు రావడం దండగ అని చెప్పి రాష్ట్ర అధికార పార్టీకి సంబంధించిన సభ్యులకు తెలియచేస్తూ, తప్పకుండా అండదండగా ఉంటామని ఈ సందర్భంగా తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, మొదటి విషయం ఏమిటంటే స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ఈ రోజు వరకు రాష్ట్రంలో ఏ రాష్ట్రానికి జరగని అభివృద్ధి ఈ రాష్ట్రానికి జరిగిందనేది వాస్తవం. ఈ వాస్తవాన్ని దాచిపుచ్చేది కాదు. స్వయంగా మన ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ డిపార్టుమెంట్ వెబ్‌సైట్‌లోనే ఈ విషయాలన్నింటిని చాలా స్పష్టంగా చెప్పడం జరిగింది. **Central Grants-in-aids** లో ఈ రాష్ట్రానికి 2013-14కు సంబంధించిన 58 శాతం ఉమ్మడి రాష్ట్రంలో ఉందో, దానిలో భాగంగానే రూ.5,215 కోట్లు ఈ రాష్ట్రానికి వస్తే **Grants-in-aid**లో ఈ నాలుగు సంవత్సరాల్లో రూ.1,55,000 కోట్లు ఏవైతే ఉన్నాయో అవి ఏ రాష్ట్రానికీ ఇవ్వని విధంగా మన రాష్ట్రానికే కేంద్రం నిధులను ఇవ్వడం జరిగింది. ఈ విధంగా నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం కాదా? అని అడుగుతున్నాను. అసలు మనకు ఉండే భూభాగం ఎంత? దానికి గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ ఇంత ఎక్కువ ఇవ్వడానికి గల కారణం కేంద్రప్రభుత్వం కాదా అని ఈ సందర్భంగా తమ

ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. కేవలం ఇదే విషయం కాదు, అలాగే శ్రీ నారా లోకేష్ గారు ఇక్కడే ఉన్నారు. ఆయన పంచాయతీ రాజ్ శాఖా మంత్రి కూడా. అన్ని వ్యవస్థలకు కేంద్రం మిగతా రాష్ట్రాలకు పోకుండా, మన రాష్ట్రానికి సహకారం చేయడం కారణంగానే ఈ రాష్ట్రం ముందుకు వెళ్ళింది. దీనికి మేము ఏం చేశామని చెప్పడం లేదు. ముఖ్యమంత్రి గారు సభలో మాట్లాడుతూ అన్నీ మేము చేశామని చెప్పారు. మేము అనేది ఏమిటంటే అన్నీ మనం కలిసి చేశామని చెబుతున్నాను. అనంతపురం జిల్లాలో వచ్చిన కియా మోటార్స్ గానీ...

**మిస్టర్ డిప్యూటి చైర్మన్:** మాధవ్ గారు ఒక్క నిముషం ఆగండీ...

**శ్రీ డొక్కా మాణిక్య వరప్రసాద్:** అధ్యక్షా, మాధవ్‌గారు చెప్పిన వాటిల్లో మన రాష్ట్రానికి ఇచ్చారా, మొత్తం దేశానికి ఇచ్చారా? గ్రాంట్‌ఇన్ ఎయిడ్ గానీ, మునిసిపాలిటీలకు సంబంధించినవి కేవలం మన రాష్ట్రానికే కాదు, దేశం మొత్తానికి ఇచ్చారు. ఇక్కడ సమస్య ఏమిటంటే మన రాష్ట్రానికే విభజన జరిగింది, క్రొత్తగా చట్టం వచ్చింది, క్రొత్త రాష్ట్రం ఏర్పడింది. ఈ రాష్ట్రానికి లోటు బడ్జెట్ ఉంది, ఈ రాష్ట్రానికి అనేక ఇబ్బందులు ఉన్నాయి, రాష్ట్రానికి అనేక ఇన్‌స్టిట్యూషన్లు లేవు, కేంద్ర నుంచి ప్రత్యేక హోదా రావాలి, ఇలాంటి సమస్యలన్నింటి పైన ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో మన రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజల తరఫున ఆయన, ఇతర మంత్రులు కేంద్రం చుట్టూ తిరిగి కృషి చేస్తుంటే ఆ విషయాలపైన మీ సమాధానం చెప్పకుండా ఉంటే ఎలా? ఈ రాష్ట్రంలోని ఐదుకోట్ల మంది ప్రజలను, ఒక రాజ్యాంగహక్కును కాలరాసి, మళ్ళీ మేము అవి ఇచ్చాం, ఇవి ఇచ్చామని మీరు చెబుతున్నారు. ఏం అన్ని రాష్ట్రాలకు ఇచ్చినట్లుగానే మన రాష్ట్రానికి కూడా ఇచ్చారు గానీ, ప్రత్యేకంగా అంటూ ఏమీ ఇవ్వలేదుగా. ఈరోజున కేంద్ర ప్రభుత్వపు **un-constitutional behaviour** మనకు కనిపిస్తోంది. ఈ రోజున కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేకంగా పనిచేస్తోంది. కాబట్టి, ఐదు కోట్ల ప్రజలు మిమ్మల్ని ఈ విషయాలపై నిలదీస్తున్నారు. ఈ రోజున ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం నుంచి వైదొలిగామంటే దానికి గల కారణాలు ఏమిటో ఒకసారి మీరందరూ ఆలోచించండి. అందువల్ల, మాధవ్‌గారు ఈ రాష్ట్రానికి ఏమి చేశారో, చెప్పండి. ఈ రాష్ట్రం ఇబ్బందుల్లో ఉంది. దానికి ఏం చేశారో చెప్పండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, ప్రత్యేకించి ఒక్క రాష్ట్రానికి చేయడానికి కుదరదు. అన్ని రాష్ట్రాలతోపాటుగా మన రాష్ట్రానికి కూడా చేయడం జరిగింది. ఒక రాష్ట్రానికే ప్రత్యేకంగా ఏమీ చేయలేదు. ఆ విషయం అందరికీ తెలుసు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాలను సమానంగా చూసినట్లుగానే, కేంద్రం కూడా అలానే చూస్తుంది. కొంత ఎక్కువ ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని చూస్తుందనే విషయాన్ని తెలియజేయడం కోసం ఈ విషయాలు చెబుతున్నాను. Central funds in Grant in aid received in the last 5 years, (From 2014-15 to 2018-19) రూ1,55,000 కోట్లు This is much higher than any other State in India అనే విషయం తెలియజేయడం కోసం ఆ విషయం చెప్పడం జరిగింది. కేవలం గ్రాంట్ ఇన్ ఎయిడ్స్‌లో రూ.1,55,000 కోట్లు ఇవ్వడం అబద్ధమా అని చెప్పమంటున్నాను. అధ్యక్షా, కేవలం ఇదే అని కాదు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కాదు, మిగతావి కూడా చెప్పాను.

దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ నిధులు ఇచ్చింది. పవర్ సెక్టార్ రిఫార్మ్స్ గానీ, ఇన్‌స్టాల్డ్ కెపాసిటీ 1290 మెగావాట్స్ నుంచి 659 మెగావాట్స్ గానీ, పంచాయతీ రాజ్ వ్యవస్థలో సీసీ రోడ్లు నిర్మించామనేది, అలాగే వాటర్ వే, ఎయిర్ వే, రోడ్డు వే, సీ వే వీటి నిర్మాణాలన్నింటిలో కేంద్ర ప్రభుత్వ సహకారం లేదా? అని అడుగుతున్నాను. వీటిని నిర్మించాలంటే ఒకరి వల్ల కాదు, అటు కేంద్రమయినా, రాష్ట్రమయినా ఇద్దరూ కలిసి వెళితేనే అన్ని సమస్యలు నెరవేరుతాయి. ఆ విధంగానే ఇవన్నీ నెరవేరాయి. ఈ రోజు విభజన జరిగిన ఆంధ్రప్రదేశ్‌లో ఈ రోజు సందర్భం వచ్చింది కాబట్టి, తప్పకుండా అడగాలి. గతంలో స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి, మన రాష్ట్రం 1953వ సంవత్సరంలో ఏర్పడిన నాటి నుంచి ఈ ప్రాంతానికి ఒనగూరిన ప్రాజెక్టులు ఏమిటి? తప్పకుండా హైదరాబాదు ప్రస్తావన చేయకుండా ఉండలేను. ఈ రోజు హైదరాబాదు కారణంగానే ఈ ప్రాంతం ఎడారి అంటే వ్యవస్థలో కాదు.

మ.01.20

అనేక ఇన్‌స్టిట్యూషన్స్ ఉంటే అన్ని ఇన్‌స్టిట్యూషన్స్ హైదరాబాదులోనే పెట్టారు. ముఖ్యమంత్రి గారు సభలో కూడా చెప్పడం జరిగింది. నేను హైదరాబాదును అద్భుతంగా నిర్మించానని చెప్పారు. అద్భుతంగా ఫ్లైఓవర్లు కట్టించానని, రోడ్లు వేయించానని, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుని కట్టించానని చెప్పారు. ఆ విషయాన్ని మేం కూడా ఒప్పుకుంటున్నాము. అద్భుతంగా ఐ.టి. ప్రగతిని తీసుకువచ్చారు. అనేక రకాల రోడ్లు వేశారు. దాంట్లో ఎవ్వరూ విభేదించడం లేదు. తప్పకుండా హైదరాబాదుకు అన్నీ చేశారు. అదే ఈ రాష్ట్రానికి శాపంలా మారింది. ఇది నిజం. ఎవ్వరు నమ్మినా, నమ్మకపోయినా ఇది నిజం. నాకు తెలియక అడుగుతున్నాను. నేను విశాఖపట్నంలో పుట్టి పెరిగాను. ఈ రాష్ట్రంలో, దేశంలో అన్ని ప్రాంతాల్లో తిరిగాను. కానీ, ఆయన పాలనా సమయంలో మా విశాఖపట్నానికి వచ్చిన ప్రాజెక్టు ఏమిటని అడుగుతున్నాను. విజయవాడకు వచ్చిన ప్రాజెక్టు ఏమిటని అడుగుతున్నాను. తిరుపతికి వచ్చిన ప్రాజెక్టు ఏమిటని అడుగుతున్నాను. రాయలసీమకు జరిగిన ప్రగతి ఏమిటని అడుగుతున్నాను. తప్పకుండా, హైదరాబాదు కేంద్రంగా జరిగిన ప్రగతి ఏదైతే ఉందో, దాని కారణంగానే ఈ ప్రాంతానికి సంబంధించిన అనేక అవసరాలు రాకుండా పోయాయనేది కూడా నిజం అధ్యక్షా.

ఆ విధంగా మన ప్రాంతానికి ఇన్‌స్టిట్యూట్స్ రాలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అనేక రాష్ట్రాలు విభజించబడ్డాయి. ఏ రాష్ట్రానికీ రాని విధంగా ఈ రాష్ట్రానికి వసతులు రావడంతోబాటు, అనేక రకాల ఇన్‌స్టిట్యూషన్స్ ఈ రాష్ట్రానికి వచ్చాయనేది పచ్చి నిజం. ఆ రకంగా విభజన చట్టంలో 13వ షెడ్యూల్ కాకుండా, అందులో లేని అంశాలు అనేకం రాష్ట్రానికి రావడం జరిగింది. 10 వ షెడ్యూల్‌కు సంబంధించిన, ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు సంబంధించిన 13 అంశాలు ఈ రోజున రావడం జరిగింది. మూడున్నర సంవత్సరాల్లోనే ఇన్ని సంస్థలు వచ్చాయంటే, ఇంకా బిల్డింగ్స్ కట్టారా, లేదా అనే మాట కూడా మాట్లాడుతున్నారు. ఈ సందర్భంగా తప్పకుండా అందరూ తెలుసుకోవాలి. మేం కూడా అనుకున్నాము. నిజమే కదా! ఐఐటి బిల్డింగ్ రాలేదు, ఐఐఎం బిల్డింగ్ రాలేదు. ఇందాక గౌరవ సభ్యులు చెప్పినట్లు తాడేపల్లిగూడెం, ఎన్ఐటి క్లాసులు వాసవి ఇంజనీరింగ్ కాలేజీలో జరుగుతున్నాయి.

వారందరూ ఇబ్బంది పడుతున్నారు. నిజంగానే 1600 మంది విద్యార్థుల్లో, 480 మంది సీట్లు తెచ్చుకున్నారు. 23 ఎన్ఐటిలు దేశవ్యాప్తంగా ఉంటే, ఎక్కువ మంది విద్యార్థులు తాడేపల్లిగూడెం, ఎన్ఐటిలో చేరారు. ఎందుకంటే, ఇక్కడ ఇంజనీరింగ్ విద్యపై ప్రాధాన్యత ఆ విధంగా ఉంది. ఇంజనీరింగ్ విద్యకు ప్రాధాన్యత తీసుకువచ్చింది శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారేనని చెబుతున్నాను. ఆ విధంగా తీసుకురావడం వల్ల ఎక్కువ మంది చేరారు. అయితే, ఎన్ఐటిలకు సంబంధించిన అంశం ఎందుకు ముందుకు వెళ్లలేదని అడుగుతున్నాను. ఈ రోజు మాకు ఎందుకు ఎక్కువ సమయం కావాలని అడుగుతున్నానంటే, ఈ నిజాలు అందరికీ తెలియాలి. తప్పకుండా, ఈ నిజాలపైన చర్చ కూడా జరగాలి.

మొన్న జరిగిన గవర్నర్ గారి ప్రసంగంలో గాని, బడ్జెట్ ప్రసంగంలో గాని అంతా దీని చుట్టూనే తిరిగింది. అందువల్ల, ఇది ఈ రోజున అతి కీలకమైన అంశం. అందరూ మాపైన ఆరోపణలు సంధిస్తున్న సమయంలో అంశాల వారీగా మాట్లాడే అవకాశం మాకు రావాలి, అంశాల వారీగా మాక్కూడా జవాబు కావాలని ఈ సందర్భంలో అడుగుతున్నాము. తాడేపల్లిగూడెంలో ఎన్ఐటి ఏర్పడింది. 2015లో అక్కడ శంకుస్థాపన జరిగి క్లాసులు ప్రారంభం కాలేదా? ఈ ఇన్స్టిట్యూట్స్ యొక్క నేపథ్యం ఏమిటంటే, ఇన్స్టిట్యూట్స్ అన్నింటిలో కూడా ప్రొఫెషనల్స్ బయటకు రావాలి. దేశ, విదేశాలకు పనికొచ్చే అనేకమంది ప్రొఫెనల్స్ బయటకు రావాలనేదే వాటి ఏర్పాటు ముఖ్య ఉద్దేశం. ఎప్పుడైతే ఫౌండేషన్ స్టోన్ పడిందో, అప్పుడే పక్కనుండే తాత్కాలిక భవనాల్లో అనేక రకాల వసతులు కల్పించి క్లాసులు ప్రారంభించామనేది నిజం. అది చెయ్యడమే కాకుండా, అక్కడుండే సిబ్బందిని తీసుకువచ్చి, ఆ తాత్కాలిక సిబ్బందికి, తాత్కాలిక నిర్మాణాలకు పూర్తి స్థాయిలో డబ్బుల్ని కేంద్రమే ఇచ్చి నడిపిస్తోంది. ఆ విధంగా కేంద్రం సాయం చేస్తోంది. ఎన్ఐటికి సంబంధించిన పనులు ఎందుకు ఆగిపోయాయనేది ఈ సందర్భంగా తెలియజేయాలి. దానికి కాంపౌండ్‌వాల్ నిర్మించి, గేట్లు పెట్టిన తరువాత అక్కడ మొదటి టెండరు వెళ్లాల్సిన అవసరముంది. సగం గోడ కట్టిన తరువాత మధ్యలో పని ఆగిపోయింది. కాంట్రాక్టరు రేటు చాలా తక్కువగా కోట్ చేశారు. అతను ఎవరనేది అందరికీ తెలుసు. ఆ కాంట్రాక్టరు మీద చర్యలు తీసుకోమని చెబితే, దానికి ఒక సంవత్సరం పట్టింది. ఇది నిజమా, కాదా అని అడుగుతున్నాను. ఒక సంవత్సరం తరువాత, ఆ కాంట్రాక్టరుపై చర్యలు తీసుకున్న తరువాత కాంపౌండ్ వాల్ నిర్మాణం ఇప్పుడే పూర్తయ్యింది.

**డా.ఎ.ఎస్. రామకృష్ణ:** 4 సంవత్సరాలు అయిపోయింది.(మైకు లేదు)

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** 4 సంవత్సరాలు అయినా, కాంపౌండ్‌వాల్ కట్టలేదంటున్నారు. నేను ఈ రోజున ఛాలెంజ్ చేస్తున్నాను. కట్టారో, కట్టలేదో నాక్కూడా చెప్పండి. నేను కూడా తెలుసుకోవాలని అనుకుంటున్నాను. అనేక విషయాలు తెలుసుకోవాల్సిన సందర్భం ఇది. ప్రజలు కూడా ఇది గమనిస్తున్నారు. ఇవన్నీ కూడా ఇప్పుడు మాట్లాడాల్సిన అవసరముంది అధ్యక్షా. సభలో ఇవన్నీ మాట్లాడితే ప్రజలు తెలుసుకుంటారు. ఒక సైడే మాపైన దాడి చేసి, అనేక

రకాల మాధ్యమాల్లో మాపైన ఏదైతే కుట్రపూరిత వ్యవహారం నడుస్తున్నదో, ఇక్కడే తేల్చుకోవాల్సిన సందర్భం కనుకనే చెబుతున్నాను.

అలాగే, ఎన్ఐటి విషయంలో అదే జరిగింది. ఐఐఎం విషయంలో నాకు గౌరవ హెచ్ఆర్డి మినిష్టర్ గారు చెప్పారు. బిల్డింగ్స్ ఇంకా కట్టలేదు, మీరేమంటారని అడిగారు. నేను నిజంగానే ఆలోచించాను. ఐఐఎం దగ్గరకు అంటే గంభీరం దగ్గర సమీర్ అని ఒక prestigious project, ఎలక్ట్రానిక్ ఎక్విప్మెంట్ టెస్టు చేసుకునే ఒక అద్భుతమైన కట్టడం మన రాష్ట్రానికి రావడం జరిగింది. మొన్ననే నేను అక్కడికి వెళ్లడం జరిగింది. చూస్తే అది అద్భుతమైన ల్యాబ్. దేశంలో ఎక్కడా లేనటువంటి ఆ సమీర్ అనే ల్యాబ్ మన రాష్ట్రానికి వచ్చింది. సుమారు పదివేల మంది ఎలక్ట్రానిక్స్లో ఇంజనీరింగ్ చదివిన వారికి ఉద్యోగాలిచ్చే అవకాశం ఉంది. దాన్ని సందర్శించడం జరిగింది. పూర్తి స్థాయిలో అది అందుబాటులోకి రావాలంటే ఇంకో సంవత్సరం పడుతుందని చెప్పడం జరిగింది. పక్కనే ఈ ఫిషింగ్కు సంబంధించిన ఎక్స్పోర్ట్ ఇన్స్పెక్షన్ ఏజెన్సీకి సంబంధించిన బిల్డింగ్ కూడా పూర్తయ్యింది. విభజన చట్టంలో లేని అంశాలైనప్పటికీ, రెండూ రాష్ట్రానికి రావడం జరిగింది.

పక్కనే ఐఐఎం ఉంది. ఐఐఎం కట్టిన తరువాత, గోడ సగంలో ఆగిపోయింది. తరువాత కలెక్టర్ గారిని ఏమయ్యిందని అడిగాము. డైరెక్టర్ గారు ఫోన్ చేసి చెప్పిందేమంటే – రాష్ట్ర ప్రభుత్వం మాకు ఒక జి.ఓ. ఇవ్వాలి, జిల్లా కలెక్టర్ గారు, ఆ ల్యాండ్ని ఐఐఎంకు ట్రాన్స్ఫర్ చేసిన తరువాత టెండర్లు పిలుస్తాము, ఇంకా ఆ జీఓలు ఇవ్వలేదని చెప్పారు. వెంటనే కలెక్టర్ గారిని అడిగాము. వెంటనే జిఓలు ఇస్తున్నామని చెప్పి మార్చి, 09, 2018లో ఆ ల్యాండ్ ట్రాన్స్ఫర్ అవ్వడం జరిగింది. ఐఐఎంకు ల్యాండ్ ట్రాన్స్ఫర్ జరిగిన తరువాత వెంటనే మొదటి దశలో భవనాలు కట్టుకునే అవకాశం లభించింది. నిజంగానే అడుగుతున్నాను. మన గౌరవ హెచ్.ఆర్.డి. మినిష్టర్ శ్రీ గంటా శ్రీనివాసరావు గారు సభలోనే చెప్పడం జరిగింది. కనుక, ఆ విధంగా చేసే అవకాశం మాకు వచ్చింది. ఎందుకు లేట్ అయ్యిందని రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుతున్నాను. కేవలం ఐఐఎం కాదు. ఐఐటి, తిరుపతి గాని. పక్కనే ఉన్న మంగళగిరి ఎయిమ్స్కు మొన్ననే వెళ్లడం జరిగింది. స్వయంగా తెలుగుదేశం వెబ్సైట్లో రాయడం జరిగింది. రాష్ట్రానికి ఎయిమ్స్ వచ్చింది గాని, ఈ రోజు వరకు నిధులు రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. నిజంగా ఇవ్వలేదని నేను కూడా భావించాను. అక్కడ చూస్తే, 17 భవనాలు శరవేగంగా, అద్భుతంగా, నూతన టెక్నాలజీతో కడుతున్నారు. మొత్తం రూ.800 కోట్లు అయితే, మొదటి టెండరులో రూ.275 కోట్లు, రెండవ టెండరులో రూ.558 కోట్లతో రెండవ ఫేజ్ టెండర్ల ప్రక్రియ కూడా అయిపోయింది. అలాగే, విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో తాత్కాలిక భవనాల కోసం రూ.6 కోట్లు ఇచ్చి క్లాసులు ప్రారంభించడానికి 50 సీట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఆ విధంగా అద్భుతమైన మెడికల్ కాలేజీతోబాటు, అద్భుతమైన హాస్పిటల్ కూడా ఢిల్లీ, ఎయిమ్స్ తరహాలో ఇక్కడకు రావడం వల్ల కేవలం ఆంధ్రప్రదేశ్కు మాత్రమే కాదు, పక్కనున్న రాష్ట్రాలకు కూడా అది కల్పతరువుగా ఉంటుంది. ఆ విధంగా

తీసుకువచ్చాము. ఆ భవనాల నిర్మాణం జరుగుతోంది. పనులు జరుగుతున్నా, జరగడం లేదని మాట్లాడి ప్రజలకు ఏవైతే అసత్యాలు చెపుతున్నారో, నిజంగా ఈ సందర్భంగా తెలుసుకోవాలి.

కేవలం ఇవి మాత్రమే కాదు. నిన్న మేము లాం ఫాంకు వెళ్లడం జరిగింది. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంకు సంబంధించి రాష్ట్ర విభజన సమయంలో ఎవరైనా దగాపడ్డారు, అర్ధరాత్రి బయటకు తరిమివేయబడ్డారంటే చాలా మంది సభ్యులు మాట్లాడొచ్చు, కట్టుబట్టలతో బయటకు వచ్చామని చెప్పవచ్చు. కట్టుబట్టలతో వచ్చిన వైనం ఎక్కడైనా చూడాలంటే మన పక్కనే ఉన్న లాంఫాంలో ఉన్న ఎన్జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఉద్యోగుల్ని చూడాలి. ఎంత దారుణంగా హైదరాబాదులో ఉన్న తెలంగాణా ఉద్యోగులు రాత్రికి రాత్రే ఖాళీ చేసి వెళ్లిపోమంటే, అక్కడి సిబ్బంది ఎక్కడికి వెళతారు? వారంతా ఇక్కడకు రావడం జరిగింది. ఆ రోజున రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా మనం అభినందించాలి. ఇక్కడే ఉండి, లాంఫాంలో వెటర్నరీ హాస్పిటల్‌కు సంబంధించిన 500 ఎకరాల స్థలంలో తాత్కాలిక భవనాలు పెట్టుకోమన్నారు. వారంతా ఇక్కడకు రావడం జరిగింది. వ్యవసాయ విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత కల్పిస్తామని విభజన చట్టంలోనే చెప్పడం జరిగింది. ఈ విభజన చట్టంలో ఉందని చూపిస్తే, తప్పకుండా ఇస్తామని ఆ రోజు రాధామోహన్‌సింగ్ గారు మాటివ్వడమే కాకుండా, తప్పకుండా రూ.10,000 కోట్లు ఇచ్చి, తాత్కాలిక భవంతులు కట్టడానికి అవకాశమిచ్చారు. ఆ విధంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ నిన్న వెళ్లి చూస్తే, లాంఫాంలో అద్భుతంగా నడుస్తోంది. అక్కడుండే వైస్‌ఛాన్సలర్ డా.వి.దామోదర్ నాయుడు గారు గాని, రిజిస్ట్రార్ గారు గాని మెచ్చుకోవడం జరిగింది. సెంట్రల్ గవర్నమెంట్ మాకు రూ.135 కోట్లు ఇవ్వడం జరిగింది. మా అక్కౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇక్కడ మేము అద్భుతంగా బిల్డింగ్ కట్టబోతున్నాము. స్వయంగా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారే మా బిల్డింగ్ నమూనాకు ఆమోదం తెలిపారు, అక్కడ రెండు ట్విన్ టవర్స్ రాబోతున్నాయి, 110 ఎకరాలు మాత్రమే మాకు ఇవ్వడం జరిగింది, వ్యవసాయ అవసరాల కోసం ఉపయోగపడేలా రెండు అద్భుతమైన టవర్లు కట్టడానికి అవకాశం కలిగిందన్నారు. మొన్ననే ముఖ్యమంత్రి గారు దీన్ని ఆమోదించారు. దానికి సంబంధించిన డిపిఆర్ కూడా కేంద్రానికి వెళ్లడం జరిగింది. అప్పుడే ఎపిఐఐసి ద్వారా కన్‌స్ట్రక్షన్ శరవేగంగా కొనసాగుతోంది. బాయ్స్ అండ్ గర్ల్స్ హాస్టల్స్‌ని సందర్శించడం జరిగింది. అక్కడుండే విద్యార్థులతో కూడా మేము మాట్లాడటం జరిగింది. 4 సంవత్సరాల నుండి అక్కడ తరగతులు నడుస్తున్నాయి. ఎమ్మెస్సీ, పిహెచ్‌డికి సంబంధించిన అనేక మంది విద్యార్థులు అక్కడ చదువుతున్నారు. వారితో మాట్లాడితే మేము చాలా ఆనందంగా ఉన్నామని, కేంద్ర ప్రభుత్వం ఇతోధికంగా సహకరించడమే కాకుండా, ఈ రోజున మమ్మల్ని నిర్భాగ్యులుగా నెట్టేసినా ఆదుకున్నందుకు కేంద్ర ప్రభుత్వాన్ని అందరూ మెచ్చుకోవడం, జోహార్లు చెప్పడం జరిగింది అధ్యక్షా. నిన్ననే వారిని కలిసి ఈ రోజు ఇక్కడకు రావడం జరిగింది. ఆవిధంగా కేంద్రం చెప్పిన ప్రతి అంశం...

**డా.ఎ.ఎస్.రామకృష్ణ:** జోహార్లు అనకండి.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** జోహార్లు కాదు. ఆ విధంగా చెప్పడం జరిగింది అధ్యక్షా. అభినందనలు తెలియజేయడం జరిగింది. ఆ విధంగా చెప్పి మమ్మల్ని స్వాగతించడం జరిగింది. కేవలం ఇవి మాత్రమే కాదు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తామన్న 11 విద్యాసంస్థలకు గాను, ఇంక రెండే మిగిలాయి. సెంట్రల్ యూనివర్సిటీ, ట్రైబల్ యూనివర్సిటీ అందులో ఉన్నాయి. ట్రైబల్ యూనివర్సిటి విషయంలో తప్పకుండా మనం ఒక విషయం తెలుసుకోవాలి. ట్రైబల్ యూనివర్సిటీ ఎందుకు విజయనగరం జిల్లాకు రావడం లేదంటే రాష్ట్రపునర్విభజన చట్టంలో కేంద్రం ఒక మెలిక పెట్టింది. తెలంగాణాకు, ఆంధ్రాకు కలిపి రెండు ట్రైబల్ యూనివర్సిటిలు ఒకేసారి ప్రారంభం కావాలి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం యొక్క చొరవ కారణంగా, ప్రొ-యాక్టివ్‌నెస్ కారణంగా ఏం జరిగిందనేది ఈ సందర్భంగా చెబుతున్నాను. తప్పక చెప్పాలి. విజయనగరం దగ్గర రాష్ట్ర ప్రభుత్వం ల్యాండ్ ఇవ్వడం జరిగింది. అయితే, రెండుచోట్లా ఒకేసారి శంకుస్థాపన జరగాలని చట్టంలో రాసుంది. ఆ విధంగా మాట్లాడితే, తప్పకుండా కేంద్ర గిరిజన శాఖామంత్రి Jual Oram గారు చొరవతీసుకుని ల్యాండ్ ఎవరిస్తారో, వారికే శంకుస్థాపన చేస్తానని చెప్పడం జరిగింది. అయితే, ఆలస్యం ఎక్కడ జరిగిందంటే, రాష్ట్రంలో యూనివర్సిటీ రావాలంటే పార్లమెంటులో బిల్లు పాసవ్వాలి. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు పాసయ్యే అవకాశముంది. కానీ, దురదృష్టవశాత్తు బిల్లు పాస్ కాకుండా అడ్డుకునే ప్రయత్నం ఎవరు చేస్తున్నారో మీకే తెలియాలి. ట్రైబల్ యూనివర్సిటీ రాష్ట్రానికి తప్పకుండా వస్తుంది. ఎందుకంటే, మొన్న బడ్జెట్‌లో ప్రత్యేకంగా రూ.10 కోట్లు కేటాయించారు. ఈ యూనివర్సిటీ తప్పకుండా ప్రారంభం కావాలి. మరి రూ.10 కోట్లు ఏం సరిపోతాయి ? సరిపోవు. ప్రారంభంలో మొదట తొలి అడుగుతోనే నడక ప్రారంభమవుతుంది. 1000 కి.మీ. ప్రయాణం. ఇంకా మనకు అనేక నిధులు రావాలి, అనేక ప్రాజెక్టులు రావాలి. కానీ, ప్రారంభమంతా చాలా తక్కువతోనే ప్రారంభమవుతుంది. ఈ సందర్భంలో నేను ఒక్క విషయం తెలియజేయాలి. నేషనల్ హైవేస్‌కు సంబంధించిన విషయానికి వస్తే, ఈ రాష్ట్రానికి సుమారు రూ.1,15,000 కోట్ల మేర విలువైన ప్రాజెక్టులు వచ్చాయి. తెలుగుదేశం నాలెడ్జ్ సెంటరులో కూడా చూపించారు.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** (మైకు లేదు) రూ.4000 కోట్లు మాత్రమే ఇచ్చింది. లక్ష కోట్లు అంటే ఎట్లా ?

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** అధ్యక్షా, సభ్యులు వినాల్సిందిగా కోరుతున్నాను. రూ.1,15,000 కోట్ల..

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** (మైకు లేదు)అధ్యక్షా, సభను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఈ రోజు ఎలక్ట్రిసిటీకి సంబంధించి ఆర్‌టిఐ యాక్టు క్రింద సమాచారం తెచ్చాను. ఏ,ఏ రాష్ట్రాలకి ఎంతిచ్చారో చెబుతాను.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** సభ్యులకు అనుమతి ఇవ్వకూడదు అధ్యక్షా.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** (మైకు లేదు) ఉత్తరప్రదేశ్‌కు ఇచ్చారు, పశ్చిమ బెంగాల్‌కు ఇచ్చారు.

(అంతరాయం)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** రాజసింహులు గారూ, మీకు టైమిస్తాను కూర్చోండి.

**శ్రీ బి.ఎన్.రాజసింహులు:** (మైకు లేదు) వాస్తవాలు చెప్పండి. వాస్తవాలు వక్రీకరించొద్దు. వాస్తవంగా 24 గంటలు కరెంటు ఇచ్చింది ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలు.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** తెలంగాణాకు ఇవ్వలేదు.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** రాజసింహులు గారూ కూర్చోండి.

**శ్రీ జి.దీపక్ రెడ్డి (స్థానిక సంస్థలు – అనంతపురం):** (మైకు లేదు) అధ్యక్షా, సభ్యులు తప్పుడు సమాచారం ఇస్తున్నారు.

(సభ్యులు శ్రీ బి.ఎన్.రాజసింహులు మరియు శ్రీ జి.దీపక్ రెడ్డి గార్లచే అంతరాయం కొనసాగింది.)

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** రాజసింహులు గారూ కూర్చోండి.

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** (మైకు లేదు) మేము దాడి చేస్తున్నామని అనడం చాలా తప్పు.

మ. 1.30

**శ్రీ జి. దీపక్ రెడ్డి :** (మైక్ లేదు) మా హక్కులు అడగడం తప్పా?

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్ :** హక్కులు అడగండి. కాదని ఎవరు అన్నారు?

**శ్రీ జి. దీపక్ రెడ్డి :** (మైక్ లేదు) మొన్న జరిగిన పవన్ కల్యాణ్ సినిమాకి డైరెక్షన్ ఎవరు? ప్రొడ్యూసర్ ఎవరూ అని ప్రజలు అడుగుతున్నారు.

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మాధవ్ గారూ, కంప్లీట్ చేయండి. దీపక్ గారూ కూర్చోండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** సార్, అందరూ మాట్లాడుతుంటే ఎలా? నాకు కాస్త సమయం ఇవ్వండి. వాళ్ల వైపు నుండి అంతమంది మాట్లాడారు. నేను అభిమన్యుడిలా ఒక్కడినే నిలబడ్డాను. కాస్త కనికరం చూపించి సమయం ఎక్కువ ఇవ్వాలని కోరుతున్నాను. ఒక లక్షా పదిహేను వేల కోట్లు ఇచ్చారని సిజిఎం దగ్గర నుండి తీసుకున్న వివరాల ఆధారంగా నేను చెబుతున్నాను. తెలుగుదేశం నాలెడ్జ్ సెంటర్లో కూడా ఆ వివరాలు రాశారు. నేషనల్ హైవే ప్రకటించారంటే దాని స్థల సేకరణకు చాలా సమయం పడుతుంది, అ స్థలానికి సంబంధించి చాలా సమస్యలు ఉంటాయి. అనకాపల్లి ఆనందపురం హైవేకు సంబంధించి నేను దగ్గరగా చూశాను. అది మా ప్రాంతానికి సంబంధించినది. నేను అక్కడ ఉన్న స్కూల్లో చదివాను. అవి పూర్తి కావాలంటే అనేక స్థల వివాదాలు ఉంటాయి. వాటన్నింటినీ తీర్చుకుని పూర్తి చేయాలంటే ఎంత సమయం పడుతుందో గౌరవ సభ్యులకు తెలుసు. అటువంటిది నేషనల్ హైవేలు శరవేగంతో

పూర్తి చేస్తున్నారు. దేశంలో ఎక్కడా ఇవ్వనటువంటి నేషనల్ హైవేలను ఈ రాష్ట్రానికి ఇచ్చారు. **1/7th of total National Highways of the country were given to the State of Andhra Pradesh.** ఇది వాస్తవం. కావాలంటే ఆధారాలు చూపిస్తాము. నేషనల్ హైవే అథారిటీ దగ్గరకు వెళ్లి తెలుసుకోవచ్చు. ఆ విధంగా ఈ రాష్ట్రాన్ని ప్రత్యేకంగా పరిగణించి చేస్తుంటే దానికి అరకొర నిధులు ఇచ్చారని చెబుతున్నారు. సుమారు లక్షకోట్లు అన్నారు కదా రూ.7,000 కోట్లు ఇచ్చారు అంటే, అన్నప్రాశన రోజే ఆవకాయ తినము అధ్యక్షా. అందుకు సమయం వస్తుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి దేశంలో ఎక్కడా లేని విధంగా శరవేగంగా రోజుకు 400 కి.మీ. చొప్పున చాలా స్పీడ్‌గా పనులు జరుగుతున్నాయి. నితిన్ గడ్కరీ గారు నేషనల్ హైవేలకు ఒక అథారిటీని పెట్టి, నిధులు ఎక్కడనుండి తెస్తున్నారో కూడా నాకు అర్థం కావడం లేదని స్వయంగా అరుణ్ జైట్లీగారే అన్నారు. అనేక రకాలుగా పిపిపి మోడ్స్‌లో వీటిని సిద్ధం చేస్తున్నారు.

**శ్రీ శిద్ధా రాఘవరావు:** పిపిపి మోడ్‌లో అనేక కార్యక్రమాలు చేశాము........

**మిస్టర్ డెప్యూటి చైర్మన్:** మినిస్టర్ గారూ, మీకు సమయం ఇస్తాను. చైర్‌ను ఉద్దేశించి మాట్లాడండి. మీరిద్దరూ కాదు.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** పిపిపి మోడ్‌లో మీరు చేయని కార్యక్రమం ఏమైనా ఉందా? హైదరాబాదులో హైటెక్ సిటీని ఏ పద్ధతిలో కట్టారు? రాష్ట్రంలో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ వ్యవస్థను సుదృఢం చేసిన నాయకుడు చంద్రబాబు నాయుడు గారేనని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను. పిపిపి ద్వారానే పనులు త్వరగా పూర్తవుతాయి. కేంద్రం దగ్గర డబ్బులుంటాయా? రాష్ట్రం దగ్గర డబ్బులుంటాయా? ఉండవు అధ్యక్షా. పిపిపి విధానం ద్వారానే అనేక ప్రాజక్టులను తీసుకువచ్చాము. ఆ విధంగానే అద్భుతమైన హైవేలు, ఫ్లైఓవర్లు తయారు అవుతున్నాయి. న భూతో న భవిష్యత్ అనే విధంగా కేంద్రం రాష్ట్రానికి అనేక వనరులు, అనేక వసతులు ఇస్తున్నదని మరొకసారి తెలియచేస్తున్నాను. ముఖ్యంగా మనకు తెలియాల్సిన అంశాలు రెండే రెండు. ఆర్థిక లోటు, రెవెన్యూ లోటుకు సంబంధించిన అంశాలు ప్రస్తావిస్తాను.

(ఈ దశలో గౌరవ చైర్మన్ అధ్యక్షస్థానం వహించారు. )

**మిస్టర్ చైర్మన్:** మాధవ్ గారూ, త్వరగా ముగించండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** మా మీద ఎటువంటి విమర్శలు వస్తున్నాయో ప్రజలు కూడా తెలుసుకోవలసిన అవసరముంది. మా మీద ఎటువంటి కుట్రలు జరుగుతున్నాయో తెలుస్తుంది. అధ్యక్షా, రెవెన్యూ లోటుకు సంబంధించి రాష్ట్రానికి సుమారు రూ.16,078 కోట్లు రావాల్సిన అవసరముంది.

**మిస్టర్ చైర్మన్:** మాధవ్ గారూ, త్వరగా ముగించండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** స్పెషల్ క్యాటగిరీ స్టేటస్ కూడా విభజన చట్టంలో లేదు. వీటి గురించి సెపరేట్‌గా చర్చ చేస్తే బాగుంటుంది. విభజన చట్టంలో ఉన్న 13వ షెడ్యూల్‌తోబాటు, అన్ని అంశాలతోబాటు అతి ముఖ్యమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన 8 పాయింట్లు ఉన్నాయి. (మైక్ లేదు ) ఈ రాష్ట్రానికి తీసుకువచ్చేవాటిపై మా చిత్తశుద్ధిని శంకిస్తున్నారు అధ్యక్షా.

**మిస్టర్ ఛైర్మన్ :** మాధవ్ గారు, కుర్చోండి**.** **Nothing will go on record without my permission.** చిక్కాల రామచంద్రరావు గారూ మాట్లాడండి.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** ఒక్క నిముషం అధ్యక్షా. దుగరాజపట్నం పోర్టు గురించి నేనే స్వయంగా వెళ్లి నితిన్ గడ్కరీ గారిని అడగడం జరిగింది. ఆల్టర్నేటివ్ చూపించమని అడిగారు. అయితే రామాయపట్నం చూపిస్తే తప్పకుండా ముందుకు వెళ్లడానికి అవకాశముంటుంది. అయితే, ఈ రోజుకీ దుగరాజపట్నం పోర్టుకు అభ్యంతరాలు లేకపోతే అక్కడే శంకుస్థాపన చేయడానికి నాకు ఎటువంటి అభ్యంతరాలు లేవు అని వారు అన్నారు. రెండవ విషయమేమంటే, విశాఖపట్నం రైల్వే జోన్ కల సాకారం చేసే పూర్తి బాధ్యతను కేంద్రం తీసుకున్నది. ఆ ప్రాంతవాసిగా నేను చెబుతున్నాను. గత రెండు దశాబ్దాలుగా విశాఖ రైల్వే జోన్ కోసం పోరాటం చేసిన వ్యక్తిగా చెబుతున్నాను. మొదటి కేబినెట్ మీటింగ్‌లోనే వెంకయ్యనాయుడుగారు, హరిబాబు గారు మాట్లాడారు. ఈనాడు అది చాలాముఖ్యం.

**మిస్టర్ ఛైర్మన్:** కూర్చోండి. చాలా సమయం అయింది.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** (మైక్ లేదు) ఇక్కడ ముఖ్యమంత్రిగారు కూడా ఉన్నారు. ఈ విషయం కూడా వారి దృష్టికి తీసుకురావాలి. ఆనాడు 2003వ సంవత్సరంలో మా ప్రాంతంలో గొప్ప నేత ఎర్రంనాయుడు గారు, మాకు అత్యంత ఇష్టమైన వ్యక్తి, రైల్వే బోర్డు మెంబరుగా ఉన్నారు. ఆనాడు ఒక అద్భుతమైన అవకాశం వచ్చింది. రైల్వే జోన్ కావాలంటే వచ్చేది.

**మిస్టర్ ఛైర్మన్:** మీరు ఒక్కరే అరగంట సేపు మాట్లాడితే ఎలా ?

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** (మైక్ లేదు) అధ్యక్షా, వారందరూ నా మీద అన్ని బాణాలు వేస్తే నేను ఒక్కడినే. నాకు కొంత మాట్లాడడానికి అవకాశం ఇవ్వండి. సమాధానం చెప్పాలి కదా. 2003వ సంవత్సరంలో రైల్వే జోన్ తీసుకురాగలిగే సువర్ణ అవకాశాన్ని మనం కోల్పోయాము. ఈనాడు రైల్వే జోన్ వచ్చేవిధంగా తప్పకుండా అన్ని అవకాశాలు పరిశీలించి త్వరలోనే దానిని తీసుకురాగలుగుతామనే నమ్మకం నాకు ఉంది. మనందరం కలిసి రైల్వే జోన్‌ను తీసుకురావాలి.

(అంతరాయం)

ఆనాడు వాజ్‌పేయిగారు ప్రకటన చేయవలసి వచ్చింది.

**MR. CHAIRMAN:** Nothing will go on record.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** (మైక్ లేదు) ఈనాడు మనందరం కలిసికట్టుగా పనిచేస్తే మనం అనుకున్నవన్నీ సాధించుకోగలమనే నమ్మకం నాకుంది.

**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి:** అధ్యక్షా, మాధవ్ గారు మాట్లాడుతూ, కీర్తిశేషులు ఎర్రంనాయుడు గారు సువర్ణ అవకాశాన్ని పోగొట్టారు అని అన్నారు. అంటే వచ్చే రైల్వే జోన్‌ని ఇప్పుడు లేని ఎర్రంనాయుడు గారి మీద వేసే ప్రయత్నం చేయడం చాలా దురదృష్టకరం. ఎర్రంనాయుడు గారు ఈ రాష్ట్రం కోసం, జనం కోసం బ్రతికారు, చనిపోయారు.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్ :** (మైక్ లేదు) అధ్యక్షా, నేను ఎర్రంనాయుడుగారు పోగొట్టారు అని నేను అనలేదు.

**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి:** మీరు అన్నారు. కేంద్రంలో బీజెపి అధికారంలో ఉండి, బోర్డు మెంబరు రైల్వే జోన్ తీసుకురాలేదని అంటున్నారు. కేంద్రం చేయలేనిది, కేంద్ర రైల్వే మంత్రి చేయలేనిది బోర్డు మెంబరు సువర్ణ అవకాశం పోగొట్టారని అంటున్నారు. ఎక్కడో స్వర్గంలో ఉన్న ఎర్రంనాయుడు గారి మీదకు నెట్టివేయడం పద్ధతి కాదు.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** (మైక్ లేదు) అవకాశం వచ్చిందని అన్నాను కానీ, పోగొట్టారు అని అనలేదు.

(అంతరాయం)

**మిస్టర్ చైర్మన్:** మాధవ్ గారు కూర్చోండి. మంత్రిగారు.....కూర్చోండి. రామచంద్రరావు గారూ మాట్లాడండి.

**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి:** నాలుగు సంవత్సరాలు దిల్లీలో ఉన్నవారు చేయలేనిది, బోర్డు మెంబరు చేయగలరా?

**శ్రీ జి. దీపక్ రెడ్డి:** (మైక్ లేదు)ప్రతిదీ మనం కోల్పోయామని చెబుతున్నారు గానీ, బాధ్యత తీసుకుంటామని మాత్రం చెప్పడం లేదు.

**మిస్టర్ చైర్మన్:** కూర్చోండి. రామచంద్రరావు గారూ, మాట్లాడండి.

మ.01.40

**శ్రీ చిక్కాల రామచంద్రరావు:** అధ్యక్షా, ఈ రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజన చేయడం జరిగింది. మన రాష్ట్రంలో సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతున్నప్పుడు రాష్ట్ర ప్రజలెవ్వరూ విడదియ్యడానికి ఒప్పుకోని సందర్భంలో

కాంగ్రెస్‌పార్టీ రాజకీయ ప్రయోజనం కోసం రాష్ట్రాన్ని విడదీసింది. అందులో భాగంగానే బీజెపి కూడా రాష్ట్రాన్ని విడదీయడంలో ప్రథమపాత్ర పోషించింది. ఆనాడు బీజెపి మద్దతివ్వకపోతే ఈ రాష్ట్రం విడిపోయేదే కాదు. అంతేగాక, హైదరాబాద్ తెలంగాణకే పరిమితమవడం వల్ల, 40 శాతం ఆదాయం హైదరాబాద్‌లోనే ఉంటుంది కనుక అకస్మాత్తుగా రాష్ట్రం విడిపోవడం మంచిదికాదని ఎంతోమంది చెప్పారు. గతంలో ప్రత్యేక ఆంధ్రా ఉద్యమం చేసినప్పుడు కూడా హైదరాబాద్ శాశ్వతంగా తెలంగాణాలోనే ఉండిపోతుందని చెప్పారు. అన్నీ తెలిసికూడా కాంగ్రెస్‌పార్టీనే రాష్ట్రాన్ని విభజించింది. దానికి బీజెపి మద్దతునిచ్చింది.

అధ్యక్షా, మనకు జనాభా 58 శాతముంటే 46 శాతం ఆస్తులు, 58శాతం అప్పులు పంపిణీ చేశారు. అదీ గొప్పదనం. ఇలా మనం అనేక ఇబ్బందులు పడుతున్నాము. అలాగే పునర్విభజన చట్టం ప్రకారం మనకు రావాల్సిన 19 అంశాల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు 29 సార్లు ఢిల్లీకి వెళ్ళారు. ఇందాక శ్రీనివాసులురెడ్డిగారు మాట్లాడుతూ ఎప్పుడో ఉద్యమం చేయాలని చెప్పారు. కానీ చంద్రబాబునాయుడుగారు కొత్త రాష్ట్రం అభివృద్ధి కోసం కేంద్ర సహకారం తీసుకోవాలని, పునర్విభజన చట్టాన్ని అమలుచేయాలనే ఉద్దేశంతో దఫదఫాలుగా ప్రధానమంత్రిని, కేంద్రమంత్రులను, అధికారులను కలవడం జరిగింది. అయినా చట్టంలో ఉన్న అంశాల అమలుకు వారి నుంచి సహకారం రావడంలేదు. ఈ రాష్ట్రాన్ని భవిష్యత్తులో ముందుకు తీసుకెళ్ళాలనే ఉద్దేశంతో, దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అమరావతికి అన్నిరకాలా పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలనే తపనతో, తాపత్రయంతో ముఖ్యమంత్రిగారు కష్టపడి పనిచేస్తున్నారు.

అధ్యక్షా, చాలామందికి రాజకీయంలో ఓర్పు అనేది ఉండదు. కానీ ముఖ్యమంత్రిగారు ఇప్పటివరకూ చాలా ఓర్పు వహించారు. కేంద్రంవారు ప్రత్యేక హోదా కల్పించలేమనీ, అన్నిరకాలా సదుపాయాలు కల్పిస్తామని చెప్పి ఏదీ చెయ్యలేదు. పోనీ దానినైనా చట్టబద్ధంగా చెయ్యమని మనం చెప్తున్నా చెయ్యడంలేదు. ఇటీవల కేంద్రబడ్జెట్‌లో కూడా మన రాష్ట్రానికి సంబంధించి కానీ, పునర్విభజన చట్టం కోసం కానీ ఎక్కడా కేటాయింపులు చేయలేదు. ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో మన ఎం.పిలందరూ ఆందోళనలు చేయడం జరిగింది. వాళ్ళు అలా చేస్తుండగానే జైట్లీగారు మళ్ళీ పాతపాటే పాడుతు ప్రత్యేకహోదా రాదని, అన్నీ ఇచ్చేశామని అనగానే, మన కేంద్ర మంత్రులిద్దరూ కూడా రాజీనామా చేయడం జరిగింది. అయినా మనం మిత్రపక్షంగా ఉండాలని ముఖ్యమంత్రిగారు చాలా తపన పడ్డారు. కానీ గత్యంతరం లేక ఇద్దరు మంత్రుల్నీ కూడా రాజీనామా చేయించడం జరిగింది.

అధ్యక్షా, మాధవ్‌గారు మాట్లాడుతూ, రాష్ట్రానికి ఏవేవో చేస్తున్నామని చాలా విషయాలు చెప్పారు. మన రాజ్యాంగంలో మనకు హక్కులున్నాయి. ఆ హక్కుల ప్రకారమే మనకు వస్తుంది. దానిని కూడా మేమే ఇచ్చేస్తున్నామని చెప్పడం కరెక్టుకాదు. ఆంధ్రప్రదేశ్‌లో ఈనాడు మనకున్న అనేకరకాలైన ఇబ్బందులను అధిగమించడానికి అనేక విధాలుగా మన ప్రభుత్వం కృషి చేస్తోంది. అయితే మన రాష్ట్రంలో అభివృద్ధికోసం, సంక్షేమంకోసం పాటుపడుతూ అన్నివర్గాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో రకరకాల కార్యక్రమాలు చేస్తూ ఈనాడు కేంద్రం నుంచి సహకారం రాకపోయినప్పటికీ చాలా

కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ కార్యక్రమంకానీ, అనేక అభివృద్ధి కార్యక్రమాలుకానీ చేయడం జరుగుతోంది.

అధ్యక్షా, ఈనాడు మనకు రూ.16,000 కోట్లు రెవెన్యూ లోటు ఉంటే ఇంతవరకూ రూ.4,117 కోట్లు మాత్రమే కేంద్రం నుంచి వచ్చింది. మీకు ఇంక ఏమీ రాదని వారు చెప్తున్నారు. చాలా దారుణంగా ఉంది. రూ.16,000 కోట్లు లోటు బడ్జెట్ అని కాగ్, 14వ ఆర్థిక సంఘం చెప్పింది. దానికి అందరూ ఒప్పుకున్నారు. కానీ కేంద్రం వారు మాత్రం మీకు రూ.138 కోట్లే వస్తుందని చెప్పారు. ఇది కాకుండా పోలవరం ప్రాజెక్టు జాతీయ ప్రాజెక్టుగా తీసుకుని వందశాతం ఇస్తామని చెప్పారు. సంతోషమే. కానీ దీనికి రూ.54,000 కోట్లు ఖర్చవుతుంది. కానీ ఇప్పటివరకూ మనకు రూ.5363 కోట్లు మాత్రమే ఇచ్చారు. మనం ఖర్చు పెట్టిందే మనకు ఇంకా రూ.2589 కోట్లు ఇవ్వాలి. దానిని కూడా ఇవ్వడంలేదు. ఏమైనా అంటే మనం బిల్లులు ఇవ్వడంలేదని కేంద్రంవారు ఆరోపణలు చేస్తున్నారు. అన్ని బిల్లులూ ఇచ్చారు. రెవెన్యూ లోటుకు బిల్లులు ఎక్కడా ఇవ్వరు. కానీ పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి అన్ని బిల్లులు ఇచ్చారు. అయినా రాష్ట్రం ఇవ్వలేదని ఒక ఆరోపణ చేసి నెపం మనమీద వేస్తున్నారు.

అధ్యక్షా, అమరావతికి మనకు ఇంతవరకూ రూ.2500 కోట్లు, ఒక రూ.1000 కోట్లు విజయవాడ, గుంటూరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకోసం, మొత్తం కలిపి రూ.3500 కోట్లు ఇచ్చారు. అమరావతి కోసం రూ. 45,000 కోట్లు టెండర్లు పిలవడం జరిగింది. టెండర్లు అయిపోయినాయి. అమరావతి మొత్తం పూర్తిస్థాయిలో కావాలంటే ఎంతో కష్టపడాల్సి ఉంది. మనం ఇక్కడ కట్టిన తాత్కాలిక భవనంలో ఉన్నాము. కానీ వీటినే శాశ్వత భవనాలలాగా నిర్మించారు. ఈ భవనాలు తాత్కాలికంగా ఉన్నాయా? దీనిని దుర్వినియోగం చేశారని ప్రతిపక్షం పార్టీలు తప్పుగా ప్రచారం చేశాయి. శాశ్వత భవనాలకు ఇప్పటికే 74శాతం టెండర్లు పూర్తయ్యాయి. మిగతావన్నీ కూడా టెండర్లు పిలుస్తారు. రూ.45,000 కోట్లు ఎక్కడ? రూ.3500 కోట్లు ఎక్కడ? చెప్పండి. అలాగే రైల్వే జోన్ విషయంలో కూడా ఒకసారి ఇస్తామని, మరొకసారి ఇవ్వమని చెప్తున్నారు.

**మిస్టర్ ఛైర్మన్:** త్వరగా పూర్తి చెయ్యండి.

**శ్రీ చిక్కాల రామచంద్రరావు:** అధ్యక్షా, ఇంకా చాలా రావాలి. పెట్రో కారిడార్ రావాలి. ఏవీ ఇవ్వకుండానే ఇస్తామని చెప్పడం, ఇవ్వకపోవడం, పైపెచ్చు మనమీద ఎదురుదాడి చేయడం, ఇలాంటి పనులు చేస్తున్న బీజేపిని తిప్పి కొట్టాల్సిన అవసరముంది. ఆంధ్ర రాష్ట్రంలోని మొత్తం అయిదు కోట్ల మంది ప్రజలు బీజేపి మీద ఆగ్రహంగా ఉండి తిరగబడుతున్నారు. మీరు ప్రత్యేకహోదా ఎందుకివ్వరు? 19 అంశాలు ఎందుకివ్వరు అని అడుగుతున్నారు. ఈనాడు రాష్ట్రం బాగుకోసం ఎందుకు సహాయం చేయడం లేదని అందరూ ఆగ్రహంతో ఉన్నారు. దీనికి పరిష్కారం చూడాలని, లేకపోతే మాత్రం బిజెపి చాలా ఇబ్బందులు పడుతుంది. ఈనాడు మాట్లాడడానికి అవకాశం ఇచ్చినందుకు మీకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**మిస్టర్ ఛైర్మన్:** 15.3.1978వ సంవత్సరం మన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుగారు రాజకీయ జీవితంలో ప్రవేశించడం జరిగింది. నలభై సంవత్సరాలు పూర్తయ్యింది. వారితోపాటు మీరూ, మేము అందరమూ కూడా కలిసి వారి అడుగుజాడల్లో ఆరోజుల్లో పనిచేశాం. వారు ఇంకా ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకువెళ్ళాలి. నాకు ఒక సందర్భం బాగా జ్ఞాపకం ఉంది. నేను పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇదే చట్టసభల్లో ఉమ్మడి రాష్ట్రంలో ఒక స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది. అదేంటంటే, ఎన్.డి.ఏ కన్వీనర్‌గా సెక్యూలర్ భావాలు కలిగిన చంద్రబాబునాయుడుగారు తెలుగుదేశంపార్టీ తరఫున గుజరాత్‌లో జరిగిన అల్లర్లను ఖండించారు.

అదేవిధంగా, రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో నాతో మాట్లాడుతూ, ఫరూక్ నేను ముస్లిమ్ వ్యక్తిని రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్నాను, ఎలా ఉంటుందని మొదటిగా నన్ను అడగడం జరిగింది. సార్, ఇది చాలా మంచి నిర్ణయం. ఎన్.డి.ఎ మీద ఉండే చెడు అభిప్రాయం పోతుందని, సెక్యూలర్ పార్టీగా మనం సపోర్టు చేస్తున్నాం కాబట్టి, మనమీద కూడా ప్రజల్లో మంచి భావాలుండాలనీ, కాబట్టి మీ నిర్ణయం చాలా మంచి నిర్ణయమని నేను చెప్పడం జరిగింది. ఆరోజు వాజ్‌పేయి గారిని ఒప్పించి, మహానుభావుడైన అబ్దుల్‌కలాంగారిని మీరు రాష్ట్రపతిగా నియమించినప్పుడు దేశ, విదేశాలనుంచి, స్వరాష్ట్రం నుంచి ఏ పార్టీకూడా పోటీ చేయకుండా ఏకగ్రీవంగా వారిని ఎన్నుకోవడానికి మీరు చేసిన కృషి నాకు బాగా జ్ఞాపకముంది. ఆరోజు మీరు రాష్ట్రపతిగారి గురించి మొదటగా నన్నే అడగడం జరిగింది. మళ్ళీ రాజకీయ ప్రస్థానం వచ్చింది కాబట్టి భగవంతుడు మీకు ఇంకా ఆయురారోగ్యాలు ప్రసాదించాలని, రాష్ట్ర పురోభివృద్ధి కోసం మీరు ఇంకా కృషి చేయాల్సిన అవసరముంది కాబట్టి సెక్యులర్ భావాలతో ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని ముందుకు తీసుకెళ్ళాలని ఈ ఎగువ సభద్వారా మీకు తెలియజేస్తున్నాను.

(గౌరవసభ్యుల హర్షధ్వానాలు)

శ్రీ పొట్టి శ్రీరాములు గారి 117వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రిగారు మాట్లాడుతారు.

మ.01.50

## <u>6. శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి తీర్మానం</u>

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు:** అధ్యక్షా, ఈరోజు మనం శ్రీ పొట్టి శ్రీరాములు గారి జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి నివాళులు అర్పిస్తూ, ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తీర్మానం చేస్తున్నాము.

ఈరోజు తెలుగు ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసిన మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు గారి జయంతి. తెలుగువారి ఐక్యత కోసం, తెలుగువారికి స్వయం పాలన అందించడం కోసం అశువులు బాసిన ఆ అమరజీవికి ఈ శాసనమండలి శ్రద్ధాంజలి ఘటిస్తోంది. ఆ త్యాగమూర్తి జన్మదినాన తెలుగుజాతి కోసం ఆయన చేసిన ప్రాణత్యాగాన్ని,

చిరస్మరణీయ సేవలను ఒకసారి మననం చేసుకోవడం నవ్యాంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణంలో మనందరిలో మళ్లీ ఒక స్ఫూర్తి నింపగలదని ఈ శాసనమండలి భావిస్తోంది.

శ్రీ పొట్టి శ్రీరాములు గారు 1901 మార్చి 16న మద్రాసు నగరం జార్జి టౌన్ అన్నాపిళ్లై వీధిలో శ్రీ గురవయ్య, మహాలక్ష్మమ్మ పుణ్యదంపతులకు జన్మించారు. బొంబాయిలో శానిటరీ ఇంజనీరింగులో పట్టభద్రులయ్యారు. 25 ఏళ్ల వయసులోనే రైల్వే ఉద్యోగాన్ని వదిలి గాంధీ మహాత్ముని అనుచరుడిగా సబర్మతి ఆశ్రమంలో చేరి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించారు. 1941-42లో సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని మరో మూడుసార్లు జైలుశిక్షను అనుభవించారు.

ప్రేమ, వినయం, సేవ, నిస్వార్థత మూర్తీభవించిన స్వరూపం శ్రీ పొట్టి శ్రీరాములు గారు. సత్యాన్ని, అహింసను ఆరాధించే ప్రేమమూర్తి. పేద ప్రజల ఉన్నతికి పాటుపడిన మహోన్నత వ్యక్తి. 1946లో నెల్లూరు మూలపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో హరిజనుడి ప్రవేశం కోసం నిరాహారదీక్ష బూని విజయం సాధించారు. గాంధీజీకి శ్రీరాములు గారంటే ప్రత్యేక అభిమానం. పొట్టి శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్ర్యం సాధించగలమని అంటూ ఉండేవారు.

తెలుగువారు అవమానాలకు, అవహేళనకు, అన్యాయానికి గురవుతున్న నేపథ్యంలో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోరుతూ, 1952 అక్టోబరు 19న మద్రాసులోని బులుసు సాంబమూర్తిగారి ఇంట్లో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఆయన నిరశన దీక్షకు మద్దతుగా ఆంధ్రదేశమంతటా ఆనాడు సమ్మెలు, ప్రదర్శనలు జరిగాయి. పొట్టి శ్రీరాములు గారికి సంఘీభావంగా, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నారు. 1952 డిసెంబర్ 15 అర్ధరాత్రి శ్రీరాములు గారు తన ఆశయ సాధన కోసం ప్రాణాలు అర్పించారు. ఆయన దీక్షఫలితంగా 1952 డిసెంబర్ 19న అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 1953 అక్టోబర్ 1వ తేదీన కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు గారు ప్రథమ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఐతే తెలుగుభాష మాట్లాడే వారందరికీ ఒక రాష్ట్రం ఉండాలని, తెలుగు మాట్లాడే నైజాం రాష్ట్రాన్ని ఆంధ్రలో విలీనం చేసి ప్రత్యేక రాష్ట్రం ఆకాంక్ష మొగ్గతొడిగి క్రమంగా బలపడింది. అనేక ఉద్యమాలు, పెద్దమనుషుల ఒప్పందం ఫలితంగా 1956 నవంబర్ ఒకటో తేదీన హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటయ్యింది. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ప్రాతిపదికన ఆవిర్భవించిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు ఘనకీర్తి లభించింది.

తన ప్రాణాలను తృణప్రాయంగా త్యజించి తెలుగువారిలో ఐక్యత తెచ్చిన మహనీయుడు పొట్టి శ్రీరాములుగారు. ఆచంద్రతారార్కం తెలుగువారి ఐక్యతే ఆయనకు నిజమైన నివాళిగా భావిస్తూ, ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేసిన ఆ అమరజీవికి ఈ శాసనమండలి ఘనమైన నివాళి అర్పిస్తోంది.

అధ్యక్షా, శ్రీ పొట్టి శ్రీరాములు గారిని ఒకసారి గుర్తు తెచ్చుకుంటున్నాము. ఆయన స్ఫూర్తిని ఒకసారి నెమరవేసుకుంటున్నాము. అందుకే ఈ ప్రభుత్వం వచ్చిన తరవాత ఆయనను శాశ్వతంగా గుర్తు పెట్టుకోవడానికి నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా నామకరణం చేశాము. ఈరోజు ఆ మహనీయుడి యొక్క స్ఫూర్తి మనమందరం ఒకసారి నెమరవేసుకోవాల్సిన అవసరముంది. ఆరోజు కూడా ఇలాగే అవహేళన, అవమానం జరిగినప్పుడు ఇంకా నేను బ్రతికినా లాభం లేదు, నేను త్యాగం చేయాలని ముందుకు వచ్చి నిరవధిక నిరాహార దీక్ష చేసి చివరకు తన ప్రాణాలను అర్పించి తెలుగువారికి ఒక రాష్ట్రం వచ్చేలా చేసిన వ్యక్తి, ఒక మహనీయుడు శ్రీ పొట్టి శ్రీరాములు గారు. మన దురదృష్టం, స్వాతంత్ర్యానికి పూర్వం మనం మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉండడం, అక్కడి నుండి పొట్టి శ్రీరాములు గారి త్యాగం తరవాత కర్నూలుకు రావడం, మూడు సంవత్సరాలు ఆంధ్రరాష్ట్రం అక్కడ ఉండడం, అక్కడి నుండి రేకుల షెడ్లలో రాష్ట్రం ఉండడం జరిగింది. అక్కడి నుండి తెలుగువారు అందరూ హైదరాబాదు రాష్ట్రం, ఆంధ్రరాష్ట్రం పెద్దమనుషులు కూర్చోవడం, తెలుగువారికి ఒక రాష్ట్రం ఉండాలని చెప్పి అందరూ ప్రయత్నం చేయడం జరిగింది. మద్రాస్ నుండి విడిపోయినప్పుడు మనకు ఏమీ రాలేదు, ఆస్తులు రాలేదు, ఆదాయం రాలేదు, శ్రమ చేశాము కాని అక్కడ మనమే వెళ్లిపోతామని అన్నాము కాబట్టి వెళ్లిపొమ్మన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో కాబట్టి అప్పులు కూడా లేవు. ఆ తరవాత ఆంధ్రప్రదేశ్ అంతా కూడా హైదరాబాదులో ఉండడం, 60 సంవత్సరాలు హైదరాబాదు అభివృద్ధికోసం కష్టపడ్డాము. హైదరాబాదును ఒక నాలెడ్జ్ సిటీగా డెవలప్ చేసి, ప్రపంచ పటంలో పెట్టడమనేది మనందరి శ్రమ. ఆ శ్రమ తరవాత మళ్లీ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడడం వల్ల మనందరం కలిసి అమరావతికి రావడం జరిగింది. ఎందుకు ఈ విషయాలన్ని చెబుతున్నానంటే ఈరోజు మనం ఒక్కసారి చూసినప్పుడు ఏ విధంగా డెవలప్‌మెంట్స్ జరిగాయనేది ఒకసారి గుర్తు పెట్టుకోవాల్సిన అవసరముంది. ఏ దేశంలో ఏ జాతికి రాని కష్టాలు తెలుగు జాతికి వచ్చాయి. మనం రెండు మూడు సార్లు రాజధానిని మార్చుకుంటూ ప్రస్తుతానికి ఇక్కడకు వచ్చాము. ఈరోజు పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకుని ఆ మహనీయుడికి నివాళులు అర్పించడానికి శాసనమండలిలో తీర్మానం చేసుకున్నాము. మరోప్రక్క ఈరోజు తెలుగుదేశం పార్టీ బి.జె.పితో ఎన్.డీ.ఏలో భాగస్వామిగా ఉండం అని చెప్పి చాలా స్పష్టంగా చెప్పాము. ఈ రెండూ కూడా కలిసి ఒకేరోజు వచ్చాయి. ఇక్కడ బి.జె.పి.పార్టీకి సంబంధించి సభలో ఒక్క మాధవ్‌గారే ఉన్నారు, బి.జె.పి నాయకులంతా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఎందుకు ఇలాంటి కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందో బి.జె.పి.పార్టీ యొక్క ప్రతి ఒక్క కార్యకర్త ఆలోచన చేసుకోవాల్సిన అవసరముంది. ఈరోజున స్వార్థ ప్రయోజనాల కోసం చేయలేదు, రాష్ట్ర ప్రయోజనాల కోసం చేశాము. ఒక రాజకీయ పార్టీగా ప్రతి ఒక్కరికి ఒక వ్యక్తిత్వం ఉంటుంది. ఒక సిద్ధాంతం ఉంటుంది.

మ.02.00

అధ్యక్షా, 29సార్లు దిల్లీకి వెళ్లాను, చెప్పాను. నాలుగు సంవత్సరాలు అన్ని ప్రయత్నాలు చేశాను. ఈ ప్రభుత్వానికి ఐదు సంవత్సరాలు అవకాశం ఇచ్చింది. మొన్న బడ్జెటు ప్రవేశ పెట్టిన తరువాత, ఎందుకంటే ఈ ప్రభుత్వానికి ఇదే

చివరి బడ్జెటు. ఆరోజు తెలుగుదేశం, బి.జె.పితో కలిసి ఎన్డీయే తరఫున ఎన్నికల్లో పోటీ చేసింది. 5 సంవత్సరాల అధికారం కోసం మనం పోరాడాము. ప్రజలు మనల్ని విశ్వసించి అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారం ఇచ్చారు. ఆరోజు కేంద్రం చెప్పింది, మేము చెప్పాము. రాష్ట్రానికి అన్యాయం జరిగింది కాబట్టి, బ్రహ్మాండంగా నిధులు కేటాయించి చేస్తామని చెప్పి, 4 బడ్జెట్లలోనూ పట్టించుకోకుండా ఉండి, కనీసం చివరి బడ్జెటులో కూడా ఆంధ్రప్రదేశ్ పేరుపెట్టడానికి ఆలోచించారంటే, ఏవిధంగా మా పార్టీ కానీ, ప్రభుత్వం కానీ, కేంద్రానికి సహకరిస్తుంది? ఆరోజు బడ్జెటులో ఎవరూ రెయిజ్ చేయలేదు. ఈ రాష్ట్రంలో ఉండే ఏ నాయకుడు మాట్లాడలేదు. కారణాలు ఏమైనా కావచ్చు. నేనే మొదటిసారి రెయిజ్ చేశాను. అన్యాయం జరిగింది, ఇది కరెక్టు కాదు, నమ్మితే మోసం చేస్తున్నారని ఆరోజు రెయిజ్ చేశాను. రెయిజ్ చేసిన తరువాత పార్లమెంటులో మా మెంబర్లు పోరాడారు. మేము పోరాడుతుంటే ఒకరు వచ్చారు. మళ్లా లాలూ। పడుతున్నారు. అవన్నీ కూడా నేను ఈరోజు చెబుతాను. అదే సమయంలో ఆరోజు పోరాడితే పార్లమెంటు అడ్జర్న్ చేశారు. ఎందుకంటే ఒక నెల సమయం ఉంది కాబట్టి. పార్లమెంటు అడ్జర్న్ చేసిన తరువాత మళ్లీ ఇప్పుడు పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయి. కనీసం కేంద్రప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కోసం ప్రయత్నం చేసిందా అని నేను అడుగుతున్నాను. ఈ రాష్ట్రం ఒకటి ఉంది, వీళ్లకు సమస్య ఉంది. వీళ్లకు కూడా సెంటిమెంట్స్ ఉంటాయి, వీళ్లు కూడా బాధల్లో ఉన్నారని ఒక్కసారైనా ఆలోచించారా? అని నేను కేంద్రప్రభుత్వాన్ని అడుగుతున్నాను. ఆలోచించలేదు. మళ్లీ మేము పోరాడాము. పోరాడితే ఆరోజు ఏమి చేశారు? ఇదే హౌస్‌లో రెండోరోజు నేను సమాధానం చెప్పాను. మొదటి రోజు అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడాను. ఆరోజు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ రాష్ట్రానికి బిజెపి పార్టీ వారు కొన్ని హామీలు ఇచ్చారు. విభజన జరిగిన తరవాత ఆ ఇష్యూలన్నీ మనం ఒకసారి పరిశీలిస్తే, చాలా అన్యాయం జరిగింది. ఏదైతే మనం రూ.16,000కోట్లు డెఫిసిట్ ఉందని, మరోప్రక్కన 46శాతం ఎస్టిమేటెడ్ రెవెన్యూస్ మనకు వస్తాయి, 58శాతం జనాభా ఉన్నారు, అస్సెట్స్ అన్నీ లొకేషన్ బేసిస్‌లో వెళ్తాయి. లయబిలిటీస్ డెబ్ట్స్ అన్నీ కూడా పాపులేషన్ బేస్‌లో ఇస్తారు, పవర్ మాత్రం కన్జంప్షన్ బేసిస్‌లో ఇస్తారు. డిఫర్డ్ టాక్సేషన్ ఇస్తే, 58:41పర్సెంటేజ్‌లో రావాల్సి ఉంది.

అధ్యక్షా, ఆరోజు లొకేషన్ ప్రకారం ఎక్కడ రిజిస్ట్రేషన్ అయితే అక్కడ ఇస్తామని చెప్పి, బిల్లులో కూడా పెట్టారు. సింగరేణి కాలరీస్‌కి 51శాతం తెలంగాణాకు ఇచ్చారు, అదే సమయంలో ఏపిహెచ్ఎమ్ఇఎల్ ఇక్కడ ఉన్నా సబ్సిడీ అని వాళ్లకు ఇచ్చే పరిస్థితి వచ్చింది. పెన్షన్ లయబిలిటీస్ అన్నీ అక్కడే ఇచ్చే పరిస్థితి వచ్చింది. అంటే పాపులేషన్ బేసిస్‌లో ఇచ్చారు. అంటే ఆరోజు బి.జె.పి ఒక పార్టీగా ఇందులో భాగస్వామి అవునా, కాదా అని నేను అడుగుతున్నాను? 25 నిముషాలలో బిల్లుపాస్ చేశారు. అదే రాజ్యసభలో గట్టిగా ఫైట్ చేశారు. ఆ రోజు అపోజిషన్ పార్టీలో ఫ్లోర్ లీడర్‌గా ఉన్నప్పుడు అరుణ్‌జైట్లీగారు కూడా చెప్పారు. వెంకయ్యనాయుడు గారు కూడా చెప్పారు. దురదృష్టం ఏమిటంటే, ఆరోజు అపోజిషన్‌లో ఉన్నాం కాబట్టి వారు చెప్పారు, అధికారంలోకి వస్తారని మరచిపోయారు. ఏ కారణం వల్లనో కానీ, అలా పోరాడిన వ్యక్తులు, అడిగిన వ్యక్తులు మళ్లీ ఈరోజు విస్మరించడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే

పరిస్థితికి వచ్చారు. ఆరోజు మీరు పార్లమెంటులో, లోక్‌సభలో కూడా సరిగ్గా ఉండుంటే ఈ అన్యాయం జరిగే పరిస్థితి వచ్చేది కాదు. కానీ, జరిగిన అన్యాయం చూసి, ఈరోజు మళ్లీ వీటన్నింటి గురించి నేను పోరాడుతున్నాను. నేను అడిగిందేమిటి, ఆరోజు పార్లమెంటులో విభజన చట్టాన్ని పెట్టారు. ఆ చట్టాన్నే నేను అమలు చేయమన్నాను. ఆ రోజు రాజ్యసభలో మీరు కొన్ని హామీలు ఇచ్చారు. ప్రత్యేక హోదా గురించి ఆరోజు బి.జె.పి. పార్టీ అడిగింది, అందరూ అడిగారు. అదేవిధంగా ఆరోజు పార్లమెంటులో ఆనాటి ప్రధానమంత్రి కూడా హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు ఇవ్వరని నేను అడుగుతున్నాను. మేము కొత్తగా ఏమీ అడుగలేదు. మేము కష్టపడతాము, సమర్థవంతంగా పనిచేస్తాము. ఎవరు సపోర్టు చేసినా చేయకపోయినా, ఈ రాష్ట్రం అభివృద్ధి జరిగి తీరుతుంది. దానిలో అనుమానం లేదు, వదిలి పెట్టే సమస్యేలేదు.

అధ్యక్షా, ఇది మన హక్కు. ఆ రోజు ఇప్పుడు అధికార పార్టీలో ఉన్న కేంద్ర ప్రభుత్వం వారు అన్యాయం చేశారు. అన్యాయం చేసి, ఇప్పుడు మా హక్కును కాపాడడంలో ఎందుకు వెనకాడుతున్నారు? ఆరోజు నేను అన్నీ అడిగి, రెండు మూడు రోజులు పోరాడితే, ఆరోజు అరుణ్‌జైట్లీ గారు "Sentiment do not define the quantum of fund." సెంటిమెంట్ డిఫైన్ చేయవా అండి? రాజకీయాలలో ఉండే మనకు స్పృహ ఉండదా? రాజకీయాలలో ఉండే నాయకులు గుర్తు పెట్టుకోవాల్సిందేమంటే, ఎందుకు సెంటిమెంట్ వచ్చింది? సెంటిమెంట్ వెనుక ఏముంది? అగమ్యగోచరంగా ఉన్నప్పుడు విభజన జరిగింది. ప్రతిఒక్కరూ ఆవేదన పడ్డారు. నా పిల్లల్ని ఎలా చదివించాలి? నాకు పెన్షన్ వస్తుందా, లేదా? నా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయా? లేకపోతే వ్యవసాయం ఏమైపోతుంది? రాజధాని ఎక్కడ కట్టుకోవాలి? అని ఆదాయం లేని రాష్ట్రంలో ప్రజలు బాధ పడ్డారు. అలాంటి వారికి సెంటిమెంట్ ఉండదా? మిమ్మల్ని గానీ, మీ నాయకుణ్ణి గానీ ఉన్నపళంగా ఇంట్లో నుంచి, లేకపోతే మీ ఆస్తుల్లో ఒక్క పైసా కూడా ఇవ్వకుండా బయటికి వెళ్లమంటే కన్నతండ్రి అయినా మీరు రివోల్ట్ అవుతారు. ఆ విషయం మీరు గుర్తు పెట్టుకోవాల్సి ఉంది. అలాంటి సెంటిమెంట్‌కి సంబంధించిన విషయంలో నేనూ ఆ మాటే చెప్పాను. తెలంగాణ పైన కోపంతో చెప్పలేదు. అక్కడ ఆందోళన చేశారు. అది వేరే విషయం.

అధ్యక్షా, ఆనాడు సెంటిమెంట్‌తో ఒక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. అదే సమయంలో ఇక్కడ కూడా సెంటిమెంట్స్ ఉన్నాయి కాబట్టి న్యాయం చేయమని నేను అంటున్నాను. ఆ న్యాయం చేయడంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ఈ సభ ద్వారా ఎన్డీయేని నేను ప్రశ్నిస్తున్నాను. దానికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అంటే ఇది లెక్కలేని తనమా? మనం అడిగాము, అడిగిన తరువాత ఈ స్టేట్‌మెంట్ ఇచ్చారు.(స్టేట్‌మెంట్ ప్రతిని సభలో చదివారు) దీనిలో ఏముంటుంది? What is the implication of Special Status? "The Special Status used to be originally granted to States in the North East because, they have their own resources that were inadequate" Jaitley said. "At that time Special Category State concept did not exist but, according to the $14^{th}$ Finance Commission, there is no Special Category Status now to be given." ఇంకొక మాట చెబుతాను అరుణ్‌జైట్లీ గారు చెప్పింది. క్లియర్‌గా 14వ ఆర్థిక సంఘం స్పెషల్

స్టేటస్ ఇవ్వొద్దంది అనే విధంగా చెప్పారు. ఆరోజు నుండి ఎందుకు స్పెషల్ అసిస్టెన్స్ అని ముందుకు వెళ్లామంటే, ఇది కొత్త రాష్ట్రం, అన్ని అవే ఇస్తామన్నారు, పేరు తప్ప. మీరు అవన్నీ ఇవ్వండని ఆరోజు నేను చెప్పాను. మాకు స్పెషల్ స్టేటస్‌లో ఏమైతే ఇస్తామని చెప్పారో, అవన్నీ ఇవ్వాలి. సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీముల్లో 90:10 ఇవ్వాలి. ఇఎపిలో 90:10 ఇవ్వాలి. అదే సమయంలో మీరు ఏమైతే ఇండస్ట్రియల్ ఇన్సెంటివ్స్ ఇస్తామని అన్నారో, అవి సెపరేట్ జీ.ఓలో లేకపోవచ్చు. మీరు అదే ఆర్గ్యూ చేస్తున్నారు. నేను సెపరేట్ జీ.ఓ ఇవ్వమన్నాను. అందరి రాజకీయ నాయకులలాగా నేను స్లోగన్స్ మాట్లాడడం లేదు. వాళ్లకు అర్థం కాకపోవచ్చు. మీరు (కేంద్రప్రభుత్వం) తప్పించుకుంటారని నాకు తెలిసే నేను ఆ విషయమే చెప్పాను. సెపరేట్ జీ.ఓ ద్వారా స్పెషల్ స్టేటస్ ఉండే రాష్ట్రాలకు స్పెషల్ ఇండస్ట్రీస్ ఇన్సెంటివ్స్ అన్నీ ఇచ్చారు. అవే మాకు కూడా ఇమ్మన్నాను. హక్కు కింద ఇమ్మన్నాను. ఆ విషయమే ఆ రోజు అడిగాను, ఈరోజు అడుగుతున్నాను. మీరు అది చెప్పకుండా ఏదీ ఇవ్వము అని రిజెక్ట్ చేశారు. ఇక్కడ మొన్న కూడా ఆయన చెప్పారు. ఒక మంత్రి నిన్నే రాజ్యసభలో సమాధానం చెబుతూ, ఎక్కడా కూడా మాకు 14వ ఆర్థిక సంఘం ఇవ్వమని చెప్పలేదు అని మాట్లాడారు. ఆ ఫైనాన్స్ కమీషన్ చైర్మన్ మాట్లాడుతూ, మేము ఇవ్వద్దని ఎక్కడా చెప్పలేదు, కావాలంటే మీరు ఇచ్చుకోవచ్చు. అవి కేంద్ర ప్రభుత్వమే ఇవ్వాలి. ప్రొసీజర్ ప్రకారం ఇచ్చుకోవచ్చని ఆయన చెప్పారు. మొన్న కూడా ఫైనాన్స్ కమీషన్‌లో ఒక మెంబర్ చెబుతూ అనవసరంగా మమ్మల్ని డామేజ్ చేస్తున్నారు. మమ్మల్నెందుకు డ్యామేజ్ చేస్తారు? ఇస్తారో, లేదో మీరు చెప్పకోండి. మేమిచ్చిన రిపోర్టులో ఆ పదమే లేదు. అలా మేము చెప్పలేదని కూడా చెప్పారు. ఎందుకు ఇన్ని అబద్ధాలు, అసత్యాలు మాట్లాడతారని కేంద్రాన్ని నేను అడుగుతున్నాను.

మ. 02.10, 02.20

అధ్యక్షా, అసలు ఇస్తారా, లేదా అని చెప్పమంటే, డొంక తిరుగుడు సమాధానాలు దేనికని మళ్ళీ ఒకసారి మిమ్మల్ని అడుగుతున్నాను. ఈ రోజు కూడా మళ్ళీ మాట్లాడుతున్నారు. నేను ఏమీ తీసుకోలేదని అప్పుడు అడిగానన్నారు. నేను ఎప్పుడూ అడగలేదు. నేను ఒకటే అడుగుతున్నాను. విభజన చట్టంలో ఉండే హామీలు ఆరోజున రాజ్యసభలో ఇచ్చిన హామీలు రెండూ అంటే ఈ విభజన చట్టంలో ఉండే ప్రొవిజన్స్ రాజ్యసభలో మీరు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆరోజు నుంచి డిమాండ్ చేస్తున్నాను. ఈరోజు వరకు అదే డిమాండ్ చేస్తున్నాను తప్ప నేను వేరేది అడగడం లేదు. ఆ విషయాన్ని మీరందరూ గుర్తుపెట్టుకోవాలని ఈ సందర్భంగా అందరికీ తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అందుకే ఈ స్టేట్‌మెంట్ ఇచ్చిన తరువాత ఆవేదనతో ఏకపక్షంగా డెఫిసిట్ ఫైనాన్స్ చెపుతున్నారు. మీకు ఇవ్వవలసింది రూ.3,950కోట్లు ఇచ్చామని, ఇంకొక రూ.139కోట్లు ఇస్తే అయిపోతుందని ఏకపక్షంగా వారు నిర్ణయం తీసుకున్నారు. రెండవది వారు మాట్లాడుతూ, డిఫెన్స్ బడ్జెట్ తీసుకువస్తారాండి. అంతకు ముందు రోజు ఒకరిద్దరు మాట్లాడుతూ, ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిస్థితి చూస్తే, వీళ్ళకి డిఫెన్స్ బడ్జెట్ కూడా ఎక్కువ లేదు కాబట్టి, ఇప్పుడు డిఫెన్స్ బడ్జెట్ కూడా వీళ్ళకి ఇవ్వమని అడుగుతున్నారన్నారు. అంటే, మేము డిఫెన్స్ బడ్జెట్ అడిగేంత సంస్కారం లేని ఆంధ్రప్రదేశా అండి ఇది. ఇంకొక ప్రక్కన వీళ్ళు మాట్లాడుతూ, అప్పుడు మంత్రి కూడా అడ్మిట్

అయ్యి ఈ దేశాన్ని కాపాడే బాధ్యత మాకు ఉందని మాట్లాడారు. మీరు ఒక్కరే ఈ దేశాన్ని కాపాడతారా? ఇంకెవరకీ ఈ దేశాన్ని కాపాడే బాధ్యత లేదా? దేశం కోసం వస్తే ప్రతి ఒక్క సామాజిక పౌరుడు మరియు భారత దేశం మొత్తంలోని తెలుగువాళ్ళు అంతా ఈ దేశాన్ని రక్షించుకోవడానికి అందరూ మనస్ఫూర్తిగా దేశభక్తితో ముందుకు వస్తారు తప్ప, ఎలాంటి త్యాగాలు చేయడానికైనా ఈ ప్రజలందరూ ఏకత్రాటిపై ముందుకు వస్తారని చెప్పాను. వాళ్ళ ఒక్కరికే దేశభక్తి ఉందని, మేమే దేశాన్ని కాపాడుతున్నామని మాట్లాడడం కరెక్టు కాదు.

అధ్యక్షా, మరొక ప్రక్కన తెలుగు సెంటిమెంటు ఉందంటే, ఇప్పుడు తెలుగువారి ఆత్మగౌరవం అంటారు. రేపు కన్నడ, బెంగాలీ, ఒడిశా అని మాట్లాడితే ఎలా అండి? ఎందుకు ఆ సెంటిమెంటు మాటలు. తప్పనిసరిగా ఏ జాతికి అయినా ఆ జాతి ఆత్మ గౌరవం ఉంటుంది. అదే పార్లమెంటులో ప్రధాన మంత్రిగారు చెప్పారు. ఆరోజున స్వర్గీయ నందమూరి తారక రామారావు గారు రాజకీయాలలోకి ఎందుకు వచ్చారు? తెలుగు జాతి యొక్క ఔన్నత్యాన్ని కాపాడడానికి, తెలుగుజాతికి అవమానం జరిగినప్పుడు ఆ మహనీయుడు ఆలోచించి ఇదెక్కడి న్యాయం, 40 సంవత్సరాలు నన్ను ఈ జాతి గౌరవించింది. ఈ జాతికి అన్యాయం జరుగుతోంది, ఇంక నాకు సినిమాలు కాదు, నేను రాజకీయాలలోకి చేరి ఈ తెలుగువారి ఆత్మ గౌరవాన్ని కాపాడాలనే నినాదంతో తెలుగుజాతి ఆత్మగౌరవం కోసం పెట్టినదే ఈ తెలుగుదేశం పార్టీ.

అధ్యక్షా, ఎప్పుడూ మేము రాజీపడలేదు. రాజీపడే సమస్యే ఉండదు. కానీ, ఎప్పటికప్పుడు రాజకీయంగా మీరు ఆలోచించినప్పుడు ప్రజలకు మంచి జరగాలన్నప్పుడు ఆలోచిస్తాము, వర్కవుట్ చేస్తామని చెప్పారు. ఆ మాటలు చెప్పిన ప్రధాన మంత్రిగారు మన గురించి ఒక్క రోజైనా ఆలోచించారా? కనీసం ఒక్క గంట సమయం అయినా మనకు ఇవ్వలేరా? ఇన్ని రోజులు పార్లమెంటు జరిగితే, పార్లమెంటు సభ్యులందరూ పోరాడుతుంటే ఎందుకయ్యా మీరు పోరాడుతున్నారని, మిత్రపక్షంగా రండి కూర్చుందాం అని ఆయన ఒక్క మాట అడిగారా? మీ నాయకత్వం అడిగిందా? నేను అడుగుతున్నాను దీనికి ఏం సమాధానం చెపుతారో చెప్పండి. అంటే, మీ ఉద్దేశం ఎక్కడికి పోతున్నాము? మీరు ఏమన్నా చేయండి, మీరు ఏం చేయగలుగుతారనే ధీమానే కదా మీకు. అంటే కేవలం మాకు 25 సీట్లే ఉన్నాయి కదా? 5 కోట్ల జనాభానే కదా? అసలు ఎక్కడికి పోతున్నాం అధ్యక్షా? అంటే, ఆ రోజున 42 సీట్లను 17, 25గా విభజన చేశారు. ఇప్పుడు వచ్చి ఇవన్నీ చేస్తున్నారు. నేను అందుకనే ఇవన్నీ చూసిన తరువాత నిన్నటి వరకు వెయిట్ చేశాను. నిన్న ఫైనాన్షియల్ బిల్లు పెట్టారు. ఆ ఫైనాన్స్ బిల్లులోనైనా కరెక్టు చేస్తారని ఆలోచిస్తే, ఇన్ని రోజులు ఏమీ పట్టించుకోకుండా నిన్న కూడా ఏమీ చేయకుండా మీరు ముందుకు పోయే పరిస్థితి వస్తే మేము ఎందుకు ఉండాలనే ఉద్దేశంతోనే మేము ఆలోచించాము. మేము కూడా నో కాన్ఫిడెన్స్ పెడతామని కొంతమంది డ్రామాలాడుతున్నారు. ఆ డ్రామాలన్నీ అందరికీ తెలుసు. అవి కూడా చెబుతాను. కానీ, తెలుగుదేశం పార్టీగా ఒకటే ఆలోచించాము. తెలుగుదేశం పార్టీ ఒక పద్ధతిగా ఉండే పార్టీ కాబట్టి, నో కాన్ఫిడెన్స్ పెట్టే ముందే బీజేపిలో ఎన్‌డిఏకి మనకు సంబంధం లేదని, తెగతెంపులు చేసుకున్న తరువాతనే నో కాన్ఫిడెన్స్ పెట్టాలని ఈ రోజు ఉదయమే నిర్ణయం

చేసుకోవడం జరిగింది. మీరందరూ గుర్తుపెట్టుకోండి, దానికి కూడా రీజన్ ఉంది. ఇన్ని రోజులు ప్రయత్నం చేశాము. ప్రధానమంత్రిగారిని కూడా అడిగినప్పుడు చెప్పాము. మా మనోభావాలు వేరేగా ఉన్నాయి, చాలా సార్లు తిరిగినా మీరు చేయడం లేదు, అధికారులు కూడా సహకరించడం లేదు, కానీ, మాకు న్యాయం చేయమని చెప్పినప్పుడు మీరు ఏ మాత్రం కూడా పట్టించుకోకుండా ఉంటే, అప్పుడు ఏం చేయాలా అని ఆలోచించిన మీదట ఈ రోజున మేము ఉదయం ఒక నిర్ణయం తీసుకున్నాము. ఆ తరువాతనే నో కాన్ఫిడెన్స్ పెట్టాము. ఆ విశ్వాసాన్ని మీరందరూ గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఉంది. ఒక పద్ధతి ప్రకారమే పోతున్నాం తప్ప, ఎక్కడా కూడా అటూ ఇటూ రాజకీయాలలో పరిగెత్తే పరిస్థితిలో లేము.

అధ్యక్షా, ఆరోజున ఎన్‌డిఎలో 29 మంది ఎం.పి.లు, మన సమైక్య ఆంధ్రప్రదేశ్ నుంచి 35మంది ఎంపిలు ఉన్నారు. వారందరూ ఒక్క పదవి అడగకుండా ఆరున్నర సంవత్సరాల పాటు కేంద్రప్రభుత్వంలో ఎన్‌డిఎ పార్టీని సపోర్టు చేసిందంటే అది తెలుగుదేశం పార్టీ నీతి, నిజాయితీ, ఈ దేశం కోసం పనిచేసిన విధానం. ఆ విషయాన్ని మీరందరూ గుర్తుపెట్టుకోవాలి. ఇప్పుడూ అదే చెప్పాము. మేము పదవులు అడిగినప్పుడు కూడా అడగలేదు. చేరమంటే, ఒక మంత్రి పదవి ఇస్తామన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే చేరాను. పోర్టుఫోలియోని కూడా నేను అడగలేదు. సివిలైజేషన్ ఇచ్చారు. అదేసమయంలో మళ్ళీ వస్తే, ఇంకొక మంత్రి అది కూడా స్టేట్ మినిస్టర్ అంటే సైన్స్ అండ్ టెక్నాలజీ ఇచ్చారు. అది ఉపయోగుడేది ఏమీ లేదు. అది అందరికీ తెలిసిన విషయమే. అయినా నేను ఏమీ అడగలేదు. ఇంతవరకు నేను ఒక్క పదవిని కూడా అడగలేదు. ఒక్క డైరెక్టర్‌ని కూడా అడగలేదు. నేను అక్కడికి ఎన్ని సార్లు వెళ్ళినా కూడా ఇదే అడిగాను. కానీ, ఇవి కూడా చేయకపోతే ఏ విధంగా అర్థం చేసుకోవాలని తమ ద్వారా అడుగుతున్నాను.

అధ్యక్షా, అదేమాదిరిగా మనం ఆ రోజున చూస్తే, బిల్లులో కానీ, ఆనాడు ప్రధానమంత్రి పార్లమెంటుకు ఇచ్చిన హామీలుగానీ చాలా స్పష్టంగా ఉన్నాయి. ఈరోజున మీరు చూసినప్పుడు, ఆ రోజున ప్రధాన మంత్రి చెప్పింది - First for purpose of Central Assistance Special Category Status will be extended to Successor State of Andhra Pradesh comprising 13 Districts including the 4 Districts of Rayalaseema and 3 districts of North Coastal Andhra for a period of 5 years. This will put the State finances for a former footing. ఈ విషయం ఎందుకు చెప్పారు? ఆ రోజున ఆర్థిక పరిస్థితులను మనం ఒకసారి చూస్తే మొత్తం 58 శాతం జనాభాకు 50.69 శాతం మనకు రాష్ట్ర విభజన సమయంలో జిఎస్‌డిపి భాగస్వామ్య వాటా ఉంది. అదే తెలంగాణాకు అయితే 41.69శాతం జనాభాకు 49.41 శాతం వాళ్ళ భాగస్వామ్యం వచ్చింది. ఆరోజున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల యొక్క తలసరి ఆదాయం వచ్చేసరికి రూ.82,870లు మనకు, తెలంగాణాకు రూ.1,12,162లు ఉండేది. అంతకుముందు సమైక్యాంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు మొత్తం లెక్క వేసుకుంటే రూ.89,214లు తలసరి ఆదాయంగా ఉండేది. రాష్ట్రం విడిపోతూనే మనకు రూ.82,870లుగా అయ్యి, తెలంగాణా రాష్ట్రానికి రూ.1,1,2,162లు అయింది. అంటే, ఆటోమేటిక్‌గా ఇక్కడ నష్టం, అక్కడ లాభం వచ్చింది. అది అందరూ ఒప్పుకున్నారు.

అధ్యక్షా, అదేమాదిరిగా ఈ మూడు సంవత్సరాలు మనం చాలా కష్టపడ్డాము. ప్రతి సంవత్సరం కొద్ది కొద్దిగా పెరుగుతున్నాము. నిన్న, మొన్న అది కూడా అన్నారు. మీరందరూ బాగా సహకరించి ఉంటే ఇంకా బాగా ముందుకు పోయి ఉండేవారం కానీ, కేంద్రప్రభుత్వం సరిగ్గా సహకరించకపోయినా కూడా ఈ దేశంలో డబుల్ డిజిట్ గ్రోత్ వచ్చిందంటే నెం.1 గ్రోత్ వచ్చిందంటే, దానికి ఆంధ్రప్రదేశే కారణం. జాతీయస్థాయిలో వాళ్ళు కూడా 2, 3 శాతం చూపించడానికి ఇది కూడా ఉపయోగపడింది. మన కష్టం, ఇక్కడ అధికారుల సహకారం, రాత్రింబగళ్ళు ప్రజలు చూపించిన చొరవతో మనం పెరిగితే, గ్రాడ్యువల్‌గా 50.69శాతం నుంచి 51.01 శాతానికి మరుసటి సంవత్సరానికి వచ్చాము. ఆ తరువాత సంవత్సరంలో అంటే, 2015-16 సంవత్సరంలో 51.80శాతం, 2016-17లో 51.97శాతానికి వచ్చాము. ఇప్పుడు ఇంకొంచెం పెరుగుతోంది. ఈ నిష్పత్తిలో పోయినా తెలంగాణ మరియు దక్షిణాది రాష్ట్రాలను చేరుకోవాలన్నా కూడా ఇంకా దాదాపుగా 10 సంవత్సరాలు పడుతుంది. కనీసం మీరు 8, 9 సంవత్సరాలు అయినా పడితే అది కూడా నెం.1 అభివృద్ధి ఉంటేనే సాధ్యమవుతుంది. అది కూడా మీరు పూర్తిగా సహకరించమంటే సహకరించకుండా, సహాయనిరాకరణ చూపిస్తుంటే ఇంక ఏం చేయాలని అడుగుతున్నాను.

అధ్యక్షా, మరొక ప్రక్కన చూస్తే, మన రాష్ట్రం యొక్క తలసరి ఆదాయం 2013-14వ సంవత్సరంలో రూ.82,870లు అయితే, తెలంగాణ రాష్ట్రంలో రూ.1,12,182లు, తమిళనాడు రూ.1,16,583, కర్ణాటక రూ.1,19,023, కేరళ రూ.1,23,388లుగా ఉన్నది. వాళ్ళకు మనకు ఉన్న తేడాను కనుక మీరు గమనించినట్లయితే, దాదాపుగా రూ.30,000ల నుంచి రూ.35,000ల తేడా ఉంది. అక్కడ నుంచి ఎంతవరకు పెరిగామంటే, అందరికంటే ఎక్కువగానే పెరిగాము. 2013-14వ సంవత్సరంలో 10.96శాతం, 2014-15వ సంవత్సరంలో 13.07శాతంగాను, 2015-16వ సంవత్సరంలో 15.44శాతంగాను, 2016-17లో 13.14 శాతానికి పెంచాము. ఇప్పటికి వచ్చిన అంకెలను మీరు చూస్తే, ఇప్పుడు వచ్చిన అంకెల ప్రకారం చూస్తే, కొన్ని రాష్ట్రాల అంకెలే వచ్చాయి, మిగిలిన రాష్ట్రాలవి లేవు కాబట్టి, నేను ఆ అంకెలు ఇవ్వడం లేదు. ఇవి కూడా గత సంవత్సరం లెక్కలు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,22,376 అయితే, తెలంగాణలో రూ.1,57,612లు, తమిళనాడు రూ.1,53,243లు, కర్ణాటక రూ.1,57,474లు, కేరళ రాష్ట్రం యొక్క అంకెలు ఇంకా అందుబాటులో లేవు. ఈ లెక్కలు ఈ మాదిరిగా ఉంటే ఇప్పుడు మీరు చెప్పిన సమాధానం ఏమిటి?

భారతదేశం మొత్తం మీద మీరు మెరుగ్గా ఉన్నారు. మీకు మేము ఎందుకు ఇవ్వాలి? అంటున్నారు. తమ ద్వారా నేను వారిని అడుగుతున్నాను అసలు ఇది ఎక్కడి వాదం అండి? అసలు ఆంధ్రప్రదేశ్‌ను వేరే రాష్ట్రాలతో మీరు ఏ విధంగా పోలుస్తారు? మాకు విభజన జరిగింది. మేము కష్టపడ్డాము. గతంలో మేము కష్టపడిన ఆస్తులను, సంపదలను అన్నీ వదులుకుని వచ్చాము. అలాంటప్పుడు ఈ రాష్ట్రానికి చేయూతనివ్వవలసిన బాధ్యత కేంద్రానికి ఉందా, లేదా అని అడుగుతున్నాము. అధ్యక్షా, ఈనాడు అవే సెంటిమెంట్సు ఇక్కడ ఉన్నాయి. ఆ విషయమే మీరు ఆ రోజున పార్లమెంటులో చెప్పారు.

అధ్యక్షా, ఆనాడు కాంగ్రెస్ పార్టీ పార్లమెంటులో విభజన బిల్లు పెడితే, దానిని సమర్థించే సమయంలో పార్లమెంటులో చాలా స్పష్టంగా చెప్పి ఇప్పుడు నేను చెప్పినదాని ప్రకారం ఆరోజున ఇదే ప్రధాన మంత్రిగారు చెప్పారు. కేవలం ఇదే కాదు, ఇంకా నాలుగైదు అంశాలు చెప్పారు. అందులో టాక్స్ ఇన్‌సెంటివ్, మరొక ప్రక్కన అభివృద్ధి కోసం చాలా స్పష్టంగా యాక్టులో లేకపోయినా రాయలసీమ నార్త్ ఆంధ్రకు ఏమి ఇస్తామంటే, కోరాపుట్, బోలంగిరి, కలహండి ప్రాజెక్టును ఇస్తామన్నారు. ఇది నేను చెప్పలేదు, ఆనాటి ప్రధానమంత్రి చెప్పారు. ఈరోజు ఎందుకు వివక్ష చూపిస్తున్నారని అడుగుతున్నాను. ఆరోజు కాంగ్రెసు పార్టీ బిల్లు పెట్టి, కొన్ని అంశాలను తీసుకువచ్చి, ఆ తరువాత కాదు అన్నప్పుడు కొన్ని ప్రకటనలు ఇచ్చిన తరువాత కూడా, ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం సంతృప్తి చెందలేదు. 125 సంవత్సరముల కాంగ్రెస్ పార్టీ, అదే సమయంలో 10 సంవత్సరములలో కేంద్రంలోను, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని ఏం చేశారో మనమే చూస్తున్నాము. ఎక్కడా అడ్రెస్ లేకుండా ఈ మెంబర్లలో ఎవరూ ఎక్కడా ఉండే పరిస్థితి లేదు. అలాంటి సెంటిమెంటు వచ్చిన తరువాత మీకు బాధ్యత ఉందా లేదా అని అడుగుతున్నాను. ఆ విషయాలు కూడా చెబుతాను.

అధ్యక్షా, మరొక ప్రక్కన పోలవరం ప్రాజెక్టును చూసినట్లయితే, చాలా స్పష్టంగా చెప్పారు, ఆ వివరాలను కూడా తమ ద్వారా అందిస్తాను. మళ్ళీ వాటిని రీ-ఇన్‌ఫోర్స్ కూడా చేశారు. మేము తప్పకుండా పోలవరానికి అన్నీ చేస్తామని ఆనాడు చెప్పారు. ఇంకొక ప్రక్కన చూసినట్లయితే, ఈ రాష్ట్రాన్ని నోటిఫై చేసే లోపలే అన్ని సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. ఇప్పటికి నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యింది. ఇంకా ఏ సమస్యలూ పరిష్కారం కాకుండానే, మనం ముందుకుపోయే పరిస్థితి వస్తోంది. ఇక రిసోర్స్-గ్యాప్‌కి సంబంధించి చూస్తే, దానిగురించి ఆయన పార్లమెంటులో చెప్పారు. మేము ఈ బడ్జెట్‌లోనే పెడతాము. రూ.16,000కోట్లు ఇంకా తక్కువ ఉంది. ఎంత ఉంటే అంత పెడతాము. అంచనాలు వేయాల్సింది గవర్నరు మరియు రాష్ట్రాలలో సిఎజి వాళ్ళు చేస్తే, మేము పెడతామని ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చినటువంటి హామీ ఇది. వీటన్నింటిని ఈరోజున మీరు నీరు గార్చేసి ఎక్కడికక్కడ చేసేంది చూస్తే - చాలా క్యాజువల్‌గా మీకు ఇంతే వస్తుంది, ఇంతే తీసుకోండని అప్రూవల్ తీసుకున్నారు. అందుకని ఇక్కడకు వచ్చినప్పుడు నేను ఇంతకు మునుపే చెప్పాను, కేవలం ఈ రెండే కాకుండా ఈ రోజున అప్పు దాదాపు రూ.1,30,000కోట్లుగా వచ్చింది. ఇప్పటికి కూడా రూ.24,000కోట్లు రెండు రాష్ట్రాల మధ్య డివైడ్ చేయాల్సింది ఇంకా డివైడ్ చేయకుండానే ఆంధ్రప్రదేశ్ అకౌంట్‌లోనే ఉంది. వాటికి వడ్డీ మనం కడుతున్నాము. ఇప్పటికీ ఇంకా సెటిలయ్యే పరిస్థితి లేదు.

అధ్యక్షా, మరొక ప్రక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాదో, బెంగుళూరో, చెన్నై లాంటి సిటీలు లేవు. మన రాష్ట్రానికి సర్వీసు సెక్టారులో చాలా తక్కువ ఆదాయం వస్తుంది. ఉద్యోగ అవకాశాలు కావాలంటే వేరే రాష్ట్రాలకు వెళ్ళవలసి వస్తుంది. భవిష్యత్తులో ఈ సర్వీసు సెక్టారు యొక్క ఆదాయమే మెరుగవుతుంది. సర్వీసు సెక్టార్ ఇక్కడ వస్తుందంటే, పట్టణాలలో వచ్చే పరిస్థితి వస్తుంది. దానిని కూడా మనం గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఉంది. ఇటువంటివన్నీ ఉన్నప్పుడు ఒక ప్రక్క వ్యవసాయ రంగం కూడా ఎక్కువగానే ఉన్నది. వ్యవసాయ రంగంలో ఆదాయం

ఎక్కువ ఉండదు. సర్వీసులు, పరిశ్రమలు ఉంటేనే ఎక్కువ ఆదాయం వస్తుంది. అలాంటప్పుడు మనం పరిశ్రమలను, వాటి సర్వీసులను కూడా బాగా ఎక్కువగా అభివృద్ధి చేసుకోవాలి. వీటికి మళ్ళా పెట్టుబడులు, ఇన్‌సెంటివ్స్ ఇవ్వవలసిన అవసరం ఉంది. ఇది ఏ విధంగా చేయాలో చేయకుండా మీరు మమ్మల్ని వదిలిపెట్టే పరిస్థితి వస్తే ఇది ఏవిధంగా అవుతుందని తమ ద్వారా అడుగుతున్నాను.

అధ్యక్షా, ఆనాటి ప్రధానమంత్రిని మీరు చూసినప్పుడు ఈయన క్యాండేట్ గుల్బర్గాకి వెళ్ళారు. అప్పుడు గుల్బర్గాకి వెళ్ళి ఏం చెప్పారు – పురుడు పోసి తల్లిని చంపేశారు. మేమయితే మాత్రం తల్లికి–బిడ్డకు న్యాయం చేసే వాళ్ళం అన్నారు అయిపోయింది. మీరు అధికారంలోకి వచ్చారు, మమ్మల్ని నమ్మారు. వచ్చారు, మాకు న్యాయం చేయాలి. అదేమాదిరిగా తిరుపతికి వస్తే ఏం చెప్పారు – చాలా పెద్ద ఎత్తున తిరుపతిలో గానీ, ఇక్కడ అమరావతి శంకుస్థాపనకు వచ్చిన సందర్భంలో గానీ, విశాఖపట్టణంలో కూడా ఆరోజున వచ్చినప్పుడల్లా చాలా విషయాలు చెప్పారు. అమరావతి రాజధానిని మరియు నవ్యాంధ్రప్రదేశ్ రాజధానిని దిల్లీ కంటే బావుంటుందని, దానికి పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. అంటే, కేవలం రూ.1,500కోట్లతో నూతన రాజధాని వస్తుందాండీ? అదేమాదిరిగా విజయవాడ, గుంటూరుకు కూడా రూ.500కోట్ల చొప్పున శ్రీ ఎం. వెంకయ్య నాయుడు గారు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చారు. కేవలం దాంతోనే అభివృద్ధి అయిపోతుందా? వేరే రాష్ట్రాలకు మీరు ఏ విధంగా ఇచ్చారు? నిన్న కూడా బడ్జెట్‌లో ఎంత పెట్టారు? అహ్మదాబాదు మెట్రో, ముంబయి మెట్రో, ఇతర మెట్రోలకు ఎంతెంత ఇచ్చారు? ఈ అమరావతి మీకు ఎందుకు కనపడడం లేదు?

అధ్యక్షా, ఒక్క మాటలో చెప్పాలంటే ఈరోజున మన అమరావతి ఈ సందర్భంలో మనం నిర్మించుకునే నూతన రాజధాని. ఇది ఎక్కడా రాదు. ఇప్పుడు ఎగ్జిస్టింగ్ సిటీని మనం అభివృద్ధి చేయడం లేదు. ఒక గ్రీన్ ఫీల్డ్ సిటీని మనం అభివృద్ధి చేస్తున్నాము. కనీసం దేశానికి కూడా గౌరవం ఉండేది. ప్రతిష్ట పెరిగేది. మనమందరం కలిసి ఒక బ్రహ్మాండమైన రాజధానిని కట్టి ఉంటే, ఎంత పేరు వచ్చేది. నన్ను ప్రపంచం అంతా పేరు పేరునా అడిగేవారు. మీకు అందరి దగ్గర నుంచి సహకారం వస్తోందా? వేరే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మీకు సహకరిస్తున్నాయా అని చాలామంది అడిగారు. ఎందుకంటే క్రొత్త రాష్ట్రం కాబట్టి కో–ఆపరేటివ్ ఫెడరలిజం వాళ్ళందరూ సహకరించాలి అని అడిగితే నేను అప్పుడు ఆ రోజు చెప్పింది కూడా కొంతమంది సహకరిస్తున్నారు, ఆశీర్వదిస్తున్నారని చెప్పాం కానీ, సహకరించవలసిన కేంద్రప్రభుత్వమే సహకరించడం లేదు. ఆ విషయాలన్నీ మనం ఒకసారి ఆలోచించవలసి ఉంది. ఇక్కడ చెప్పడమే కాదు, ఇంకొక ప్రక్కన మీరు చూస్తే, ఈ రాష్ట్ర అభివృద్ధి బాధ్యత మాదేనని, అమిత్‌షా కూడా వచ్చి ఇక్కడ చెప్పి వెళ్ళారు.

అధ్యక్షా, తమ ద్వారా నేను అడిగేది ఏమిటంటే – ఈరోజున ఇంత మంది ఇక్కడకు వచ్చి చెప్పిన తరువాత, ఏమి జరిగిందని మనం ఒకసారి ఆలోచిస్తే, 29సార్లు దిల్లీకి వెళితే, ఇంకొకాయన ఎందుకు పోయారని మాట్లాడుతున్నారు. చాలామంది నేను అసమర్థుడనని అంటున్నారు. నేను అసమర్థుడిని కాదు. నేను అడగవలసిన

విధంగా గట్టిగానే అడిగాను. చెప్పే రీతిలోనే గట్టిగానే చెప్పాను. కానీ, ప్రధానమంత్రికి ఇవ్వవలసిన విధంగానే గౌరవం ఇచ్చాను. కానీ, వాళ్ళు చెప్పినవన్నీ ఇవ్వలేకపోయారు కాబట్టి, ఇప్పుడు నాకు విధి లేని పరిస్థితిలో ఏమి చేస్తారో చూస్తున్నాము. నామీద వేరే వాళ్ళందరినీ రెచ్చగొడుతున్నారు. ఎదురు దాడి చేస్తున్నారు. అయినా కూడా నేను చాలా సంక్షోభాలు చూశాను. నేను భయపడే పరిస్థితి లేదు. రాష్ట్ర ప్రజల కోసం పోరాడతాను తప్ప వెనక్కి తిరిగే సమస్యే లేదు.

అధ్యక్షా, అదే సమయంలో మీరందరూ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. ఆగస్టు క్రైసిస్. ఆరోజున ఇదేవిధంగా శ్రీమతి ఇందిరాగాంధీ గారు ఆలోచించారు. నందమూరి తారక రామారావు గారిని బర్తరఫ్ చేస్తే, ఈయన భయపడిపోయి మళ్ళా సినిమాలలోకి వెళ్ళిపోతాడని, తెలుగుదేశం పార్టీ ఉండదని ఆలోచించారు. కానీ, ఆరోజున ఎన్.టి.రామారావు గారిని బర్తరఫ్ చేస్తే, తిరిగి కేవలం 30 రోజుల్లోనే పోరాడి, ప్రపంచం దృష్టికి తీసుకువచ్చి, అందరిపైనా ఒత్తిడి తీసుకువచ్చి ఇది అన్యాయమని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, తప్పకుండా ఎన్.టి. రామారావు గారిని ముఖ్యమంత్రిగా చేయమని ప్రపంచం మొత్తం ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. మొట్టమొదటిసారి శ్రీమతి ఇందిరా గాంధీ గారి జీవితంలో తిరిగి ఎన్.టి.రామారావు గారిని ముఖ్యమంత్రిని చేశారు. ఆవిడ నిర్ణయాన్ని మార్చుకున్నారు.

అధ్యక్షా, ఇది ఒక చరిత్ర. మీరందరూ దీనిని గుర్తుపెట్టుకోవాలి. ఈరోజున తెలుగుదేశం పార్టీలో సభ్యుల సంఖ్య తక్కువగా ఉండచ్చు. ఒకప్పుడు ప్రధాన ప్రతిపక్షంగా పనిచేశాము. 35 మందితో బీజేపి పార్టీలో ఇద్దరు సభ్యులు ఉన్నప్పుడు 35 మందితో తెలుగుదేశం పార్టీ పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నది. ఆనాడు శ్రీమతి ఇందిరా గాంధీ మరణానంతరం శ్రీ రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి అయినప్పుడు పని చేసినది తెలుగుదేశం పార్టీనే. అదేమాదిరిగా మొన్న మీరు తెలుగుదేశం పార్టీలో సంక్షోభాలని చూశారు. చాలా సమస్యలు వచ్చాయి.

డా.వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కొన్ని వందల మంది కార్యకర్తలు చనిపోతే ఏ మాత్రం కూడా లెక్కపెట్టకుండా మా ఇంట్లో ఒకరిని చంపితే ఇంకొకరం మేము రెడీగా ఉన్నామని పార్టీ కోసం పనిచేశారు తప్ప, ఎక్కడా వెనుతిరగలేదు. అది తెలుగుదేశం పార్టీకి ఉండే బలం. మొన్న కూడా తెలుగుదేశం పార్టీని దృష్టిలో పెట్టుకునే చేశారు. మొన్నవిభజన చేసినప్పుడు కనీసం 10 సంవత్సరములు అపోజిషన్ లీడర్‌గా లేరు. నేను 9 సంవత్సరములు సమైఖ్యాంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిని. ఇంత అనుభవం ఉన్న వ్యక్తిని ఆనాడు ఒక్క మాట కూడా అడగకుండా ఏకపక్షంగా చేశారు. ఆరోజు కాంగ్రెస్ పార్టీ పోరాడలేకపోయింది. ఆనాటి ప్రభుత్వం కూడా పోరాడలేకపోయింది. ఈరోజున ప్రభుత్వం మీద ఒకటి గుర్తుపెట్టుకోవలసిన అవసరం ఉంది. రాష్ట్ర ప్రజల కోసం పోరాడే శక్తి ఉండే ప్రభుత్వం ఈ తెలుగుదేశం ప్రభుత్వమేనని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, హక్కుల కోసం పోరాడతాం. ఎట్టి పరిస్థితులలో సాధించుకునే వరకు నిరసన తెలియచేస్తాం. ఇది తప్పదు. అందుకే ఈనాడు మీరు చూసినప్పుడు ఈ రీ-ఆర్గనైజేషన్ చట్టంలో పెట్టిన విషయాలు మీరు చూస్తే, చాలా

వరకు వీళ్ళు చేయనప్పుడు ఇప్పటి వరకు మేము వాళ్ళకి చాలా లేఖలు వ్రాశాము. అదేమాదిరిగా మీరు మొన్న ఒకసారి ఇదంతా ఏ విధంగా జరిగిందో, అన్నీ వివరంగా ప్రధానమంత్రిగారికి ఒక లేఖ రూపంలో వ్రాసి ఇవ్వడం జరిగింది.

మ.02.30

అధ్యక్షా, రాష్ట్ర విభజన చట్టంలో పెట్టిన అంశాలు చూస్తే చాలావరకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకూ ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందిగా చాలా లెటర్స్ రాశాను. మొన్నకూడా ఏవిధంగా అన్యాయం జరిగిందో వివరిస్తూ, ఇచ్చిన హామీలు అమలు చేయాల్సిందిగా ప్రధానమంత్రి గారికి కూడా ఒక లెటర్ ఇవ్వడం జరిగింది. ఇంకొక ప్రక్కన మీరొకసారి చూస్తే ప్రత్యేక హోదాలో కూడా నేను ఇంతకు ముందే చెప్పినట్లు లెటర్స్ అన్నీ ఉన్నాయి. బిజెపి సభ్యులు కావాలంటే చూసుకోవచ్చు. బిజెపి ప్రభుత్వాన్ని సపోర్టు చేసే వాళ్లు కూడా చూసుకోవచ్చు. ఇది గోవిందరావు ఇచ్చిన లెటరు.(సభలో లెటర్ చూపిస్తూ) చాలా స్పష్టంగా మేము మెన్షన్ చేయలేదని చెప్పిన లెటర్ ఇది. అదే విధంగా మీరొకసారి ఈ లెటర్ చూస్తే Y.V.Reddy open heart with R.K. దీనిలో చైర్మన్ Y.V.Reddy వ్యాఖ్యలు, అదే విధంగా నిన్న, ఈ రోజు కేంద్ర మంత్రులు చెప్పినవి కూడా ఇక్కడ ఉన్నాయి. వారు కూడా చెప్పిన దాని ప్రకారం ఎక్కడా 14వ ఆర్థిక సంఘం చెప్పలేదని స్పష్టంగా చెప్పారు. ఈ రోజు 14వ ఆర్థిక సంఘం చెప్పనప్పుడు మొన్ననే మీరు చూస్తే లోక్‌సభలో సమాధానమిస్తూ Since 14th Finance Commission in its recommendations has not made any distinction between Central Category States and Special Category States in the horizontal distribution of sharable taxes among the States, no state is being considered for grant of Special Category Status for plan assistance. అని మొన్ననే అక్కడ ఇవ్వడం, నిన్న మళ్లీ మీ మంత్రి చెప్పినప్పుడు ఎక్కడా కూడా ఇవి లేవనే పరిస్థితికి వచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశానికి ఒక స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. 14వ ఆర్థిక సంఘం చెప్పింది. 14వ ఆర్థిక సంఘం చెప్పకపోతే ఎందుకు ఇవ్వరు? ఇది మా హక్కు క్రింద అడుగుతున్నాం. ఎట్టి పరిస్థితిలో ప్రత్యేక హోదాను సాధించే వరకు తెలుగు జాతి విశ్రమించదు. దానిని సాధించుకోవడం కోసం అన్ని విధాలా పోరాడతాం. దీనిలో ఏ కన్ఫ్యూజన్ లేదు. కొన్ని పార్టీలు నాటకాలు ఆడుతున్నాయి. ఆ నాటకాలతో ప్రజలకు సంబంధం లేదు. 90:10 శాతం Centrally Sponsered Schemes క్రింద రావాలి. 90:10 శాతం Externally aided projects లో share రావాలి. అదేవిధంగా మిగిలిన చిన్న చిన్నవన్నీ కూడా రావాలి. అదే విధంగా Tax incentives North Eastern States కు ప్రత్యేక హోదా ఇచ్చినట్లే ఇస్తారా, లేదంటే ప్రత్యేకంగా జీ.ఓ ద్వారా ఇస్తారా అని అడుగుతున్నాను. ప్రత్యేక హోదాను ఎట్టి పరిస్థితిల్లోనూ ఇవ్వాల్సిందిగా ఈ రోజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను. ఇక్కడ సభ్యులు అందరూ చెప్పిన అంశాలపై చాలా స్పష్టత ఉంది. ఇప్పుడు ఈ విషయాన్ని తప్పించుకోవడానికి అనేక విషయాలు చెప్పి, ప్రజల్లో చులకన అయ్యారు తప్ప ఇంకొకటి కాదు. మీరు స్పెషల్ అసిస్టెంట్స్ ఇస్తామని చెప్పి ఆ డబ్బులు కూడా ఇవ్వలేదు. ఇప్పుడేమో స్పెషల్ పర్పస్ వెహికల్ (SPF) పెట్టుకోండి, నాబార్డు నుంచి ఇప్పిస్తాం, మీ ఎఫ్ఆర్‌బిఎంలో

పెట్టుకోండి మేము మీకు ఎప్పుడో ఇస్తాం, లేకపోతే ఏదో ఒకటి చేస్తామంటే మన లెక్కలో మనం డబ్బులు తీసుకుంటే ఎప్పుడో తిరిగి చెల్లిస్తామని అంటున్నారు. అదే వేరే రాష్ట్రాలకు 90:10 శాతంలో ఇస్తున్నారు, అలాగే మాకు కూడా ఇస్తే పది సంవత్సరాలు కలిసివస్తుంది, ఆ అవకాశం మాకు ఎందుకు ఇవ్వరు? మాకు కూడా ప్రతి సంవత్సరం రూ.3,500కోట్లు కలిసొస్తే, ఆ డబ్బులు వేరే కార్యక్రమాలకు ఖర్చు చేసుకునేవాళ్లం. అది చేయలేదు కాబట్టి మనకు ఆర్థికంగా ఇబ్బందులు వచ్చే పరిస్థితి వచ్చింది. ఆ విషయం మీరు గుర్తు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది.

రెండవది ఈ రోజు మీరు చూసినప్పుడు రెవెన్యూ డెఫిసిట్‌లో మీరు చెప్పింది ఏ మాత్రం సబబు కాదు. మొత్తం కలిసి మనకు రూ.16,000కోట్లు రావాలి. చివరికి మీరు రూ.16,072కోట్లు ఇవ్వాల్సి వస్తే, రూ.3979కోట్లు వస్తుందని, ఇంకా ఇవ్వాల్సింది రూ.138కోట్లేనని, లేకపోతే వేరే ఫార్ములా ప్రకారం తీసుకుంటే మరికొద్దిగా వస్తుంది, అది కూడా రూ.1500కోట్లు వస్తుంది. కాబట్టి, అంత వరకే ఇస్తామనే పరిస్థితికి వచ్చారు. ఇవి నేను చెప్పిన లెక్కలు కాదు అధ్యక్షా. ఇవి ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్‌గా ఉన్న వ్యక్తి ఒక లెటర్ రాశాడు, అతను లెటర్ వ్రాసిన తరువాత మొత్తం రూ.15,691కోట్లు రావాలని ఫైనాన్స్ సెక్రటరీ లెటర్ వ్రాశారు. దీనికి ఒక కమిటీ కూడా వేశారు, ఆ కమిటీకి బాధ్యత వచ్చిన వెంటనే ఎనలైజ్ చేసి 2014-15 బడ్జెట్‌లో పెట్టాలని చెబితే ఇన్ని సంవత్సరాలు అయినా దానిని ఇచ్చే పరిస్థితిలో లేరు. అదే విధంగా సిఎజీని చాలా స్పష్టంగా ఎస్టాబ్లిష్ చేశారు. వాళ్లు కూడా సీఎజీకి చెప్పినప్పుడు ఇది వాస్తవం వీరికి నష్టం జరిగిందని చెప్పారు.

అధ్యక్షా, వాళ్లు లేనిపోని అడ్డంకులు పెట్టి ఇచ్చే డబ్బులు ఇవ్వకుండా చేస్తున్నారు తప్ప ఇంకొకటి కాదు. మొత్తం ఈ రోజు వారు ఇచ్చినది చూసిన తర్వాత మొత్తం నాలుగైదు ఐటమ్స్ తీసుకున్నారు. ఎందుకంటే డబ్బులు కట్ చేయాలి కాబట్టి, ఏ విధంగా కట్ చేస్తే బాగుంటుందని రుణమాఫీ క్రింద రూ.7,069కోట్లు, వృద్ధాప్య పింఛన్లు ఇచ్చారని రూ.3,391కోట్లు కట్ చేశారు. ఫైనాన్షియల్ అసిస్టెన్స్ క్రింద డిస్కమ్స్‌కు రూ.1500కోట్లు, అంటే దాదాపు రూ.11,960కోట్లు కట్ చేశారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు దాదాపు రూ.3,920కోట్లు పిఆర్‌సీని డిఫర్ చేస్తే దానిని పరిగణనలోకి తీసుకోరు. ట్రెజరీలో చివరి రోజు అప్పులు చెల్లించ కుండా 2014-15 ఎకౌంట్స్ అన్నీ కూడా 2015-16లో రూ.2,606కోట్లు చెల్లించాము. పిఎఓలో రూ.117కోట్లు, డిడబ్ల్యులో రూ.469కోట్లు, అంటే దీనిని పరిగణనలోకి తీసుకోరు. మరొక ప్రక్క పెన్షన్ ఇచ్చేటప్పుడు రూ.200ల చొప్పున ఒక నెలకే తీసుకుంటారు, 10 నెలలకు తీసుకోరు. 200+200 కలిపి రూ.400 ఇస్తారు. దానిని పరిగణనలోనికి తీసుకుంటే రూ.1,985కోట్లు వస్తుంది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా, మరొక ప్రక్కన చూస్తే వీళ్లు ఇచ్చిన డబ్బులు కూడా చాలా తక్కువ. 2015-16లో ఫైనాన్స్ కమీషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం రూ.6,609కోట్లు లోటు బడ్జెట్ క్రింద ఇచ్చారు. కానీ, లోటు బడ్జెట్‌ను రూ.58,624కోట్లుగా ప్రాజెక్టు చేస్తే మనకు వచ్చింది రూ.44,742కోట్లు. అంటే రూ.13,882కోట్ల ప్రాజెక్షన్‌కి, అసలుకు డిఫరెన్స్ వచ్చింది. రెండూ లెక్క వేసుకుంటే దగ్గర దగ్గర రూ.20,300కోట్లు మనకు ఇవ్వాల్సి వస్తే, మనకు వచ్చింది రూ.6,600కోట్లు మాత్రమే వచ్చే సంవత్సరానికి బడ్జెట్‌లో రూ.4,903కోట్లు పెట్టారు. ఇక్కడ

కూడా రూ.18,958కోట్లు ప్రొజెక్షన్‌లో డిఫరెన్స్ ఉంది. అంటే వాళ్లు ఇచ్చిందే తక్కువైతే దానిని కూడా పెట్టి మేము ఇవ్వడం లేదని వారు మాట్లాడం ఎంత వరకు సబబు అని అడుగుతున్నాను.

ఇంకొక ప్రక్కన పోలవరం ప్రాజెక్టు. ఈ సభలో మొన్న కూడా మొత్తం దీని గురించే చదివి వినిపించాను. పోలవరం ప్రాజెక్టును ఎ.ఐ.బి.పి క్రింద చేపట్టాలని అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ గారి చివరి కేబినెట్ సమావేశంలో చాలా స్పష్టంగా నిర్ణయం తీసుకున్నారు. సంబంధించి ఒకసారి చూస్తే Last Cabinet meeting of Manmohan Singh ఎఐబిపి నుండి సమాచారం తీసుకున్నాను. అందులో చాలా స్పష్టంగా చెప్పారు. 2013 లాండ్ అక్విజిషన్ బిల్లు తీసుకొచ్చాం. ఆర్ అండ్ ఆర్ సెటిల్‌మెంట్ ఇచ్చాం. లిబరల్ ప్యాకేజీ ఇచ్చాం. అవన్నీ రావాలంటే రూ.16,000కోట్లు పెరుగుతుంది. దాని ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత మాది. మొత్తం ఎన్‌హాన్స్‌మెంట్ ఎంత అయితే అంత ఖర్చు పెడతామని చెప్పి ఆ రోజు ముందుకు పోయారు.

మ.02.40

అదే సమయంలో తెలంగాణాలో ఉన్న 7 మండలాలలను ఏపీలోకి తేకుండా వదిలిపెట్టారు. నేను ఆ విషయం చెప్పాను. First day... రాష్ట్రం ఇంకా రెండుగా నోటిఫై కాలేదు. రాష్ట్రం నోటిఫై అయ్యింది జూన్, 02, 2014న. ప్రధానమంత్రి గారు ప్రమాణస్వీకారం చేసింది మే, 7వ తేదీన. నేను ఆ రోజు దిల్లీకి వెళ్లి ప్రమాణ స్వీకారం అయిన తరువాత చెప్పిందేమంటే- మీరు గాని ఈ 7 మండలాలను మాకివ్వకపోతే నేను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయను, నాకు ఈ పదవి వద్దు, దీనివల్ల అన్యాయం జరుగుతుందని ఆ రోజే స్పష్టంగా చెబితే, ఆ 7 మండలాలను మనకు ఇచ్చారు. ఆ 7 మండలాలు ఇచ్చిన తరువాత కూడా ఇప్పటిదాకా ఎన్ని తిప్పలు పెడుతున్నారండి! ఈ రోజు మనం ఒక ప్రణాళిక పెట్టుకున్నాం. ప్రతి సోమవారాన్ని నేను పోలవరంగా పెట్టుకున్నాను. Virtual Inspection కు వెళుతున్నాము. వారం వారం సోమవారమంతా physical inspection కు వెళుతున్నాం. ఏజెన్సీలు సరిగ్గా పనిచేయకపోతే, అవన్నీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్నాము. ఇవన్నీ స్ట్రీమ్‌లైన్ చేసి ఇన్ని చేస్తే, మొత్తం ఇప్పటివరకు మీరిచ్చినవి చూస్తే రూ.5349 కోట్లు ఇచ్చారు. ఇంకా రూ.2600 కోట్లు దాదాపుగా రావాల్సిన అవసరముంది. ఇందులో రూ.1800 కోట్లు original estimated DPR-1లో ఉంది.

ఇంకోపక్క డిపిఆర్-2 కూడా ఫైనలైజ్ చేయాలి. అది ఫైనలైజ్ చేసి ఇప్పుడు చేసిన పనులకే ఇంకా రూ.1000 కోట్లు ఇవ్వాలి. ఇది కాకుండా రోజురోజుకు బిల్లులు పెరుగుతున్నాయి. ఈ రోజున మనకు చాలా ఇబ్బందులున్నాయి. డబ్బుకు ఇబ్బందులున్నా, ఆర్థికంగా మనకు సమస్యలున్నా పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తే ఈ రాష్ట్రంలో నీటిఎద్దడి ఉండదు, సముద్రంలోకి వృథాగా పోయే నీటిని మనం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు తీసుకువెళ్లొచ్చు. ఇటువైపు పెన్నా వరకు తీసుకువెళ్లొచ్చు. దీనివల్ల ఎనలేని ప్రయోజనాలు వస్తాయనే ఉద్దేశంతో మనం ముందుకు పోయాం. ఒక చిన్న ప్రయోగం చేస్తే, పట్టిసీమ ద్వారా గోదావరి నీళ్లు కృష్ణాకు తీసుకువచ్చి, ఇందులో వాడే నీళ్లు 100 టిఎంసిలు శ్రీశైలంలో పెట్టి రాయలసీమను సస్యశ్యామలం చేయగలిగాము.

అధ్యక్షా, ఈ రోజు ఒక్కటే నా నమ్మకం. వ్యవసాయంలో స్టెబిలిటీ తీసుకువచ్చాము. భవిష్యత్తులో తప్పకుండా ఈ ప్రాజెక్టుల్ని పూర్తి చేసి ఈ రాష్ట్రంలో కరువు అనేది లేకుండా, రాయలసీమ కూడా బ్రహ్మాండంగా ముందుకుపోయే పరిస్థితి వస్తుంది. ఈ యాంగిల్‌లో మనం ముందుకుపోయి, ఈ సంవత్సరం రెండు, మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తాము. అంటే పురుషోత్తపట్నం పూర్తి చేసాము. చింతలపూడి పూర్తిచేస్తున్నాం. దీనివల్ల 200 టిఎంసిల నీరు మనం వాడుకునే పరిస్థితి వస్తుంది.

అధ్యక్షా, ఈ రోజు, నిన్నా, మొన్నా కూడా నేను చూస్తున్నాను. అక్కడక్కడ బిజెపి వాళ్లు మాట్లాడుతున్నారు, ఇంకా కొంతమంది మాట్లాడుతున్నారు. ఈ ప్రాజెక్టులో ఏదో అవినీతి జరిగిపోతోందని మాట్లాడుతున్నారు. ఎక్కడా జరగలేదు. ఈ రోజు సాక్షి పత్రికలో చూస్తే భూసేకరణలో అక్రమాలపై సిబిఐ ఎంక్వైరీ వెయ్యాలని రాస్తారు. అంటే మీ ఉద్దేశమేమిటని అడుగుతున్నాను? ఈ ప్రాజెక్టు రాకూడదు, తెలుగు జాతి బాగుపడకూడదు, కష్టాల్లో ఉండాలి, అడ్డంకులు సృష్టించాలి. ఆ రోజున కూడా ఈ ప్రాజెక్టు కావాలని నేను అడగలేదు. ఆ రోజున నీతి ఆయోగ్ వాళ్లు ఆలోచించి ఇది రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టు. ఉత్తరాదిలో కేంద్రం చేపట్టిన ప్రాజెక్టులేవీ ఇప్పటికీ పూర్తి కాలేదు. ఈ ప్రాజెక్టు పూర్తికావాలంటే అది రాష్ట్రం వల్లనే సాధ్యమనే ఉద్దేశంతో, ఆ రోజు కేంద్ర క్యాబినెట్‌కు రికమెండ్ చేసి మనకిచ్చారు.

అధ్యక్షా, ఈ రోజున మీరు చూస్తే ఉత్తరాదిలో చాలా ప్రాజెక్టులున్నాయి. Kulsi Dam Project ఇంతవరకు ఒక్కపైసా ఖర్చుపెట్టలేదు. Noa DiHing Dam Project ఒక్కపైసా ఖర్చుపెట్టలేదు. Upper Siang Project అరుణాచల్‌ప్రదేశ్‌లో అదేమాదిరిగా ఉంది. Renuka Dam Project హిమాచల్‌ప్రదేశ్‌లో అంతే. Gyspa HE Project హిమాచల్‌ప్రదేశ్‌లో ఒక్కపైసా ఖర్చుపెట్టలేదు. Kishau Multipurpose Project హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో ఒక్కపైసా ఖర్చుపెట్టలేదు. ఒకట్రెండు తప్ప, ఏ ప్రాజెక్టు చూసినా అంతే. Teesta Barrage Project, West Bengal రూ.175 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకోపక్క Saryu Nahar Pariyojana, Uttar Pradesh రూ.1159 కోట్లు ఖర్చుపెట్టారు. మొత్తం జాతీయ స్థాయిలో 16 ప్రాజెక్టులు ఉంటే ఈ 16 ప్రాజెక్టుల్లో ఏదీ పూర్తి కాకుండా ఉంటే, ఈ పోలవరం ప్రాజెక్టు మనకు ఇచ్చిన తరువాత మొన్న కొన్ని అడ్డంకులు వచ్చాయి. ఆ అడ్డంకులు లేకపోయినట్లయితే 2018 కల్లా గ్రావిటీతో నీళ్లు వచ్చేవి. ఈ అడ్డంకులవల్ల ఇప్పుడు ఒక ఏడాది ఆలస్యమైంది. అయినాసరే, 2019కి ఎట్టిపరిస్థితుల్లో గ్రావిటీతో నీళ్లు తీసుకురావాలని ఈ ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉంది.

ఎట్టిపరిస్థితుల్లోనూ, 2019, డిసెంబరుకి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలనుకుంటే, అప్పుడే కుట్రలు కూడా ప్రారంభమయ్యే పరిస్థితులు వచ్చాయి. బిజెపి వాళ్లు ఒకపక్కన మాట్లాడితే, మరోపక్క నిన్న పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ఒక జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టుకి, మీరు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుకుని దీనికి మీరు ప్రైవేటు కాంట్రాక్టులు ఇప్పించుకున్నప్పుడు, ముంపు మండలాల్ని రాష్ట్రపతి ఆర్డినెన్స్ ద్వారా ఇప్పించుకున్నప్పుడు, హైకోర్టును ఎందుకు తీసుకురాలేదని మాట్లాడుతున్నారు. అంటే మీరు అవగాహన ఉండి మాట్లాడుతున్నారా, అవగాహన లేక

మాట్లాడుతున్నారా, ఏవిధంగా చేయాలని మీరు ఆలోచిస్తున్నారు. అంటే, ఈ ప్రాజెక్టు కోసం అక్కడ కాంట్రాక్టరు కూడా ఎవరైతే ముందుకు వచ్చారో అతనికి కొత్తగా వచ్చిన ఎస్టిమేట్స్ ప్రకారం కాదు, పాత రేట్లే ఇస్తున్నాం. అతనికి లాభాలు రావు. కానీ, నేను ఈ రాష్ట్రం నుండే వచ్చాను, ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే, నాక్కూడా మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో ఆ కాంట్రాక్టరు ముందుకు వచ్చారు. ఇది కూడా నేను డిసైడ్ చేసింది కాదు. కేంద్ర ప్రభుత్వం ఇన్‌వాల్వ్ అయ్యి, కేంద్ర ప్రభుత్వంలో ఉండే అధికారులు, రాష్ట్ర ప్రభుత్వంలో ఉండే అధికారులు, అటు మంత్రితోబాటు, మేమందరం అంగీకారం చేసిన తరువాత వాళ్లు పనిచేస్తూ ఉంటే, ఇలాంటి విషయాలు మాట్లాడటం ఏమాత్రం సబబు? ఈ రోజు ఈ రాష్ట్ర ప్రయోజనాలు ఆశించే ప్రతి ఒక్క వ్యక్తి చేయాల్సిన పని పోలవరం రావాలని కోరుకోవాలి. పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు ఒక వరం. ఈ ప్రాజెక్టు సాధించుకోవడం మనందరి బాధ్యతగా ముందుకుపోవాలే తప్ప, ఎవరైనా ఈ ప్రాజెక్టు విషయంలో ఇలాంటి లేనిపోని అనుమానాలు క్రియేట్ చేయడం, అపోహలు సృష్టించడం, అడ్డంకులు సృష్టించడం చేస్తే మాత్రం పరిస్థితి చాలా తీవ్రంగా ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు మనకందరికీ ఒక జీవనాడి. ప్రజలందరూ దీని కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు, ఆతృతతో ఉన్నారు. మొన్న కృష్ణా డెల్టాలో అయితే ఆ నీళ్లు వచ్చిన తరువాత ఎంత ఆనందపడ్డారంటే మాకు దిగుబడి పెరిగింది, పంట ఎక్కువ వచ్చింది, సకాలంలో పంట చేతికి వచ్చిందని రైతులు పండుగ చేసుకునే పరిస్థితి వస్తే, మీ రాజకీయ ప్రయోజనాల కోసం దారుణమైన పరిస్థితులు సృష్టించి, లేనిపోని అడ్డంకులు సృష్టించాలని అనుకుంటున్నారు. ఇది మంచిది కాదని హెచ్చరిస్తున్నానని మీకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, అదే సమయంలో ఈ ప్రాజెక్టుకు రావాల్సింది రూ.58,000 కోట్లతో ఎస్టిమేషన్ వేసి డిపిఆర్-2 ఇచ్చాము. రూ.16,000 కోట్లు పోతే, రూ.42,000 కోట్లు అవుతుంది. అందులో మొత్తం లెక్కేసుకుంటే రూ.58,000 కోట్లలో, రూ.4000 కోట్లు పవర్ ప్రాజెక్టు వస్తుంది. అది మనమే పెట్టుకుంటున్నాము. దాదాపుగా రీహాబిలిటేషన్, ల్యాండ్ అక్విజిషన్‌కు రూ.33,000 కోట్లు అవుతుందని నేను మీకు తెలియజేస్తున్నాను. ఇంకోపక్క ఈ రోజు స్పెషల్ ప్యాకేజీ. నేను ముందేచెప్పాను. ఆ రోజు ప్రధానమంత్రి చెప్పింది ఒక ప్యాకేజ్. ఇప్పుడు మనవాళ్లు ఇచ్చింది చూస్తే, రూ.50 కోట్లు చొప్పున, ఆరు సంవత్సరాలకు ఇస్తామని, అది కూడా మూడు సంవత్సరాలకు రూ.150 కోట్లు చొప్పున ఒక జిల్లాకు ఇచ్చారు. అంతా కలిపినా రూ.1050 కోట్లు ఇవ్వడం జరిగింది. ఇందులో రూ.946.47 కోట్లకు బిల్స్ కూడా ఇస్తే, ఇంతవరకు యు.సి.లు పంపిస్తే, మిగిలిన డబ్బులు మీరు ఇవ్వలేదు. ఇవ్వకుండా పోవడమే గాకుండా, ఇదెక్కడి అన్యాయమో ఏమో గాని... రూ.350 కోట్లు తేది.09.02.2018న ఆర్‌బిఐ వారు రిలీజ్ చేశారు. ఆ డబ్బు మన అక్కౌంట్‌లోకి వచ్చేసింది. ఆ విధంగా వచ్చిన తరువాత, పిఎంఓ ఒప్పుకోలేదని. మళ్లీ మీరు తేది.15.02.2018న రివర్స్ చేసుకున్నారు. ఇదెక్కడి న్యాయమండి? అని నేను అడుగుతున్నాను. ఈ దేశంలో ఇంతకుమునుపు అపోజిషన్ పార్టీలు లేవా? కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు మీరు అపోజిషన్‌లో లేరా? ఆ రోజున కాంగ్రెస్ పార్టీ ఇదే మాదిరిగా చేస్తే మీరు ఒప్పుకుంటారా? రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన డబ్బులకి కూడా మీరు

అడ్డంపడే పరిస్థితి వస్తే, ఎక్కడ చెప్పుకోవాలని అడుగుతున్నాను. ఇది న్యాయమా అని అడుగుతున్నాను. కాబట్టి, ఇది ప్రజలు కూడా ఆలోచించాల్సిన అవసరముంది.

అదే సమయంలో ఇక్కడ ఉండే శాసనమండలి సభ్యులు కూడా గుర్తు పెట్టుకోవాల్సిన అవసరముంది. మనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది చాలా తక్కువ. నేను మళ్లీ డిమాండ్ చేస్తున్నాను. ఆ రోజు రాజ్యసభలో ఇచ్చిన స్ఫూర్తికి అనుగుణంగా ఈ బ్యాక్‌వర్డ్ డిస్ట్రిక్ట్స్ అన్నింటికీ కూడా మీరు డబ్బులు రిలీజ్ చేయాల్సిన అవసరముందని డిమాండ్ చేస్తున్నాను. తరువాత రైల్వే జోన్. ఇప్పుడు కూడా దీని గురించి మాట్లాడుతున్నారు. అది ఇస్తామంటున్నారు. మీరు చట్టంలో ఏం పెట్టారు? ఆరు నెలల లోపల ఫీజిబిలిటీ ఎస్టాబ్లిష్ చేసి, రైల్వే జోన్ ఇవ్వాలనంటే మీరు మాత్రం నాలుగేళ్లు గడిచిన తరువాత మేము ఆలోచిస్తున్నాం, ఈ రోజో, రేపో ఇస్తామని మాట్లాడుతున్నారంటే ఏవిధంగా సబబు అని అడుగుతున్నాను. నిన్నా, మొన్నా ఒరిస్సా ఎంపీలు కూడా స్పష్టంగా చెప్పేశారు. మొన్నటివరకు ఒరిస్సా గవర్నమెంట్‌తో సంప్రదించాలన్నారు. నాకైతే ఆశ్చర్యం వేస్తుంది. మీరు ఎప్పుడూ, ఎవ్వరితో సంప్రదించనే లేదు. మమ్మల్ని సంప్రదించే మీరు వేరే రాష్ట్రాల్లో రైల్వే జోన్స్ పెట్టారా?

మ.2.50

మనం ఆ విషయం అడుగుతున్నాము. మాధవ్‌గారు కూడా చెప్పారు, నేను ఇప్పిస్తాను సార్ అని. ఇప్పుడేంచేశారు అని నేను అడుగుతున్నాను. ఇంకెన్నేళ్లు కావాలి మీకు? ఎప్పుడిస్తారని అడుగుతున్నాను. ఇంకొక్క సంవత్సరమే ఉండేది. ఆ తరువాత ఇచ్చే పరిస్థితి లేదు. చెప్పిన మాట నిలబెట్టుకోవాలి. సరైన సమయంలో ఇవ్వాలి. అప్పుడే ప్రజలు హర్షిస్తారు తప్ప మాయ మాటలు చెప్పి మభ్య పెడితే మాత్రం ప్రజలు ఒప్పుకోరు. ఆ విషయం గుర్తుపెట్టుకోవాలి. అందుకే ఈ విషయంలో రాజీ లేదు. రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు గురించి యాక్టులో పెట్టారు. ఇమ్మని అడుగుతున్నాము. ఇప్పుడేమంటున్నారంటే, 14 శాతం ఐఆర్ఆర్ ఇవ్వాలని అన్నారు. ఐఆర్ఆర్ మేమివ్వాలని ఉంటే మీరివ్వడమెందుకు ప్రైవేటు వాళ్లే వస్తారు కదా. ఎక్కడకు పోతున్నారు? **Is it a commercial venture?** మీరెందుకు పెట్టారంటే ఆదాయం కేంద్రప్రభుత్వానికే ఎక్కువ వస్తుంది. రూ.7,000 కోట్లు ఫారెన్ ఎక్సేంజ్ రిజర్వ్స్ మిగులుతాయి, రూ.1750 కోట్లు ప్రతి సంవత్సరం కేంద్రప్రభుత్వానికి వస్తాయి. ఏం నాలుగేళ్లు మీ ఆదాయాన్ని పోగొట్టుకుని ఇవ్వలేరా? **Is it only notional income?** ఆ ప్రాజెక్టు రాకపోతే ఇన్‌కం రాదు, అలాంటి ఆ ప్రాజెక్టు పెట్టడానికి నాలుగు సంవత్సరాల ఆదాయం మాది కాదు అనుకుని ముందుకు రాలేదు. ఆ తరువాత ఆదాయం వచ్చేది కేంద్రానికే అయినా ఆ విధంగా చేయలేదు. గ్రీన్‌ఫీల్డ్ క్రూడ్ ఆయిల్ రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ పెట్టడానికి హెచ్‌పిసిఎల్– గెయిల్ సంయుక్తంగా ముందుకొచ్చాయి. అవి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా పబ్లిక్ అండర్ టేకింగ్ సంస్థలు. వాటికివ్వండి, వాళ్లు పెడతారు. అంతేగానీ 14 శాతం రాష్ట్రాన్నిమ్మంటే ఎలా? అంత శాతం ఇచ్చేటట్లు ఉంటే ప్రైవేటు వాళ్లే వస్తారు. ఆ విషయమే నేను అడుగుతున్నాను. ఇది సబబు కాదు. కానీ, ఇదే తరహా ప్రాజెక్టును రాజస్థాన్‌లో 12 శాతానికి ఇచ్చారు. చట్టంలో పెట్టినప్పుడు ఒక రాష్ట్రానికి ఒక

రకంగా, మరో రాష్ట్రానికి ఇంకో రకంగా ఇమ్మంటే ఇది ఏ విధంగా సబబు అని అడుగుతున్నాను. దీనిపై కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరముందని నేను తెలియచేస్తున్నాను.

అమరావతి రాజధాని గురించి కూడా చెప్పాలి అధ్యక్షా. 33,000 ఎకరాల భూమిని రైతులు ఇచ్చారు. దాదాపు 40,000 కోట్ల విలువ చేసే భూమి అమరావతిలో ఇస్తే కేంద్రానికి బాధ్యత లేదా సార్? వాటి మీద ఆదాయం కేంద్రానికే వస్తుంది. రాష్ట్రప్రభుత్వ ఆదాయం కంటే కేంద్రప్రభుత్వానికే ఆదాయం ఎక్కువగా వస్తుంది. కొత్త నగరాలలో ఇన్‌కంట్యాక్స్ వంటి వివిధ పన్నుల ద్వారా  కేంద్రానికి ఆదాయం ఎక్కువ వచ్చే అవకాశముంటుంది. అలాంటి ఈ రాజధాని నిర్మాణానికి ఎందుకు ముందుకు రావడం లేదని కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నాను.

అధ్యక్షా, కొంతమంది రకరకాలుగా మాట్లాడుతున్నారు. పవన్ కల్యాణ్ గారు మరోరకంగా మాట్లాడుతున్నారు. ఆయన కూడా రాజధానికి 1500 ఎకరాలు చాలు అని అంటున్నారు. సరిపోతుందనే అనుకుందాము. నేను కూడా అడ్మినిస్ట్రేటివ్ క్యాపిటల్ వెయ్యి, 900 ఎకరాలో కట్టిస్తున్నాము. అది కాదు ఇష్యూ. భువనేశ్వర్‌లో జర్మన్ ఆర్కిటెక్చర్ 34,000 ఎకరాలు ప్లాన్ ఇచ్చారు. జంషెడ్‌పూర్ 35,000 ఎకరాలు. చండీఘర్ రాజధాని నిర్మాణం కొరకు 1996వ సంవత్సరంలో  స్విట్జర్లాండ్, ఫ్రెంచ్, పోలాండ్, అమెరికన్ ఆర్కిటెక్చర్లు 30,000 ఎకరాలు కావాలని డిజైన్స్ ఇచ్చారు. గాంధీనగర్‌కు 32,500 ఎకరాలు రాజధాని కొరకు స్విట్జర్లాండ్, ఫ్రెంచ్ ఆర్కిటెక్చర్లు డిజైన్స్ ఇచ్చారు. నవీ ముంబై 42,000 ఎకరాలు. నయా రాయపూర్‌కు 32,000 ఎకరాలు ఉన్నాయి. నేను అమరావతికి 33,500 ఎకరాలు కావాలని అంటే దానిని ఎందుకు అని ప్రశ్నిస్తున్నారు. ఆనాడు నేను రాజీపడకుండా సైబరాబాదు సిటీ నిర్మాణం చేపట్టకపోయి ఉంటే,  హైటెక్ సిటీ రాకపోయి ఉంటే హైదరాబాదు పరిస్థితి ఏమిటి? అందుకే చెబుతున్నా ఎవరు ఎన్ని అడ్డంకులు  సృష్టించినా ఈ రాజధాని నిర్మాణం ఆగదు. One of the best capital నిర్మాణం చేస్తాము.

(సభ్యుల హర్షధ్వానాలు)

తెలుగుజాతి గర్వపడేలా ఈ రాజధాని ఉంటుందని నేను మనవిచేస్తున్నాను. ఇందులో అనుమానమేమీ లేదు. ఎందుకు మీకు బాధ అని కేంద్రాన్ని అడుగుతున్నాను. అవగాహన ఉందా అని అడుగుతున్నాను. రాజధాని కట్టడం నాకేమీ ఫ్యాన్సీ కాదు అధ్యక్షా.  ఒకమాటలో చెప్పాలంటే ఒక క్రైసిస్ ఇది. దీనిని ఎలా హ్యాండిల్ చేయాలని ఆలోచించినప్పుడు, నా కొలీగ్స్‌తో మాట్లాడినప్పుడు నాకొక  ఆలోచన వచ్చింది. అదే ల్యాండ్ పూలింగ్. డబ్బుల్లేవు. Win win situation లో పోదాము. ప్రజలను చైతన్యవంతులను చేద్దాము. సింగపూర్ ఆర్కిటెక్ట్స్  మాస్టర్ ప్లాన్ ఇస్తామని ముందుకు వచ్చారు. ఇవన్నీ చెప్పిన తరువాత సింగపూర్ కంటే బెటర్ సిటీ కడతామని చెప్పిన తరువాత రైతులందరికీ నమ్మకం వచ్చి ఒక్క శాతం కూడా లిటిగేషన్ లేకుండా 33,000 ఎకరాలు ఇచ్చారంటే ఆ స్పిరిట్‌తో భారత ప్రభుత్వం కూడా ముందుకు రావాలి కదా అధ్యక్షా. అదేమీ లేకుండా మీకింత ఇచ్చాము, అంత ఇచ్చాము అని అంటున్నారు. ఇంకా కొంతమంది డ్రీమ్ క్యాపిటల్ కడతారట అని ఎగతాళి చేస్తున్నారు. ఏమిటండీ ఆ మాటలు?

డెఫినెట్‌గా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజానీకానికి కోరిక ఉంటుంది. మాకు కూడా మరో ముంబయి కావాలని ఉంటుంది. మరో బెంగళూరు కావాలని ఉంటుంది. కొత్త సిటీ కడుతున్నాము. ఏం మనకు కూడా ఆశలు ఉండకూడదా? ఆ కోణంలో మనం ఆలోచిస్తే సహాయం చేయకపోగా ఎగతాళి చేయడం మంచిది కాదు. ఇక్కడ ఉండే రాజకీయ నాయకులకు అవగాహన లేకుండా ఇంత రాజధాని ఎందుకు అంటున్నారు.

అధ్యక్షా, ఈ అసెంబ్లీ, కౌన్సిల్ ట్రాన్సిట్ బిల్డింగ్ అంటున్నారు, ఈ భవనాలు బాగున్నాయి, వీటినే ఉంచవచ్చు కదా, అని ఇంతకుముందు రామచంద్ర రావు గారు మాట్లాడుతూ అన్నారు. డెఫినెట్‌గా ఇవి కూడా బాగున్నాయి. కానీ, వీటిని మరో పర్పస్‌కు ఉపయోగించుకుంటాము. రాజధాని అనేది మన కల. విభజనలో మనకు జరిగిన అన్యాయాన్ని గుర్తుపెట్టుకుని కసితో, కక్షతో బ్రహ్మాండమైన రాజధాని కట్టామనే తృప్తి జీవితంలో తెలుగువారికి శాశ్వతంగా మిగిలిపోవాలి.

(సభ్యుల హర్షధ్వానాలు)

ఆ విధంగా ముందుకు పోవాలి అధ్యక్షా. అందరూ మంచి ఇళ్లు కట్టుకోవాలి, ప్రజలకు మాత్రం ఒక మంచి రాజధాని అవసరం లేదా? ఆ విషయం నేను ప్రతి ఒక్కరినీ అడుగుతున్నాను. ప్రపంచంలో ఉన్న పుణ్యక్షేత్రాలనుండి మట్టిని తీసుకువచ్చాము. పవిత్ర జలాలను తీసుకువచ్చాము. ఈ ప్రాంతాన్నంతా కూడా పవిత్రమైన జలాలతో, మట్టితో పునీతం చేశాము. ఆ సందర్భంగానే ప్రధానమంత్రిగారు కూడా మట్టి, నీరు తెచ్చారు. కానీ, నేను ఆ రోజు గర్వపడ్డాను. మనం చేసిన ఉద్యమంలో భాగస్వాములయ్యారని అనుకున్నాను. డబ్బులివ్వడంలో మాత్రం వెనక్కి వెళ్లిపోయారు. కొత్తగా రాజధాని నిర్మాణమనేది నా ఒక్కడి బాధ్యతా? ప్రధానమంత్రికి బాధ్యత లేదా? కేంద్రానికి బాధ్యత లేదా? ఆదాయం వస్తే మాత్రం కావాలా? ఆదాయాన్ని సృష్టించడం కోసం కలిసి పనిచేయాలి. కేంద్రం, రాష్ట్రం రెండూ కలిసి పనిచేస్తేనే ఆదాయం పెరుగుతుంది. దానిని పెంచేందుకు మార్గాలు ఆలోచించినప్పుడు కేంద్రం కూడా సహకరించాలి. ఉదారంగా ముందుకు రావాలి. కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవడానికి అన్ని విధాలుగా ముందుకు రావాలి తప్ప ఈ విధంగా కేంద్రం చేయడం కరక్ట్ కాదని నేను మనవిచేస్తున్నాను.

దుగరాజపట్నం పోర్టు విషయంలో కూడా ఆల్టర్నేటివ్ ఇవ్వండి చేస్తామని అంటున్నారు. ఆల్టర్నేటివ్ అడగడానికి నాలుగు సంవత్సరాలు పట్టింది. ఎందుకు ఆల్టర్నేటివ్ ఇవ్వాలి? పోనీ అది ఇచ్చినా కడతారని నమ్మకమేమిటి? దీనిని బట్టి మమ్మల్ని అప్రతిష్టపాలు చేయడానికి మీరు ప్రయత్నిస్తున్నారు. యాక్టులో పెట్టింది మీరు ఎందుకు చేయలేకపోతున్నారని నేను కేంద్రాన్ని అడుగుతున్నాను. ముందు దానికి సమాధానం చెప్పండి. దానికి తగిన ప్రపోజల్స్‌తో ముందుకు వస్తే అప్పుడు ఆలోచించవచ్చు. గతంలో కాంగ్రెస్ కూడా ఇలాగే మాట్లాడారు. ఏం ఇస్తారో చెప్పకుండా ఇష్టానుసారంగా చేసి ప్రజలతో కూడా చర్చ చేయకుండా రాజధానిని ఇచ్చే పరిస్థితి తీసుకువచ్చారు. యాక్టులో ఉండే దుగరాజపట్నం కూడా చేయలేదు. మొన్నే లెటర్ వ్రాసి మళ్లా మొదటికి తీసుకువచ్చే పరిస్థితికి వచ్చారు. ఏపి అసెంబ్లీ

సీట్ల గురించి ఒక్కపైసా ఖర్చు లేదు. వాళ్ల ఆలోచనా విధానం నాకు అర్థం కాదు. అటు తెలంగాణా ప్రభుత్వం వారు కావాలన్నారు. ఇటు మనం కూడా కావాలన్నాము. ఎక్కువ సీట్లు ఉంటే సుస్థిరత ఉంటుంది. తక్కువ సీట్లు ఉంటే సుస్థిరత ఉండదు. అందుకని నెంబరు పెంచాలని మన రాష్ట్రంలో 175 నుండి 225 సీట్లు పెంచాలని తెలంగాణాకు 119 నుండి 153 పెంచాలని అనుకున్నారు. దానివల్ల కౌన్సిల్ సీట్లు కూడా పెరుగుతాయి. అందుకు కూడా ఏం ఇబ్బంది ఉంది అని నేను కేంద్రాన్ని అడుగుతున్నాను.

మ.03.00

అధ్యక్షా, అంటే ఇది రాజకీయం కాదా? అందుకే నేను అడగడం మానేశాను. ప్రజలు అనుకుంటే 175లో అన్ని సీట్లు గెలిపించవచ్చు. 225 సీట్లుంటే వాటిలో అన్నీ గెలిపించవచ్చు. ఆ సీట్లు కావాలని నేను అడగడంలేదు. కానీ, మీరు చేసే పనిని, మీ ఉద్దేశాలను తప్పు పడుతున్నాను. ఇక్కడ రెండు ప్రభుత్వాలకీ సీట్లు ఇస్తే వీళ్ళు బలపడిపోతారనీ, వీళ్ళకెందుకు ఇవ్వాలనే ఉద్దేశంతో తాళం వెయ్యాలి కాబట్టి వేశారు. చట్టంలో పెట్టింది కూడా మీరు చెయ్యలేకపోతే ఎలా? చట్టంలో పెట్టిన అంశాలలో ఒక్కపైసా ఖర్చు అవసరం లేకపోయినా మీరు చెయ్యలేదంటే మీ ఉద్దేశాలేమిటని అడుగుతున్నాను. ఇది దురుద్దేశం కాదా?

అధ్యక్షా, విశాఖపట్నం – చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఎన్ఐసిడిఐటిలో (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్)లో కలపమని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాను. అయినా కలపలేదు. దీనిని కలిపితే ఈ కారిడార్‌కు భవిష్యత్తు ఉండడమేగాకుండా మంచి ఉపయోగముంటుంది. అంతేగాకుండా, ఆరోజు విభజన బిల్లులో చాలా స్పష్టంగా ముంబై, ఢిల్లీ ఇండస్ట్రియల్ కారిడార్‌తో సమానంగా దీనికి గుర్తింపునిస్తామన్నారు. అక్కడ **45% Equity from Government of India DIPP, JBIC 26%, HUDCO 19.9%, IIF, CL, LIC 5%**, కేంద్రప్రభుత్వం అయిదు సంవత్సరాలలో రూ.17,000 కోట్లు ఇస్తామని బిల్లులో పెట్టారు. ఆ ఫెసిలిటీ మనకెందుకు ఇవ్వరు? మీరు ముంబై, ఢిల్లీ ఇండస్ట్రియల్ కారిడార్‌లాగా పెడతామని చెప్పి విశాఖపట్నం–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌ను నీరుగార్చే పరిస్థితికి తీసుకువస్తే, ఇదెక్కడి న్యాయమని అడిగితే, దానికి సమాధానం కూడా చెప్పకుండా నిర్లక్ష్యం చేశారు.

అధ్యక్షా, విశాఖపట్నం, విజయవాడ మెట్రో అన్నారు. ఇప్పుడేమో విజయవాడ లైట్ మెట్రో అంటున్నారు. విశాఖపట్నం మెట్రోలో ఇంకా వాళ్ళు చెయ్యలేకపోతే ప్రైవేటీకరణకు వెళ్తున్నాం. ఇవన్నీ బిల్లులో పెట్టి నాలుగు సంవత్సరాలైనా ఇంతవరకూ ఏదీ కావడంలేదు.

అధ్యక్షా, కడప స్టీల్‌ప్లాంట్ విషయానికి వస్తే, ఇది కమర్షియల్ వెంచర్. వయబిలిటీ ఉంది. ఎందుకు మీరు ఇనీషియేట్ తీసుకోరు? ఎందుకు పబ్లిక్‌సెక్టార్ పెట్టరు? పబ్లిక్‌సెక్టార్ పెడితే లిటిగేషన్ ఉండదు. అవసరమైతే కాస్తో, కూస్తో ఐరన్ ఓర్ కావాలంటే పక్క రాష్ట్రాల నుంచి తెప్పించుకోవచ్చు. కానీ, కాలయాపన చేసి డిపిఆర్ రిపోర్టులనీ,

ఎక్స్‌పర్ట్ కమిటీ అనీ మొత్తం అయిదు రిపోర్టులయితే ఇచ్చారు. ఇంతవరకూ మీరు ప్రారంభించే పరిస్థితి లేదు. భూమి ఉంది, నీళ్ళు, విద్యుత్ ఇస్తామన్నాం. మీకు ఇంకేం కావాలండి. 21 రోజులలోనే అనుమతులను ఇస్తామన్నాము. ఎందుకు కడపలో స్టీల్ ఫ్యాక్టరీ పెట్టరో మీరు చెప్పాల్సిన అవసరముందని డిమాండ్ చేస్తున్నాను. What is your constrain? మీకు ఎన్ని సంవత్సరాలు కావాలి? ఈరోజు మమ్మల్ని విమర్శించడానికి, మామీదకు రెచ్చగొట్టడానికి మాత్రం మీకు శక్తి ఉంది. ఆ శక్తిని ఎందుకు ఈ ప్రాజెక్టు మీద ఖర్చు పెట్టలేదని అడుగుతున్నాను. ఆ విషయంలో మీరు సమాధానం చెప్పాల్సిన అవసరముంది.

అధ్యక్షా, ఇంకొకపక్కన అమరావతి కనెక్టివిటీ విషయంలో రైల్ అండ్ రోడ్ ఏర్పాటు చేస్తామన్నారు. అయితే ఇవి కూడా చాలావరకూ పిపిపి మోడ్‌లో వస్తున్నాయి. ఇంకా మనం చేయాల్సింది చాలా ఉంది. అదేమాదిరిగా అమరావతి బాహ్యవలయ రహదారి, అమరావతి–అనంతపూర్ ఎక్స్‌ప్రెస్ వే విషయంలో మనల్నే భూమి తీసుకోమన్నారు. ప్రాజెక్టు ముఖ్యం కాబట్టి ముందు నెగోషియేట్ చేస్తున్నాం. అవసరమైతే దానినికూడా ఇవ్వడానికి ఒకస్టేజిలో సిద్ధపడే పరిస్థితికి వచ్చాము.

అధ్యక్షా, బిల్లులో మొత్తం 11 విద్యాసంస్థలు పెట్టారు. అందులో తొమ్మిది మంజూరు చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ, ట్రైబల్ యూనివర్సిటీ ఇంతవరకూ మంజూరే చెయ్యలేదు. ఎంత డబ్బులు ఖర్చుపెట్టారు? ఐఐటి తిరుపతికి. రాష్ట్ర ప్రజానీకానికి ఒక ఐడియా ఉండాలనే ఒకటికి పదిసార్లు వీటన్నింటినీ చెప్తున్నాను. అలాగే, ఇప్పుడు చేసే తప్పుడు ప్రచారానికి కూడా ఒక హద్దుండాలనే ఉద్దేశంతోనే ఇవన్నీ చెప్తున్నాను.

అధ్యక్షా, ఐఐటి తిరుపతికి మనం 566 ఎకరాల భూమినిస్తే, రూ.3150 కోట్లు అవసరముంటే, ఇప్పటికి వీళ్ళు రూ.115 కోట్లు ఇచ్చారు. ఎన్.ఐ.టి తాడేపల్లిగూడెంకు మనం 73 ఎకరాల భూమినిస్తే, రూ.460 కోట్లు అవసరముండగా, వీరు ఇచ్చింది రూ.110 కోట్లు. ఐఐఎం విశాఖపట్నానికి మనం 242 ఎకరాల భూమినిస్తే, రూ.691 కోట్లు అవసరముండగా, రూ.84 కోట్లు ఇచ్చారు. ఐఐఎస్ఇఆర్, తిరుపతికి మనం 255 ఎకరాలిస్తే, రూ.1613 కోట్లు అవసరముండగా, దగ్గరదగ్గర రూ.111 కోట్లు ఇచ్చారు. సెంట్రల్ యూనివర్సిటీ, అనంతపూర్‌కి రూ.10 కోట్లు మాత్రం పెట్టారు. భూమి కావాలంటే 490 ఎకరాలు ఇచ్చాము. ఈ యూనివర్సిటీకి సుమారు రూ.1100 కోట్లు ఖర్చుపెట్టాల్సి ఉంది. ఐఐపి సంస్థకు 202 ఎకరాలు ఇచ్చాము. దానికి రూ.657 కోట్లు కావాల్సి ఉండగా, ఇన్ని సంవత్సరాలైన తరువాత రూ.85 కోట్లు ఇచ్చే పరిస్థితికి వచ్చారు. అగ్రికల్చర్ యూనివర్సిటీని ముందుగా కేంద్ర సంస్థ అనీ, రూ.1500 కోట్లు ఖర్చు పెడతామంటే 110 ఎకరాలు ఇచ్చాము. దీనికి ఇప్పుడు రూ.135 కోట్లు ఇచ్చి, దీనిని రాష్ట్ర విశ్వవిద్యాలయంగా చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. బీహార్‌లో అగ్రికల్చర్ యూనివర్సిటీని సెంట్రల్ స్థాయిలో ఇచ్చి ఇక్కడెందుకు ఈ వివక్షత చూపుతున్నారని అడుగుతున్నాను. మీరు బిల్లులో పెట్టినా కూడా, ఒక రాష్ట్రానికి ఇచ్చి, మా రాష్ట్రానికి ఇవ్వడానికి మాత్రం మీకు మొహమాటం ఎందుకు అడ్డం వస్తోంది? ఎందుకు మీరు అడ్డుపడుతున్నారో మీరే చెప్పాల్సిన అవసరముంది.

అధ్యక్షా, టిడిఎం, కర్నూలు ఐఐఐటి వాటికి రూ.400 కోట్లు కావాలి. 152 ఎకరాలు ఇచ్చాము. దీనికి రూ.53 కోట్లు ఇచ్చారు. ఇది మన రాష్ట్రంలో కూడా కాదు. తమిళనాడులోని కాం।పురంలో ఉంది. ఇప్పుడు క్లాసులు కూడా జరుగుతున్నాయి. ఆఖరి సంవత్సరం అక్కడే డిగ్రీ తీసుకుని అక్కడ్నించే వెళ్ళిపోతారు వాళ్ళు. ఇదెక్కడి న్యాయం అధ్యక్షా? ఇంకొకపక్కన ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌కు రూ.1618 కోట్లు కావాలి. కానీ, ఇప్పటి వరకూ రూ.54కోట్లు ఇచ్చారు. 185 ఎకరాల మంచి భూమి ఇచ్చాము. మొన్న పోయి వాళ్ళ పార్టీవాళ్ళు కూడా చూసి వచ్చారు. ఈ నిష్పత్తిలో అయితే ఎన్ని సంవత్సరాలకు పూర్తిచేస్తారు? ఒక యాభైసంవత్సరాలకు చేస్తారా? ఎక్కడికి పోతున్నామండి. ట్రైబల్ యూనివర్సిటికి మనం 526 ఎకరాలు ఇచ్చాము. రూ.400 కోట్లు కావాల్సివస్తే రూ. 10 కోట్లు ఇచ్చారు. ఎన్ఐడిఎం, విజయవాడకు 10 ఎకరాలు కావాలంటే ఇచ్చాము. దీనికి రూ.70.87 కోట్లు కావాల్సి ఉండగా రూ.10 కోట్లు ఇచ్చారు. మొత్తం అంచనా రూ.11,672 కోట్లు కావాలి. 2912 ఎకరాల భూమి ఇచ్చాము. కాంపౌండ్‌వాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.132 కోట్లు ఇచ్చింది. వీళ్లు మాత్రం రూ.576 కోట్లు ఇప్పుడు రిలీజ్ చేశారు.

అధ్యక్షా, పైన చెప్పినవన్నీ పరిశీలిస్తే, వీరు ఏ విధంగా చేస్తున్నారో మీకు ఒక ఐడియా వస్తుంది. అదీ వీళ్ళు చేసే పని. ఈరోజు ఇంకొక పక్కన చూస్తే విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలకు అవసరమైన భూమి అంతా మనమే ఇచ్చాము. విజయవాడ విమానాశ్రయానికి 698 ఎకరాలు ఇచ్చాము. ఎకరాకు కనీసం రెండు కోట్ల చొప్పున వేసుకున్నా రూ.1400 కోట్ల విలువ చేసే భూమిని ఇచ్చాము. ఆ విమానాశ్రయానికి భూమి ఇచ్చిన వారందరికీ, ఇక్కడ వేరేచోట భూమినిస్తున్నాం. తిరుపతి విమానాశ్రయానికి 732 ఎకరాలు, రాజమండ్రి మిమానాశ్రయానికి 857 ఎకరాలు ఇచ్చాం. ఇవి ఇస్తే వీళ్ళు కొద్దిగా డబ్బులు ఖర్చుపెట్టి అభివృద్ధి చేసే పరిస్థితికి వచ్చారు.

అధ్యక్షా, షెడ్యూల్-10ని ఒకసారి పరిశీలిస్తే, హయ్యర్ ఎడ్యుకేషన్‌లో అన్యాయం జరిగిందని సుప్రీమ్‌కోర్టుకు కూడా వెళ్ళాం. సుప్రీమ్‌కోర్టువారు కూడా ఒక డెసిషన్ ఇచ్చారు. ఆ డెసిషన్ ప్రకారం జనాభా ప్రాతిపదికపైన ఈ ఆస్తులు పంచుకోవాలని, కేంద్ర ప్రభుత్వం దగ్గరకు వెళ్తే, వారు మనకు సపోర్టు చేయకుండా మనల్ని ఇబ్బంది పెట్టే పరిస్థితి వచ్చారు. దానివల్ల మళ్ళీ సుప్రీమ్‌కోర్టు కంటెంప్ట్ కింద రివిజన్ పిటీషన్‌కుంద మనం వెళ్ళే పరిస్థితి వచ్చింది. కనీసం రెండు రాష్ట్రాల మధ్య సమన్వయం చేసి, సమస్యలను పరిష్కారం చెయ్యడానికి కూడా కేంద్ర ప్రభుత్వానికి సమయం లేదంటే ఏం చెప్పాలో నాకైతే అర్థం కావడంలేదు. ఇంకొకపక్కన ఆంధ్రాభవన్ ఆస్తులు అలాగే ఉన్నాయి. అవికూడా పరిష్కారం కాలేదు. Anomaly in taxation రూ.3820 కోట్లు సెట్ చేయాల్సిన అవసరముంది. దీనిని కూడా చేసే పరిస్థితి లేదు. గ్రేహౌండ్స్‌కు ఇప్పటికీ మీరు చూస్తే రూ.218 కోట్లు ఇచ్చారు.

మ.03.10

అధ్యక్షా, ఇవన్నీ చూసినప్పుడు మమ్మల్ని విమర్శించడం మొదలు పెట్టారు. వారి శక్తినంతా ప్రజల సమస్యలను పరిష్కారం చేయడానికి కాకుండా ఎవరైనా అడిగితే, ప్రశ్నిస్తే వారిమీద ఎదురుదాడి చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. అది మంచి పద్ధతి కాదు. రెవెన్యూ డెఫిసిట్‌కు రూ.3,979కోట్లు ఇస్తే దానికి యు.సిలు అవసరం లేదు. పోలవరానికి రూ.5,363కోట్లు అయితే దానికి కూడా యు.సిలు అవసరం లేదు. వీటికి పిపి అథారిటీ ఉంది, బిల్స్ వాళ్లకి ఇస్తాము, వాళ్లు వెరిఫై చేస్తారు, కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తారు. మనకే డబ్బులు రావాలి. అమరావతికి కేటాయించిన రూ.1000కోట్లకు యు.సి.లు ఇచ్చాము. విజయవాడకు సంబంధించిన రూ.229.65కోట్లకు యు.సి.లు సబ్మిట్ చేయడం జరిగింది. అమరావతికి సంబంధించి రూ.1508కోట్లకు యు.సిలు ఇచ్చాము. వెనుకబడిన జిల్లాలకు రూ.946కోట్లు ఇస్తే మనకు నిధులు ఇచ్చినట్లే ఇచ్చి మరలా వెనక్కి తీసుకున్నారు. మెట్రోరైలుకు రూ.2.56 కోట్లకు యు.సిలు ఇచ్చేశాము. మొత్తంగా రూ.7,619 కోట్లకు యు.సిలు ఇచ్చాము. మిగిలిన పనులు అవుతున్నాయి, ఆ యు.సిలు కూడా సబ్మిట్ చేస్తున్నాము. డాక్యుమెంట్స్‌తో సహా నా దగ్గర వివరాలు ఉన్నాయి. ఎవరికి కావాలంటే వారికి ఇస్తాము, ఆన్‌లైన్‌లో కూడా పెడతాము. యు.సి.లు ఇవ్వలేదు, లెక్కలు చెప్పలేదు కాబట్టి డబ్బులు ఇవ్వడం లేదని చెబితే మాత్రం మంచిది కాదని ఈ సభ ద్వారా కేంద్రప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, కేంద్ర ప్రభుత్వం మిగతా రాష్ట్రాలకు చాలా ప్రాజెక్టులు ఇచ్చింది, అహ్మదాబాదు మెట్రో ప్రాజెక్టుకు రూ.10,573కోట్లు ఇచ్చింది. మరోప్రక్క ఆరు హైవేల కోసం రూ.12,600కోట్లు జోగ్దల్‌పూర్ – కోరాపూట్ రైల్వే లైన్‌కు రూ.1800కోట్లు ఇచ్చింది. లక్నో మెట్రోకు, చెన్నై మెట్రోకు, ముంబాయి, బెంగళూర్‌కు కేంద్ర ప్రభుత్వం వారు నిధులు ఇచ్చారు. వారందరికీ ఇచ్చినప్పుడు మనకు ఎందుకు ఇవ్వరో ఒకసారి ఆలోచించాల్సిన అవసరముందని నేను మనవి చేస్తున్నాను.

ఎందుకు కేంద్ర ప్రభుత్వం వారు ఈ విధంగా చేస్తున్నారని ఆలోచిస్తున్నప్పుడు రాష్ట్రం అభివృద్ధి కాకూడదనే ఉద్దేశమా, ఒకవేళ రాష్ట్రం బాగా అభివృద్ధి చెందితే కేంద్రప్రభుత్వానికి వారి మాట వినమనే భయమా? ఎందుకిలా చేస్తుంది? ఇలాంటి అనుమానాలన్నీ ఎందుకు వస్తున్నాయంటే రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీ ఉంది. ఆ ప్రతిపక్ష పార్టీని అడ్డుపెట్టుకుని మనకు రావాల్సిన, ఇవ్వాల్సిన నిధులను ఇవ్వడం లేదు. ఎవరైతే డ్రామాలు ఆడుతున్నాడో ఆ ప్రతిపక్ష పార్టీ నాయకుడు ప్రధానమంత్రిని మే 10, 2017వ తేదీన కలిశాడు. ఆయన ఏం చెప్పాడంటే బి.జె.పి పార్టీకి మేము అన్నివేళలా మద్ధతిస్తున్నాము, ప్రజలకు మంచి చేసే పనులన్నింటికి మద్దతిస్తున్నాము, రాష్ట్రపతి ఎన్నికలలో తమ మద్దతు ప్రత్యేక హోదాతో ముడిపెట్టబోము, **unconditional** గా సపోర్ట్ చేస్తామని చెప్పారు. అక్కడ ఎలాగూ గెలిచేది బి.జె.పినే కాబట్టి మేము కూడా సపోర్టు చేస్తున్నామనే పరిస్థితికి ప్రతిపక్షపార్టీవారు వచ్చారు. ఇక్కడొక విషయం గుర్తు పెట్టుకోవాల్సిన అవసరముంది. ప్రతి శుక్రవారం ఎ1,ఎ2,ఎ3,ఎ4 ముద్దాయిలందరూ కోర్టుకు వెళుతుంటారు. దీనిని ఏవిధంగా ప్రధానమంత్రిగారు సమర్థిస్తారని అడుగుతున్నాను. అటువంటి అవినీతిపరులకు ప్రధానమంత్రిగారు

అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారు? వారి సపోర్ట్ కేంద్రప్రభుత్వానికి అవసరమా? వారి సపోర్ట్ ఎందుకు తీసుకోవాల్సి వస్తోంది? ఇది అనైతికం కాదా? ఏవిధంగా నీతివంతమైన పాలన అందజేస్తారు? అందరూ వారి కేసులను మాఫీ చేయించుకోవడానికే ప్రధానమంత్రిని కలుస్తున్నారని అనుకుంటున్నారు.

మరోప్రక్క చూస్తే అధ్యక్షా, ఎవరికీ నమస్కారం కూడా పెట్టనివారు, రామ్‌నాథ్‌కోవింద్ వస్తే జగన్ పాదాభివందనం చేశాడు. అంటే అధికారం ఉన్నవారికి పాదాభివందనం చేస్తే వారి కేసులు మాఫీ అవుతాయనా? అదే మా గురించి మాట్లాడేటప్పుడు బంగాళాఖాతంలో పడేస్తామంటారు, నడిరోడ్డుమీద షూట్ చేస్తామంటారు, మనం ప్రజాస్వామ్యంలో ఎక్కడికి వెళుతున్నాము? అలాగే విజయసాయిరెడ్డి కూడా పాదాభివందనం చేస్తాడు. అంటే ఏంటీ ఇవన్నీ, ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారు? మరోప్రక్క రామ్‌నాథ్‌కోవింద్‌ను ప్రెసిడెంట్ అభ్యర్థిగా ప్రకటించగానే బీహార్‌వెళ్లి రామ్‌నాథ్‌కోవింద్‌తో ఫోటోలు దిగారు. అంటే సి.బి.ఐ.కి, ఎ.డి.కి, అన్ని ఏజెన్సీలకు ఒక మెసేజ్ ఇచ్చేలా నాకు ప్రధానమంత్రి బాగా పరిచయం, రాష్ట్రపతి నాకు బాగా పరిచయం, కాబట్టి నా కేసుల జోలికి రావొద్దు, మీకు ఏమైనా కావాలంటే సెటిల్ చేసుకుందామనేలా ప్రవర్తిస్తారు. ఇదెక్కడి వైరుధ్యమని అడుగుతున్నాను. ఇది ఎంత దుర్మార్గమని అడుగుతున్నాను. ఎలాంటి సంకేతాలకు దారి చూపుతున్నారని అడుగుతున్నాను.

అధ్యక్షా, నేను ఒక మాట అడిగాను, ఈ ఆస్తులు మావి, వాన్‌పిక్ సిటీ, లేపాక్షి వంటి చాలా ఆస్తులు ఉన్నాయి. అభివృద్ధి ఆగిపోతోంది, ఆ ల్యాండు, ఆస్తులు ప్రభుత్వానికి ఇవ్వమంటున్నాము. ఎంక్వైరీ సి.బి.ఐ.లో ఉంది. ఎంక్వైరీ చేయండి కాని ఆస్తులు ప్రభుత్వానికి ఇవ్వమంటే ఆ ఆస్తులు ఇవ్వడానికి మాత్రం మనసు రాలేదు, వీళ్లు మాత్రం కలిసే పరిస్థితికి వచ్చారు. రాష్ట్రపతి అభ్యర్థి ఇంటికి వెళ్లి మెమొంటోస్ ఇవ్వడం, మాజీ సి.ఎమ్. ఆనందిబెన్ గవర్నరుగా వస్తుందనే వార్త రాగానే ఆమెను కలవడానికి వెళ్లారు. ఆమె తరవాత మధ్యప్రదేశ్‌కు గవర్నరుగా వెళ్లింది. అంటే ఒక పద్ధతి లేకుండా చేస్తున్నారు.

పి.ఎమ్.ఓలో జరిగిన ఒక సంఘటన అధ్యక్షా, (పేపర్ సభలో చూపిస్తూ) "వైకాపా ఎం.పీ విజయసాయి రెడ్డి బుధవారం పార్లమెంట్ ఆవరణలోని ప్రధానమంత్రి కార్యాలయంలో కూర్చోని, విలేఖర్లతో దాగుడుమూతలు ఆడారు. మధ్యాహ్నం 12.45నిమిషాల సమయంలో ఆయన వినీత్ రెడ్డి అనే యువకుడిని వెంటబెట్టుకుని ప్రధానమంత్రి వ్యక్తిగత కార్యదర్శి గదిలోకి వెళ్లారు. అనంతరం ఎంతసేపటికీ బయటకు రాలేదు. దీనితో ఆయన లోపల ఉన్నారా లేదా అని చూడడానికి ఇద్దరు విలేఖరులు లోపలికి వెళ్లి తొంగి చూశారు. గదిలో ఒక చివరన కూర్చున్న విజయసాయి రెడ్డి విలేఖర్లను చూసి వారికి కనిపించకూడదు అన్నట్లుగా ప్రక్కకు ఒరిగారు, ఒక పాత్రికేయుడి చేతిలో ఫోన్ ఉండడం చూసి, ఫోటోలు తీస్తున్నారనే ఉద్దేశంతో మరింతగా దాక్కున్నారు. పాత్రికేయులు బయటకు వచ్చిన కొద్ది సేపటికి విజయసాయి రెడ్డి ప్రక్కన కూర్చున్న వినీత్‌రెడ్డి ప్రధానమంత్రి కార్యాలయ సిబ్బంది బయటకు వచ్చి విలేఖరుల కోసం వెతికి లోపలికి వెళ్లిపోయారు. ఫోటోలు ఏమైనా తీశారా అని కనుక్కోవడానికి ప్రధానమంత్రి కార్యాలయ సిబ్బంది ఒక్కరే విలేఖరుల దగ్గరకు వచ్చారు. మీరేమైనా లోపలికి వచ్చారా అని గద్దిస్తున్నట్లు మాట్లాడారు, లేదని

సమాధానం చెప్పడంతో లోపలికి వెళ్లిపోయారు. ఆ తరవాత కూడా పలుమార్లు కార్యాలయ సిబ్బంది బయటకు వచ్చి పదే పదే పాత్రికేయులను పరీక్షగా చూస్తూ లోపలికి, బయటకు తిరగడం మొదలు పెట్టారు."

అధ్యక్షా ఏంటీ ఇది, అంటే ఏవిధంగా మనం సమర్ధించుకోగలుగుతాము? అగ్రిగోల్డ్ కేసు విషయంలో కచ్చితంగా యాక్షన్ తీసుకుంటున్నాము. అగ్రిగోల్డ్ కేసులోని నిందితులు దాదాపు 30 లక్షల మంది దగ్గర డబ్బులు తీసుకున్నారు. వ్యాపారాలు చేశారు, సరిగ్గా నిర్వహించలేక కొలాప్స్ అయితే అందర్ని అరెస్ట్ చేసి ఆ ఆస్తులను జప్తు చేశాము. ప్రతి పదిరోజులకు ఒకసారి కేబినెట్‌లో చర్చిస్తున్నాము. అగ్రిగోల్డ్ బాధితులలో ఆత్మహత్య చేసుకుని చనిపోయిన వారికి ఒక్కొక్కరికి రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇచ్చాము. సుభాష్ అనే ఒక వ్యక్తి నా దగ్గరకు వస్తే, వారికి ఒక ట్రస్ట్ ఉంటే మేము పూర్తిగా సహకరిస్తాము మీరు తీసుకోండి, తీసుకుని వారి డబ్బులు పే చేయమని ప్రోత్సహిస్తున్నాము. కోర్టును కూడా అభ్యర్థిస్తున్నాము, ఇలాంటి ఆస్తులు తీసుకుంటేనే అటువంటి వారికి భయం ఉంటుంది. ఈఫోటోను చూస్తే మీకు అర్థమవుతుంది.(ఫోటో ఉన్న పుస్తకాన్ని సభలో చూపిస్తూ) దాక్కొని దాక్కొని ఉంటే ఫోటో తీశారు. What is the answer? ఇవే సమస్యలు. అక్కడ విశ్వాసం, బయట మాత్రం అవిశ్వాసం.

మ.03.20

అధ్యక్షా, ఆరోజు కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలో కేసులు పెట్టి, వీళ్లు చేసిన తప్పుడు పనులకు జైలుకు పంపిస్తే, రూ.40,000కోట్లు అవినీతి జరిగిందని కేసుని ఎస్టాబ్లిష్ చేస్తే, ఆరోజు జైలులో 16 నెలలు ఉండి, ఎలక్షన్ జరిగిన సమయంలో, రాష్ట్ర విభజన జరిగిన సమయంలో లాలూచి పడి సమైక్య ఆంధ్రప్రదేశ్ స్లోగన్‌తో రాష్ట్రం అంతా తిరిగారు. ఆరోజు మోసం చేశారు. ఇప్పుడు మీరేంటి స్పెషల్ స్టేటస్ కావాలని అడుగుతున్నారు? లేనిపోనివి ఇంకా రూమర్స్ ఉన్నాయి. ఏమనంటే వీళ్లు రేపు ఎంపీలుగా రాజీనామా చేస్తే, బి.జె.పి పార్టీ ఒప్పుకుని వీళ్లకు స్పెషల్‌స్టేటస్ ఇస్తుందని. అంటే నన్ను దెబ్బతీయడానికి. నన్నెందుకండి వారు దెబ్బతీయడం. దీనిలో నా తప్పేముందండి? ఆ రోజు పెట్టుకున్నటువంటి అలయన్సే రాష్ట్ర ప్రయోజనాల కోసం. (కేంద్రప్రభుత్వాన్ని ఉద్దేశించి) మీరు నాకు చేయండి. మీకు బాధ్యత ఉంది. ఒకవేళ మీరు చేయలేకపోతే, ఎందుకు చేయలేకపోయారో ప్రజలకు చెప్పండి. అలాకాక నాకు ఇవ్వకుండా, వాళ్లకి ఇస్తామని అంటే మీ ఉద్దేశం ఏమిటి? మీ ఉద్దేశం ఒకటే, అలాంటి వాళ్లయితే మీ చెప్పు చేతల్లో ఉంటారు. మీకు ఇబ్బందే లేదు.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, వాళ్లకు ఇస్తామని ఎక్కడా అనలేదు.

**MR. CHAIRMAN:** Please don't disturb.

**శ్రీ నారా చంద్రబాబునాయుడు:** మీరు అనలేదు. (వై.ఎస్.జగన్‌ని ఉద్దేశించి) ఆయన చెప్పుకుంటున్నాడు. (పి.వి.ఎన్. మాధవ్‌ని ఉద్దేశించి) మీరు ఏవిధంగా చెబుతారు బ్రదర్. ఇవన్నీ ఇంట్లో కూర్చొని ప్రధానమంత్రి ఆఫీసులో కూర్చొని ఏమి చెప్పుకుంటారు మీరు?

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు చెప్పినట్లు, మాకు వై.ఎస్.ఆర్.సి.పితో ఎటువంటి సంబంధాలు లేవు. ఈ యొక్క అపోహ....

(అంతరాయం)

**శ్రీ నారా చంద్రబాబునాయుడు:** (శ్రీ పి.వి.ఎన్.మాధవ్‌ని ఉద్దేశించి) మీరు కూర్చోండి. మీకు అవకాశమిచ్చినప్పుడు మీరు మాట్లాడండి. రాంగ్ సిగ్నల్స్ ఇస్తున్నారు. నేరస్తుల్ని ప్రధానమంత్రి ఇంట్లో పెట్టుకుంటే దీనికి సమాధానం ఏమి చెబుతారు? మనం అవినీతి పైన ఎలా పోరాడుతాము?

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** మాకు వై.ఎస్.ఆర్.సి.పితో ఎటువంటి సంబంధాలు లేవు. ఇంతకు ముందు కూడా చెప్పాము. ఆయన వెళ్లి కలవడం జరిగిందే తప్ప, అందులో ఏమీ రాజకీయాలు లేవు. అది గమనించాలి.

(అంతరాయం)

**శ్రీ నారా చంద్రబాబునాయుడు:** మీరు వినాలి. ఇప్పుడు దీని పర్యవసానం ఏమిటంటే, ఇది రిజల్ట్. రిజల్ట్ ఏమిటో తెలుసా? Appellate Tribunal, Prevention of Money Laundering Act at New Delhi, date of decision 13.02.2018. ఈ కేసు కూడా చూస్తే MP PMLA 1732/Hyd/ 2015 FPA PMLA 920 Hyd/2015. ఈ ట్రిబ్యునల్ అల్టిమేట్‌గా ఏదైతే confiscate చేశారో, అది చెల్లదని మీరు ఇచ్చారు. ఇక్కడ బెనిఫిట్ వచ్చింది. Therefore, without prejudice, the attachment at least to an extent of Rs.6,94,88,000 in the hands of Jagan, Janani Infrastructure Pvt. ltd. is unconvict. The impugned order for the said attachment is modified so as the PAO. ఈ ఆర్డరు వచ్చాక మీరు ఏం సమాధానం చెబుతారండి? అక్కడ కలిశారు, ఇక్కడ ఆర్డర్లు వచ్చాయి. అంటే ఈ దేశంలో అవినీతిని నిర్మూలించే పనితీరు ఇదేనా అని నేను ప్రశ్నిస్తున్నాను. అదే రోజు వచ్చిన ఇంకొక ఆర్డరు..MP PMLA 717 TLI 2014 CPIFPI PMLA 547 DLI 2013 దీనిలో Attachments effect to the OC for a sum of Rs. 34.64 crores in the hands of Jagathi Publications Pvt. Ltd. దాని మొత్తం జడ్జిమెంట్ ఇచ్చిన తరువాత the provisions attached order was passed by relying upon the Income Tax Authority Assessment Order dated 31.12.2010. చివరగా, thus the provisional Attachment Order and confirmation thereof is not sustainable in law. The same is set aside. The Attachment Order of attaching the amount lifted forthwith. మనం ప్రజలకు ఏమి చెప్పగలుగుతాము? ఇది క్లియర్ కదా. అక్కడకు వచ్చారు, ఎందుకు వచ్చి మీకు సపోర్ట్ చేశారు? సపోర్టు చేసింది కేసులు కోసం. ఇప్పుడు మిమ్మల్ని రెచ్చగొట్టేది కేసుల కోసం. అతను అయితే మీ గుప్పిట్లో ఉంటాడు, ఎప్పుడైనా కేసులు పెట్టొచ్చు. నేను అయితే మీ మాట వినను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** అధ్యక్షా, వాయిదా లేకుండా కోర్టు కేసులు తియ్యలేదు. టైం పడుతుంది, ఏదైతే జగతి పబ్లికేషన్స్ అని వచ్చిందో, కోర్టులో కేసు ఉంది. అనేక సార్లు వాయిదా వచ్చింది. ఆవిధంగా ఆ వాయిదా రావడం జరిగింది.

(అంతరాయం)

**శ్రీ నారా చంద్రబాబునాయుడు:** (శ్రీ పి.వి.ఎన్. మాధవ్‌ని ఉద్దేశించి) మీరు ఆర్గ్యుమెంట్ చెప్పొచ్చు. తప్పేమి లేదు. నేను అడిగేదొక్కటే, ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీని మనం ఏమి తిట్టామండి? మనందరం స్కామ్ కాంగ్రెస్ అన్నాము. స్కామ్ ఇండియా అన్నాము. ఇప్పుడు ఇలాంటి స్కాముల్లో ఉండేవాళ్లని పక్కన పెట్టుకుంటే ఏమని సంకేతం వస్తుంది? దీనికి సమాధానం ఎవరు చెబుతారు? మీరు కూడా ఆలోచించాలి కదా? మనం కూడా ఆలోచించకపోతే ఏమవుతుంది? ఆ రోజు చెప్పిన వాళ్లం ఈరోజు కోర్టుల్లో ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని ఏ1, ఏ2లు వచ్చి కలుస్తుంటే, what are the signals we are giving? Wrong signals we are giving. ఎవరైనా ఒక నేరస్తుడు వచ్చి పబ్లిక్ ప్లేస్‌లో గానీ, ఇంట్లో గానీ నన్ను కలిస్తే ఏమని చెబుతాను? అండగా తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తుంటాయి. అందుకనే జాగ్రత్తగా ఉండాలి? ప్రధానమైన పదవిలో ఉండే మేము, ఉన్నతమైన పదవుల్లో ఉండే మనం ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉంటే తప్ప మనకు ఈ సమస్యలు రాకుండా ఉండవు. కొంతమంది నన్ను అంటున్నారు. నిన్నో, మొన్నో పవన్‌కళ్యాణ్ కూడా రూ.20కోట్లు ఎక్కడికో పంపించానని అన్నారు. ఎక్కడికి పంపించానండి నేను? ఎక్కడకు పంపిస్తానండి నేను రూ.20కోట్లు ఒక నియోజక వర్గానికి. నేను ప్రధానమంత్రికి వంద సార్లు చెప్పాను, ఇప్పుడు చెబుతున్నాను, వారు అధికారంలోకి రాకముందు కూడా వేరే ప్రభుత్వానికి కూడా చెప్పాను. ఈ దేశంలో రూ.1000/-, రూ.500, రూ.2000ల నోట్లు రద్దు చేయాలి. మొత్తం డిజిటల్ కరెన్సీకి వెళ్లాలి. అప్పుడే అవినీతి అదుపులోకి వస్తుంది. ఇంకా కేంద్రానికి ఆ ఆలోచన లేకపోతే ఎలా? విదేశాలలో డబ్బులు పెడుతున్నారు? డబ్బులు మారుస్తున్నారు, ఓట్లకు డబ్బులు ఇస్తున్నారు. మనం ఓటర్లకు డబ్బులు ఎందుకివ్వాలి? మనందరం కష్టపడి పనిచేస్తే మన పనితనాన్ని చూసి ఓట్లు వెయ్యాలి. ప్రజల్ని మభ్య పెట్టే పరిస్థితిలోకి మనం వచ్చినప్పుడు ఏవిధంగా సపోర్టు చేసుకుంటాము? తెలుగుదేశం పార్టీ ఈరోజు మాట్లాడడం లేదు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఇదే చెప్పాము. మొత్తం డిజిటల్ కరెన్సీకి వెళదాము. నోట్లు రద్దు చేద్దాం. ఎక్కడా ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా చేసి, దేశాన్ని అభివృద్ధిలోకి తీసుకువెళదామని నేను మాట్లాడుతుంటే, నన్ను విమర్శించడానికి కొంతమంది ముందుకొస్తున్నారు.

ఇదే సమయంలో నిన్న కూడా నేను చెప్పాను. నా కుటుంబ విషయం కూడా నేను చెప్పాలి. 25 సంవత్సరాల కంటే ముందు నా భార్య ఒక కంపెనీ ఫ్లోట్ చేయడమే కాకుండా పని చేసుకుంటూ వస్తున్నారు. 24 గంటలు పనిచేస్తారు. ఈరోజు కూడా ఆమె మహారాష్ట్రలో ఉన్నారు. పూణె నుంచి ఎక్కడో యూనిట్ ఉంటే అక్కడకు వెళ్లి రాత్రి పదికో పన్నెండు గంటలకో ఇక్కడకు వస్తున్నారు. ఆ నిష్టతో వాళ్లు పని చేస్తున్నారు. అదేవిధంగా 25 సంవత్సరాలు పనిచేశారు

కాబట్టి, ఆవిడకు ఒక పని, అలాగే కుటుంబాన్ని కూడా ఆర్థికంగా ముందుకు తీసుకువెళుతున్నారు. మా కుటుంబం యొక్క ఆస్తులన్నీ ఎప్పటికప్పుడు ప్రకటిస్తున్నాము. ఎథిక్స్ కమిటీని నేనే తీసుకువచ్చాను. ఎవ్వరూ తీసుకురాలేదు. ఫస్ట్ టైం 1998వ సంవత్సరంలో ఎథిక్స్ కమిటీని తీసుకువచ్చి అందరి ఆస్తుల వివరాలు స్పీకర్‌కి, చైర్మన్‌కి ఇచ్చే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాము. అదే సమయంలో మా అందరి ఆస్తులు ప్రకటిస్తున్నాము. లోకేష్‌గారు ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చారు కాని, అంతకు ముందు రాజకీయాల్లో లేకపోయినా అందరి ఆస్తుల్ని ఎనిమిది సంవత్సరాల నుంచి ప్రతి సంవత్సరం ప్రకటిస్తున్నాము. దేనికోసం అంటే రాజకీయాల్లో ఉండే మనం, వ్యాపారాలు చేసినా, ఏం చేసినా అవన్నీ ప్రజలకు స్పష్టంగా తెలియాలని ఆ విధంగా చేశాము. నేనెప్పుడూ చెబుతుంటాను, నీతిమంతంగా డబ్బులు సంపాదించుకుంటే శాశ్వతంగా గౌరవం ఉంటుంది. అవినీతిగా డబ్బులు సంపాదించుకుంటే మీకు గౌరవం ఉండదు. ఆ డబ్బుల వల్ల మీకు సమస్యలు వస్తాయి. ఇది మంచిది కాదని చెప్పాను. నా మీద 26 ఎంక్వైరీలు వేశారు. ఏమీ చేయలేకపోయారంటే, ఏమీ లేదు కాబట్టి, నిప్పు లాగా బ్రతికాను కాబట్టి, నన్ను ఎవరూ టచ్ చేయలేకపోయారు. ఒకవేళ ప్రయత్నాలు చేసినా, ఇప్పుడు కాదు, కాంగ్రెస్ పార్టీ వాళ్లు ప్రయత్నాలు చేశారు. ఏమి చేయలేకపోయారు. నేను ఒకటే కోరుతున్నాను. ఆరోపణ చేయడం కాదు. ఆరోపణ చేసేప్పుడు ఆలోచించి చేయాలి. ఇంకోపక్క మొన్నమొన్న మాట్లాడుతూ కొంతమంది ఈరోజు ఉండే మిత్రులు కూడా మాట్లాడుతున్నారు. మేము అసెంబ్లీ ఎలక్షన్స్‌లో కూడా సపోర్ట్ చేశాము. పవన్‌కళ్యాణ్‌తో గానీ, బి.జె.పితో గానీ పొత్తు పెట్టుకున్నాము. కానీ ఇక్కడ ఒకటి గుర్తు పెట్టుకోవాలి. శాసనసభ ఎన్నికల కంటే ముందు స్థానిక సంస్థల ఎన్నికలు ముందు జరిగాయి. స్థానికసంస్థల ఎన్నికల్లో 47.8శాతం సీట్లు, శాసనసభ ఎన్నికలకు వచ్చేప్పటికి 46.8శాతం వచ్చాయి. చెప్పాలంటే ఇంకా 1శాతం తగ్గింది. ఎలక్షన్‌ని చూస్తూనే పేపర్ వాళ్లు ఒక అసెస్‌మెంట్ చేస్తూ వచ్చారు. ఈ రేషియోలో అయితే తెలుగుదేశం పార్టీకి 120 సీట్లు, వైకాపాకి 48 సీట్లు రావాల్సి ఉందని వారు చెప్పారు. రిజల్ట్స్ వచ్చాక మాకు వచ్చింది 102+4 సీట్లు వచ్చే పరిస్థితి వచ్చింది.

మ.03.30, 03.40

అధ్యక్షా, అంటే మనం పొత్తు పెట్టుకున్న తరువాత సీట్లు తగ్గాయి తప్ప సీట్లు పెరగలేదు. ఆ విషయం వారు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉంది. అంతకు ముందు ఎన్నికల్లోనే చాలా స్పష్టంగా స్థానిక సంస్థల ఎన్నికలు ఆధారంగా చేసుకుంటే 120-125 సీట్లు తెలుగు దేశానికి వచ్చేవి. నియోజకవర్గం వారిగా కూడా ఉంది. ఆ రోజు నేను సీట్ల కోసం ఆలోచించలేదు. రాష్ట్రం కోసం ఆలోచించాను. ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం ఆలోచించాను. దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఆదుకునే కార్యక్రమం గురించి ఆలోచించాను. ఈరోజు జరిగింది ఏమిటంటే మీరు సరిగా స్పందించలేదు కాబట్టి ఈ రోజు మరలా విడిపోయే పరిస్థితికి వచ్చాము. ఆ విషయం మీరు గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. నేను ఏ త్యాగం చేశానో ఏ రాజకీయాల కోసం, రాష్ట్రం కోసం ఆలోచించానో అది విఫలమైంది కాబట్టి ఈ రోజు గట్టిగా అడిగే పరిస్థితుల్లో డిఫరయ్యే పరిస్థితికి వచ్చామని కూడా మీకు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, నిన్నా, మొన్నా పవన్ కళ్యాణ్ గారు మాట్లాడారు. చాలా విషయాలలో యూటర్న్ తీసుకున్నారు. నాలుగు సంవత్సరాలు వారికి నేను మంచి వాడిగా కనపడ్డాను. మరలా వెంటనే నేను చెడ్డవాడిలా కనపడుతున్నాను. నేను మూడు మాటల్లో ఆరు అసత్యాలు మాట్లాడతానంటున్నానా? అందుకే నేను 40 సంవత్సరాలు రాజకీయాలలో ఉన్నాను. 40 సంవత్సరాలు నేను రాజకీయాలలో ఉన్నా ప్రజలు నన్ను విశ్వసిస్తున్నారంటే నా నిజాయితీనేనని చెప్పవచ్చు. ఎంతో మంది ఎన్నో విధాలుగా ప్రయత్నం చేశారు. అందరూ చెప్పారు. ఏవో చేస్తామని నిన్న కూడా ఒక పొత్తు ధర్మంగా ఎక్కడా మాట్లాడకూడదనుకున్నాను. నిన్న ఎవరితోనూ మాట్లాడలేదు. ఎప్పుడైతే వారు అన్యాయం చేశారో చూసిన తరువాత ఈరోజు ఉదయం నిర్ణయం చేశాము. ఆ నిర్ణయం పొలిట్‌బ్యూరో టెలీకాన్ఫరెన్స్‌లో తీసుకుని before Parliament మనం నిర్ణయించాలి. నో కాన్ఫిడెన్స్ పెట్టాలని నిన్న సభలో చెప్పాను. ఎవరైతే ప్రధాన మంత్రి కార్యాలయంలో తొంగి తొంగి చూసి దాక్కునే వ్యక్తులు vote of no confidence పెడితే వారిని మేము సపోర్టు చేస్తే దేశం ఏమంటుంది? నమ్మకాలు ఏమి ఉంటాయి? అందుకే మేము ముందు పొత్తు లేదని నిర్ణయించాము. ఆ తరువాత no confidence పెడతామంటే ఈరోజు దేశంలో ఉండే అన్ని రాజకీయ పార్టీలు మొత్తం వచ్చి మన ఆంధ్రప్రదేశ్‌కు సంఘీభావాన్ని తెలియజేసే పరిస్థితి వచ్చింది.

అధ్యక్షా, మేము మాటల్లో చెప్పడం లేదు మేము సిన్సియర్ గా పని చేస్తాము. నీతి నిజాయితీగా ప్రజల కోసం పని చేస్తాము. ఎవరు నాటకాలాడినా ఆ నాటకాల్ని జరగనీయం. ఇది తమిళనాడు కాదు. తమిళనాడులో జరిగింది. దీని గురించి మీరంతా ఆలోచించవలసిన అవసరం ఉంది. తమిళనాడులో ఎంత దారుణంగా చేస్తున్నారు. ఒక రాష్ట్రంలోనే ఈ రాజకీయాలన్నీ కూడా ఎంత దారుణమైన పరిస్థితిలోకి వస్తున్నాయంటే, స్వయంగా పన్నీర్ సెల్వమే స్టేట్‌మెంట్ ఇచ్చారు. ప్రధానమంత్రిగారు ఫోన్ చేసి చెబితే నేను డిప్యూటీ సిఎమ్‌గా ఉన్నాననే పరిస్థితి వస్తే, ఇక ప్రధానమంత్రి గారి హూందా ఏమిటి? ఇది కూడా మనం ఆలోచించవలసిన పరిస్థితి ఉంది. నిన్న చూస్తే ఏవైతే ఉన్నాయో వరుసగా మాట్లాడేశారు. మెగా, అక్వా, ఫుడ్‌పార్క్, ఎవరు వారు నాకు ఏమైనా బంధువులా, అక్కడ ఒక ఫుడ్‌పార్క్ వస్తే ఉద్యోగాలు వస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో అక్వాకల్చర్ ఉంది. Prawns, Fish, Shrimp ఉన్నాయి. ఫిలిప్పైన్స్‌కు వెళ్తున్నాయి. వేరే దేశానికి వెళ్తుంది. అక్కడ ప్రాసెస్ అవుతున్నందున, అక్కడ ఉద్యోగాలు వస్తాయి. మనం పండిస్తాము. దీని వలన వారికి ఉద్యోగాలు వస్తాయి, తద్వారా వారికి ఆదాయం వస్తుంది. అక్కడ నుండి వేరే మార్కెట్ అమెరికాకో, జపాన్‌కో అన్ని దేశాలకు పంపిస్తారు. ఇక్కడ ఉద్యోగాల కల్పనకు చాలా స్పష్టంగా ఆక్వా సాగు వలన ఎక్కడా కూడా నష్టం జరగకూడదనే ఉద్దేశంతోనే ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా ఒక కమిటీని వేసి ముగ్గురు అనుభవజ్ఞులను నియమించి ఆ ముగ్గురినీ ఒక రిపోర్టు ఇమ్మని చెప్పాము. దాదాపు 26.5 కిలోమీటర్లు అంటే తుందుర్రు విలేజ్ నుండి సముద్రం వరకూ Marine outfall వరకూ రూ.11కోట్లు అవుతుందంటే, అది కూడా మంజూరు చేశాము. అదే మాదిరిగా ఫస్ట్ ఫేజ్‌లో పైపు లైన్ కోసం రూ.4 కోట్లు మంజూరు చేశాం. ఫుడ్‌పార్కు నుండి దిరుసుమర్రు వరకు ఫిబ్రవరిలో వర్కు కూడా మొదలు పెట్టాము. మొత్తం పశ్చిమగోదావరి జిల్లాలో యనమదుర్రు డ్రైన్ ఉంది. తణుకు నుండి భీమవరం వరకూ అక్కడ నుండి సముద్రంలోకి వెళ్ళిపోతుంది. 140కి.మీ. దీనికి

డెల్టాపేపరు వస్తుంది. తణుకు షుగర్స్, కెమికల్ ఫ్యాక్టరీలు వస్తాయి. వీటన్నింటికీ కూడా సిఇటిపి (Central effluent treatment plant) పెట్టి మొత్తం ప్రొటెక్టు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వెళ్తుంటే, దీని పైన మమ్మల్ని విమర్శించడం ఏమిటి? అంటే మీకు పరిశ్రమలు వద్దా? ఒకాయన కాకినాడ వెళ్లారు. ఇక్కడ కెమికల్ ఫ్యాక్టరీ రాకూడదా అని అంటారు. ఇంకొకాయన నేను విశాఖపట్నంలో ఇన్‌వెస్టర్స్ సమ్మిట్ పెడితే జల్లికట్టు స్ఫూర్తితో ఆందోళన చేస్తానంటారు. ఆ రోజు జల్లికట్టు స్ఫూర్తిని చూపించి ఉంటే రూ.10,00,000కోట్లు భ్రష్టు పట్టుకుపోయేది. ఈ రాష్ట్రంలో పద్ధతి ప్రకారం పని చేస్తున్నాము కాబట్టి పరిశ్రమలు వస్తున్నాయి. ఈ పరిశ్రమలు రావాలని ఒక పక్క మాట్లాడుతున్నారు. ఒక్క పరిశ్రమ రాలేదని నిన్న కూడా మాట్లాడారు. ఒక్క పరిశ్రమ రాలేదా? కియో మోటార్స్ భారతదేశంలో ఎన్నో రాష్ట్రాలు పోటీ పడితే వెనుకబడిన జిల్లా అనంతపురం జిల్లాకు వచ్చింది. ఈ రోజు సౌత్ కొరియా ఆటోమొబైల్ టౌన్‌షిప్ వస్తుంది. కియో మోటార్స్‌కు 23వ తారీఖున శంఖుస్థాపన చేస్తున్నాము. అదే మాదిరిగా హార్డ్‌వేర్ కంపెనీలు చాలా వచ్చాయి. చాలా పరిశ్రమలు కనీసం రూ.18 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతూ ఎంఓయూ చేశారు. దీని వలన ఉద్యోగాలు వస్తాయంటే ఇన్ని కష్టాలలో కూడా కనీసం రూ.10లక్షల పెట్టుబడులు పెట్టి 2019 వ సంవత్సరానికి 20లక్షల మందికి ఉద్యోగాలు వచ్చే విధంగా ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి ముందుకు వెళ్తున్నాము. ఇన్ని కష్టాల్లోకూడా. అది వారు గుర్తు పెట్టుకోవాల్సిన అవసరముంది.

అధ్యక్షా, ఫాతిమా మెడికల్ కాలేజీ విషయంలో అన్ని ప్రయత్నాలు చేశాము. పిల్లలు ఒక అఫిడవిట్ కూడా ఇచ్చేశారు. కేసు కోర్టులో ఉంది. కోర్టు జడ్జిమెంట్ ప్రకారం చేసుకుంటామని మేము ప్రశ్నించమని ఒక అఫిడవిట్ కూడా ఇచ్చి ఆ అఫిడవిట్‌ను పబ్లిష్ చేసిన తరువాత అడ్మిట్ చేసే పరిస్థితికి వచ్చారు. కానీ బాధ్యతగా ముందుకు వెళ్లాము. మొన్నటి వరకూ ఆరోగ్య శాఖా మాత్యులు శ్రీనివాస్ గారు ఉంటే వారిని పంపించి వాస్తవాలన్నీ చెప్పాను. మనము ఏమేమి చేశామో అన్ని విషయాలు వివరించి చెప్పాము. ఇది హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా వచ్చింది. ఆరోగ్య శాఖా మంత్రి గారు 6 సార్లు ఢిల్లీకి వెళ్లారు. అక్కడ కార్యదర్శి గారితో మాట్లాడారు. అక్కడ మంత్రి గారితో చెప్పాము. రెవ్యూ పిటీషన్ వేయమన్నాము. ఏమీ కావాలో అన్నీ చేయమని నేను ఆదేశాలు ఇస్తే, మనము ఏదో చేయలేదని దీనిని విమర్శించడం ఎంత వరకు సబబు అని అడుగుతున్నాను.

అధ్యక్షా, ఇవే కాకుండా ఎర్ర చందనం విషయంలో ఈ ప్రభుత్వం పోరాడినట్లు ఎవరు పోరాడుతున్నారు? తమిళనాడులో కూడా నా మీద పోస్టర్స్ వేసి ఆందోళన చేశారు. ఒకసారి కోయంబత్తూరుకి మా బంధువుల పెళ్ళికి వెళితే నేను బయటకు రాగానే ఆందోళన చేస్తున్నారు. ఎందుకు నా మీద ఆందోళన చేస్తున్నారంటే, మీరు ఎర్ర చందనం విషయంలో 29 మందిని చంపేసారట, అని దాని మీద వచ్చి ఆందోళన చేస్తే దానికి నేను ఏమి చేస్తాను. మీరు రావడమే తప్పని చెప్పి వచ్చేసాను. అలాంటి firm decision తీసుకుంటే జయలలిత కూడా ప్రొటెస్ట్ లెటర్ పంపించారు. నేను ఒకటే చెప్పాను. మీరు ఏమి చెప్పినా బాధలేదు. మీకు ఏమి కావాలో పనులు చేస్తాము తప్ప, ఈ ఎర్ర చందనం స్మగ్లింగ్ చేసే వారిని మీరు కంట్రోల్ చేయాలని చాలా స్పష్టంగా ఆ రోజు చెప్పాను. ఈ రోజు ఇంకొక

పక్క ఈ ఎర్ర చందనం గురించి మీరు ఒకసారి ఆలోచిస్తే గవర్నమెంట్ ఆఫ్ ఇండియా అనుమతి ఇవ్వాలి. మనం అమ్మడానికి వారి అనుమతి కావాలి. అదే మాదిరిగా Tree harvest చేయడానికి వారి అనుమతులు కావాలి. అప్పటికి కూడా ఇన్ని కష్టాలున్నా 2004-2014 సంవత్సరాల కాలంలో, కాంగ్రెస్ వారు మొత్తం రూ.69కోట్లకి అమ్మితే, గత నాలుగు సంవత్సరాల్లో మీరు చూస్తే రూ.1,231కోట్లు రియలైజ్ చేయగలిగాము. ఒక్క ఎర్ర చందనం అమ్మి రూ.1,231కోట్లు ప్రభుత్వం ఆదాయాన్ని రాబట్టింది అంటే అది ఈ ప్రభుత్వానికి ఉండే పట్టుదల, దానిలో రెండో ఆలోచనే లేదు.

అధ్యక్షా, భవిష్యత్తులో కూడా ప్రతి రెండు నెలలకొకసారి వేలం వేయమని నేను మంత్రి గారికి చెప్పాను. వేలం వేసి దీనిని ప్రొటెక్ట్ చేయాలి. మొన్న కూడా కొంత మంది కూంబింగ్ ఆపరేషన్లు చేస్తే పక్కనే ఉన్న చెరువులో పడి ఐదారుగురు మంది మునిగిపోయారు. బాధపడతాము కానీ కూంబింగ్ ఆపరేషన్లు ఆపలేము. ఆపితే దీని వల్ల డెన్ తయారౌతుంది. స్మగ్లర్స్ డెన్‌గా తయారయ్యే పరిస్థితి వస్తుంది. చాలా భయంకరమైన పరిస్థితులు వస్తాయి. ఎర్ర చందనం స్మగ్లింగ్‌లో ఇన్‌వాల్వ్ అయిన వారు కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ నాయకులే. జైలుకు వెళ్లి పరామర్శించారు. ఇంకా చాలా ఉన్నాయి. నా మీద అలిపిరి బ్లాస్ట్ చేసినప్పుడు సెల్‌ఫోను ఇచ్చిన వారు కూడా వారే. నేను ఆ డీటైల్స్‌కు వెళ్ళడం లేదు. ఈ విషయాలను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఇంకొక పక్క ఈ రోజు ఒక బిల్లు కూడా తీసుకువచ్చాము. ఎర్ర చందనం స్మగ్లర్ల ఆస్తులను confiscate చేయడానికి హైకోర్టును అడిగాము. ఒక జడ్జిని ఇమ్మని చెప్పి జడ్జిని ఇస్తే ఎవరైతే ఎర్ర చందనం వ్యాపారం చేసే వారున్నారో వారికి వేరే విధంగా ఉండే ఆస్తులన్నీ అక్వైర్ చేసి కాన్ఫిస్కేట్ చేసి ప్రభుత్వ ఖజానాలోకి తీసుకుంటాము. అవినీతి కేసుల్లో కూడా ఏసిబీలో కూడా అదే చేస్తున్నాము. ఎవరైనా విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకుని విమర్శించాలి. ఈరోజు ఈ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా ఏసిబీ రైడ్ చేయడం గానీ, కేసులు ఎస్టాబ్లిష్ చేయడం గానీ చేస్తున్నాము. ఎవరైతే పెద్ద ఎత్తున డబ్బులు సంపాదించుకుని ఆస్తులు కూడ గట్టుకున్నారో వారి ఆస్తులన్నీ confiscate చేసి, ప్రభుత్వ ఖజానాలోకి తీసుకొస్తామని హామీ ఇస్తున్నాను. అది కూడా త్వరలోనే జరుగుతుంది.

అధ్యక్షా, అదే విధంగా ఇంకొక పక్క ఇసుక విషయం మాట్లాడారు. ఈ ఇసుక విషయం చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఎవరో ఊర్లో ఒకరు తప్పు చేస్తున్నారంటే organised crime కి దీనికి తేడా లేదని మాట్లాడారు. ఇదెక్కడి న్యాయమో నాకు అర్థం కాలేదు. గాలి జనార్ధన్ రెడ్డికి ఏ ఊళ్లో అడ్రస్ కూడా చెప్పలేదు. ఫలానా వారని చెప్పలేకపోతున్నాము. ఇసుక విషయంలో చాలా ఫర్‌ఫెక్ట్‌గా సిస్టమ్స్ ఎస్టాబ్లిష్ చేశాం. మొత్తం సీసీ టీవీ కెమెరాలు పెట్టి తీయిస్తున్నాము. అదే సమయంలో కన్స్యూమర్స్‌కు ఫోన్ చేసి ఏ విధంగా ధరలు వచ్చాయని అడుగుతున్నాము. ఇసుక ధరలు అదుపు చేయడానికి ప్రభుత్వం తీసుకునే చర్యల పైన బాగుంది, బాగాలేదనే వివరాలకు సంబంధించిన పర్సంటేజ్ కూడా తెప్పించాము. లేటెస్టు పర్సంట్ 84 శాతం బాగుందని 16 పర్సంట్ బాగాలేదంటే దాని పైన శ్రద్ధ పెట్టామని కూడా మీకు తెలియజేస్తున్నాను. రియల్ టైమ్ డేటా కలెక్ట్ చేస్తున్నాము. రియల్ టైమ్ డేటా కలెక్ట్ చేసి ఒక

డ్యాష్ బోర్డు పెట్టి ఏ వాహనాలు అక్రమంగా వస్తున్నాయో అవన్నీ పెట్టి ఎక్కడికక్కడ యాక్షన్ తీసుకుంటూ వినియోగదారులకు న్యాయం చేసే పరిస్థితులలో ముందుకు వెళ్తున్నాము.

ఉద్దానంలో కిడ్నీ రోగుల గురించి నా దృష్టికి తీసుకువచ్చినప్పుడు వెంటనే వారికి న్యాయం చేయాలనే ఉద్దేశంతో వారికి ఒక గౌరవంతో న్యాయం చేస్తే ఇప్పుడేమో మేము ఏదో భయపడి చేశామని అనడం కరెక్టు కాదు. రాజకీయాలలో పని చేసినప్పుడు ఎప్పుడూ ఒక గౌరవం ఉంటుంది. రాజకీయాలలో పని చేసినప్పుడు పార్టీకి గానీ, ఎలక్షన్స్‌లో గాని 10 మంది 10 రకాలుగా సహాయం చేస్తూ ఉంటారు. అలాంటి సమయంలో ఏదైనా సమస్య మన దృష్టికి ఎవరైనా తీసుకువచ్చినప్పుడు సిన్సియర్‌గా ఆలోచించి ఆ సమస్యను పరిష్కారం చేస్తాము. అదే విధంగా ఇందులో మీరు చూస్తే చాలా పనులు చేశాం. ఈరోజు మొత్తం 7 మదర్ ప్లాంట్స్, 135 రిమోట్ డిస్పెన్సింగ్ యూనిట్స్ పెట్టి క్లీన్ వాటర్ ఇస్తున్నాము. రూ.2500 పింఛను ఇస్తున్నాము. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2,500/-పింఛను ఇచ్చేది ఒక్క ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే 2,677మందికి పింఛను ఇస్తున్నామంటే, ఇది తెలుగుదేశం పార్టీకి ఈ కిడ్నీ బాధితుల పైన ఉండే ప్రేమ. రాష్ట్రమంతా డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ కిడ్నీ రోగులకు ఇబ్బంది లేకుండా చేస్తున్నాము. నిన్న ఒక్క మాట కూడా మోదీ గారి గురించి మాట్లాడలేదు. ఎందుకు ఈ మాదిరిగా మాట్లాడుతున్నారు? మనకు ఎవరు ఇవ్వాలి? ఈరోజు నేను రాష్ట్ర ప్రజల తరఫున పోరాడుతున్నాను. వారు ఇబ్బందులు పెడతారని నాకు తెలుసు. ఎందుకు పోరాడుతున్నాను? నిధులు రానీయకుండా చేయవచ్చు. ఇంకొక విధంగా చేయవచ్చు. కానీ నేను భయపడడం లేదు. అన్నింటికి నిర్ణయించుకునే ముందుకు వెళ్తున్నాను. ఎలాంటి ఇబ్బందులు పెట్టినా భయపడే సమస్య ఉండదు. రాష్ట్ర ప్రయోజనాలకు వచ్చినప్పుడు తప్పకుండా ముందడుగు వేయడమే తప్ప వెనక్కి తిరిగి చూసే సమస్యే లేదని ఈ సందర్భంగా మీ అందరికీ, రాష్ట్ర ప్రజానీకానికి కూడా తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, ఈ సమయంలో నేను పోరాడుతూ ఉంటే రాష్ట్రంలో ఉన్న ప్రతి వ్యక్తి నాకు సహకరించాలి. ఒక రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యమంత్రిగా నన్ను బలపరచాలి. రాష్ట్ర అధినేతగా నేను చేసే ఈ పోరాటం రాష్ట్ర ప్రజానీకం కోసం. ఇది అధర్మపోరు కాదు. ఆ రోజు ఒక పద్ధతి లేని విభజన చేశారు. రెండు జాతీయ పార్టీలు ఉన్నాయి. పద్ధతి లేని విభజన చేశారు కాబట్టి సహకరిస్తామని బీజేపి వారు చెప్పారు. నమ్మి పొత్తు పెట్టుకున్నాము. నాలుగు సంవత్సరాలు కలసి పని చేశాం. 29సార్లు అడిగాను. 29సార్లు అడిగితే పవన్ కళ్యాణ్ గారు ఏమంటున్నారంటే నేను ఏదో భయపడుతున్నానని అన్నారు. నేను దేని కోసం భయపడాలి. నేను భయపడడం లేదు. నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా దేశ ప్రధాన మంత్రికి ఎంత గౌరవము ఇవ్వాలో అంత గౌరవం ఇచ్చాను. నేను లాలూ। పడలేదు. సొంత పనులు చేయమని అడుగలేదు. ఇంకొక ప్రయోజనం కోసం ఆశించలేదు. నేను ఆరోజూఈరోజూఅడిగింది కేవలం విభజన చట్టంలో ఉన్న ప్రొవిజన్స్‌ను, రాజ్యసభలో చెప్పిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నాను. న్యాయమైన కోరిక అని చెబుతున్నాను. ఇది మా హక్కు అని చెబుతున్నాను. ఈరోజు మరలా చెబుతున్నాను ప్రత్యేక హోదా అనేది తెలుగువారి హక్కు అని కూడా తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఆరోజు కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చేసింది. విభజన చేసినప్పుడు మీరు (బీజేపీ) కూడా సహకరించారు. మీరంతా కూడా ఇవన్నీ పరిష్కరిస్తామని చెప్పారు. ఇప్పుడు ఎందుకు చేయరని నేను అడుగుతున్నాను. నేను ఎందుకు చేయరని అడిగితే నామీద ఎదురు దాడి చేయిస్తారా? ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకుంటారు. ఫ్యాక్ట్‌ఫైండింగ్ కమిటీ ఎందుకు వేయాలి? నా మీద ఫ్యాక్ట్‌ఫైండింగ్ కమిటీ వేస్తారా? ఈ రాష్ట్రానికి డబ్బులు రాలేదని నేను చెబుతూ ఉంటే ఈ రాష్ట్రానికి సహకరించాల్సింది పోయి మీకు ఏ సమాచారం కావాలో తీసుకోవాల్సింది పోయి నా మీద ఫ్యాక్ట్‌ఫైండింగ్ కమిటీ వేశారు. రూ.75,500కోట్లు ఇవ్వాలని ఎస్టాబ్లిష్ చేశారు. ఒక్కమాట కూడా ఆ విషయం గురించి మాట్లాడరు. ఏమని అర్థం చేసుకోవాలి. నన్ను ఎప్పుడూ విమర్శించని వ్యక్తులు టకామని యూటర్న్ తీసుకుని నా మీద పోరు చేస్తున్నారు, నా మీద పోరు చేసి మీరు ఏమి సాధిస్తారు? మీ ఉద్దేశం ఏమిటి? రాష్ట్రంలో ఎక్కడికక్కడ అలజడి సృష్టించి కేంద్ర ప్రభుత్వానికి వెసులు బాటు ఇవ్వాలనుకుంటున్నారా అని నేరుగా అడుగుతున్నాను. ఇప్పుడు మన బాధ్యత ఏమిటి? కేంద్ర ప్రభుత్వం మనకు డబ్బులు ఇవ్వలేదు. చెప్పిన మాట తప్పారు. మన హక్కులను కాలరాస్తున్నారు. అలాంటి సందర్భంలో అందరమూ కలసి కేంద్రం పైన ఒత్తిడి తీసుకురావాల్సిందిపోయి, 24 గంటలూ నన్ను తిడతారేమిటి? ఒకాయన పాదయాత్ర చేస్తారు. 24 గంటలూ నన్నే తిడతారు. ఇదెక్కడి అడ్రస్. ప్రధాన మంత్రి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే నన్ను తిట్టడమేంటి? మీరు లాలూచి పడితే మీరు పడాలి. అంటే ప్రజల్ని మభ్య పెట్టడానికి ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తున్నారు. దాని గురించి ఒక్క మాట మాట్లాడరు. నిన్న మీటింగ్‌లో మాట్లాడక పోతే ఏమి సమాధానం చెబుతారండి మీరు మీ ప్రోగ్రామ్ గురించి చెప్పుకోలేదు. కేంద్రం ఇవ్వవలసిన డబ్బులు గురించి మాట్లాడలేదు. మన హక్కుల గురించి మాట్లాడలేదు. తిరిగి నన్ను తిట్టి ఇప్పుడేదైనా మాట్లాడితే మేము ఏదో మిమ్మల్ని విమర్శించినట్లు అవుతుందని మాట్లాడుతున్నారు. ఇది కరెక్టు కాదు. ఆధారాలు లేని ఆరోపణలు చేయడం అంతకంటే కరెక్టు కాదు. నేను రాజకీయాలలో 40 సంవత్సరాల నుండి ఉన్నాను. చాలా రాజకీయాలను, చాలా మందిని చూశాను. అదే విధంగా నిన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ ఎంపీ మాట్లాడుతున్నారు. జగన్‌తోనే జనసేన ఉంటుందన్న వైకాపా ఎంపీ వరప్రసాద్. ఈమధ్య పవన్ కళ్యాణ్ ఫోన్ చేసి కలవాలని అడిగితే కలిశాము. వైకాపా నాపై ఎందుకు విమర్శ చేస్తోందని పవన్ అడిగారు. మా పార్టీని అవినీతి పార్టీ అని మీరు మాట్లాడుతున్నారు వారు పోలవరం సందర్శనకు వెళ్తున్నారని మీకు తెలిసి మీరు ముందే అక్కడకు వెళ్లి మాట్లాడుతున్నందుకు మీరు తెలుగుదేశం పార్టీతో ఉన్నారని మీపై విమర్శ చేశారని చెప్పాను. నేను తెలుగుదేశంతో ఏ మాత్రం లేను, అవసరమైతే, నేను జగన్‌కే మద్దతు ఇస్తానని పవన్ చెప్పారు. ఎన్నికల తరువాత జగన్‌కు అవసరమైతే జనసేన పార్టీ ఎమ్ఎల్ఏలను కూడా ఇస్తుందని వారు చెప్పారు. ప్రత్యేకహోదా సాధన విషయంలో జనసేన, వైకాపాలు పరస్పర మద్దతుతో పోరాటం చేస్తాం అని ఆయన చెప్పారు. అంటే ఎక్కడికి పోతున్నారు? ఎలాంటి సంకేతాలు ఇస్తున్నారు. ఇవి న్యాయమైన సంకేతాలా అని అడుగుతున్నాను. ఈరోజు మరలా చూస్తే, ఈయన ఎవరో పివియస్ శర్మ బిజెపి నాయకులు ఈయన సూరత్ వైస్ ప్రెసిడెంట్. ఈయన ఏమి స్టేట్‌మెంట్ ఇచ్చారంటే, మా పార్టీ పగ్గాలను చేపట్టి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో శూన్యాన్ని పవన్‌కళ్యాణ్ గారు పూర్తి చేస్తారు. దుర్వినియోగం చేయబోమనే భరోసా కేంద్రానికి కలిగినప్పుడే ప్రత్యేక

హోదా వస్తుంది. పవన్ కళ్యాణ్ ఇందుకు నాయకత్వం వహించి పోరాడతారు. మేము పవన్ కళ్యాణ్‌తో మాట్లాడుతున్నాము. త్వరలోనే ప్రత్యేక హోదా ప్రకటిస్తాము. నిన్న ఆయన నేను దిల్లీకి వెళ్లను, ఇక్కడే ఉండి గట్టిగా పోరాడతానని చెప్పారు. అంటే ఆయన మరలా నిరవధిక నిరహార దీక్ష చేస్తే ఆయనకు కూడా ఇస్తామనే హామీ ఇచ్చారు. మీరే చెబుతున్నారు. What are the signals we are giving? మీరందరూ కూడా రాజకీయాలలో ఉండే వారు. నేను ఏమి అంటున్నానంటే అధ్యక్షులుగా ఆథరైజేషన్ అని చెప్పండి నేను కాదనడం లేదు. ఈరోజు మోదీ గారిని విమర్శించాల్సింది పోయి, ఎన్‌డిఏ గవర్నమెంట్‌ను విమర్శించాల్సింది పోయి నన్ను విమర్శిస్తే పవన్ కళ్యాణ్ గారిని ఏమి అనుకోవాలి. First of all రాష్ట్ర ప్రజానీకం అంతా ఆలోచించాలి. రాష్ట్రం అంతా ముక్తకంఠంతో ఏ చిన్న పిల్లవాడు మాట్లాడినా రాష్ట్రానికి అన్యాయం జరిగింది. దీనికి కారణం ఎవరంటే నరేంద్రమోదీ గారేనని అందరూ చెబుతున్నారు. కాదా?

**శ్రీ పి.వి.ఎన్.మాధవ్:** (మైకు లేదు) అధ్యక్షా, సభలో ఈ విధమైన ఆరోపణలు చేయడం సబబు కాదు.

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు:** అధ్యక్షా, ప్రధాన మంత్రి గారు చేయలేదని అందరూ అంటున్నారు. ఈ రోజున అందరూ ఒక విషయం గుర్తు పెట్టుకోవాలి. ఒక ఊరిలో పింఛను రాకపోతే ముఖ్యమంత్రిగా నన్ను విమర్శిస్తారు. అదే విధంగా నేను కేంద్రానికి ఏదో భయపడుతున్నాను ఏదో కేసులు ఉన్నాయని అంటున్నారు. ఏమి కేసులు ఉన్నాయి?

మ.03.50

అధ్యక్షా, ప్రతి ఒక్కరూ నేను కేంద్రానికి భయపడుతున్నానని, నాపై కేసులున్నాయని అంటున్నారు. అయితే, ఈ దేశంలో ఎలాంటి కేసులు లేని వ్యక్తిని, 26 సార్లు కేసులు పెట్టినా కూడా ఎక్కడా ఏ కేసూ నిలబడకుండా ఉండిన వ్యక్తిని. నేను చాలా జాగ్రత్తగా ఉంటాను. నా ప్రక్కన ఎవరు ఉన్నారో చూసి మాట్లాడి కూర్చుంటాను. నేనెప్పుడూ సామాజిక న్యాయాన్ని, చట్టాన్ని గౌరవిస్తాను. ఇంకొక మాట అసలు కేసే లేకపోతే, వైయస్‌ఆర్ పార్టీ నాయకుడు నాపై కేసు పెట్టడానికి హైకోర్టుకి వెళ్లారు. హైకోర్టుకు ఆ డేటా అంతా ఇస్తే, దానిని హైకోర్టు క్లియర్‌గా పరిశీలించి కేసు ఎక్కడ ఉందయ్యా, నువ్వు చెప్పిన ప్రకారం దీనిలో కేసే లేదు ఏమి మాట్లాడుతున్నావని కేసునే డిస్‌మిస్ చేసే పరిస్థితి వచ్చింది. మరల సుప్రీంకోర్టుకు వెళ్లి ఏదో ఒక కేసు పెట్టాలని చూసారు. ఇలాంటి కేసులను చాలా చూశాం, నేను ఎప్పుడూ భయపడలేదు, నేను ఎవరికీ భయపడలేదు. నేను ఎవరికైనా భయపడితే మన రాష్ట్ర ప్రజానీకానికి తప్ప, మరి వేరే ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని మీకు తెలియజేసుకుంటున్నాను.

అదే విధంగా, ఈ రోజు ఇవన్నీ చూసిన తరువాత నేను వీరందరినీ ఒకటే అడుగుతున్నాను. ఇంత జరిగిన తరువాత ఈ రోజు కేంద్ర ప్రభుత్వం గానీ, ఇక్కడుండే నాయకులందరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. మన హక్కుల విషయంలో మనం ఎక్కడా రాజీపడే ప్రసక్తే ఉండదు. ఎట్టి పరిస్థితులలో మనకు ఇవ్వాల్సిన నిధులు గానీ, హక్కులు గానీ, మన హామీలు అన్నింటినీ కేంద్రం నెరవేర్చాల్సిన అవసరం ఉంది. రెండవది, ఈ రాష్ట్రంలో ఉండే

ప్రతి ఒక్క వ్యక్తి ఒకటే ఆలోచించాలి. ఇది తెలుగు వారి ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయం. ఆ ఆత్మ గౌరవాన్ని ఎవరూ కించపరిచేలా ప్రవర్తించినా ప్రజలు సహించరు. ఈ రోజు మనం ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తరఫున న్యాయమైన కోర్కెల సాదనా కోసం కేంద్ర ప్రభుత్వంతో పోరాడుతున్నాం. అలాంటి సమయంలో నేను నా హక్కుల కోసం అడిగితే కర్నూలు వెళ్లి రాయలసీమకు ఒక డిక్లరేషన్ ఇస్తారండీ మీరు. మీకు కర్నూలుపై అదే అభిమానం ఉంటే కర్నూలులో సుప్రీంకోరులు బెంచి పెట్టండి. దానికి మేము కూడా సపోర్టు చేస్తాం. లేకపోతే ఆంధ్రప్రదేశ్ అమరావతికి రెండవ రాజధానిని చేయండి. ఇవన్నీ చేయకుండా నేను రాయలసీమను సస్యశ్యామలం చేస్తానంటే, ఓర్వలేక మీరు అక్కడ కూడా చిచ్చు పెట్టే పరిస్థితికి వచ్చారంటే ఇది ఏవిధంగా జాతీయ వాదమని నేను అడుగుతున్నాను. ఏ విధంగా మిమ్మల్ని అర్థం చేసుకోవాలని అడుగుతున్నాను. ఇది చిచ్చుపెట్టే కార్యక్రమం కాదా? అని నేను అడుగుతున్నాను. నేను కూడా రాయలసీమలోనే పుట్టాను. నాకు లేని ప్రేమ బీజేపీకి ఉందా అని అడుగుతున్నాను.

**శ్రీ పి.వి.ఎన్. మాధవ్:** (మైకు లేకుండా) అధ్యక్షా, నేను విశాఖపట్నంలో పుట్టాను...

(అంతరాయం)

**శ్రీ నారా చంద్రబాబు నాయుడు:** ఏమీ చెప్పక్కరలేదు, నాకు తెలుసు అన్నీ. నీకేమి తెలుసయ్యా? ఆ విశాఖపట్నంను కూడా నేనే డెవలప్ చేశాను గుర్తుపెట్టుకోండి. మీ పార్టీ డెవలప్ చేయలేదు, మీరు చేయలేదు. ఎలా మాట్లాడుతారు?

అధ్యక్షా, రాయలసీమలో కూడా హైకోర్టు బెంచి కావాలని ఎప్పటి నుంచో అక్కడి వారు అడుగుతున్నారు. హైకోర్టు ఇక్కడ వస్తుంది కాబట్టి, ఈ విషయాన్ని నాకు రెండు, మూడు సార్లు హైకోర్టు న్యాయవాదులు, మా పార్టీ నాయకులు కూడా చెప్పారు. తప్పకుండా రాయలసీమలో హైకోర్టు బెంచ్ పెట్టడానికి ఈ ప్రభుత్వం ముందుకొస్తుంది. ప్రధాన న్యాయమూర్తికి కూడా నేను లెటర్ రాస్తానని కూడా తెలియజేస్తున్నాను. అందుకని చివరిగా ఈ సభ ద్వారా నేను కోరేదేమిటంటే కుట్రలు చేయండి, కుతంత్రాలు చేయండి, ఈ సమయంలో కాదు. రాజకీయంగా ఎదుర్కోండి నాకు ఏ సమస్యా లేదు. రాష్ట్ర ప్రజానీకం మనోభావాలు దెబ్బతిన్నప్పుడు, ఇప్పటికే ఒకసారి మోసం చేసినప్పుడు, ప్రతి ఒక్కరూ ఆందోళనా, ఆవేదనలో ఉన్నప్పుడు ప్రతి ఒక్క వ్యక్తి సంఘటితంగా ఉండి, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకోవడానికి ఆలోచించాలి. నేను ఇప్పుడు చెప్పిన డేటా చూపించాను. ఈ డేటా అంతా చూసిన తరువాత ఎవరికైనా అర్థమవుతుంది. ఇంట్లో కూర్చున్న చిన్న బిడ్డలు, ఆడ బిడ్డలు సైతం అర్థం చేసుకుంటారు. కానీ, ఏ ఉద్దేశంతో వీళ్లందరూ నన్ను ఈ రోజు ఈ విధంగా మాట్లాడుతున్నారు? బీజేపీ, వైయస్ఆర్, పవన్ కళ్యాణ్ ఎందుకు నన్ను విమర్శిస్తున్నారు. కమ్యునిష్టులు దీనిగురించి మాట్లాడడం లేదు. వారు ప్రత్యేక హోదాపై పోరాడుతున్నారు. వారు ఎప్పుడు ఆ ఉద్యమాలు చేస్తుంటారు. నేను వారి గురించి మాట్లాడడం లేదు. వీళ్లు మాత్రం నన్ను విమర్శిస్తున్నారు. ఎందుకు విమర్శిస్తున్నారని అడుగుతున్నాను. నన్ను బలహీనపరిస్తే అక్కడ వీళ్ల ఆటలు సాగుతాయి, రాష్ట్రం నష్టపోవాలి. ఇలాంటి క్లిష్టపరిస్థితిలో

రాజకీయాలకు అతీతంగా, వ్యక్తిగత ప్రయోజనాలకు అతీతంగా తెలుగుదేశం ప్రభుత్వాన్ని అందరూ సమర్థించాలి. నేను రాష్ట్రాధినేతగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పోరాడుతున్నానే తప్ప, వ్యక్తి గత ప్రయోజనాల కోసం నేను పోరాడడం లేదు. నా బలం 5 కోట్ల ప్రజలు. నాకు ఎటువంటి రాగద్వేషాలు లేవు. ఎవరి మీద కోపం లేదు. ప్రజలకు అన్యాయం జరిగింది. ప్రజలు నాపై నమ్మకం పెట్టుకొని నాకు ఓట్లు వేశారు. మీరైతేనే ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారు, మీరైతేనే ఈ క్లిష్టపరిస్థితుల నుంచి బయటపడతామనే ఉద్దేశంతో నాకు ఓట్లు వేసి గెలిపించారు. ఈ రాష్ట్ర ప్రజానీకాన్ని కాపాడవలసిన అవసరం నాకు ఉంది. నాకు చాలా బాధ కలిగింది. చాలా సార్లు వచ్చి అడిగితే, ఈ దేశంలో ఉన్న సీనియర్ మోస్ట్ నాయకుడినయ్యా నేను. నేను రాజకీయ జీవితంలోకి వచ్చి 40 సంవత్సరాలు కూడా నిన్ననే పూర్తయ్యాయి. ఛైర్మన్ గారు కూడా ఇంతకు ముందే ఒక విషయం చెప్పారు. ఆ రోజు గుజరాత్‌లో జరిగిన సంఘటనలో కూడా నేను చెప్పాను.

అదే విధంగా అబ్దుల్ కలాం గారిని కూడా రాష్ట్రపతిగా నేనే ప్రపోజ్ చేశాను. స్ఫూర్తి అంటే ఆ విధంగా ఉంటుంది. సభ్యులందరికీ కూడా అర్థం కావాలి. ఆ రోజు అబ్దుల్ కలాం గారిని రాష్ట్రపతి చేయడం కోసం మేజర్ సపోర్టు తెలుగుదేశం పార్టీ కాబట్టి, వాజ్‌పేయ్ గారు నాతో మాట్లాడి చంద్రబాబు నాయుడు గారు మనమిద్దరం కలిసే రాష్ట్రపతి అభ్యర్థిని ఫైనలైజ్ చేద్దాము, ప్రస్తుతానికి మీరు నాకు ఎండార్స్ చేయండి, నేను నిర్ణయం తీసుకొని మీతో మాట్లాడి చేస్తానని చెప్పారు. ఆ విషయం చెప్పిన తరువాత నేను సరేనని బయటికి వచ్చేశాను. ఒక రోజు రామకృష్ణగారూ, నేను ఏదో ప్రోగ్రామ్‌లో ఉంటే వాజ్‌పేయ్ గారు ఫోన్ చేశారు. మేము రాష్ట్రపతి అభ్యర్థిగా అలెగ్జాండర్‌ను ఫైనలైజ్ చేశామని చెప్పారు. నేను షాక్ అయ్యాను. ముందు ఏమి చెయ్యాలో అర్థం కాక, ప్రధానమంత్రి అని కూడా చూడకుండా ఫోన్ పెట్టేశాను. మరల ప్రధానమంత్రి గారు ఫోన్ చేస్తే, ప్రధానమంత్రి గారు ఈ నిర్ణయం ఆమోద యోగ్యమైనది కాదు అని అంటే అందుకు ప్రధానమంత్రిగారు లేదు, లేదు అప్పుడే చెప్పేశాముగా అని అన్నారు. అందుకు నేను కాదు సార్ మీరు చెప్పినా కూడా దీనిని నేను యాక్సెప్ట్ చెయ్యను సార్ అని చెప్పాను. నేను ఇప్పుడు హైదరాబాదు వెళుతున్నాను, నేను అక్కడికి వెళ్లి నిర్ణయం తీసుకొని చెబుతాను, ఇప్పుడు మాత్రం ఈ నిర్ణయాన్ని ఫైనలైజ్ చేయకండి అని చెప్పేసి వచ్చేశాను. రెండు రోజులు ప్రధానమంత్రి గారు నాతో మాట్లాడడం, నన్ను ఢిల్లీకి రమ్మనడం, అప్పుడు నేను రాననడం, అప్పుడు చివరిగా ప్రధానమంత్రిగారు ఫోన్ చేసి ఎవరైనా నీ మనసులో ఉంటే చెప్పు అని అడిగితే ఎవరూ లేరని చెప్పాను. లేకపోతే వీరికి బదులుగా ఎవరినైనా చెప్పమని అడిగితే on the spur of the moment అప్పుడు నన్ను ఒకేసారి అబ్దుల్ కలాం గారు కలిశారు. అబ్దుల్ కలాం గారు అయితే బాగుంటుంది అని చెప్పాను. ఈ క్లిష్ట పరిస్థితిల్లో అప్పట్లోనే మనకు పాకిస్తాన్‌తో విరోధం ఉంది. కానీ, కలాంగారి పేరును మనం నిర్ణయిస్తే ఆయన ఒప్పుకుంటాడా అని ప్రధానమంత్రిగారు అడిగారు. మీరు ఒకసారి ప్రయత్నం చేయండి అని నేను చెబితే, ప్రధానమంత్రిగారు ప్రయత్నం చేసిన మరుసటి రోజే నాకు ఫోన్ చేసి అబ్దుల్ కలాం గారు ఒప్పుకున్నారు. నేను చాలా ఆనందంగా ఉన్నాను. మీరు కూడా సంతోషంగా ఉన్నారు కదా! అని అన్నారు. అందుకు నేను కాదు సార్ దేశమంతా సంతోషంగా ఉంటుందని చెప్పాను.

సా.04.00

రాష్ట్ర ప్రజలందరికీ ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ క్లిష్ట సమయంలో ప్రతి ఒక్కరూ ఆలోచించండి. అందరి ఉద్దేశాలను అర్థం చేసుకోండి. ఎవరెవరు ఎలాంటి డ్రామాలు ఆడుతున్నారో చూడండి. కానీ, మీకు కావాల్సింది సమిష్టిగా పోరు సలపాలి. ఇంతకుముందు విదేశీయుల నుండి దాడులు జరిగినప్పుడు కూడా, మన దేశంలో లాలూ। పడ్డారు. బ్రిటీషు వారు మన దగ్గరకు వచ్చి పరిపాలించినప్పుడు, మన వాళ్లు స్వాతంత్ర్యం కోసం పోరాడినా మనవాళ్లు ఆ రోజున కూడా లాలూ। పడ్డారు. కానీ, ఈ రోజు 5 కోట్ల మందిని ఒక్కటే కోరుతున్నాను. మనకు కేంద్రం అంటే వ్యతిరేకత లేదు. దేశం అంటే వ్యతిరేకత లేదు. కానీ, మనకు ఇచ్చిన హామీలు నెరవేర్చుకోవడానికి మనమందరం సంఘటితంగా ఉండాల్సిన అవసరముంది. దానికి పూర్తిగా సహకరించమని రాష్ట్ర ప్రజానీకాన్ని కోరుకుంటూ, నేను ఈ విభజన చట్టంపైన ఒక తీర్మానాన్ని పెడుతున్నాను. దీన్ని ఏకగ్రీవంగా సభ్యులందరూ ఆమోదించాల్సిందిగా కోరుకుంటున్నాను.

## 7.విభజన చట్టం హామీల అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై శాసనసభ తీర్మానం

" ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లోని అంశాలు, ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్ర శాసనమండలి తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగింది. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. ఆస్తుల అప్పుల విభజనలో, విద్యుత్ పంపిణీలో, పన్నుల వసూళ్లు, తిరిగి చెల్లింపుల్లో మన రాష్ట్రానికి మిక్కిలి నష్టం జరిగింది.

విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి; రాష్ట్రానికి రైల్వే జోన్ రావాలి; ఉక్కు కర్మాగారం స్థాపించాలి; ఓడ రేవు రావాలి; పెట్రో కెమికల్ పరిశ్రమను ఏర్పాటు కావాలి; నియోజకవర్గాల సంఖ్య పెరగాలి; అనేక విద్యా, పరిశోధన సంస్థలు ప్రారంభించాలి; ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన పూర్తికావాలి. విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదింప చేయడానికి ఆనాటి ప్రధానమంత్రి ఆరు హామీలతో కూడిన ప్రకటన చేశారు. అందులో ముఖ్యమైనవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం, ఆదాయం కోల్పోతున్న రాష్ట్రానికి రెవెన్యూ లోటును భర్తీ చేయడం, బుందేల్‌ఖండ్, కోరాపుట్ –బోలాంగిర్–కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించడం .

రైల్వే జోన్ ఇవ్వడం కుదరదంటున్నారు. ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటున్నారు. ఓడ రేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారు. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు ఐదు వేల కోట్ల రూపాయల వయబిలిటీ గేప్

ఫండింగ్ భారం రాష్ట్రం భరించాలంటున్నారు. విద్యా సంస్థల పురోగతి మందంగా ఉంది. ఇప్పుడు ఇస్తున్న కేటాయింపులను చూస్తే ఇవి వచ్చే ఇరవై యేళ్లకైనా పూర్తవుతాయా అన్న సందేహం కలుగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడకనడుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన ఊసే లేదు. విజయవాడ, గుంటూరు పట్టణాలకు డ్రైనేజీ కోసం ఇచ్చిన డబ్బు కూడా రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చూపిస్తున్నారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇస్తున్న సాయం నామమాత్రంగా ఉంది.

రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణిని శాసనమండలి తీవ్రంగా ఖండిస్తోంది.

పోలవరం మన రాష్ట్రానికి జీవనాడి. మన ప్రజల చిరకాల స్వప్నం. ఏడు ముంపు మండలాలను మనకు బదలాయించిన తర్వాత కేంద్రం నుంచి అందాల్సిన సాయం మందగించడం దురదృష్టకరమని శాసనమండలి భావిస్తోంది. మనం ఖర్చు చేసిన సుమారు రెండున్నర వేల కోట్ల రూపాయలకు పైగా మొత్తం కేంద్రం నుంచి ఇంకా రావాల్సి ఉంది.

పదునాల్గవ ఆర్థిక సంఘం సిఫార్సుల దరిమిలా ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని, ఇప్పుడు హోదా కలిగి ఉన్న రాష్ట్రాలకు కూడా కొనసాగించబోమనీ కేంద్రం చెప్పింది. హోదా బదులు దానికి సరిసమానమైన ప్రయోజనాలు కలిగించే ప్రత్యేక సహాయాన్ని ఇస్తామన్నారు. అయితే, ఈ ప్రత్యేక సహాయం నంచి మన రాష్ట్రానికి రావల్సిన నిధులు పెద్దగా రాకపోగా, ప్రత్యేక హోదా రాష్ట్రాలకు పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగిస్తున్నారు. పదునాల్గవ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వద్దంటూ ఎక్కడా చెప్పలేదనీ, అది తమ పరిధిలోని అంశం కాదనీ ఆ సంఘం అధ్యక్షులు, సభ్యులు బహిరంగంగా చెప్పారు.

ప్రత్యేక హోదా ఇవ్వద్దని ఆర్థిక సంఘం చెప్పనప్పుడు, రాయితీలు, ప్రోత్సాహకాలు, ప్రస్తుత హోదా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నపుడు మన రాష్ట్రానికి ఎందుకు నిరాకరిస్తున్నారని కేంద్రాన్ని ఈ శాసనమండలి ప్రశ్నిస్తోంది.

చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలు అసంపూర్తిగా, ఆలస్యంగా జరగడం పట్ల రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకువెళ్లినా కేంద్రం ఉదాసీనత ప్రదర్శించింది. రాష్ట్రానికి చట్టపరంగా దక్కాల్సిన అంశాల పట్ల కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని ఈ శాసనమండలి తీవ్రంగా పరిగణిస్తోంది.

కేంద్రానికి రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, అన్యాయంగా విభజన జరిగి కష్టాలలో ఉన్న మన రాష్ట్రం పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువ. మనం నిలదొక్కుకుని, దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వరకు కేంద్రం చేయూత అందించాలి. చట్టంలో లేనివీ, పార్లమెంటు సాక్షిగా

ప్రధాని ఇచ్చిన హామీలలో లేనివి మనం అడగడం లేదు. మనవి చట్టబద్ధమైన డిమాండ్లనీ, న్యాయమైన కోరికలనీ కేంద్రం గుర్తించి వ్యవహరించాలని కోరుతూ ఈ శాసనమండలి తీర్మానిస్తున్నది". దీన్ని ఏకగ్రీవంగా ఆమోదించాలని సభ్యులను కోరుతున్నాను.

MR.CHAIRMAN: Motion moved. Now, the question is

విభజన చట్టం హామీల అమలు విషయంలో

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై శాసనసభ తీర్మానం

" ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 లోని అంశాలు, ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్ర శాసనమండలి తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగింది. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసింది. ఆస్తుల అప్పుల విభజనలో, విద్యుత్ పంపిణీలో, పన్నుల వసూళ్లు, తిరిగి చెల్లింపుల్లో మన రాష్ట్రానికి మిక్కిలి నష్టం జరిగింది.

విభజన చట్టం ప్రకారం రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి; రాష్ట్రానికి రైల్వే జోన్ రావాలి; ఉక్కు కర్మాగారం స్థాపించాలి; ఓడ రేవు రావాలి; పెట్రో కెమికల్ పరిశ్రమను ఏర్పాటు కావాలి; నియోజకవర్గాల సంఖ్య పెరగాలి; అనేక విద్యా, పరిశోధన సంస్థలు ప్రారంభించాలి; ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన పూర్తికావాలి. విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదింప చేయడానికి ఆనాటి ప్రధానమంత్రి ఆరు హామీలతో కూడిన ప్రకటన చేశారు. అందులో ముఖ్యమైనవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం, ఆదాయం కోల్పోతున్న రాష్ట్రానికి రెవెన్యూ లోటును భర్తీ చేయడం, బుందేల్‌ఖండ్, కోరాపుట్ –బోలాంగిర్–కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించడం .

రైల్వే జోన్ ఇవ్వడం కుదరదంటున్నారు. ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటున్నారు. ఓడ రేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారు. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు ఐదు వేల కోట్ల రూపాయల వయబిలిటీ గేప్ ఫండింగ్ భారం రాష్ట్రం భరించాలంటున్నారు. విద్యా సంస్థల పురోగతి మందంగా ఉంది. ఇప్పుడు ఇస్తున్న కేటాయింపులను చూస్తే ఇవి వచ్చే ఇరవై యేళ్లకైనా పూర్తవుతాయా అన్న సందేహం కలుగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడకనడుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన ఊసే లేదు. విజయవాడ, గుంటూరు పట్టణాలకు డ్రైనేజీ కోసం ఇచ్చిన డబ్బు కూడా రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చూపిస్తున్నారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు

ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇస్తున్న సాయం నామమాత్రంగా ఉంది.

రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణిని శాసనమండలి తీవ్రంగా ఖండిస్తోంది.

పోలవరం మన రాష్ట్రానికి జీవనాడి. మన ప్రజల చిరకాల స్వప్నం. ఏడు ముంపు మండలాలను మనకు బదలాయించిన తర్వాత కేంద్రం నుంచి అందాల్సిన సాయం మందగించడం దురదృష్టకరమని శాసనమండలి భావిస్తోంది. మనం ఖర్చు చేసిన సుమారు రెండున్నర వేల కోట్ల రూపాయలకు పైగా మొత్తం కేంద్రం నుంచి ఇంకా రావాల్సి ఉంది.

పదునాల్గవ ఆర్థిక సంఘం సిఫార్సుల దరిమిలా ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని, ఇప్పుడు హోదా కలిగి ఉన్న రాష్ట్రాలకు కూడా కొనసాగించబోమనీ కేంద్రం చెప్పింది. హోదా బదులు దానికి సరిసమానమైన ప్రయోజనాలు కలిగించే ప్రత్యేక సహాయాన్ని ఇస్తామన్నారు. అయితే, ఈ ప్రత్యేక సహాయం నంచి మన రాష్ట్రానికి రావల్సిన నిధులు పెద్దగా రాకపోగా, ప్రత్యేక హోదా రాష్ట్రాలకు పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగిస్తున్నారు. పదునాల్గవ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వద్దంటూ ఎక్కడా చెప్పలేదనీ, అది తమ పరిధిలోని అంశం కాదనీ ఆ సంఘం అధ్యక్షులు, సభ్యులు బహిరంగంగా చెప్పారు.

ప్రత్యేక హోదా ఇవ్వద్దని ఆర్థికసంఘం చెప్పనప్పుడు, రాయితీలు, ప్రోత్సాహకాలు, ప్రస్తుత హోదా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నపుడు మన రాష్ట్రానికి ఎందుకు నిరాకరిస్తున్నారని కేంద్రాన్ని ఈ శాసనమండలి ప్రశ్నిస్తోంది.

చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలు అసంపూర్తిగా, ఆలస్యంగా జరగడం పట్ల రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకువెళ్లినా కేంద్రం ఉదాసీనత ప్రదర్శించింది. రాష్ట్రానికి చట్టపరంగా దక్కాల్సిన అంశాల పట్ల కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని ఈ శాసనమండలి తీవ్రంగా పరిగణిస్తోంది.

కేంద్రానికి రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, అన్యాయంగా విభజన జరిగి కష్టాలలో ఉన్న మన రాష్ట్రం పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువ. మనం నిలదొక్కుకుని, దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వరకు కేంద్రం చేయూత అందించాలి. చట్టంలో లేనివీ, పార్లమెంటు సాక్షిగా ప్రధాని ఇచ్చిన హామీలలో లేనివీ మనం అడగడం లేదు. మనవి చట్టబద్ధమైన డిమాండ్లనీ, న్యాయమైన కోరికలనీ కేంద్రం గుర్తించి వ్యవహరించాలని కోరుతూ ఈ శాసనమండలి తీర్మానిస్తున్నది."

(PAUSE)

The Motion was adopted and the Resolution was unanimously Carried.

**మిస్టర్ చైర్మన్:** అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. Now, the House is adjourned to meet again at 10.00 a.m. on Tuesday, the 20th March, 2018.

(The House then adjourned at 04.06 p.m. to meet again at 10.00 a.m. on Tuesday, the 20th March, 2018)

**“Published under Rule 316 of the Rules of Procedure and Conduct of Business in the Andhra Pradesh Legislative Council and printed at the AP Legislative Assembly Press, Velagapudi, Amaravati.**